COPYRIGHT STATEMENT

Venkatarangaiya, Mamidipudi,
1889-

అర్థశాస్త్రము

విజయనగరము, 1922

Record no. 438

Venkatarangaiya, Mamidipudi, 1889-

Arthaśāstramu

Vijayanagaramu, 1922

Record no. 438

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

Venkatarangaiya, Mamidipudi, 1889-
అర్థశాస్త్రము / ఇది మామిడిపూడి వెంకటరంగయ్యచే వ్రాయబడినది.- 2. కూర్పు.- విజయనగరము : శ్రీవేదవ్యాస ముద్రాక్షరశాల, 1922.
14, 192 p. ;19 cm.
Record no. 438

Venkatarangaiya, Mamidipudi, 1889-
Arthaśāstramu / idi Māmiḍipūḍi Veṅkaṭaraṅgayyacē vrāyabaḍinadi.- 2. kūrpu.- Vijayanagaramu : Śrīvēdavyāsa Mudrākṣaraśāla, 1922.
14, 192 p. ;19 cm.
Record no. 438

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB
Date filming began:

406

406

అర్థశాస్త్రము

ఇది

విజయనగర మహారాజావారి కాలేజిలో
అర్థశాస్త్రోపన్యాసకులగు
మామిడిపూడి వెంకటరంగయ్య. ఎమ్. ఏ. చే
వ్రాయబడినది.

రెండవ కూర్పు.

విజయనగరము:
శ్రీ వేదవ్యాస ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడియె.

౧౯౨౨.

[వెల రు. 1-4-0.

విషయసూచిక

—౧ ఉపన్యాసము.—

అర్థశాస్త్రమన నేమి? 1-2, ధనముయొక్క ప్రాధాన్యము 3-9, జనసంఖ్య హెచ్చుట 9-13, కోరికలసంఖ్య హెచ్చుట 13-16, ధనమనుమాటకు అర్థము 17-20, నాణెములవలని ప్రయోజనము 20-22, ధనము ఆదాయము 22-24, దేశములోని సాంవత్సరి కాదాయమును నిర్ణయించు పద్ధతి 24-26.

—౨ ఉపన్యాసము.—

ధనోత్పత్తి సాధనములు— ప్రకృతి, మూలధనము, పురుషకారము 27-28, ప్రకృతివర్గము— భూమి, భూసారము, అడవులు, గనులు మొదలగునవి 29-33, ప్రకృతిలక్షణములు— బాహుళ్యము, సారము, స్థానము, స్థానముయొక్క ప్రాధాన్యము 33-35, ప్రకృతిలోని సారమును రక్షించుకొనుట 35-38, పురుషునకును ప్రకృతికిని గల సంబంధము 38-40.

మూలధనముయొక్క లక్షణములు 40-44, మూలధనమధికము చేయుటకు మార్గము 44-45, ఆదాయములో కొంత భాగమును కూడబెట్టినగాని మూలధనము వృద్ధికాదు

45-50, కూడబెట్టినదానిని మూలధనముగమార్చుట 50-52, బ్యాంకులు 53-55, మూలధనముయొక్క ప్రాధాన్యము హెచ్చుచున్నది 55-56.

—౩ ఉపన్యాసము.—

పురుషకారముయొక్క ప్రాధాన్యము 57-58, జనసంఖ్యను నిర్ణయించు అంశములు 58-59, వివాహసంబంధమగు ఆచారములు, వివాహమాడువారిసంఖ్య 59-60, వారి వయస్సు 60-65, సంతానేచ్ఛ 65-66, మరణముల సంఖ్య 66-69, జనసంఖ్య వృద్ధియగుటవలన నష్టముకలుగునను వాదము 70-75, ఈనష్టమును తొలగించు మార్గము— మనుష్యుని బుద్ధిబలము 75-80, మనదేశములోని జనసంఖ్య అధికముగానున్నదా? 80-82, ధనోత్పత్తి చేయనివారిని గుఱించిన విమర్శ; బాలురు 82-84, స్త్రీలు 84-85, ఉద్యోగములు లేనివారు 85-87, సోమరులు 87, చోరులు 88, ప్రజలు ఒకప్రదేశమునుండి మఱియొకదానికిని, ఒకవృత్తినుండి మఱియొకదానిలోనికిని వెళ్ళుటకు సిద్ధపడవలెను 89-93.

—౪ ఉపన్యాసము.—

శరీరబలమునకును ధనోత్పత్తికిని గల సంబంధము

94-96, బుద్ధిబలముయొక్క ప్రాధాన్యము 97-100, విద్య 100-110, నీతిప్రవర్తన 110-113, కార్యవిభజనము వలని లాభములు, కార్యకౌశలము వృద్ధియగుట 114-116, ఎవరికి తగినపని వారుచేయుట 116, క్రొత్తసాధనములను కనుగొనుట 117, సాధనముల వలన అధిక లాభము పొందుట 117-118, సామాన్యకార్య విభజనము, సంశ్లిష్టకార్య విభజనము 118-120, వ్యాపారసౌకర్యముల ఆవశ్యకత 120-125, విదేశవ్యాపారము 125-127.

—౫ ఉపన్యాసము.—

వ్యవహారము 138—130, వ్యవహారపరిమాణము 130-132, అధికపరిమాణ వ్యవహారమువలన అధికతర లాభముకలుగును 132-135, ఇందువలన కార్యవిభజన సౌకర్యము అధికమగును 135-138, యంత్రముల నుపయోగించుటకు అవకాశ మేర్పడును 138-140, క్రయ విక్రయములందు అధిక లాభము వచ్చును 140-141, దీనివలన స్వేచ్ఛకు భంగము కలుగునను వాదము 142-143, భాగ వ్యవహారములు 143-145, జాయింటు స్టాకు వ్యవహారములు 146-149, ధనోత్పాదకకర్మలు— మూలకర్మలు, పక్వకర్మలు, యానకర్మలు, వాణిజ్యకర్మలు, తక్కిన కర్మలు 149-153, వ్యవసాయములో మనము చేయవలసిన సంస్కరణములు 153-158, పక్వకర్మలలో చేయవలసిన మార్పులు 158-159, ఎట్టి కర్మలు

దేశమం దధికముగా నుండవలెను? 159-162, ఇనుప దారులు 162-165.

— ౬ ఉపన్యాసము. —

వినిమయము అర్థోత్పత్తికి మూలాధారము 166-167 మూల్యము 167-168 మూల్యనిర్ణయము 169-170, పదార్థము కావలసియున్నప్పుడే దానికి మూల్యముండును 170-173, మూల్యము వాంఛల తీక్ష్ణతను అనుసరించి యుండును 173-174, పదార్థాంశములు అధికము కానుకాను ఈతీక్ష్ణత హీనమగును 173-174, మూల్యమునకును దీనికినిగల సంబంధము 174-180, కొన్ని సిద్ధాంతములు 180-182, పదార్థముల మితత్వమునకు కారణములు 182-192.

పీఠిక

అర్థశాస్త్రమును ఆంధ్రభాషలో వ్రాయవలయుననెడి యుద్దేశము నాకు చాలాకాలమునుండికలదు. కాని అనేక కారణములవలన ఇంతవర కది కొనసాగకుండెను. గత సంవత్సరము ఏప్రిల్ మాసమున ఆంధ్రగ్రంథాలయ సంఘమువారు ఈవిషయమును గుఱించికొన్ని యుపన్యాసముల నియ్యవలసినదని నన్నుకోరిరి. అందుకు నేనెంతయో సంతోషముతో అంగీకరించితిని. గ్రంథాలయోద్యమము మన దేశాభివృద్ధికి తోడ్పడు సాధనములలో అగ్రగణ్యమైనది. దానిని కడుదీక్షతో కొనసాగింప ప్రయత్నించుచున్న గ్రంథాలయ సంఘము వారికి నాశక్తికొలది సహాయము చేసి ఆంధ్రమాతయందు నాకుగల భక్తిలేశమును ఈవిధముగ చూపింప నిశ్చయించి ఈ యుపన్యాసముల నిచ్చితిని. వానినే మార్పులేమియు చేయక గ్రంథరూపమున ముద్రింప సాహసించితిని. అర్థశాస్త్రములోని విషయముల నన్నిటిని ఇందుచేర్చలేదు. ఇట్టిసంపుటములు మూడో నాలుగో వ్రాసినగాని గ్రంథమంతయు పూర్తి కాజాలదు. దైవకృపవలనను మిత్రులప్రోత్సాహము మూలమునను త్వరలో ఈపనిని చేయగలుగుదునని నమ్ముచున్నాను.

అర్థశాస్త్రము పాశ్చాత్య శాస్త్రములలో ఒక్కటియై యున్నది. కావున పాశ్చాత్య గ్రంథకర్తల పద్ధతిననుసరించి నేను దీనిని వ్రాసితిని. దీనిని వ్రాయుటతో శాస్త్రపరిచయ

ములేని జనసామాన్యమునకు సులభగ్రాహ్యముగ నుండ వలయునని ఉద్దేశించి సాంకేతిక పదములను విస్తారముగ వాడలేదు. సిద్ధాంతముల అర్థము బాగుగ బోధపడుటకై అనేకములగు ఉదాహరణముల నిచ్చితిని; కొన్ని సమయములందు పునరుక్తిదోషమువచ్చినను ప్రధానములగు అభిప్రాయములను మార్గాంతరమున పలుమారు చెప్పియున్నాను. శాస్త్రవిషయములు అందరికిని సుబోధమగుటయే నాముఖ్యోద్దేశము. మన ఆర్థికపద్ధతులలో ఎట్టిమార్పులను చేసికొనినయెడల దేశైశ్వర్యమధికమగునో సూచించియున్నాను. నా రచనయందలిలోపములను పాఠకులు చూపినయెడల మరియొక ముద్రణమందు వానిని సవరించుకొనెదను.

బెజవాడలో నేను ఈయుపన్యాసముల నిచ్చిన తర్వాత కొన్నినెలలవరకు వీనిని ముద్రింప ఇష్టపడనైతిని. కాకితములకు కరవుపుట్టియుండుటచే ఇందుకగు వ్యయమును భరింప సమర్థత కాజాలనని నేనూరకుంటిని. ఇట్లుండగా ఒకనాడు నాఅదృష్టవశమున ఈగ్రంథములోనికొన్నిభాగములను విజయనగర సంస్థానపరిపాలకులు కాబోవుచున్న శ్రీశ్రీశ్రీకుమారమహారాజావారికి చదివి వినిపించుట తటస్థించెను. అప్పుడువారు వారి సహజదాతృత్వముతో ఈగ్రంథప్రచురణమునకు వలయు ఖర్చులను ఇచ్చునట్లు వాగ్దానమును చేసిరి. అంతటివారు నాకు సహాయముచేయ నియ్యకొనినప్పుడు ఆలస్యము చేయుట అను

చితమని తక్షణమే దీనిని ముద్రింపప్రారంభించితిని. వయస్సునచిన్నవారైనను బుద్ధియందును సుగుణసంపదయందును పెద్దవారగు శ్రీశ్రీశ్రీకుమార మహారాజావారి కరుణకు పాత్రమగుటచే ఈ నాగ్రంథమునకు క్రొత్తఅలంకారమొకటి కలిగెను. విద్యావంతులగు శ్రీశ్రీశ్రీ కుమార మహారాజావారు విద్యాభిమానులగుటలో ఆశ్చర్యమేమియున్నది. పండితులను సన్మానించి ఆంధ్రసారస్వతమును క్రొత్తమార్గముల వికసింపచేయుటలో శ్రీశ్రీశ్రీ కుమార మహారాజావారు దీక్షాపరులై ఉండురనుట నిస్సంశయము. అట్టిప్రభువులు ఈకాలములో మనదేశమందుండుట మనయదృష్టమేకదా!

ఈగ్రంథములో చాలాభాగము అచ్చయినతర్వాతదీనికొక యుపోద్ఘాతమువ్రాయ మ॥రా॥రా॥ దివాన్ బహదూరు కే.బి. రామానుజాచార్యులుగారిని ప్రార్థించితిని. వారందులకియ్యకొని గ్రంథమునంతయు నాచేచదివించిరి; నేనీవిధముగ కలిగించిన శ్రమకోర్చి ఇందలి ఉపోద్ఘాతమును వ్రాసియిచ్చిరి. శ్రీరామానుజాచార్యులువారు ఆంధ్రదేశములోని విద్యాధికులలో భీష్మునివంటివారు; ప్రాక్పశ్చిమ విద్యాపద్ధతులను సమన్వయము చేయగలిగినవారు. అట్టివారు నావిషయమై చూపిన ఈవాత్సల్యమునకు హృదయపూర్వకముగ నమస్కారసహస్రమును అర్పించుచున్నాను.

ఈగ్రంథమును వ్రాయుటలో నాకు అనేక విధములుగ తోడ్పడిన మిత్రులకుకూడ నమస్కారపూర్వకముగ నాకృతజ్ఞతను చూపుచున్నాను. వారిలో నెల్ల విజయనగర మహారాజావారి సంస్కృతకళాశాలలో పండితులగ నున్నట్టియు, నాగ్రంథమునంతను సావధానముగ చదివి కొన్ని సలహాలనిచ్చిన బ్రహ్మశ్రీ ఆకుండి వేంకటశాస్త్రిగారికి ముఖ్యముగ నమస్కరింపవలసియున్నది.

విజయనగరం
13-2-21. } మామిడిపూడి వేంకటరంగయ్య

ఉపోద్ఘాతము

సాధారణముగఁ దర్క-వ్యాకరణ వేదాంత మీమాంసాదిశాస్త్రములను మనపండితులు చదువుచున్నారు. కానియర్థశాస్త్రమనునది యొకటియున్నదని తెలిసినవారున్నను దానినిఁ జదివినవారతివిరళముగనున్నారని యె చెప్పవలసియున్నది. క్రీస్తుపుట్టుటకుఁ గొన్ని శతాబ్దములకుముందుఁ గౌటిల్యుఁడను పండితుఁడర్థశాస్త్రములో నొకగ్రంథమును వ్రాసియుండెను. ఆ గ్రంథమును మైసూరుపుస్తకభాండాగారాధ్యక్షులైన షామశాస్త్రిగారాంగ్లభాషలోనికిఁ దర్జుమా చేసియున్నారు. నాకుఁ దెలిసినంతవఱకుఁ బ్రస్తుతమున మైసూరిలో విద్యాశాఖకు ముఖ్యాధ్యక్షులుగానున్న మహారాజశ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు తప్ప మఱియొకరాంధ్రభాషలో నర్థశాస్త్రమునుగూర్చి వ్రాసియున్నట్లగపడదు.

గతసంవత్సరమున బెజవాడపట్టణములోనున్న గ్రంథాలయ సర్వస్వసభవారు ప్రోత్సహింప విజయనగర మహారాజు కళాశాలలో నర్థశాస్త్రముఖ్యాధ్యాపకులుగానున్న మహారాజశ్రీ మామిడిపూడి వేంకటరంగయ్యగారీ శాస్త్రమునుపై నాలుపన్యాసముల నిచ్చియున్నారు. ఇవియర్థశాస్త్రముతో సంబంధించిన సమస్తవిషయములను దెలియఁజేయకున్నను సామాన్య

ముగా జనులకుఁ దెలియఁదగిన ముఖ్యాంశములను బోధించుచున్నవి. అర్థశాస్త్రవిషయములు నాగరికజీవితముతో సంబంధము గలవియైనను నాంధ్రదేశీయులకు వానియందు విశేషజ్ఞానమున్నట్లగపడదు. కనుక నతిసులభశైలిలో సామాన్యజనోపయోగముగ వ్రాయఁబడిన యీయుపన్యాసములను బుస్తకరూపముగఁ బ్రకటించుచున్న వేంకటరంగయ్యగారి కాంధ్రజనులు మిగులఁ గృతజ్ఞులుగా నుండవలెనని ఘంటాఘోషముగఁ జెప్పవచ్చును.

అర్థశాస్త్రముతో సంబంధించిన ముఖ్యవిషయములలో నొక్కదాని నొక్కొక్క యుపన్యాసములోఁ జర్చించియున్నారు. వీనిలోనున్న సంగతులన్నిటి నుదాహరించినయెడల గ్రంథబాహుళ్యమగునను భీతితో ముఖ్యాంశములను సంగ్రహరూపమున సూచించుచున్నాను. (౧) మొదటియుపన్యాసములో "ధనమననేమి; ఇదియెటుల సుఖసాధనము; నాగరికతకును ధనాభివృద్ధికినిగల సంబంధమేమి; ధనశబ్దమునకు సామాన్యముగ జనులెటుల నర్థమును జేయుచున్నారు" అను మొదలగువిషయములు చర్చింపఁబడియున్నవి. (౨) రెండవయుపన్యాసములో ధనసంపాదనమునకు ముఖ్యకారణములగు ప్రకృతి, పురుషకారము, పనిముట్లు, వానియావశ్యకతాతారతమ్యము, మూలధనమునకును ధనాభివృద్ధికినిగలసంబంధము, పురుషకారస్వరూపము మొదలగు విషయములు విచారింపఁబడి

యున్నవి. (౩) మూడవయుపన్యాసములోఁ బురుషకారవిశేషములు, జనవృద్ధిక్షైణ్యములకును ధనవృద్ధిక్షయములకునుగల సంబంధము, సాంఘికాచారములవలన మనదేశమునకుఁగలుగు నష్టములు మొదలగు విషయములు విమర్శింపఁబడి యున్నవి. (౪) నాల్గవ యుపన్యాసములో బురుషకారముతో సంబంధించిన జనుల దేహబలము, బుద్ధిబలము, వారి సత్ప్రవర్తనము, సంఘముగఁ బనిచేయుటకు వారికిఁగల యవకాశములు, వస్తువిభజనమువలనఁ గలుగులాభములు మొదలగు—— విషయములు విపులముగ నాలోచింపఁబడినవి. (౫) అయిదవయుపన్యాసమునఁ బురుషప్రయత్నమువలనను, మూలధనాభివృద్ధివలనను ధనవృద్ధి యగుటలో మన దేశమునకును నమెరికా యూరపుఖండములలోనున్న దేశములకునుగలభేదము, స్వతంత్రోద్యోగము, వ్యవహారవైపుల్యమువలనఁ గలుగులాభము, మొదలగునవి వివరింపఁబడినవి. మఱియునిందుఁ బ్రాణాధారమునకు ముఖ్యమైన యాహారపదార్థములు కృషివలనఁగలుగుటచే నన్నివృత్తులకంటె నది ముఖ్యమైనదైనను గేవలము కృషీవలులు తమకాలమునంతను గృషియందు వినియోగించుట కవకాశము లేనందున నితరములగుపనులనుజేసి ధనార్జనము చేయుట యావశ్యకమను విషయముగూడఁ దెలుపఁబడినది. (౬) ఆఱవయుపన్యాసములో వస్తువినిమయము, మూల్యలక్షణము, వివిధవస్తుమూల్యనిశ్చయము, యానసాధనసౌకర్యము,

మొదలగు విషయములు చెప్పఁబడియున్నవి.

చిరకాలమునుండియు మన దేశములో విద్యావంతులగు బ్రాహ్మణులు ధనార్జనాసక్తులుకాక తమబుద్ధిని విద్యను నెల్లపుడు నాముష్మిక విషయచర్చలయం దుపయోగించుచు, వచ్చిరి. ఇతరులు కృషివాణిజ్యాదివృత్తులయందుఁ దమకాలమును గడుపుచున్నను వానియందమెరికా యూరపుఖండములలో నున్నవారివలెఁ బ్రకృతిశాస్త్రజ్ఞానసాహాయ్యము వలన యంత్రములను గల్పించి వానిమూలమున ధనాభివృద్ధిని జేయలేకుండిరి. ఈకారణమువలన నన్యదేశీయు లీదేశమునస్వకీయ విద్యాబుద్ధి కౌశల్యముచే యంత్రములను వినియోగించి భూమిజములగు సమస్తవస్తువులను భోగార్హములుగాఁ జేసి తన్మూలమున విశేషధనమును సంపాదించి యాధనమునంతను దమదేశమునకుఁ గొనిపోవుటచేతను, రాజకీయములగు కొన్నికారణములచేత న్యాయ్యమగురీతి నికరరూపముగఁ బ్రభువులు తీసికొనిన ధనములో విశేషభాగము ప్రతిసంవత్సర మితరదేశములకుఁ బోవుచుండుటచేతను, నానాఁటికి దేశములో దారిద్ర్యము హెచ్చగుచున్నది. ఈదారిద్ర్యము తగ్గవలెనన్న ధనార్జన సాధనములన్నిటిని గూర్చియు మనవారు విశేషముగ నాలోచింపవలసి యుండును. దీని కర్థశాస్త్రజ్ఞానము ప్రధానమై యున్నది. ఇందుకు లక్ష్యముగా నొక విషయము నీసందర్భమున నుదాహరించుచున్నాను.

ప్రకృతము స్వర్ణరజతములయొక్క పరస్పరమూల్యసంబంధము స్వల్పకాలములోఁ దఱచుగ మాఱుచుండుటచే వాణిజ్యమునకు విశేషహాని కలుగుచున్నదని వర్తకవ్యాపారమునందున్న వారందఱును ఘోషపెట్టుటయేగాని యట్టిసంబంధపు స్థిరతకుఁ గావలసిన యుపాయములను జనులు చూపింపలేకున్నారు. ఇందువలన దేశమునకు విశేషహాని కలుగుచున్నదనుట యందఱికిని విశదమే. హిందూదేశమున కితరదేశములతో వాణిజ్యసంబంధ ముండుటవలన వానితో సంబంధించిన కారణములవలన నీదేశమునకుఁ గూడ లాభనష్టములు కలుగుట తప్పకున్నను నర్థశాస్త్రజ్ఞాన మీదేశములో వ్యాపించినయెడల విశేషబుద్ధిసూక్ష్మత గలవారికీహానిని దగ్గించు నుపాయముతోఁచినఁ దోఁచవచ్చును. మఱియుఁ బ్రకృతిశాస్త్రములవలెఁగాక యర్థశాస్త్రము కేవలము మనుష్యజీవితముతో సంబంధించి యుండుటవలన నమెరికా యూరపుఖండములలో నున్న యర్థశాస్త్రపండితు లేర్పఱిచిన వ్యవస్థలనుబట్టి యీదేశపు స్థితిగతులను నిశ్చయింపరాదను సిద్ధాంతమును బూర్ణముగా నంగీకరించి మనయర్థశాస్త్రజ్ఞులు మనదేశమునకు సరిపడిన వ్యవస్థలనుజేయుట యత్యావశ్యకమైయున్నది. ఇట్టి వ్యవస్థలనేర్పఱచుట కర్థశాస్త్రజ్ఞానము దేశభాషల మూలమున వ్యాపింపవలసి యున్నది. దీని కనుకూలముగ నాంధ్రభాషలో సులభశైలి నర్థశాస్త్రముఖ్యాంశముల నాంధ్రదేశీయుల

కుఁ తెలియునట్లు చేసిన వేంకటరంగయ్యగారి యుపకృతియత్యంతశ్లాఘనీయమై యున్నది.

విజయనగరము, రౌద్రి
సం॥ర మాఘ శుద్ధ స
ప్తమి మంగళవారం } కిళాంబి రామానుజాచార్యులు.

అర్థశాస్త్రము

౧ ఉపన్యాసము.

ఇప్పటి కాలమందు మానవకోటి ధనమునేలాగు గడించుచుండునదియు, దానినేలాగు ఖర్చుచుండునదియు తెలుపు శాస్త్ర మర్థశాస్త్రము. ప్రధానశాస్త్రములలో నిదియొక్కటి యని పాశ్చాత్యపండితులిదివరకే యంగీకరించియున్నారు. మనదేశమందుగూడ నిప్పుడిప్పుడు దీని ప్రాధాన్యమంగీకరింపబడుచున్నది. శాస్త్రములను, ప్రకృతిశాస్త్రములనియు, సాంఘికశాస్త్రములనియు, రెండురకములుగ శాస్త్రవేత్తలు విభజించియున్నారు. మనుష్యునికి బాహ్యముగనుండు ప్రపంచముయొక్క తత్త్వమును బరిశోధించునవి ప్రకృతిశాస్త్రములు; భూగోళము, రసాయనశాస్త్రము మొదలగునవి ఇందులో జేరినవి. సంఘములోని మనుష్యుల పరస్పరసంబంధమును, దానిననుసరించిన మనుష్యుని వ్యాపారములను బరిశోధించునవి సాంఘికశాస్త్రములు; నీతిశాస్త్రము, అర్థశాస్త్రము మొదలగునవి వీనిలో జేరినవి. మనుష్యుని తత్త్వమెఱుంగుటకు వాని వ్యాపార పరిశీలనము ప్రధానాధారమైయున్నది. వాని బాహ్యచర్యల బట్టి

శమే వాని స్వభావమిట్టిదియని మనము నిర్ణయింప గలిగియుందుము. వానిచర్యలలో ననేకములు ధనముగడించుటయందు వినియోగింప బడుచున్నవి. ధనమునుసంపాదించుటకై ప్రయత్నించుట మంచిదియా? కాదా? యనునంశమును నీతిశాస్త్రజ్ఞులు తర్కింతురుగాక. అర్థశాస్త్రమునందీప్రశంస విస్తారముగ నుండదు. సరియైనను గాకపోయినను మనమందరము నీపనిని జేయుచున్నాము. మనకాలములో జాలభాగము నిందుసమిత్తముగ గడపుచున్నాము. ధనార్జనయత్యంతావశ్యకమైన కార్యమనికూడ మనమెంచుచున్నాము. ఇందుకై మనము పడునంతటిశ్రమ మరిదేనికిగాని పడుటలేము. కావున మనుష్య వ్యాపారముల స్వభావమును మనుష్యుని ప్రకృతిని దెలిసికొనగోరు శాస్త్రపరిశోధకులందఱు ధనముగడించుటకై మనుష్యుడు చేయుప్రయత్నముల నెఱింగినవారైనగాని వారిశాస్త్రజ్ఞానము పరిపూర్ణతనొందదు. ధనముకొఱకై మనుష్యుడు పడుశ్రమ యెట్టిది? ఆసందర్భమున నతడితరులతో నెట్టిసంబంధమును గలిగించుకొనుచున్నాడు? కొన్నిదేశముల వారెక్కువ ధనికులుగ నుండుటకును మఱికొన్నిదేశములవారు దరిద్రులుగనుండుటకును గారణములెవ్వి? ఎట్టిమార్గముల నవలంబించిన యెడల బేదరికమనుభవించు దేశములవారు ధనవంతులు కాగలరు? ధనభూయిష్ఠములగు దేశములందుసహితము కొందఱు లక్షాధికారులైయుండ దక్కినవారు భిక్షాధికారులై కడుదారిద్ర్యమనుభవించుటకు హేతువేమి? అను మొదలగు విషయములకు సమాధానముల నర్థశాస్త్రజ్ఞు లియ్యబూనుకొనియున్నారు.

అర్థశాస్త్రజ్ఞాన మభివృద్ధికానుగాను ఈప్రశ్నలకు బూర్తిగ మనము సమాధానముల నియ్యగలిగి యుందుము.

ధనముయొక్క ప్రాముఖ్యమిట్టిదని నిరూపించుట మిక్కిలి యవసరముకాదు; అదియందఱి యనుభవమునందుండు అంశమే. మనలోనెల్లవారును ధనము నార్జించువారుగను దానిని ఖర్చిడువారుగను నున్నారు. ప్రతిమనుజునకును నేదియోయొక జీవనోపాయ మావశ్యకమైయున్నది. లాభకరములగు జీవనోపాయముల సంపాదించువారు ధనికులై యిహసౌఖ్యముల బొందగలిగి పరమునుగూడ సాధింపదగి యున్నారు. అట్లు కానివృత్తుల నవలంబించువారు పరమునకును నిహమునకును గూడ దూరులగుట తటస్థించుచున్నది. "ధనమూలమిదం జగత్" అనుపండిత వాక్యమందెంతయో సత్యమున్నది. ధనికున కితరుల సహాయమధికముగ లభించును; బంధుగౌరవము కలుగును; స్నేహితులు సులభముగ దొరకుదురు. ధర్మము చేయుట కెక్కువ యవకాశముండును. తానుసౌఖ్యపడుటయే గాక, ఇతరుల సౌఖ్యవంతులజేయుట కాతడు సమర్థుడైయుండును; వానికి గుటుంబమం దైకమత్యము వర్ధిల్లును. కుమారులను దృఢశరీరులుగను నారోగ్యవంతులుగను విద్యావంతులుగనుజేయుట యట్టివానికి సులభసాధ్యమగును. పుష్టికరమగు నాహారమును, విశాలమగు గృహమును, సౌఖ్యదాయకము లగు నితరపదార్థములను యథేచ్ఛముగ నట్టివాడనుభవించుచుండును. అధికార గౌరవములు గూడ వానికేగలుగు[illegible].

మంచిచేయుటకుగాని కీడుజేయుటకుగాని యతనికున్నంత యవ
కాశము దరిద్రునకుండదు. ఇన్నిలాభములు కలుగుటవలననే
ప్రతిమనుజుడును గొప్పదీక్షతో ధనసంపాదనమునకు గడగు
చున్నాడు.

ధనములేని యెడల సౌఖ్యము బొందగూడదా? ధనిక
లెల్లరు సుఖులైయున్నారా? అనుప్రశ్నల మీరడుగవచ్చును.
నిజమే; దరిద్రుడుసహితము ధర్మము సత్యము శౌచము మొ
దలగు సుగుణ సంపత్తిని సంపాదింపవచ్చును; అట్టి వారనేకులు
న్నారు. ధనవంతులలో నిట్టిసుగుణములు లేనివారెందరో
యున్నారు. కాని ధనముండినచో నిట్టిసుగుణము లలవడుట
సులభతరమైయుండును. "సుగుణదుర్గుణములు పుట్టుకతో మ
నుష్యునికి లభించును. కర్మవశముచేత గొందరు పుణ్యాత్మ
ులుగను మరికొందరు పాపాత్ములుగను జనించుచున్నార"ని
కొందరు వాదింపవచ్చును. కాని సహజగుణములు వికసించు
టకును నశించుటకును దగినయవకాశములుండుట యావశ్యక
ము. సారవంతమగు భూమిసహితము మనుష్యుని పరిశ్రమయు
ను నవకాశమును బొందియే మనకుపకారకరమగుచున్నది;
పరిశ్రమావకాశము లేనియెడల దానిసారము నిష్ఫలమేయగును.
అట్లే సహజముగ గొన్నిగుణములు గలవాడుకూడ నవకాశ
మున్నప్పుడే దానివలన నతడు లాభనష్టముల నొందుటయు,
నితరుల కట్టివానిని గలిగించుటయు సంభవించుచున్నది. "ఐ
శ్వర్యము" "దారిద్ర్యము" అనునవియే యిట్టియవకాశ హేతు
వులు. రోజునకు బండ్రెండు గంటలకాలము విరామము లేక

కూలిపనిజేయుచు, నప్పటికినిగూడ వానికుటుంబపోషణమునకు
వలయునంతటి ద్రవ్యముగడింపలేక యింటికివచ్చిన తోడనే
పిల్లలన్నమునకును బట్టలకును మొఱపెట్టుచుండ, భార్యయును
రోగనతియయ్యును దారిద్ర్యదేవతపట్టి పీడించుచున్నదిగదా
యని విసుగుకొనుచుండ నట్టికూలిపనివానికి సౌఖ్యమనునది
లభించుటెట్లు? అట్టివానికి మనశ్శాంతి కలుగుటెట్లు? ఈకారణ
ముచేతనే దరిద్రులనేకులు తమతీరుబడి కాలమునంత జూద
మందో పానమందో గడుపవలసి యున్నారు. పేదరికమును
మనమెంత యధికముగ దగ్గింపగలుగుదుమో యంత వేగము
మనము మనప్రజల సర్వవిధముల బాగుచేయగలవార మగు
దుము.

దేశముయొక్క ఘనతకూడ జాలవరకు ధనముపై నా
ధారపడి యున్నది. అభివృద్ధి, నాగరకత, అనుపదముల నీకా
లమందు మనము విశేషముగ వాడుచున్నాము. కాని దేనిని
బట్టి యొకదేశము నాగరకతగాంచి యున్నదా లేదా యను
సంశయమును మనము నిర్ణయించుచున్నామో కొంచెమాలోచిం
పవలయును. నిజముగ నాగరకతగాంచిన దేశములలోని ప్ర
జలు తుచ్ఛములును సామాన్యములునునగు వాంఛల విశేష
ముగ బెట్టుకొనక, యుత్కృష్టములగు కోరికలను విస్తారముగ
గలిగియుండి వానిని బూర్తిగావించుకొనుటకై వలయుసాధన
సామగ్రిని బడసియుందురు. మధురమగు గానశ్రవణము జే
యవలయుననియు, మనోహరములగు కావ్యముల జదువవల
యుననియు, సుందరములగు దేవాలయాదులనిర్మించి నేత్ర

నందు మొదవలయుననియు, శిలావిగ్రహముల జెక్కించియు, చిత్తరువుల వ్రాయించియు, బండితుల ప్రోత్సహించియు, శాస్త్రజ్ఞానాభివృద్ధి గావించియు, మనుష్యసృష్టిజేయుటలో భగవదుద్దేశము లేవియో వానిని నెఱవేర్పవలయుననియు నాగరకతగాంచిన దేశములవారు యత్నించుచుందురు. నాగరకుల లోగన్పడు నీధర్మములలో నెద్దానిననుష్ఠింప వలయునన్నను ధనమెంతయో యావశ్యకమగు సహకారిగనుండును. గాయకులును కవులును శిల్పులును చిత్రకళావిశారదులును శాస్త్రజ్ఞులును దేశమందనేకులుండవలయునన్న వారిని బోషించుటకు వలయుసమర్థత దక్కినప్రజలలో నుండవలయునుగదా? అనగా దక్కినవారి పరిశ్రమవలన నుత్పత్తియగు నాహారాది పదార్థసముదాయము వారిస్వకీయ పోషణమునకే గాక గాయకులు మొదలగువారి పోషణమునకుగూడ జాలియుండవలెను. అట్లుగానినాడు, గానశక్తిగలవారుకూడ స్వోదరపోషణార్థమై కర్షకులై యాహారపదార్థముల సంపాదించుటకు బాటుపడవలసియుండును. వ్యవసాయము వ్యాపారము మొదలగు కర్మలు మంచిదశయందుండి, కర్మకరులకు విశేషలాభమొసంగుచుండు దేశమున బ్రజలలో గొందఱైన నిట్టికర్మలజేయ నవసరము లేక కవిత్వ శాస్త్రపరిశోధనాదులలో గాలముగడుప నవకాశము గలిగియుందురు. ప్రస్తుతకాలమున మనదేశమందు దగిన ద్రవ్యసహాయము లేకపోవుట చేతనేగదా విద్యావ్యాపనము మొదలగు కార్యములనేకముల నెఱవేర్చుట దుర్ఘటమైయుండుట. ఎవరో కొందఱుతప్ప జనసామాన్యమంతయు మిక్కిలి

దరిద్రులైయుండుటచేత, వారు సంపాదించునది వారిపోషణకే చాలక సదుద్యమములకు దోడ్పడుటయందు వారికుత్సాహమున్నను శక్తిమాత్రము వారికిలేకయున్నది. జీర్ణించిన కళలన్నియు పునరుజ్జీవములై, నాగరకతాధిక్యముచే వన్నెగాంచిన దేశములతో మనదేశము సమానము కావలయుననిన మనమిప్పటికంటె నధికముగ ధనము నుత్పత్తిజేయుటకు వలయుశక్తిసామర్థ్యముల సంపాదింపవలెను. ధనముండిన మాత్రముననే దేశము నాగరకత కలదియగునా? యను సంశయముకలుగవచ్చును. నాగరకతకలది యగునని నాయభిప్రాయముకాదు. ధనమును వ్యయపరచు విధానమునుబట్టి నాగరకతాభివృద్ధి యగుచుండును. కాని ధనముండిన యెడల దానిని సన్మార్గముల వినియోగపఱుప బ్రయత్నింపవచ్చును. అదిలేనిచో మనమేపని జేయుటకుగూడ నసమర్థులమై యుందుముకదా? దరిద్రులచేనిండిన యేదేశముకూడ ఘనతగాంచినట్లు మనము వినియుండలేదు.

ఈసందర్భమున మఱియొక విషయమునుగూడ మనమాలోచింపవచ్చును. పాశ్చాత్య దేశములందును నిప్పుడిప్పుడు మనదేశమందుగూడను 'కూలి'వాండ్రు సంఘములుగ నేర్పడి, సమ్మెకట్టుకట్టి వారియజమానులతో బోరాడుచుండుట మనము వినుచున్నాము. కొన్నిగ్రామములందు నగ్రహారస్థులకును రైతులకును, మరికొన్ని ప్రదేశములందు జమీందారులకును వారిరైతులకును బరస్పర వైషమ్యమధికమై యొకొక్కప్పుడు కలహరూపముగ బరిణమించుటయు గలదు.

ఇట్టి కలహములవలన నిరుపక్షముల వారికేగాక దేశమునకెంతయు నష్టము కలుగుచున్నది. ఈకలహముల కన్నిటికిని ధన విషయకములగు సంశములే మూలకారణములై యున్నవి ఒకబట్టలనేయుశాలలో బనిజేయుచుండు వేలకొలది కూలివాండ్రిక కాలమున బనిమానివేసిరనిన వారికిచ్చుకూలి చాల తక్కువ యనియు వారికష్టమునకది తగినది కాదనియు వారభిప్రాయ పడుటయే దానికి హేతువు. వారి పరిశ్రమలేనిదియు నాశాలలో బట్టలనేయుట యసాధ్యమైనను, శాలాధికారియగు వారియజమానుడు నెలకెన్నియో వందల రూపాయల నార్జించుటయు, రాత్రింబవలు పనిచేయువారికి రోజునకొక రూపాయ కూలిగూడ దొరకకుండుటయు, వారిమనస్సుల నెల్లప్పుడు బాధించుచునేయుండును. ఇట్లే, పనిపాటులేమియులేని జమీందారుడుసంవత్సరమున కెన్నియో వేలకొలదిరూపాయలగడించుచుండ, గష్టపడి సంవత్సరమంతయు వ్యవసాయముచేయు రైతులకుగడుపునిండనన్నముదొరకుట దుస్సాధ్యమైయుండును. ఇట్టి వ్యత్యాసము మనకన్నులెదుట బ్రతిదినమును జరుగుచున్నది. ఇదియెంతయో యన్యాయమని తలచువారనేకులున్నారు. అందఱునుగలిసి యుత్పత్తిగావించిన వస్తుసముదాయములో గొందఱికెక్కువభాగము వచ్చుటయేమి? కొందఱకు దక్కువ భాగము వచ్చుటయేమి? ధనికులు, భూస్వాములు, వర్తకులు, న్యాయవాదులు, ఉద్యోగస్థులు మున్నగువారెల్లప్పు డెక్కువ యాదాయమును బొందుచుందురు. ఏధర్మము ననుసరించి దేశమందుత్పత్తియగు వస్తుసముదాయ మందఱకును విభజింపబడుచున్నది? ఈకాలమందెక్కడ జూచినను ప్రజలలోనొకరొకరికెట్టి భేదము నుండగూడదనియు, సాంఘికగౌరవములొందుటలో బ్రాహ్మణ బ్రాహ్మణేతర పంచమ క్రైస్తవ మహమ్మదీయులను భేదవివక్ష చేయకూడదనియు, రాజకీయాధికారము లనుభవించుటలో నందఱకు సమానావకాశము లుండవలయుననియు, ప్రజాప్రభుత్వమందిట్టి భేదములుండుట యసంగతములనియు, మనమంగీకరించు చున్నాము. ఆర్థికవిషయములందన్ననో యిట్టిభేదము లగపడుచున్నవి. కొందఱు ధనికులుగను గొందఱు దరిద్రులుగను నున్నారు. సోమరులగు వారనేకు లైశ్వర్యవంతులుగ నున్నారు; ఎడతెగక పాటుబడు వారనేకులు దరిద్రులైయున్నారు. సంఘమందిట్టి విపరీతమెట్లు సంభవించినదో తెలిసికొనుట మనవిధియైయున్నది.

ప్రపంచములోని దేశములవారికి బరస్పరవైషమ్యము గలుగుటకును, నావైషమ్యము యుద్ధరూపమున బరిణమించుటకును "ఆర్థిక" విషయములే ముఖ్యకారణములు. ధనమును గోరియే పాశ్చాత్యదేశముల వారాసియా ఆఫ్రికాఖండములందలి దేశములన్నిటిని వశపఱచుకొనిరి. ప్రస్తుతకాలమందలి రాజ్యాంగ సమస్యలన్నియు ఆర్థికాంశములపై నాధారపడియున్నవి.

ఈపైవిషయములబట్టి ధనముయొక్కయు దద్విషయమై మనుష్యులు గావించు వ్యాపారముల యొక్కయు ప్రాముఖ్యము స్పష్టమగుచున్నది. ఇట్టివిశేషముల గ్రహించుటయందు మనకుదోఁచెడు 'అర్థశాస్త్రము' యొక్క ప్రాముఖ్యము

వేఱుగ జెప్పనవసరము గన్పింపదు.

ఆర్థికవిషయ ప్రాధాన్యము స్పష్టమగుటకు మరిరెండు ముఖ్యాంశముల గురించి చెప్పవలసియున్నది.

ప్రతిదేశమందును నొకసంవత్సరమునకంటె మరియొక సంవత్సరమున జనసంఖ్య హెచ్చుచున్నది. అగ్ని ఉదక వ్యాధి దుర్భిక్ష యుద్ధాది పీడలవలన నప్పుడప్పుడు జనక్షయ మధికముగ గలుగుచున్నను మొత్తముమీద జనసంఖ్య వృద్ధి యగుటయేగాని క్షీణించుటలేదు. ఇట్లధికమగుచుండు జనసముదాయమునకు కావలసిన యాహారాదుల నెట్లు మనము సంగ్రహించుకొనుచున్నామో యాలోచించితిమేని 'ఆర్థిక' జీవనముయొక్క నిశ్చితార్థము బోధపడక మానదు. ఆహారము, వస్త్రము, గృహము గృహోపకరణములు మున్నగునవి ప్రతిమనుష్యునకును నావశ్యకములై యున్నవి. కొందఱివి ఎక్కువగ ననుభవించుటయు, మరికొందఱట్లుగాకుండుటయు, అనుతారతమ్యము లగపడవచ్చును. కాని ప్రతిమనుజునకు నివి జీవనాధారములై యున్నవి. ఇట్టివస్తుసముదాయమును తృప్తిగ గాంచుటకు సారవంతమును విస్తీర్ణతాధిక్యమునుగల భూమియు, నదులు గనులు అడవులు వర్షము తగుశీతోష్ణము మొదలగునవి యుండవలెను. వీని నాధారము జేసికొనియే మనుష్యుడు తనకు వలయువాని నన్నిటిని సమకూర్చుకొనుచున్నాడు. కానియివన్నియు మనకు మితముగ నియ్యబడియున్నవి. వీనిని విస్తరింపజేయుట మనకసాధ్యము. జనసంఖ్య హెచ్చినను తగ్గినను నదులసంఖ్యయు గనులసంఖ్యయు భూవిస్తీర్ణతయు

నొక్కటిగనే యుండును. వానిపరిమాణములో మార్పుకలుగుటలేదు. మితపరిమితిగల వీనినుండి యమితముగ వృద్ధిపొందుచుండు మనుష్యకోటికి వలయునాహారాదుల సంపాదించుటెట్లు? ప్రథమమున జనసంఖ్య తక్కువగనున్నప్పుడు దేశములోని చాలభాగము బీడుపొలముగను నడవులుగను నుండవచ్చును. జనసంఖ్య హెచ్చగనే యిట్టిప్రదేశముల బాగుచేసి వ్యవసాయమున కనుకూలపఱచుకొనవచ్చును. కాని యెప్పటికో యొకప్పటి కిట్టి ప్రదేశములన్నియు సమసిపోవుట తటస్థించును. అట్టికాల మనేకదేశములలో నిదివఱకే తటస్థించినది. మన దేశమిప్పు డిట్టిదైయున్నది. ఇంగ్లండు ఫ్రాంసు జర్మనీ మొదలగు దేశములుగూడ నిట్టిస్థితియందేయున్నవి. ఇటీవల కాలమందు గనుగొనబడిన అమెరికా ఆస్ట్రేలియా మొదలగు ఖండములలో ఖాళీప్రదేశము లింకనున్నవి. కాని, వానియందుగూడ జనసంఖ్య హెచ్చుగానుకాను ఖాళీప్రదేశములన్నియు సాగుచేయబడగలవు. ఇట్టి సందర్భమున మనుష్యుడేమి చేయుచున్నాడు? తనకుగావలసిన పదార్థముల నెట్లుసంపాదించుచున్నాడు? ఒకచిన్న యుదాహరణమును దీసికొనుదము. ఒకగ్రామమందు రెండువందల జనమును నాలుగువందల యెకరముల భూమియు నున్నదనుకొనెదము. ఈభూమినంతను నుపయోగించి వారికిగావలసిన యాహారపదార్థాదుల వారుత్పత్తిగావించుకొనుచుండ గొంతకాలమునకు జనసంఖ్య మూడువందలయినదని యనుకొందము. ఆలుగువందల యెకరములనుండి పండినధాన్యము రెండువందలమందికి సరిపడుచుండినచో మూడువందల

జనమున్నప్పుడు వారికాపంట యెట్లుసరిపడును? పూర్వముకంటె నిప్పుడొకడు కడుపు దక్కువ యాహారముతో దృప్తిపొందియుండవలెనుగదా? రెండువందల జనమున్నప్పు డొకరికొకరి కెంత యాహారముదొరికినదో అంతయాహారము మూడువందలమంది యున్నప్పుడుకూడ లభింపవలయుననిన, నాలువందల యెకరములనుండి యెక్కువధాన్యమును పండింపవలయును గదా? ఇదివఱకెకరము పొలమునుండి యొకపుట్టెడుధాన్యము పండినయెడల నిప్పుడొకటిన్నర పుట్టి పండించినగాని పూర్వపు మోస్తరుగా బ్రతిగ్రామస్థునకును బుష్టిగనాహారము దొరకదుగదా? ఒకచిన్న గ్రామమునందిట్టి కష్టముకలిగినట్లే దేశమందంతట కలుగుచుండును. ఇందువలననే ప్రాణధారణ మప్పటప్పటికి కష్టతరమగుచుండునని మనమభిప్రాయ పడవలసియున్నది. నిజముగ మనజీవితము కష్టతరమగుచున్నదా? ఇట్టికష్టములను తొలగించుటకై మనుష్యులెట్టిసాధనముల సృష్టిజేయుచున్నారు? మనుష్యునిచరిత్రను మనముపరిశీలించినయెడల వాని యభివృద్ధియంతయు నీకష్టమును నివారించుటకై యతడుచేసికొనిన సదుపాయములతో గూడియున్నట్లు గన్పడును. మితముగ భగవంతునిచే నియ్యబడిన భూమి నదులులోనగు వానినుండి మనుష్యుడు వానిబుద్ధి చమత్కారము నుపయోగించుచు నొకకాలముకంటె మరియొకకాలమున నెక్కువవస్తుసముదాయము నుత్పత్తి జేయుచున్నాడు. మనుష్యుని బుద్ధివికాసము అనేకవిధము లభివృద్ధిగాంచి సృష్టియందు వానిసౌఖ్యమున కాటంకములుగలిగినపుడు వానిని బోగొట్టుటకువలయు సా

ధనములగని పెట్టుటలో వినియోగింపబడుచున్నది. ఇందువలననే జనసంఖ్య హెచ్చుకొలదియు మనజీవితము కష్టతరముగాకున్నది. కష్టములువచ్చినప్పుడే మనుష్యునినిపుణత యభివృద్ధియగుటకు నవకాశమున్నది. మనముపయోగించు నుపకరణములు, యంత్రములు, మున్నగునవియన్నియు నీనిపుణతాభివృద్ధివలన గలిగినఫలములు. వీనిసహాయముననే మనము పూర్వముకంటె బ్రస్తుతమున నెక్కువ వస్తుసముదాయము సంపాదించుచున్నాము.

జీవితమందలి మనకష్టము లధికములగుటకు జనసంఖ్య హెచ్చగుటమాత్రమే కారణముకాదు. దీనికంటె బలవత్తరమగు హేతువు మనకోరికల సంఖ్యావృద్ధియగుటయే. ఆవిషయమై మనమించుక యాలోచింపవలసియున్నది.

నాగరికులకును ననాగరికులకును గలభేదములలో గోరికలసంఖ్య యొకటియైయున్నది. నాగరికత హెచ్చుకొలదియు మనవాంఛలుగూడ హెచ్చగుచుండును. ఆహారవిషయము దీసికొనిన నాగరికుడగువాడు అన్నము పలురకములగుకూరలు, పచ్చళ్ళు, పప్పు, పులుసు, చారు, ఊరగాయలు, నెయ్యి, మజ్జిగ మొదలగు పదార్థముల నెన్నిటినో పూటపూటను వాడుచుండును. విస్తారము నాగరకత లేనివాడు అన్నము, పచ్చడి, గంజితోడనే తృప్తిబొందియుండును. కడుపునిండుటకును దార్ఢ్యము కలుగుటకును ఇన్నిరకముల పదార్థము లావశ్యకములుకావు. కాని మనుష్యస్వభావమేమనిన నొకవస్తువుతో దృప్తిబొందక పలువిధములగు వానిని గోరుచుండుట. వస్త్ర

ముల విషయమునగూడ నీధర్మమే యగపడుచున్నది. చలినుండి గాచుకొనుటకొరకు దుప్పటిచాలును. ఎండబాధను దొలగించుకొనుటకొరకు సన్ననిబట్టచాలును. కానిమనలో ప్రతిమనుజుడును నెన్నిరకముల వస్త్రముల నుపయోగించుచున్నాడో యాలోచింపుడు. కోట్లు, షర్టులు, లాల్చీలు, లాగులు, కాలర్లు జాకెట్లు, పట్టువస్త్రములు, జల్తారుబట్టలు మొదలగున వెన్నియో మనమీకాలమందు వాడుచున్నాము. దప్పితీర్చుకొనుటకు మామూలునీళ్లు చాలినను మనము కాఫీ, టీ, షర్బత్తులు, సోడా, లిమ్నేడ్, ఐస్, సారాయి మొదలగువానిని నెన్నిటినో కోరుచున్నాము. ఇది మనుష్యునికి నైజమైయున్నది. ఒకవస్తువును సంపాదింపగనే మరియొకదానిపై మనస్సువెళ్లుచుండును. మనకోరికలసంఖ్య హెచ్చగుటకు మరికొన్ని కారణములు కలవు. ఒకడునడుచుకొనిన ప్రకారము తక్కినవారు నడుచుకొనుటగూడ మనుష్యస్వభావమైయున్నది. దీనినే యనుకరణమందురు. మనలో నెవరైన నొకమోస్తరు చొక్కాతొడిగిన తోడనే వానిననుసరించి తక్కినవారుకూడ నట్లేచేయుదురు. కాఫి, టి, సబ్బుబిళ్ళలు, సిగరెట్లు, బూట్లు, టోపీలు, మొదలగునవి మనదేశమున అపరిమితముగ వ్యాపించుట కిదియేకారణము. మర్యాదను గాపాడుకొనుటకై కొన్నివస్తువు లావశ్యకములని మనమెంచుచుందుము. మనయైశ్వర్యము నితరులకు దెలియజేయనుద్దేశించి మరికొన్నివస్తువుల సంగ్రహించెదము; బంగారునగలు రత్నములు వెలగలచీరెలు మోటారుబండ్లు మొదలగునవి యిట్టివి. పైనుదాహరింపబడిన మనుష్యస్వభావ

లక్షణములకన్న వాంఛలు హెచ్చగుటకు మరియొకకారణమున్నది. అదియేదియన మనజ్ఞానాభివృద్ధియే. మనజ్ఞానమభివృద్ధి కానుగాను మనమెక్కువ సౌఖ్యమునందుటలో సాధనములగు ననేకనూతనవస్తువుల కనిపెట్టగలిగియున్నాము. అగ్గిపెట్టెలు, ఔషధములు, పొగబండ్లు, కిరసనాయిల్, చిమ్నీలు, మొదలగునవి యిట్టివి. ఇన్నికారణములచే మనకోరికలు దినదినాభివృద్ధి గాంచుచున్నవి. ముప్పది సంవత్సరములకు బూర్వము మనముపయోగించుచుండిన వస్తువులకును ప్రస్తుతము మనముపయోగించుచున్నవానికిని గలభేదమే దీనికిదార్కాణము.

ఇంద్రియములను మనస్సును మనము స్వాధీనముచేసికొని మనకోరికలు మితముగనుండునట్లు మనము ప్రయత్నింపవలయునను సిద్ధాంతమున కిదియంతయు విరోధముగనున్నదను శంకగలవారికి సంతృప్తిగ జబాబునిచ్చుటకు తగినయవకాశము లేదు. కాని రెండువిషయములనుమాత్రము మనము జ్ఞాపకముంచుకొనవలయును. సాధారణముగ మనుష్యుడు ధనసంపాదనకై పాటుపడునట్లు మరిదేనినిమిత్తముగూడ పాటుబడ నిష్టపడుటలేదు. (బహుశః మతవిషయమున నింతటియుత్సాహమునుజూపునేమో) మనకోరికలు మితములై మితప్రయత్నములవలన నవిసఫలములగునట్లుండిన యెడల మనమెల్లరము సోమరులై పోదుము. తృప్తికలిగియుండుట యొకవిధముగ మంచిదేకాని, యల్పసంతోషియగువాడు ప్రయత్నపూర్వకముగాక, వానికిసహజముగ లభించిన శక్తిసామర్థ్యముల వృద్ధిపఱచుకొనజాలడు. గొప్పకోరిక మనలనేదియో నావేశించినగాని మన

యుత్సాహమును నైపుణ్యమును మంత్రిబలమును వృద్ధియగుటకవకాశముండదు. అనాగరికులగువారిలో నీన్యాయము బాగుగగన్పడుచున్నది. ఏదైననొకరోజున వారికిసమృద్ధిగ నన్నముదొరికినయెడల దానితో వారెక్కడలేని సంతోషమునుబొంది మరిరెండుమూడు రోజులవఱకు బనులమానుకొని సోమరులై నిద్రయందే కాలముగడపెదరు. నాగరికుడన్ననో అట్లుచేయక యొకరోజున నధికలాభముకలిగినను భావికాలమొకటి యున్నదని తెలిసికొని కడుదీక్షతో బనిచేయుచునేయుండును. మనకోరికలు హెచ్చుకొలదియు మనశక్తిసంపద లెక్కువగ వికసింపకలిగియుండును. కావున కోరికలుహెచ్చుగుట సహజమగుటయేగాక దానివలనలాభము కలుగుననికూడ చెప్పవచ్చును.

ఎట్టికోరికల వృద్ధిపఱచుకొనవలెను? ఎట్టివానిని మాననవలెను? అనునది చర్చనీయమగు విషయమే. దీనినిగుఱించి భిన్నాభిప్రాయముండవచ్చును; కాని కోరికలుండుటయే పొరపాటనువాద మంగీకరింపదగినది కాదు.

పైవిషయములవలన మనజీవితమందు ధనార్జనకై మనము గావించుప్రయత్నము లెంతముఖ్యమో తెలియుచున్నది. జనసంఖ్య యధికమగుటచేతను మనకోరికలు దినదినాభివృద్ధిగాంచుచుండుటచేతను మనమెక్కువ శ్రద్ధాచాతుర్య నిపుణతలతో బరిశ్రమజేయుటయు, మనపూర్వులెఱుగని పద్ధతులనవలంబించుటయు బూర్వకాలముకంటె భిన్నమగు నేర్పాటుల ననుసరించుటయు నావశ్యకమైయున్నది. మనుష్యుని చరిత్రమందు మార్పులతప్పక కలుగుచునేయుండును. వానికిష్టమున్నను

లేకపోయినను సందర్భములు మార్పునొందుటబట్టి వానిజీవితమందును వానిప్రయత్నములందునుగూడ నాతడు మార్పులజేసికొనవలసినవాడైయున్నాడు. కొన్నిదేశములవారీమార్పుల నుద్దేశపూర్వకముగను గడువేగముగను జేసికొని వారికిగలుగుకష్టముల దొలగించుకొని కాలక్రమమున నెక్కువ సౌఖ్యమువడయుదురు. మిగిలినవారట్లుగాక బలవంతమగు నిర్బంధముమీద మార్పులగావించుకొని యనవసరముగ గష్టములపాలగుచుందురు. మాంద్యము చురుకుతనము మనుష్యుని జీవితమునందెట్టి ఫలములుబుట్టించునో దేశీయజీవితమందు నహిత మట్టి ఫలమునేయుత్పత్తిజేయును.

ధనమనుమాటను బలుమారక్కడక్కడ మనముపయోగించుచుంటిమి. ఆమాటకర్థమేమియో ఎట్టిపదార్థములు ధనవర్గములో జేరునో మనమిప్పుడు దెలిసికొనవలసియున్నది.

మనుష్యుడు పాటుపడినగాని సంపాదించుటకు వీలులేని పదార్థములన్నియు ధనవర్గములో జేరినవి. ఇండ్లు, ఆహారపదార్థములు, వస్త్రములు, పశువులు, గృహోపకరణములు, వెండి, బంగారము, లోహములు, నెయ్యి, నూనె మొదలయినవి అన్నియునిట్టివి. పాటుపడకయే మనుష్యునికిలభించు పదార్థములు ధనములో జేరవు.

ధనవర్గములో జేరిన వస్తుసముదాయమంతయు మనుష్యునికేదియో యొకవిధముగ నుపయోగించునదియని వేఱుగ జెప్పనక్కఱలేదు. నిరుపయోగములైన వస్తువుల సంపాదించుటకు నెవ్వడును బాటుపడజాలడు. ఎవనికో యొకనికి నేదియో యొకవిధమగు తృప్తిగలిగించు ప్రతిపదార్థముకూడ నుపయో

గకరమైనదని మనమనుకొనవలెను. కాఫీ, టీ, సారాయి, మొదలగునవి నిరుపయోగ పదార్థములని యనేకులభిప్రాయపడవచ్చును; కాని వానిని సేవించి, తృప్తిబొందువారు ప్రపంచమందుండునంతవఱకవి యెవరికోయొకరికి నుపయోగకరములని చెప్పకతప్పదు. కావున నిట్టివస్తువుల నుత్పత్తిజేయుటకును, సంపాదించుటకును ననేకులు పాటుపడుచుందురు. ఒకప్పుడు నిరుపయోగములని యెంచబడినవి కాలముమారుటచేతను బ్రజల యభిప్రాయములు వేరగుటచేతను మరియొకప్పు డుపయోగములగు వస్తువులలో జేరవచ్చును; లేక ఒకప్పుడుపయోగములుగ నుండినవి మరికొంతకాలమున కుపయోగరహితములని యెంచబడవచ్చును. ఇట్టిమార్పునుబొందిన వస్తువులెన్నియో మన యనుభవమందున్నవి. ఉపయోగకరము కానివెన్నడును ధనవర్గములో జేరవను విషయము మాత్రము మనము గ్రహింపవలెను.

ఉపయోగకరములగు సమస్తవస్తువులును ధనమని యెంచబడుటలేదు. అట్లెంచబడుటకు వానికి మరియొక లక్షణముండవలెను. అది యేదియన అవిమితముగ నుండుటయే. వానినుపయోగించి వానివలన దృప్తిబొందగోరు మనుష్యుల కెంత కావలయునో యంతమట్టుకు దొరకకపోవుటయే మితముగనుండుట. ధనవర్గములో మనము చేర్చు ప్రతివస్తువు నిట్టిదే. బియ్యమునుగురించి యాలోచించిచూతుము. ప్రపంచమునందెందఱో కడుపునిండ నన్నములేనివారున్నారు. ఇట్టి సందర్భమున నిప్పటికంటె గొంచెమధికముగ మనము వరిపంటనువృద్ధిచేసి కొంచెమెక్కువ ధాన్యమును బండించినయెడల మఱికొం

దఱికి కడుపునిండ నన్నము దొరకుటచేత వారుపొందుసౌఖ్యము వృద్ధిగాంచును. అట్లుగాక, ఏదియో యొక కారణముచే మామూలుకంటె గొంచెముతక్కువ విస్తీర్ణతగల పొలమును మనము సాగుజేసి కొంచెముతక్కువగ ధాన్యమును పండించితిమేని, ఆకలిచే బాధపడువారిప్పటికంటెనధికమగుదురు. వాయువిట్టిది కాదు. అదియుగూడ బ్రాణధారణమందన్నముకంటె మనకెక్కువయుపయోగకరమైయున్నది. కాని దానినెవ్వరును ధనవర్గములో జేర్చుటలేదు. ధాన్యమును గొంచెమధికముగ బండించుటకు బ్రయత్నము జేయువిధమున వాయువును మఱికొంచెమధికముగ నుత్పత్తిజేయుటకెవ్వరును బ్రయత్నించుటలేదు. దీనికి గారణమేమి? ఏకార్యములకు మనకువాయువావశ్యకమైయున్నదో యాయాకార్యములకు గావలసినదానికంటె నధికముగ నదిసర్వవ్యాప్తమైయున్నది. అనగా నదియమితముగనున్నదని యభిప్రాయము. ఎవరైన గష్టపడి యొకనూతన యంత్రమును నిర్మించి రెండువీసెల బరువుగల వాయువునుత్పత్తిజేయగలిగినయెడల ప్రపంచములోని వాయువుయొక్క పరిమాణ మధికమగునుగాని, యిదివఱకుండు వాయువుననుసరించే మనకార్యములన్నియు నెఱవేఱుచుండుటవలన, నీరెండువీసెలవాయువు మనకెట్టియధికసౌఖ్యమును గలిగింపజాలదు. అట్లే రెండువీసెల వాయువు నెవ్వరైన నాశనముజేయగలిగినయెడల దానివలన మనసౌఖ్యము తగ్గిపోదు. ఏపదార్థమును గొంచెము హెచ్చుచేయుటవలన మనసౌఖ్యముగూడ గొంచెము వృద్ధిపొందునో, దేనినిగొంచెము తగ్గించుటవలన మనసౌఖ్యముగూడ గొంచెము తగ్గిపోవునో యట్టిపదార్థమే ధనవర్గములో జేరినది. తక్కినవి

యెంతయుపయోగకరములైనను ధనమనియనిపించుకొనవు. ఆ కారణముచేతనే వానియుత్పత్తికై మనుష్యుడు పాటుపడుట లేదు.

ఉపయోగకరములై మితముగదొరుకు పదార్థములకు మరియొకలక్షణము కలదు. అట్టివానిపై ప్రతిమనుజుడును స్వీయమగుహక్కును సంపాదింప గోరుచుండును. ఆవస్తువులన్నియు నెవరోయొకరి స్వాధీనములోనుండును. హక్కుగలవాని యనుమతిలేక అట్టివస్తువుల బరులనుభవింప నవకాశములేదు. ఇదిసహజమేకదా? పాటుపడకుండ నట్టిపదార్థములుత్పత్తిగావు. కష్టపడి సంపాదించినవాడు వానిని స్వానుభవము నందుంచుకొనక పరులయధీనముచేయునా? ధనవర్గములోజేరిన పదార్థములన్నియు విలువగలిగియుండును. అనగా వానినిదీసికొని మనకు గావలసినదాని నిచ్చువారెందఱో యుందురు. ఒకనివద్ద నొక పుట్టెడుధాన్యముగాని రెండుపశువులుగాని యుండినచో వీనిని దీసికొని వానికిగావలసిన బట్టలు వంటచెఱకు మొదలగు నితర పదార్థములనిచ్చువారు దొరకుదురు. ధనవర్గములోజేరని పదార్థము నీవిధముగ వినిమయముజేయుటకు వీలుండదు.

ఈవిషయములబట్టి యొకమనుష్యునియొద్దగాని యొక గ్రామమందుగాని, యొక దేశమందుగాని యుండుపదార్థములలో నెట్టివి ధనమో ఎట్టివికావో మనమునిర్ణయింప గలిగియుందుము.

ధనికుడనగా వెండి బంగారు నాణెములరూపమగు డబ్బునుగలవాడని సామాన్యాభిప్రాయము; కాని దీనియందెట్టి సత్యమును లేదు. ఒకనివద్ద నాలుగులక్షల రూపాయల ధనమున్నదనిన వానివద్దనన్ని రూపాయలున్నవని యర్థము కాదు.

వానిస్వాధీనమందుండు పదార్థములకు ఖరీదునుగట్టి మొత్తము చేసినయెడల నాలుగులక్షల రూపాయలగునని యర్థము. క్రయవిక్రయములలో మనముపయోగపఱచు నాణెములు కొలకఱ్ఱవంటివి. గజముబద్దతో నొకవస్తువుయొక్క పొడవును, శేరుతో మరియొకదానియొక్క పరిమాణమును, వీసెగుండుతో మఱియొకదానియొక్క బరువును మనముకొలుచునట్లు, నాణెములతో పదార్థములయొక్క విలువను గొలుచుచున్నాము. అట్టి కొలపదార్థములేనియెడల ధనముయొక్క మొత్తమును దెలిసికొనుటగాని, ఇద్దరిలో నెవడెక్కువధనికుడో తెలిసికొనుటగాని, రెండుదేశములలో నేదియెక్కువ ధనవంతమైనదో తెలిసికొనుటగాని దుస్సాధ్యము. ఒకనికి రెండువందల యెకరముల పొలమును మరియొకనికి వేయిపశువులును నుండినయెడల వారిద్దరిలో ధనికుడెవడో చెప్పుటయెట్లు? రెండువందల యెకరముల కెన్నిరూపాయలువచ్చునో వేయిపశువుల కెన్నివచ్చునో తెలిసికొని దానినిబట్టి యొకనికంటె మరియొకడు ధనికుడని చెప్పగలిగియున్నాము. ఇట్లేమరియొక విషయమును గమనింపుడు. ఒకనియొద్ద పదియెకరముల భూమియు, నాలుగుజతల యెద్దులు, పదితులముల బంగారము, ఒకయిల్లు, నాలుగుయిత్తడి బిందెలు, ఎనిమిదిపుట్లధాన్యము ఐదుమంచములు నుండినపుడు వానిమొత్తము ధనమెంతయో గనుగొనుటెట్లు? ఈపదార్థములను సంకలనముజేయుటకు వీలులేదుగదా? ఇట్టిసందర్భమున వీనిలోని ప్రతివస్తువుయొక్క మూల్యమును రూపాయలలోనికి మార్చి యట్టిరూపాయలన్నిటిని గూర్చినయెడల వానివద్దయిన్నివందలో యిన్నివేలో రూపాయల ధనమున్నదని సులభముగ

జెప్పవచ్చును. పదార్థముల విలువనుగొలుచునట్టి సాధనమగు నాణెములవలన నిదియేయుపయోగము.

కావున దేశములో నెన్నిరూపాయలున్నవో యంతయే ధనముదానియం దున్నదని గాని, నాణెములసంఖ్య హెచ్చయినమాత్రముననే మనధనము హెచ్చయినదనిగాని యది తగ్గినంతమాత్రముననే మనధనము తగ్గినదనిగాని యూహించుట గొప్పపొరపాటు. మన దేశమందిప్పు డారువందలకోట్ల రూపాయలు చెలామణియగుచున్నది. కానిమనధనమంతయు దీనికంటెనెన్నియో రెట్లధికమైయున్నది. మనకోరికలనీడేర్చి మనకుదృప్తిగలుగజేయు పదార్థము లాహారాదులుకాని నాణెములుకావు. ఇట్టిపదార్థము లధికమైనపుడే మనధనమధికమగుట సంభవించును. వీసెగుండ్లుగాని, కొలతబద్దలుకాని హెచ్చినంతమాత్రముననే తూచవలసినట్టియు గొలువవలసినట్టియు బదార్థము లధికమైనవని చెప్పదగునా? ఇట్లే నాణెముల విషయమునగూడ తెలిసికొనవలెను.

నాణెముల సాధనముచే ధనవర్గములో జేరినపదార్థముల విలువనుగనుగొని మనదేశమందిప్పుడెంత ధనమున్నదియు మనముచెప్పవచ్చును. ఇతర దేశముల విషయమైగూడ నిట్లేచేసి ఆ దేశములకును మన దేశమునకును ధనవిషయమునగల హెచ్చుతగ్గుల నిర్ణయింపనగును.

మనదేశమందీనిమిషమున నెంత ధనమున్నది యనువిషయముకంటె ఏటేట మనమెంతధనము నుత్పత్తి జేయగలిగియున్నామను విషయ మర్థశాస్త్రమందెక్కువ ప్రాధాన్యము వహించియున్నది. దీనికి గారణములేకపోదు. ఏటేటమన ము

త్పత్తి జేయగల ధనసముదాయముపై మనసౌఖ్యము విశేషముగా నాధారపడియున్నదిగాని యిప్పుడు మనదేశమందుండు ధనముపైగాదు. ధనవర్గములో జేరిన పదార్థములలో జాలాభాగములనిత్యములు. అవిశాశ్వతముగ నుండజాలినవికావు. మనము కాపురము చేయుచుండునిల్లు ప్రస్తుతము మంచిస్థితియందున్నను గ్రమక్రమముగ శిథిలమైపోవును. దానిస్థానమున మరియొకయింటిని నిర్మించుటకు శక్తిసంపాదించి క్రొత్త దానిని గట్టుటవలన మనసౌఖ్యమధిక మగునుగాని, యిప్పుడున్న యిండ్లనేనమ్ముకొని యూరకుండినయెడల గొలదికాలముననే మన కష్టము లధికములగును. ఇట్లేయిప్పుడు మనస్వాధీనమందుండు నాహారపదార్థము లొకసంవత్సరముకంటె నెక్కువకాలమునకు సరిపోజాలవు. ఇవియదృశ్యమగుటకు బూర్వముననే ముందు సంవత్సరమునకు మనకుగావలసియుండు ధాన్యాదులబండించుకొనినగాని మనజీవధారణము దుస్సాధ్యమగును. మనకిప్పుడు పాలునిచ్చు గేదెలు ఆవులు మొదలగునవి యేటేటనీని నిరంతర పశులాభము మనకుసమకూడినగాని మనపోషణకువలయు పాలు పెరుగు నెయ్యి మొదలగునవి మనకుదొరకజాలవు. ఇట్లే ప్రతిపదార్థముగురించి చెప్పదగియుండును. ఈనిమిషమందు సంగ్రహింపబడియుండు ధనసముదాయ మికమీదట మనకుగావలసినధనము నుత్పత్తి జేయుటలో సహాకారియై మనకుపచరించుచున్నది. కాని భావికాలమం దుత్పన్నమగు ధనమువలననే మనసంపదయు, దారిద్ర్యమును నిర్ణీతములగుచుండును.

"మానవకోటి ధనమునేలాగు గడించుచుండునదియు, నేలాగు ఖర్చిచుచుండునదియు దెలుపుశాస్త్ర మర్థశాస్త్ర" మని

ప్రారంభమున జెప్పియుంటిని. ఇదివఱకు మనముగడించిన దానినిగుఱించి మనమాలోచింపనక్కఱలేదు. అదితక్కువగగాని అధికముగగాని యుండవచ్చును. ఇప్పుడును నికమీఁదటను మనమెంతయుత్పత్తి చేయఁగలుగుదుమో దానినిగుఱించియే మనము చక్కఁగ దెలిసికొనవలసియున్నది. ఈభేదమును స్పష్టపఱుపనెంచియే కొందఱర్థశాస్త్రజ్ఞులు 'ధనము'నకును 'ఆదాయము'నకునుగల వ్యత్యాసమును విపులముగ జర్చించియున్నారు. ధనమనునది యొకరాశివంటిది. ఆదాయమొక ప్రవాహమువంటిది. సంవత్సరమున కెంతయాదాయము లభించుచున్నదో దానినిబట్టి ప్రజలు సుఖ దుఃఖము లనుభవించుచుందురు. ఒకనికిబది యెకరముల భూమియుండవచ్చును. దానివలన వాని కెన్నిపుట్ల ధాన్యమువచ్చుచున్నవో తెలిసినపుడే వాఁడుసుఖముగ జీవయాత్ర గడుపుచున్నాఁడో లేదో మనము చెప్పఁగలిగి యుందుము. ఈకారణములబట్టి, యీనిమిషమున మనదేశమందుండు ధనముకంటె నేఁటేటనుత్పత్తియగు ధనమునుగుఱించియే యెక్కువగ నర్థశాస్త్రమందు ప్రశంసింపబడుచుండును.

మనదేశపు సాంవత్సరికాదాయమును నిర్ణయించుటకు విద్వాంసులనేక ప్రయత్నములు గావించియున్నారు; గానివారిలో భిన్నాభిప్రాయము లుండుటవలన సిద్ధాంత మిదియని తేలలేదు. ఈయభిప్రాయభేదము తొలఁగించి సత్యమును స్థిరపఱుచుటలో మనమెట్టిపద్ధతి ననుసరించి యాదాయమును లెక్కపెట్టవలయునో మనము తెలిసికొనవలెను.

ధనోత్పత్తికి మనుష్యుని పరిశ్రమయే మూలాధారమని మనమిదివఱకే తెలిసికొంటిమి. ఆపరిశ్రమవలన మనమేఁటేట

నెంతధనము నుత్పత్తిజేయఁగలిగియున్నామో నిర్ణయించుటలో నొకప్రధానవిషయము గమనింపవలసియున్నది. కొన్నిసమయములందు మనపరిశ్రమ రూపసహితములగు పదార్థములుగ బరిణమించును. కృషికర్మవలన ధాన్యాదులును, గనులలో బనిజేయుటవలన లోహములును నడవుల బాగుచేయుటచే కఱ్ఱసామానులును, కర్మాగారములలోని పనులవలన వస్త్రాదులును ఉత్పత్తియగుచున్నవి. కానిమఱికొన్ని పరిశ్రమఫలములు రూపసహితమైయుండవు. ఒకగాయకుని గానమువిని మనమెల్లరము సంతోషించి వానిశ్రమకు బ్రతిఫలముగ గొంతద్రవ్యము నిచ్చుచున్నాము. వానిగానపరిశ్రమువలన మాత్రము వ్యవసాయమువలన ధాన్యముత్పత్తియగునటుల గంటికగపడువస్తువేదియు నుత్పత్తియగుటలేదు. ఐనప్పటికిని వాని పరిశ్రమ శ్రోతలకానందమును గలిగించి ద్రవ్యరూపమగు ప్రతిఫలమును బొందుటచే దాని విలువనుసహితము దేశాదాయములో జేర్చుట యావశ్యకము. ఇట్లే వైద్యులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఇంటి నౌకర్లు, నటులు, నర్తకులు, మొదలగువారి పరిశ్రమయొక్క విలువనుగూడ దేశాదాయమున జేర్పవలసియున్నది. కావున పరిశ్రమఫలములు రూపసహితములైనను గాకపోయినను నవియన్నియు నాదాయముగ బరిగణింపఁదగియున్నవి. ఈయంశమును గమనించి మనదేశాదాయ నిర్ణయమును జేయవలెను.

ఈనిర్ణయమును జేయుట సులభకార్యముకాదు. కొంతవఱకు దొరతనమువారు ప్రచురించు సాంవత్సరికపు రిపోర్టులలో (1) వ్యవసాయమువలన నుత్పన్నమగు పదార్థములు (2) గను

లనుండి తీయబడులోహములు (3) అడవులు, నదులు, తటాకములు మొదలగువాని సహాయమున సంగ్రహింపబడు వస్తువులు (4) కర్మాగారములందు తయారగు వస్త్రాదులు మొదలగువాని మొత్తము విలువయును దెలిసికొనుట కవకాశమున్నది. ఇట్లే ప్రయాణసాధనములగు పొగబండ్లు మొదలగువానినుండి వచ్చునాదాయము నెఱుగవచ్చును. దొరతనపువారి పత్రికలనుండియు, మరికొందఱి పరిశోధనవలనను రూపసహితములుకాని ఫలము బుట్టించువారివలన గలుగునాదాయము నిర్ణయింపవచ్చును. దొరతనపువారు తయారుచేయు లెక్కలుసరియైనవని మనము చెప్పజాలము. వానిలో నెన్నియో పొరపాట్లుండుట కవకాశమున్నది. అయినను వీనిసహాయమున గొంతవఱకు బరిశోధనగావించినయెడల సంవత్సరాదాయమెంతయో స్థిరపడును.

ఇట్టిలెక్కలవలని ప్రయోజనమేమియను సందేహము కొందఱికి గలుగవచ్చును. "ఇతర దేశములవారికంటె మనముధనికులుగనున్నామా దరిద్రులుగనున్నామా", "మనకువచ్చునాదాయమువల్ల మనముసుఖముగ జీవించగలిగియున్నామా" అను మొదలగు ప్రశ్నలకు జవాబునిచ్చుటలో నీనిర్ణయమత్యంతావశ్యకమైయుండును. ఈ నాయుపన్యాసమును వినువారెల్లరు వారి వారిగ్రామముం దుత్పత్తియగు సంవత్సరాదాయమును శాస్త్రానుసారముగ లెక్కించి తయారుచేసినయెడల మనదేశపు "ఆర్థిక" స్థితియిట్లున్నదని తెలియుటయేగాక దానివలన నర్థశాస్త్ర పరిశోధనకూడ చాలవఱకు వృద్ధికాగలదు. అట్టిపనికి మీరు బూనెదరనియే నానమ్మకము.

౨ ఉపన్యాసము

దేశములోని ప్రజలసౌఖ్యము దానియందేర్పడు నుత్పత్తియగు ధనాదాయముపై నాధారపడియుండుననని వెనుకటి యుపన్యాసమున జెప్పియుంటిని. ఈయాదాయపు మొత్తమును నిర్ణయించు నంశములేవియో యిప్పుడువిచారింపవలసియున్నది.

ప్రకృతి, పురుషకారము, పనిముట్లు (మూలధనము) అను నీమూడును ధనోత్పత్తికి ప్రధానసాధనములు. వీనికూడిక వలననే ధన ముత్పత్తియగుచున్నది. వీనిలో నేది లేకున్నను ధనార్జనదుస్సాధ్యము.

భూమి, భూసారము, గనులు, అడవులు, నదులు, పర్వతములు, సముద్రములు శీతోష్ణములు, వర్షము లోనగువాని సముదాయమునకు బ్రకృతి యనిపేరు. ధనవర్గములోనియే పదార్థమునుత్పత్తి జేయవలయునన్నను వీనిలో గొన్నిటిసహాయమత్యంతావశ్యకము. భూమిలేనియెడల నాహారపదార్థాదులును, గనులులేనియెడల లోహములును లభించుట యసాధ్యముగదా! ప్రకృతివర్గములో జేరినవన్నియు భగవన్నిర్మితములు. వానిని సృష్టించుటకుగాని వాని పరిమితిని యధికముజేయుటకు గాని మనుష్యునికి శక్తిసామర్థ్యములులేవు. కొద్దిగనో గొప్పగనో భగవంతునిచే నొసంగబడిన వీనిని దగురీతిగ నుపయోగించి ధనరూపమగు ఫలమును బొందుటయే పురుషకారము.

కాని యీఫలమును బొందుటలో మనుష్యునికి గొన్ని పనిముట్లావశ్యకములై యున్నవి. నేలసారవంతమైనదైనను దానిని దున్ని చదరముజేసి తగువిధమున వ్యవసాయము జేయుటకు నాగలి, పార, గడ్డపార, చదరపుమాను, కొడవలి, కత్తి, బండి మొదలగు పనిముట్లు కావలసియున్నవి. ప్రత్తిని వస్త్రముగ మార్చుటకు బూర్వము రాట్నము, మగ్గము మొదలగు నుపకరణములు కావలయును. నువ్వులు, ఆముదాలు మొదలగు వానినుండి నూనెతీయుటకు గానుగ మొదలగు పరికరము లుండవలెను. ధనోత్పత్తివిషయమై ప్రయత్నముజేయు నెవరిని జూచినను వారేవియోకొన్ని పనిముట్ల నుపయోగించుచుండుట మనకు స్పష్టమగును. కంసాలి, కుమ్మరి, చాకలి, మంగలి, వడ్రింగి లోనగువారందఱు వారి వారి వృత్తికనుగుణమగు పరికరముల వాడుచుందురు. ఇట్టిసాధనముల సాహాయ్యము లేనియెడల బురుషప్రయత్నము విఫలమగును. ఈపనిముట్ల సముదాయమునకే కొందఱు 'మూలధనమ'ను పేరును బెట్టియున్నారు. క్రొత్తగధనము నుత్పత్తిజేయుటకై యుపయోగపడు ధనమని దీనియర్థము. దీనికిని ప్రకృతిజాలములోని పదార్థములకునుగల ప్రధానభేదమేమియో మనము మఱియొకమారు జ్ఞాపకము చేసికొనవలెను. మూలధనములో జేరిన పనిముట్లన్నియు మానవనిర్మితములు. వానిని హెచ్చించుటకును తగ్గించుటకును మనుష్యుడు సమర్థుడైయున్నాడు. ప్రకృతిలోని నదులు పర్వతములు మున్నగువాని విషయమై యతనికిట్టి సామర్థ్యములేదు.

దేశములో నుత్పత్తియగు (1) ధనసముదాయము (2) దాని స్వభావమును ప్రకృతివర్గములోని భూమ్యాదుల బాహుళ్యమునుబట్టియు వాని సారతలబట్టియు నిర్ణయింపబడుచున్నవను విషయము ఋజువుపఱచుట కష్టతరముకాదు. ఒక వ్యవసాయము విషయమై యాలోచించినయెడల నీయంశము బాగుగస్పష్టపడగలదు. విస్తీర్ణతాధిక్యముగల యిండియా, చైనా మున్నగు దేశములలో నల్పవిస్తీర్ణతగల దేశములలోకంటె నెక్కువధాన్యము పండుచుండును. విస్తీర్ణత యధికమైనను భూమినిస్సారముగ నుండినయెడల బంటతగ్గుచుండును. ఒకప్రదేశమం దొక్కటేపంట ఫలించుటయు, లేక వివిధములగు పంటలు ఫలించుటయు ఫలితమధికముగ నుండుటయు హీనముగ నుండుటయు మున్నగునంశముల నిర్ణయించునవి భూమియొక్క సారాసారతాది లక్షణములు. మన దేశములోని భూసారమంతయు నొకేవిధముగనుండక యొకభాగముకంటె మరియొకభాగము భిన్నముగానుండుటవలన వరి, గోధుమలు, జొన్నలు, రాగులు, ప్రత్తి, జనుము, నువ్వులు, వేరుసెనగ, ఆముదపుగింజలు, చెఱకులోనగు వివిధములగు పంటలెన్నియో ఫలించుట సంభవించుచున్నది. మనుష్యుని చాతుర్యముచే భూసారమును మార్చుటకు గొంతయవకాశమున్నను మొత్తముమీద నదిస్వతస్సిద్ధమైయున్నది. కావున దీనినిబట్టి భూమినుండి యేయేపదార్థముల నెంతెంతవఱకు నుత్పత్తిజేయగలమో నిర్ణయించునది ప్రకృతియని విశదమగుచున్నది. నిలుచుటకును, గూర్చుండుటకును, గాపురముండుటకును నాధారముగ

నుండు భూమిలేనిదియు వ్యవసాయమే గాక, నేత, వడ్రము, కుమ్మరిపని, కంసాలిపని మున్నగువ్యాపారము లన్నియుగూడ జరుగజాలవు.

ప్రకృతి వర్గములోని యితర పదార్థములు కూడనిట్టివియే. వంటకుగావలయు వంటచెఱకు, ఇండ్లుకట్టుటకును బని ముట్లతయారు చేయుటకును గావలయుకఱ్ఱ మొదలగునవి ముఖ్యముగ నడవులనుండియే యుత్పత్తియగుచున్నవి. అడవుల వైశాల్యము, వానిసారము మనకీపదార్థముల నుత్పత్తిగావించుట యందెంతయో సహకారులుగ నున్నవి. గనులు విస్తారముగనుండు దేశములలో లోహములమితముగ నుత్పత్తియై దేశాదాయమును వృద్ధిపఱచుచుండును. ఇంగ్లండు జర్మని అమెరికా మున్నగు దేశములీకాలమున నుచ్ఛస్థితిగాంచుటకు వాని ఖనిజసంపదయే ప్రధానకారణము. ఖనిజములన్నిటిలో ఇనుము రాక్షసబొగ్గు మిక్కిలి ముఖ్యములైయున్నవి. వెండి బంగారము లదృశ్యములైనను మనముజీవింపగలిగి యుందుము గాని యినుములేనియెడల మనప్రాణధారణమే దుర్ఘటమగును. మన దేశమందిటీవల నూతనపద్ధతులప్రకార మినుపగనులు త్రవ్వుటకు మొదలుపెట్టిరి. కాని మనకు గావలసినంత యినుము చౌకగ నుత్పత్తియగునని దృఢముగ మనమింకను చెప్పజాలము. చౌకగనినుము దొరకనికారణముచేత ధనోత్పత్తికీకాలమునవలయు యంత్రాదులను ఇతరదేశములనుండియే మనము తెప్పించుకొనవలసియున్నాము. గనులలో బనిచేసి లోహముల సంపాదించుటకును, యంత్రాదులతో బని జేయుటకును రాక్షస

బొగ్గు చాలయవసరము. రాక్షసబొగ్గుగను లినుపగనులకుసమీపమందే యుండినయెడల బాడ్లఖర్చులు విస్తారములేకయే యినుమును నినుపసామానులను దయారుజేయుట కవకాశముండును. ఈయవకాశ మింగ్లండులో జాలయధికముగనున్నది. మన దేశమందు దక్కువ. అయినప్పటికిని గనులధికముగ నెక్కడనోయొకచోట దేశమందుండినయెడల నెప్పటికో యొకప్పటికి వానినుంచి యాదాయమురాకతప్పదు.

దేశములోని శీతోష్ణస్థితియు వర్ష పరిమాణమును ధనాదాయపుమొత్తమును నిర్ణయించుటలో జాలసహాయము జేయగలిగియున్నవి. ఉన్ని ఉన్నిబట్టలు మొదలగువాని నుత్పత్తిజేయుటకు చలిదేశము లనుకూలించిన ట్లుష్ణదేశము లనుకూలింపవు. మనుష్యస్వభావము సహితమీశీతోష్ణములపై నాధారపడియుండునని యనేకవిద్వాంసుల యభిప్రాయమైయున్నది. అధికోష్ణముగాని యధికశీతలముగాని గలదేశములలోని ప్రజలు సమశీతోష్ణ దేశములలోని ప్రజలవలె దృఢగాత్రులుగను ఓర్పు పట్టుదల మొదలగు సుగుణములు గలవారుగ నుండజాలరు. ఇట్టి గుణములుండినయెడల నెక్కువ ధనాదాయము కలుగును. ఇంగ్లీషుకూలి వాడొకరోజులో జేసినంతపనిని మన వారు చేయలేకపోవుటకిదియే కారణమని యనేకులు చెప్పెదరు. కొన్ని దేశములందు వర్షసమృద్ధి యుండినగాని ధనముత్పత్తిగాదు దీనికిమనదేశమే తార్కాణము. మనకు వ్యవసాయమే ప్రధానమగువృత్తి; నదులక్కడక్కడ నుండినను మొత్తముమీద వర్షమునుబట్టియే మనకు గావలసిన జలము దొరకు

చున్నది. ఏసంవత్సరమున వర్షము తక్కువగునో యాసంవత్సరమున క్షామముతప్పక సంభవించుచుండును. మనదేశములోని వత్సమండలము రాజపుత్రస్థానములోనగు ప్రదేశములితరభాగములంత ధనవంతముగా నుండుట కీవర్షలోపమే ప్రధాన హేతువు.

దేశమును సంపద్యుక్తముగ జేయుటలో నదులవలె దోడ్పడునది మఱియొకటిలేదు. వ్యవసాయమునకును వ్యాపారమునకునుగూడ నదులుపయోగించును. ఈకారణముచేతనే ధనభూయిష్ఠములగు పాటలీపుత్రము, కాశి, కన్యాకుబ్జము, హస్తినాపట్టణము మొదలగు పురాతన నగరములును కలకత్తా, ప్రయాగ, రాజమహేంద్రవరము, బెజవాడ మున్నగు నవీనపట్టణములును నదీతీరములందేయుండుట. సాధారణముగ నదీతీరమందలి ప్రజలెల్లప్పుడు ధనికులైసుఖముగ జీవయాత్ర జేయగలిగియుందురు. నదులలోని జలము వ్యర్థముగాక కాలువలు మొదలగు వానిమూలమున నెక్కువ యుపయోగకరముగ జేసికొనుట మనుష్యుని బుద్ధిచమత్కారముల ననుసరించియుండును.

ఇట్లే పర్వతములు, సముద్రములు మున్నగు ప్రకృతివర్గములో నితరపదార్థములుగూడ ధనాదాయవిషయమున నెన్నియోవిధముల నుపయోగించుచుండును. రెండుదేశములకు ధనోత్పత్తిలోగల భేదమునకు జాలవఱకు నాదేశములలోని ప్రకృతిజాలములో గలభేదములే కారణముగనుండును. సారవంతమగుభూమి వృక్షభరితములగు నడవులు ననంతములగు లోహసముదాయముగల గనులు నిరంతరము సముద్రములవలె గంభీరములై ప్రవహించు నదులు వ్యాపారమునకనుకూలించు రేవులుగలసముద్రతీరము లోనగు ప్రకృతిసంపదలుగల యమెరికా సంయుక్తరాష్ట్రములు ఇట్టిసదుపాయము లింతయధికముగాగలిగియుండని మనదేశమునకంటె ధనవంతములైయున్నవనుటలో వింతయేమియున్నది.

ప్రకృతినిగురించి యర్థశాస్త్రములో మనము గమనింపవలసిన విషయములు మూడుగలవు.

1 ప్రకృతిసహాయమున మనముత్పత్తి జేయగల ధనము భూమి మొదలగువాని (1) బాహుళ్యము (2) సారము (3) స్థానము లను లక్షణములబట్టి నిర్ణీతములగు చుండును. మొదటి రెండులక్షణముల గురించి విస్తారముగ జెప్పవలసినది లేదు. దేశములోని భూమియొక్కయు నడవులయొక్కయు సాగుబడి పొలముయొక్కయు విస్తీర్ణత, దేశములోని గనులు నదులుమొదలగు వానిసంఖ్యయు నెంతయధికముగ నుండునో యంతయధికముగ ధనాదాయము కలుగును. బాహుళ్యాధిక్యముమాత్రమే ముఖ్యముకాదు. భూమియొక్కయు గనులయొక్కయు సారమును నదులస్వభావమును ప్రకృతిలోని యితరపదార్థముల నుగుణములుగూడ ప్రధానములగు విషయములే. సాగుబడిపొల మధికముగ నుండినను నదినిస్సారమైనచో నధికఫలము లభింపదుగదా?

మూడవలక్షణమగు "స్థానము"ను గురించి యుదాహరణపూర్వముగ కొంచెము చెప్పవలసియున్నది. విస్తీర్ణతయు

సారమును మనము సాగుజేయు పొలములో ఫలించుపంటను నిర్ణయించుట యందెంత ముఖ్యాంశములో నాపొలమెక్కడ నుండునదియుగూడ నంతముఖ్యమగు నంశమే. క్రయవిక్రయములుజరుగు వ్యవహారస్థానము (పణ్యపట్టణము) నకు సమీపమందాపొలముండినయెడల నదిమంచి 'స్థాన' మందున్నట్లు మనము భావింపవలెను. దానికిదూరమందుండినయెడల 'స్థానము' మంచిదికాదని యూహింపవలెను. విస్తీర్ణతాసారములచే సమానములగు రెండుప్రదేశములు 'స్థాన' విషయమున భేదముగలిగియుండినయెడల మంచిస్థానమందుండు పొలమునుండి యధికాదాయము తప్పకలభించును. దీనికి రెండుకారణములున్నవి. వ్యవసాయదారులలో నెల్లవారును వారిపొలమును సాగుజేయుటయందు గొన్నిపదార్థముల గొనువారుగను మఱికొన్నిటిని నమ్మువారుగను నున్నారు. వర్తకస్థానమునకు సమీపమందుండువారు ప్రయాణపుఖర్చులు బండిఖర్చులు మున్నగునవేమియులేక తమకువలయు పనిముట్లవగైరాలను కొనగలిగియుందురు; దూరమందుండువారు వారికిగావలసిన పనిముట్లకు ముదటివారిచ్చునంత ఖరీదునిచ్చుకొనుటయేగాక ప్రయాణపుఖర్చులక్రింద గొంతద్రవ్యమును వ్యయపఱుప వలసియుందురు; కావున వారివ్యవసాయపుఖర్చులు సమీపముందుండు వారిఖర్చులకంటె నధికమగుటచే వారినికరాదాయము తక్కువగనుండును. వారి యాదాయముతగ్గుటకు మరియొకకారణముగూడనున్నది. వారిఫలితములో గొంతభాగమునైన వారువిక్రయించి యితరపదార్థములు కొనవలసియుందురు. దీనిని విక్రయించుటకు

వారువర్తకస్థానమునకు వెళ్లవలెను. ఒకపుట్టెడు ధాన్యము నెట్లుబండ్లమీద తీసికొనిపోవుటకు వారు నాలుగైదురూపాయలు ఖర్చుపెట్టవలెను. పుట్టిఖరీదు నందరూపాయ లయినయెడల ఖర్చులుపోగా వారికిమిగులునది తొంబదియైదు రూపాయలు మాత్రమే. సమీపమందుండు వారీఖర్చుల భరింపవలసిన యావశ్యకతలేదు. కావున పుట్టెడుధాన్యమునకు నూరురూపాయల నికరాదాయము వారికిలభించును. సుస్థానమందుండు వానికి క్రయవిక్రయముల రెంటియందును నష్టములేక యెక్కువలాభముకలుగుట కవకాశమున్నది.

జనసమ్మర్దముగల పట్టణములలో నివసించువారికిది మిక్కిలిగ ననుభవమందుండువిషయమే. పట్టణపుమధ్యయందుండునిండ్లకు గొంచెముదూరమందుండు నిండ్లకంటె నద్దెలెక్కువగ నుండును. అట్టియిండ్లఖరీదులుగూడ హెచ్చుగనేయుండును. వైశాల్యమందును, నితరవిషయములందును సమానములుగ నున్నను బట్టణమునకు మధ్యలోనియిండ్లు దూరమందుండువానికంటెనెక్కువ యాదాయమును లభింపజేయగలవు.

ప్రకృతివర్గములోని భూమిమొదలగు వానివలనగలుగు నాదాయము "స్థానము"నుబట్టి గొంతవఱకు నిర్ణీతమగుచుండుటచేతనే యీస్థానభేదములబోగొట్టి దీనివలనగలుగు ఖర్చులదగ్గించి నికరాదాయమును వృద్ధిపఱుపనుద్దేశించి ప్రతిదేశమందునురోడ్లు, పడవలునడుచుటకు వీలగుకాలువలు, నినుపదారులు మొదలగు ప్రయాణసౌకర్యసాధనముల దొరతనమువారు గల్పించుచుందురు.

2. ప్రకృతినిగురించిన రెండవయంశమును మనమిప్పుడు గమనింపవలెను. "ప్రకృతివర్గములోని గనులు, అడవులు మొదలగువాని సంఖ్యనుగాని, వైశాల్యమునుగాని, మనమధికము జేయజాలము. అట్లే భూమి మొదలగువానియొక్క స్వాభావగుణములందు విస్తారమగుమార్పును గలుగజేయజాలము", అను విషయములగురించి యిదివఱకె జెప్పియుంటిని. ఇట్టిసందర్భములో భగవంతుడు మనకొసంగినదాని ననవసరముగ వ్యర్థపుచ్చక సురక్షితము జేసికొనుట మనకత్యంతావశ్యకమైయున్నది. ఈయంశమును మనము సాధారణముగ మఱచిపోవుచుందుము. ఒకప్రదేశమును మనమేటేట సాగుచేయుచు తగినపంటనుదానినుండి పండించుచు దానికిగావలసిన యెరువును బోయకుండిన యెడల క్రమక్రమముగ దానిసారమంతయు నశించి తుదకు దానివలన లభించుచుండు ఫలితమంతయు నదృశ్యమగును. ఇట్లు చేయుటవలన మొదటి రెండుమూడు సంవత్సరములలో మనకేమియు నష్టముకలుగకపోవచ్చును; ఇంతేగాక యెరువు క్రింద ఖర్చులేనికారణముచే మనకువచ్చులాభముకూడ నధికముగనున్నట్లు కనుబడవచ్చును. కాని ఇది పురోభివృద్ధికెంతయో హానికరముగనుండును. తాత్కాలిక నష్టమెంతసంభవించినను భూసారమునకుమాత్రము మనమెట్టిక్షయమును గలిగింపకూడదు. ఎరువులుగ నుపయోగింపదగు పదార్థములలో దేనినికూడ మనము వ్యర్థముజేయగూడదు. ఏటేట మనదేశమందుండి యెన్నియోలక్షల విలువగల నూనెగింజలు విదేశములకెగుమతియగుచున్నవి. ఈగింజలనుండి నూనెదీసిన

తర్వాత శేషించుగానుగపిండి ప్రశస్తమగుయెరువని యందఱి యభిప్రాయమైయున్నది. ఈగింజలు విదేశములకు వెళ్లుటవలన మనకీపిండియంతయు నష్టమగుచున్నది. ఇట్లుగాక వీనిని మనదేశమునందే యుండునట్లు సదుపాయముల గల్పించినయెడల భూసారమును రక్షించుటలో నిదిమనకెంతయో తోడ్పడును. ఇట్లే మనము పశువులపేడను పిడకలుగ మార్చి వంటచెఱకు క్రింద వ్యర్థపరచుచున్నాము. అట్లుగాక దీనినంతను నెరువు క్రింద నుపయోగించినయెడల మన భూసారము తగ్గక సురక్షితమైయుండును. ప్రకృతిలోని పదార్థములందిదివఱకుండు సుగుణముల రక్షించుకొనుట మనకు విధియైయున్నది.

గనులు అడవులు మున్నగువానివిషయమునుగూడ మనము శ్రద్ధవహించి భావికాలమునమనకు నష్టము గలుగకుండునట్లు వానిని ప్రస్తుతకాలమున రక్షించుచుండవలెను. గనులలోని లోహములు మితపరిమితి గలవైయుండును. తొందరపడి వానినన్నిటిని ప్రస్తుతకాలమందే తీసి యుపయోగించిన యెడల గ్రమముగ గనులసారముతగ్గి కొంతకాలమునకు వానియందుండు లోహములన్నియు క్షయమగును. వానినిమనము కడుజాగ్రత్తతో నుపయోగింపవలెను. ఇంగ్లండు దేశము రాక్షసిబొగ్గుగనులకు ప్రఖ్యాతివహించియున్నది. ఇతరదేశములందుత్పత్తియగుబొగ్గుకంటె నది శ్రేష్ఠమగుటయేగాక చౌకధరలకుగూడలభించుచున్నది. ఈకారణముచేవిదేశములవారనేకులువారియుపయోగముకొరకై యింగ్లీషుబొగ్గు నమితముగగొనుచుందురు. దీనివలన ఇంగ్లండులోని బొగ్గంతయు కొలదికాల

మునకేమైపోయి యింగ్లీషువారికిగావలసినంతగూడ దొరకదేమోయన్న భయముచే దానిని బరదేశముల కెగుమతిజేయు విషయమైనిర్బంధముల గలిగింపవలెనని యనేకులగు నింగ్లీషు ప్రముఖుల యభిప్రాయమై యున్నది. దీనివిషయమై యింత జాగరూకత వహించుటకు గారణము లేకపోలేదు. గనులు భగవన్నిర్మితములు; అవి క్షయమైనచో వానిస్థానమున మరికొన్ని గనుల నుత్పత్తిజేయుటకు మనుష్యునికి సామర్థ్యములేదు. కావున నున్నవానిని వ్యర్థపుచ్చక కాపాడుకొనుట యత్యావశ్యకము.

వంటచెరుకు, కఱ్ఱమొదలగు పదార్థముల నిచ్చుటయందు మాత్రమేగాక దేశములోని వేడినితగ్గించి వర్షమును వృద్ధిచేయుటయందు సహితము అడవులు మనకెంతయో యుపచరించుచున్నవి. ఇట్టియడవులను గొట్టివేసి వ్యవసాయమున కనుకూలించు భూములుగ వానిని మార్చుటచే ధాన్యాదులు వృద్ధియగునుగాని అడవుల వైశాల్యము తగ్గుటవలన నితర విధములగు నష్టములెన్నియో మనకు గలుగుచున్నవి. ఆలోచించినయెడల అడవులుకూడ భగవన్నిర్మితములనియే చెప్పవలసియుండును. వానివలన గలుగులాభమును గమనింపక వానికి వినాశము కలిగించినయెడల గ్రమముగ మనకెంతయో నష్టమగును. దీనిని గుర్తెఱుగక మన దొరతనవువారనేకములగు నడవుల గొట్టివేసిరి. కాని యిప్పుడిప్పుడు మిగిలిన యడవుల రక్షించి వానిని బెంచి వృద్ధిచేయుటయందు జాగరూకులైయున్నారు. అడవుల విషయమై దొరతనవువారుచేసియుండు

నేర్పాటుల నాక్షేపించువారు, అడవుల యావశ్యకతయు, నవిభగవన్నిర్మితములనియు, గొప్పయడవుల బెంచుట మనుష్యునికి సులభముకాదనియు నున్నగు నంశముల జ్ఞాపకముంచుకొనవలెను.

కావున ప్రకృతిసంపదను వ్యర్థపుచ్చక రక్షించుకొనుట మనకువిధి.

౩. పురుషునకును ప్రకృతికినిగల పరస్పరసంబంధముగురించిన వాదమనాదిగ జరుగుచున్నది. ప్రకృతి సహాయము లేక ధనోత్పత్తి యసాధ్యముగావున ప్రకృతి యనుకూలముగనున్నప్పుడే మనుష్యుడు సుఖియగుననియు ప్రకృతి ప్రతికూలముగనున్నయెడల దుఃఖియగుననియు ప్రకృతిని ధిక్కరించి మనుష్యుడేప్రయత్నమును జయప్రదమగునట్లు చేయజాలడనియు గొందఱభిప్రాయమైయున్నది. “చలిదేశములందు వరి, కాఫీ, ప్రత్తిమున్నగు పంటల బండించుట సాధ్యమగునా? ఉష్ణదేశములందు జలిదేశములకు నైజములగువాని నుత్పత్తిజేయనగునా? సుఖదుఃఖములందుటలో బురుషుడు స్వతంత్రుడుకాడు; వాడునివశించు ప్రదేశమునుబట్టియే సుఖదుఃఖములు నిర్ణయింపబడుచున్నవి”, అని వారు వాదింతురు. మఱికొందరి యభిప్రాయము దీనికి భిన్నమైయున్నది. “ఇతర జంతువులకును మనుష్యునికిని నేవిషయమున భేదమగుపడుచున్నది? ప్రకృతి ప్రతికూలముగనున్నపుడుసహితము తన బుద్ధిచాతుర్యమునవలన దానియందు మార్పులు గలుగజేసికొని దానిని దనకనుకూలపఱచుకొనుటకు మనుష్యుడు సమర్థు

లై యున్నాము. ఇట్టి సామర్థ్యమితర జంతువులకులేదు. చేరరానియడవుల బాగుచేసి వ్యవసాయమున కనుకూలపఱచుకొనుచున్నాముగదా? ప్రవాహముల చేనపరిమితనష్టముగలిగించు నదులకు కట్టలుపోసియు, వానినుండి కాలువలుద్రవ్వియుమనుష్యులు నష్టమును పోగొట్టుకొనుటయేగాక లాభమును సంపాదించుచున్నాముగదా? బట్టనేయుపద్ధతిని గనుగొని ప్రకృతి కలిగించు చలిబాధనుబోగొట్టుకొనగలిగి యున్నాముగదా ? చెరువులుతటాకములు మున్నగువానిమూలమున స్వల్పముగకురియు వర్షమునుండివిశేషమగులాభమును బొందగలిగియున్నాముగదా ? మనుష్యునికిబుద్ధిచాతుర్యమున్నది. ఈబుద్ధివికసింపను వికసింపను ప్రకృతివలనగలుగు ప్రాతికూల్యములన్నియు నశించుచుండును. కావున ప్రకృతికి దాసులుగాక ప్రకృతికియజమానులై దానిని తనవశముజేసికొని తనజీవితమును నానాటికి సుఖప్రదముగ నొనర్చుకొనుచున్నాము. ప్రతికూలముగనుండు ప్రకృతినిశాస్త్రపరిశోధనవలనను బనిముట్లు యంత్రములు మున్నగువానిని సృష్టిజేసియు వశపఱచుకొనగలిగిన దేశముల వారే ప్రపంచ పరిపాలకులై యున్నారు. పాశ్చాత్య దేశముల వారీకాలముననగ్రగణ్యతనుగాంచుట కిదియేకారణము", అని మరికొందరుచెప్పుదురు.

ఈరెండువాదములలో దేనియందు సత్యమున్నదో నిర్ధారణజేయుట సులభముకాదు. మనుష్యుని కనంతమగు బుద్ధియున్నది. దానిని దగువిధమున నుపయోగించిన యెడల కాలవశమున ప్రకృతిని వశపఱచుకొని యతడు దినదినాభివృద్ధి

గాంచగలిగి యుండును. ఈవిషయమును గ్రహించినవారేముందుకురాగలరు. అట్లుగాక "ప్రకృతి నతిక్రమించి దానికివిరోధముగ మనుష్యుడేమి చేయగలడు" అని నిరుత్సాహమునొందువారు వెనుకబడియుందురు. కావునధనోత్పత్తిలో ప్రకృతి సహాయమెంత యావశ్యకమో పురుషకారముగూడ నంత యావశ్యకమని చెప్పవచ్చును. ఇంతేగాక పురుషప్రయత్నమే బలవత్తరమైనదని కూడజెప్పుటకు మనము సాహసింపవచ్చును.

(2)

ధనవర్గములోని మానవనిర్మితములగు పదార్థములు రెండురకములుగనున్నవి. కొన్ని యనుభవ యోగ్యములై యెప్పటికప్పుడే మనకు సుఖమును గలిగించుచుండును. అన్నము, వస్త్రము, కుర్చీలు, బల్లలు, మంచము, నెయ్యి, నూనె మొదలగు పదార్థములిట్టివి. తక్కినవి యిట్లుగాక యిట్టి యనుభవయోగ్యములగు పదార్థముల నుత్పత్తి గావించుటయందు మనకు సహాయపడుచుండును. వ్యవసాయదారుని నాగలి లోనుగాగల పనిముట్లు, ఎద్దులు, ఎరువు, విత్తనములు, నూతులు మొదలగు జలాధారములును; రాట్నము మగ్గములోనగు నేతగాండ్ర యుపకరణములును; కుట్టుపనివాని కుట్టుయంత్రము కత్తెర మొదలగునవియును; వడ్రంగియొక్క బాడిస, ఉలి, రంపములును, కంసాలియొక్క బొగ్గులు, కారు, సుత్తి లోనగు సాధనములును నిట్టిపదార్థములు. వీనిలో నేదియు నన్నవస్త్రాదులవలె స్వతంత్రముగ సుఖమును గలిగించునట్టిది కాదు. కాని సుఖదాయకములగు నాహారాదుల నధికముగ

వీని సహాయమున నుత్పత్తి జేయవచ్చును. ఇదియే వీనివలన
గలుగు ప్రయోజనము. నాగలి లేనియెడల భూమినుండి మన
ము పండింపగల ఫలితముకంటె నాగలియున్నప్పుడెక్కువ ఫలి
తమును బండింపగలిగియుందుము. చేతితో బట్టలకుట్టుట కవ
కాశమున్నను 'కుట్టుయంత్రము' తో నెక్కువ బట్టల నతి
స్వల్పకాలములో గుట్టగలిగియుందుము. ఎరువు లేకపోయినను
భూమి ఫలించునుగాని ఎరువు పోసినప్పుడు ఫలమధికమగును.
కుమ్మరి చేతితో కుండలు చేయగలిగినను వాని 'సాన'తో నధి
కముగ గుండల జేయగలవాడగును. కావున నీరెండవరకపు
పదార్థములలో దేనినిగుఱించియాలోచించినను, వీనివలన నను
భవయోగ్యములగు పదార్థముల నుత్పత్తి జేయవచ్చుననియు,
నందుచేతనే వీనిని సంపాదించుటకు మన మధికప్రయత్నము
జేయుచుందుమనియు స్పష్టమగును. ఈరెండవ రకపు పదార్థ
ములకు మూలధనమని పేరు. అధిక ధనోత్పత్తికి నిది మూలా
ధారమైయుండుటచే నీపేరెంతయో తగియున్నది. కష్టపడి
మూలధనమును గొంచెము సంపాదించినయెడల దానిసహాయ
మున ననుభవయోగ్యమగుధనమును మరింత హెచ్చుగ నుత్ప
త్తి జేయుట కవకాశముండును. ధనోత్పత్తియందు తోడ్పడుట
యే మూలధనముయొక్క ప్రథమలక్షణము.

మూలధనమునకు మఱియొక లక్షణమున్నది. అనుభవ
యోగ్యములగు పదార్థములనుండి యిప్పటికప్పుడే మనకు ఫల
ముకలుగును, కానిమూలధనమునుండి యుత్తర కాలమందు
మాత్రము ఫలితము లభించును. కొంతకాలమువఱకు మన

ము నిరీక్షించుచుండినగాని మూలధనమువలని ప్రయోజనము
సమకూడదు. ఆహారమువలన మనము కోరు ఫలితము మన
యాకలి దీరుటయేగదా ? ఈఫలిత మాహారము దినిన క్షణ
మందేకలుగుచుండును. ఇట్లేతక్కిన యనుభవయోగ్యములగు
పదార్థములలో దేనినిగుఱించి యాలోచించినను నీయంశము
బోధపడకమానదు. వీనివలన తత్క్షణమే ఫలితమగుపడుచుం
డును. పనిముట్లు, జలాధారములు, ఇనుపదారులు మొదలగు
మూలధనములోని పదార్థములవలన బూర్తియగు ఫలితము
నొందుటకు గొంతకాలము వేచియుండవలెను. ఒకరైతువద్ద
నలుబది రూపాయలుండిన యెడల దానితో నతడాహారము
లోనగువానినిగొని తత్క్షణమే తృప్తినొందగలుగును. అట్లుగా
క దానితో నొకజత దున్నపోతుల కొనినయెడల నీదున్నపో
తులెంతకాలము జీవించి వానికెంత కాలమువఱకు నధికాదా
యమును గలిగించుచుండునో యాకాలమంతయు పూర్తియ
యినగాని యతడు మొదట బెట్టుబడియుంచిన నలుబదిరూపా
యలకు దగిన ఫలమును బొందజాలడు. పదిరూపాయల ఖరీ
దుగల యెరువును పొలములో పోసినపుడొకటి రెండు సంవ
త్సరములు వేచియుండినగాని దానివలనవచ్చు నధికఫలము
ననుభవించుటకు వీలుండదు. కొన్నివేల రూపాయలు ఖర్చు
పెట్టి ముండ్లచెట్లు, పొదలు మొదలగువానితో గూడియున్న
భూమిని వ్యవసాయమునకు దగినస్థితిలోనికి దెచ్చినయెడల
మొదటదానికొఱకై ఖర్చుపెట్టబడిన మూలధనమంత ఫలము
దానినుండి పొందుటకు గొన్ని సంవత్సరములుపట్టును. ఓర్పు

తో వేచియుండినగాని మూలధనమువలన ఫలము లభింపదు. అనుభవయోగ్యమగు పదార్థ మప్పటికప్పుడే ఫలమునిచ్చును. ఈభేదము ననుసరించి కొందఱుశాస్త్రకారులు "భవిష్యత్కాలమున ఫలము నిచ్చునది మూలధనము", అని మూలధనమునకు వ్యాఖ్యానము జేసియున్నారు.

మనదేశమందలి కర్షకులును, కర్మకారులును బహుస్వల్పమగు మూలధనము నుపయోగించుచున్నారనియు నీకారణముచేత మనదేశమందుత్పత్తియగు ధనాదాయము చాల తక్కువగనున్నదనియు మూలధనలోపమువలననే మనము క్రొత్తపద్ధతుల నవలంబించుటకును క్రొత్తవ్యవహారము స్థాపించుటకును నసమర్థులమై యున్నామనియు నిందువలననే మనమింగ్లీషువారివద్దనుండి మూలధనము నప్పుదెచ్చి మనదేశములో నినుపదారులు నీటికాలువలు మున్నగువానిని నిర్మింపవలసి వచ్చినదనియు మూలధనమధికమైనగాని మనము ధనికులము కాజాలమనియు విద్వాంసులెల్లరి యభిప్రాయమై యున్నది. ఈవిషయమై యించుకగూడ ననుమాన ముండగూడదు. మన యుపకరణములసంఖ్య హెచ్చయినయెడలను మన ముపయోగించు పనిముట్లిప్పటికంటె నుత్తమములైన యెడలను మన యాదాయ మధికమగునని చెప్పుటలో సందేహ మేమికలదు? కావున మూలధనమె ట్లుత్పత్తియగుచున్నది? దానిని వృద్ధిపఱచు మార్గమేది? యనునంశముల మనము విచారింపవలసియున్నది. ఈవిషయముల విమర్శించిన యెడల రెండంశములు స్పష్టపడగలవు. (1) ఏటేట మనము సంపాదించు

ధనాదాయములో మనమనుభవించిన మొత్తమును మినహాయించిన తర్వాత నెంత శేషము మిగులునో, యాశేషము నుబట్టి మూలధనము నిర్ణీతమగుచుండును. శేషమధికమైనచో మూలధనముగూడ నధికమగును. అదితక్కువైన యెడల మూలధనముగూడ తక్కువగనుండును. వచ్చినయాదాయమంతయు సంవత్సరములోపున ఖర్చై యేదియు శేషింపని యెడల మూలధనమే యేర్పడజాలదు. దేశములోని యాదాయము నూరుకోట్ల రూపాయల విలువగలదై యుండగా నందులో ఎనుబదికోట్ల రూపాయల ఖరీదుగల పదార్థము లాసంవత్సరమున ననుభవింపబడినయెడల ఇరువదికోట్ల రూపాయల మూలధనమేర్పడుట కవకాశముండును. నూరుకోట్ల యాదాయమంతయు నాసంవత్సరమందే ఖర్చైపోయినయెడల మూలధనమేర్పడుట కవకాశముండదు. (2) శేషమంతయు మూలధనమని చెప్పుటకు వీలులేదు. దీనిలో నెంతభాగమును బనిముట్లు వగైరాల నుత్పత్తిగావించుటకు ఖర్చుపెట్టెదరో యంతభాగము మాత్రమే మూలధనమగును. అధికధనోత్పత్తికి సహకారియగునది యాభాగము మాత్రమే. ఈరెండు విషయములను మనము చక్కగ పరిశీలింపవలెను.

ఒకయుదాహరణమునుదీసికొని యీవిషయమును స్పష్టపఱుపవచ్చును. ఒకరైతునకు మరికొన్ని పనిముట్లు కొంతయెరువు మరికొన్ని పశువులు ఒకనూయియు నుండినయెడల మామూలుకంటె నధికముగ నాదాయము భూమినుండి వానికివచ్చును. పనిముట్లువగైరా సాధనములక్రయము రెండువందల రూపాయ

లని యనుకొందము. ఇన్నిరూపాయల ఖర్చుపెట్టి వీనిని సంపాదింపగల సమర్థత వానికెప్పుడు కలుగును? అతనికా సంవత్సరమందు వచ్చిన యాదాయములో వాని మామూలు ఖర్చులుపోను రెండువందల రూపాయలు మిగిలినగాని యివి యన్నియు వానికి లభింపజాలవు. ఆసంవత్సరపు టాదాయము నుండి కాకపోయినను తత్పూర్వ మతడార్జించుచుండిన దానిలోనుండి యేటేట కొంతదాచుకొని రెండువంధల రూపాయల నతడెప్పుడు సమకూర్చగలిగియుండునో యప్పటికిగాని యీపనిముట్లువగైరాను సంపాదించుట కతనికి సమర్థత యుండదు. మనకువచ్చు నాదాయమునుండి ప్రథమమున మనకుటుంబ పోషణమును జేసికొనవలెను. తర్వాతదాత్కాలిక సుఖమును గలిగించు ననుభవయోగ్యములగు పదార్థముల నెన్నిటినో మనముకోరుచుందుము. ఉత్తరకాల ఫలితము నిచ్చు పదార్థములకంటె నప్పటికప్పుడే సౌఖ్యము కలిగించువాని నెక్కువ యాసక్తితో గోరుట మనుష్య స్వభావమైయున్నది. ఇట్టికోరికల నీడేర్చుకొన్న తర్వాత నేదియైన మిగిలియుండిన యెడల దానితో నుత్తరకాలమందధిక ఫలమునుగలిగించు పనిముట్లు వగైరాను గొనుటకు మనమపేక్షించుచుందుము. మనయాదాయమధికముగ నుండినయెడల దానిలో మిగిలించుకొనుట సులభముగనుండును. అట్లుగాక మనశరీర పోషణమునకును తాత్కాలిక సుఖమును గలిగించు పదార్థముల గొనుటకును కొద్దిగ వ్యయపఱుప నిష్టముగలవారమైనయెడల ఆదాయము కొంచెమైనను దానినుండి కొంతమిగులుట కవకాశముండును.

మిగిలినదానితో నుత్తరకాలమందధిక సౌఖ్యమును నొసగు మూలధనవర్గములోని పదార్థముల కొనగలిగి యుందుము. కావున మనరైతు వానియాదాయమునుండి రెండువందల రూపాయల మిగల్చగలిగినపుడే వాడు పనిముట్లు ఎద్దులు మొదలగువానిని సంపాదింపగలవాడగును.

ఒక్కొకప్పుడు వానియాదాయము తక్కువగనుండినను న్యాయముగ రెండువందల రూపాయలమిగిలించుట కతనికి సౌభాగ్యత లేకపోయినను పొరుగునుండుసాహుకారువద్ద వానికి గావలసినమొత్తము నప్పుదీసికొని వ్యవసాయోపకరణముల సంపాదింపవచ్చును. కాని యిక్కడ రెండువిషయముల మనము గమనింపవలెను. ఈఅప్పును ఎప్పుడోయొకప్పుడతడు తీర్చవలసి యుండునుగదా? అట్లు తీర్చుటకు అతనికివచ్చు నాదాయములో రెండువందల రూపాయల నిప్పుడుగాక పోయినను మరికొంతకాలమునకైన నతడుమిగల్చగలిగి యుండవలెను గదా? ఇదిగాక అతనికప్పిచ్చిన సాహుకారట్లు చేయ నెట్లుసమర్థుడయ్యెను? వానికి వచ్చునాదాయములో వానికి గావలసిన ఖర్చులన్నిటిని జేసికొని రెండువందల రూపాయల మిగల్చగలవాడగుటచేతనేగదా యతడు రైతునకు దొడ్పడుట కవకాశముకలిగెను? కావున దేశమందెవ్వరో కొందరైన నాదాయమును మించని వ్యయమును జేయుచు కొంచెమో గొప్పయో మిగల్పగలవారుండినగాని మూలధన మేర్పడుట కవకాశము లేదనువిషయమీయుదాహరణమువలనవిశదమగుచున్నది.

[illegible] మరియొకరికిచ్చి వారివద్ద బనిముట్లుగొనక

స్వయముగ తానే యీపనిముట్లను నిర్మించుకొనదలచు రైతు విషయమునగూడ నీయంశము వర్తించును. మనుష్యుడు కొంతకాలమును ఖర్చుపెట్టి కొంచెము శ్రమబడుట కుద్యుక్తుడైనగాని యేపదార్థముత్పత్తి జేయుటకు వీలుండదు. వ్యవసాయమున కుపయోగించు నొకనూతిని ద్రవ్వుట కొక నెలపట్టు ననుకొందము. ఒకరికి ద్రవ్యమునిచ్చి వారిచే నీపనిని జేయించుట కిష్టపడక స్వయముగదానే యీపనికి బూను రైతుసహితము వానియాదాయమున గొంచెము మిగుల్చుకొనక యుండినయెడల నీపని జేయుట దుస్తరమగును. ఏలన నీనెలరోజులు నతడు మామూలువ్యవసాయమును జేయుటకు వీలుండదు. నూతిని ద్రవ్వుకాలమందతడును నతనికుటుంబమును పస్తుండక యాహారాదులు గలిగియుండవలెనుగదా? ఏరోజునకు గావలసిన యాహారము నారోజుననే సంపాదించుకొనవలసిన యెడల నితడిన్నిరోజులు నూతిని ద్రవ్వుటలో గడుపుట దుస్సాధ్యమగును. అంతకుముందతడార్జించిన యాహారాదులీనెలరోజులకు సరిపడియుండినగాని యితడీపనికి బూనజాలడు. పూర్వాదాయములో శేషించిన దేమియు లేనియెడల నీనెలరోజులు కూడ నెక్కడనో కూలిపని జేసికొనియో లేక మరియే విధముగనో యతడు ప్రాణధారణమునకై పాటుపడవలసియుండును. అట్లులేక యితడీపనికిబూనుటకు గారణము నెలరోజులకు వలయునాహారాదుల నదివఱకు వాడు సంగ్రహించియుండుటయే. అదివఱకతడు సంపాదించిన దానిలో గొంత మిగల్పగలిగియుండినగాని మూలధనవర్గములో జేరిన యీనూతిని ద్రవ్వుటకును

దానివలన నుత్తరకాలమం దధికాదాయము సంపాదించుటకును నతనికవకాశముండదు. వర్తమానకాలమున నావశ్యకమగు వస్తుజాలమును సంగ్రహించినగాని యుత్తరకాలోపయుక్తములగు వానినుత్పత్తిజేయుట కెవ్వడును బూనజాలడు.

స్వయముగ దాను నిర్మింపక, కూలివాండ్రను బెట్టి పనిచేయించునపుడుకూడ నిట్టిధర్మమే కనబడుచుండును. నాగలి మొదలగు పనిముట్లుజేయుటకై నొకవడ్రంగిని యారైతు నియమించిన యెడల నాపని ముగియు పర్యంతమా వడ్రంగికి గావలయు ననుభవయోగ్యపదార్థముల నతడియ్య బూనుకొనవలెను. ప్రస్తుత మావడ్రంగి రైతుయొక్క పనిని జేయుడుగదా? రైతునివలనను సంపాదించిన యాదాయము వాని పోషణకేగాక వడ్రంగిని బోషించుటకుగూడ జాలియుండినగాని వాడు వడ్రంగిచేత పనినిజేయింపజాలడు. అనగా వాని సొంత ఖర్చుపోను వానియాదాయమందతడు కొంచెము మిగల్పగలిగియుండవలెను. అట్లులేకున్నయెడల రైతులువడ్రంగులచేపనులజేయించి వారికి వలయు నుపకరణముల సంపాదించుట కవకాశముండదు. ఇంతియేగాక, ఇట్టిసందర్భమున, వడ్రంగులు సహితము నాగళ్ళు మొదలగు ననుభవయోగ్యములు కాని పదార్థముల నుత్పత్తి జేయుటమాని కర్షకులకై యాహారపదార్థముల నుత్పత్తిజేయ దొడంగుదురు. ధనవర్గములోని పదార్థములు రెండు రకములుగ నున్నవని ప్రారంభమున జెప్పియుంటిని. మూలధన వర్గములోని వస్తువుల నుత్పత్తిజేయబూను వారికి దానివలన వారికి గావలసిన యనుభవయోగ్య పదార్థములు లభించుననెడి నమ్మకముండినగాని వారాపదార్థముల

నుత్పత్తిజేయ బూనరు. అనుభవయోగ్యపదార్థముల నుత్పత్తి జేయువారు వారిసొంతఖర్చునకు గావలసినదానికంటె నధికముగను, మూలధనము నుత్పత్తిజేయువారికి గావలసినంత నధికముగను నాహారాదుల నుత్పత్తిజేయునపుడే కొందఱు మూలధన నిర్మాణమునకు గడంగుట సంభవించును; అట్లుగాక యెవరుత్పత్తి జేసిన యనుభవ యోగ్యపదార్థములు వారియనుభవమునకే వినియోగింప బడుచుండు నెడల మూలధన మన్నది యేర్పడుటకు వీలుకలుగదు.

ఏవిధమున నాలోచించి చూచినను నాదాయమునుండి కొంత మిగల్పగలిగినపుడే మూలధనము వృద్ధియగుట కవకాశముండుననియు, నట్లుకానపు డవకాశముండదనియు స్పష్టమగుచున్నది. ఇట్లు మిగిలించుకొనుటకు రెండు మార్గములే యున్నవి. మొదటిది మన యాదాయమును వృద్ధిపఱచుకొనుట. ఇప్పటికంటె నెక్కువగ గష్టపడియు శ్రేష్టతరములగు సాధనముల నుపయోగించియు మన యాదాయము నభివృద్ధి జేసికొనవలెను. రెండవది, తాత్కాలిక సౌఖ్యము నొసంగు వస్తువులకొఱకై యధికవ్యయము జేయకుండుట. ఇట్లువ్యయమును తగ్గించుకొనినయెడల మన యాదాయములో జాలభాగము మిగులును. దానిమూలమున మూలధనము నుత్పత్తిజేయగలిగి యుందుము. అనవసరముగ మనలో నొక్కొక్కరమెంతయో ఖర్చుపెట్టుచుందుము. మనయాదాయము హెచ్చుకొద్దియు మనఖర్చులుగూడ హెచ్చుచునే యుండును. కాని మనముచేయు వ్యయములోనేది యావశ్యకమైనది, ఏదియనవసరమైనది, యనిచక్కగ వివక్షజేసి యిప్పటికంటె గొంచె

మెక్కువజాగరూకతతో బ్రవర్తించినయెడల మనలోనొక్కొక్కరము బాగుపడుటయేగాక మూలధన మభివృద్ధియై దేశమంతయు బాగుపడును.

మన యాదాయములో గొంచెము మిగిలించినమాత్రముననే దేశమందలి మూలధనమభివృద్ధియగునని సంతసించుటకు వీలులేదు. మిగిలించినదానినిమూలధనవర్గములోనిపదార్థముల నుత్పత్తిజేయుటకై వినియోగపఱచిన గాని మన యుద్దేశము నెఱవేర జాలదు. మనలో ననేకుల యాదాయము చాల తక్కువగ నుండుటచేత, దానిలో గొంతభాగమును దాచుకొనవలయు ననెడి కుతూహలము మనకున్నను నట్లుజేయుటకుమాత్రము శక్తిచాలక యున్నది. కొందఱధికాదాయము నార్జించుచు దానిలో గొంతభాగమును గూడబెట్ట గలిగియున్నారు. కాని, కూడబెట్టినద్రవ్యమును బంగారువెండివజ్రములుమొదలగు వానిని గొనుటయందు వినియోగించి భార్యాపిల్లలుమొదలగువారికి భూషణముల జేయించుచుందురు. ఇట్లుచేయుటవలన మూలధన ముత్పత్తి కాజాలదు. దీనికిబదులుగా నీద్రవ్యముతో భూమిని బాగుచేసి జలాధారముల నిర్మించి కర్మాగారములగట్టి క్షేత్రవ్యాపారముల నభివృద్ధి జేసినయెడల మూలధనము హెచ్చి యుత్తరకాలమునందలి మనయాదాయము కూడనధికమగును. నగలకైమనదేశమున నుపయోగించు బంగారము పాశ్చాత్యదేశములవా రుపయోగించు దానికంటె నధికముగనున్నదని నాయభిప్రాయముకాదు. కొన్నిదేశములవారు మనకంటెనధికముగ నిట్టిఖర్చును జేయుచుండవచ్చును. కాని వారుధనవంతులు. ఇట్టియనవసరవ్యయము వలనవారికి

విస్తారముగ నష్టము సంభవింపదు. మనమన్ని సోదరిద్రదేవతా పీడి
తులమై యున్నాము. ఎంత కొంచెపు దుర్వ్యయము మన
ము చేసినను దానివలన గలుగు నష్ట మపరిమితమై యుండును.
పురికొందఱు కష్టపడి తాము మిగిలించిన ధనమును భూమిక్రింద
పాతిపెట్టెదరు. దీనిని మూలధనమని చెప్పుటకు వీలులేదు. కొం
దఱు మిక్కిలి శ్రమనొంది స్వోదర పోషణమును గూడ జక్కగ
జేసికొనక యనేకసంవత్సరములు కష్టపడి మిగిలించిన ధనము
ను వివాహోద్యోత్సవములందు రెండు మూడు రోజులలో ఖర్చు
పెట్టెదరు. మనదేశస్థులు చాలాదూరదృష్టికలవారలే, అనవ
సరముగ మామూలు ఖర్చులు జేయువారు కారనికూడ జెప్ప
వచ్చును. కాని వారు దాచినది మూలధనముక్రింద వినియోగ
పడుటలేదు. అట్టి వినియోగము కలిగినగాని దాచినందులకు
దగిన ఫలము మనకు లభింపదు.

ఇచ్చట నొకశంక గలుగవచ్చును. మనలో నందఱును
కర్షకులు కారు. కర్మాగారములగట్టి వ్యవహారముల జేయుటకం
దఱికిని సమర్థత లేదు. వ్యాపారమునకు వలయు శక్తి యందఱికి
నుండదు. ఇట్టివారు దాచుకొనిన దానిని నగల గొనుటయందు
వినియోగింపక కర్షకులు, వర్తకులు, కర్మకరులు మొదలగు వారి
కుపయోగించు నుపకరణములు కొనుటయందు వినియోగించు
టెట్లు సంభవించును? ఉద్యోగస్థులు, న్యాయవాదులు వైద్యు
లు లోనగువారు చాలా ధనమును గడింతురు; కాని స్వయ
ముగ వారు వ్యాపారాదుల జేయుటకుగాని చేయించుటకు గాని
వీలుండదుగదా? వీరిలో ననేకులు తాము గడించిన దానిని భూ
మిని గొనుటకై ఖర్చుపెట్టుచుందురు. రైతులవద్దనుండి వీరు

భూములగొనుటవలన దేశమునకు నుపకారము గలుగకపోవుట
యే గాక నష్టముకూడ సంభవించుచుండును. వ్యవసాయమును
జక్కగ జేయలేని వారివద్దనుండి బాగుగ జేయగలవారు భూమిని
గొనినయెడల నందఱికిని లాభకరముగ నుండును. కాని వ్యవసా
యమును బొత్తుగ జేయలేనివారు చేయగలవారినుండి భూమిని
గొనుట నష్టహేతువుగాని వేఱొకటి కాదు. ఇట్టిసందర్భమున దమ
యాదాయమునుండి మిగిలిన దానిని మూలధనముగ మార్చి కర్ష
కులు మొదలగువారి కుపకారము జేయుటయెట్లు? అను సందేహ
మును నివారింపవలెను. అనాదిగ మనదేశమందును నితర దేశము
లందును నప్పులిచ్చుటయు బుచ్చుకొనుటయు నాచారముగను
న్నది. ధనికులు తాముగడించిన ధనమును స్వయముగ వ్యాపారా
దులందు వినియోగింపలేనపుడు దానిని గర్షకులు మొదలగు వారికి
నప్పిచ్చిన యెడల దానితో వారు పనిముట్లు గొనగలిగియుందురు.
ఇట్టి సహాయము నిప్పుడు గూడ నెందఱో చేయుచున్నారు. కాని ధ
నమును గడించువారికిని దానిని వ్యవసాయాదులయందుపయోగిం
చువారికిని బరస్పరసంబంధ మిప్పటికంటె నధికమైనగాని యాదా
యమునందు మిగిలినదంతయు మూలధనము కాజాలదు.

ఈసంబంధమును బలపఱుచుటకు పాశ్చాత్యదేశములయం
దు బ్యాంకులు (Banks) ప్రధానసాధనములై యున్నవి. మూ
లధనమును గడించియు దానిని నాదాయకరమగు మార్గములందుప
యోగింపలేనివారు వారిధనమును వీనియందు దాచుకొనెదరు. వ
ర్తకవ్యాపారములందు నధికాదాయమును బొందగోరియు, వా
నికివలయు మూలధనమును గడింపలేనివారీ బ్యాంకీలకు వచ్చి కా
వలసినసొమ్ము నప్పుపుచ్చుకొని పనిముట్లును గైరాలను తెచ్చెదరు.

చేయించి యధికధనోత్పత్తి జేయగలిగియుండును. వీనియందు ప్రజలకువిస్తారము నమ్మకముండును. బ్యాంకీలన్నియు ప్రజలవిశ్వాసమునకుబాత్రములగునట్లు ప్రవర్తించుచుండును. అప్పుకావలసినవారు సాహుకార్లనువెదకవలసిన యవసరముండదు. సమీపమున బ్యాంకీయున్నప్పుడు ప్రతిమనుష్యుడునువానియాదాయములో గొంచెముభాగమునైన మిగిలించుకొని దానిలోదాచుకొనుటకుబ్రయత్నించును. ఇదిగాక దాచియుంచుకొనువారికి బ్యాంకీలు వడ్డీనిచ్చుచుండును. తమధనమును భూమిలోబాతిపెట్టువారును స్థిరాస్తిగొనుటయందు ఖర్చిడువారునుగూడవడ్డీనపేక్షించిదానినిబ్యాంకీలలోనుంచుకొనెదరు. బ్యాంకీలుబాగుగబనిచేయుచుండుదేశములలో మూలధనముతగువిధమున వినియోగమగుచుండును. మనదేశమందుగూడ నమ్మకములగు బ్యాంకీలువృద్ధియైనగాని నిరుపయుక్తముగదాచియుంచబడుధనము పైకిరాజాలదు. మూలధనమభివృద్ధియగుట కిదియొకముఖ్యసాధనము. మనదేశమందిపుడువ్యాపించుచుండు 'పరపతి'సంఘములవలనమామూలుబ్యాంకీలకంటె నెక్కువసదుపాయములు కలుగవచ్చును. ఇతరములగుబ్యాంకీలకంటె వీనియందుప్రజలకెక్కువవిశ్వాసముంచుట కవకాశమున్నది. దానిచేనీసంఘములందు ధనమునుదాచుకొనుటయెక్కువక్షేమకరము. ఈవిషయమునందఱికిని జక్కగబోధపఱచి యిప్పటికంటె నధికముగ వీనియందుసొమ్మునుధనికులుదాచుకొనునట్లుజేయవలెను. ఇదిగాక, ఈసంఘములనుండి యప్పుపుచ్చుకొనువారు ఆ మొత్తమునుదుర్వినియోగము జేయుటకవీలు లేదు. గ్రామములందు సంఘములుండుటవలన బ్యాంకీలన్న నేమియో తెలియనివారికి గూడ

బ్యాంకీలవలనిలాభములేవియో స్పష్టముకాగలవు. సరియైనమార్గమున నీసంఘములిప్పుడుపనిచేయుచున్నవా, లేవాయనువిషయమునభిన్నాభిప్రాయములుండవచ్చును. కాని 'పరపతి' సంఘముల నిజతత్వమునెఱిగి వానినిదగురీతిని బ్రోత్సాహపఱచినయెడల మనదేశములోనిమూలధనము శీఘ్రకాలమునవృద్ధియగునని నిస్సందేహముగ జెప్పవచ్చును.

మూలధనముత్పత్తియగుటకెట్టిసౌకర్యములుండవలయునో దానినితగువిధమున వినియోగించుట యెట్లో ఈసందర్భమున బ్యాంకీలవలననెట్టిలాభములుకలుగునోయింతవఱకుదెలిసికొనుచుంటిమి. మఱియొకటిరెండంశములనుమాత్రమిచ్చటజెప్పవలసియున్నది. ప్రకృతివలనగలుగుఫలము భూసారముపైనాధారపడియుండునట్లు మూలధనమువలనఫలముగూడ దానిస్వరూపముపైనాధారపడియుండును. ఐదురూపాయిలు ఖర్చుపెట్టినయెడల మామూలుకొయ్యనాగలి నొకదానినిగొనవచ్చును; లేదా ఏబదిరూపాయలకు యినుపనాగలినొకదానినిగొనవచ్చును. ఇనుపనాగలొకదానివలన బదికొయ్యనాగళ్లకంటె నధికాదాయము లభించును. నాగలిస్వరూపమునుబట్టి దానివలనమనమార్జింపగలుగు నాదాయమునిర్ణీతమగుచుండును. నూతినుండిమామూలుయేతామువలన నీళ్లనుదీసిపొలమునకు గావలసిననీళ్లనుబెట్టవచ్చును. లేదా, ఆవిరియంత్రమునొకదానిని నూతివద్దస్థాపించి దానిసహాయమునబొలమునకునీరుపెట్టవచ్చును. కానిమనమూలధనము యంత్రరూపముననున్నప్పుడు మనకుగలుగు లాభమత్యధికమైయుండును. ఇట్లేప్రతివ్యాపారమందును మనముపయోగించుపనిముట్లసంఖ్యకంటె వానిస్వరూపమెక్కువ ముఖ్యమగు

సంశయమని మనము దెలిసికొనవలెను. నూతనోపకరణములను సాధ్యమైనంతవఱకు మనముపయోగించిన గాని మూలధనమువలన మనము సంపాదింపగలిగినంత ధనము సంపాదించుటకవకాశముండదు. మనము దేనిని ఖర్చుపెట్టినను దానివలన నత్యధికలాభమును బొందుటకు ప్రయత్నించుచుండవలెను. విదేశరాజుల దండయాత్రలు, దేశములో పలిదోపిడిగాండ్రు మున్నగు బాధలమితముగనున్నప్పుడు మనవారు విస్తారముగ ధనసంగ్రహము జేయుటకును సంగ్రహించిన దానిని బహిరంగముగ వినియోగపఱచుటకును వీలు లేకయుండెను. ఈ కారణముచేత ననేకులు వారి ధనమును భూమిలో బాతిపెట్టుచుండిరి. ధనికులుగ బైకగపడిన యెడల నెక్కువపన్నులను రాజులు వసూలు చేయుదురన్న భయముచే గూడ ననేకులు వారి మూలధనమును నాదాయకరమగు మార్గములందు వినియోగింపరైరి. ఇట్టిస్థితిగతులిప్పుడు మారిపోయినవి. దేశమందంతట కలహములు సమసిపోవుచున్నవి. బాధకరములగు విదేశరాజుల దండయాత్రలకవకాశము తగ్గినది. ప్రభుత్వమువారి యేర్పాటులు ప్రశస్తములు కాను గాను జోరబాధ కూడ దగ్గవచ్చును. ఇట్టిస్థితియందు మూలధనమును జేర్చి దానిని బహిరంగముగ వాడుటకెవ్వరును జంకవలసినది లేదు. ఇది గాక పూర్వకాలమున విశేష మూలధనము లేకుండినను వ్యవసాయాదుల జేయుటకవకాశముండినది. ఇప్పుడు నూతనపద్ధతులు నూతనపరికరములు మొదలగునవి ప్రబలుటవలన లక్షలకొలది మూలధనముండినగాని కొన్ని కార్యములనారంభించుట సాధ్యము కాదు. బొంబాయి కాన్పూర్, అహమదాబాదు మొదలగు పట్టణములలో నిటీవల స్థాపింపబడిన నేతశాలలలో కొక్కదానికెన్నియో లక్షల మూలధన

మావశ్యకమైనది. పూర్వకాలపు మగ్గములు రాట్నములు మొదలగునవి యీకాలమునకు సరిపడవు. ఇట్టిసందర్భమున మనమధిక ధనమును సమకూర్చిన గాని పాశ్చాత్యదేశములందువలె పరిశ్రమవృద్ధి చేయుటకు వీలుండదు. మూలధనముత్పత్తియగుటకు హేతువేదియో మనమిప్పుడు తెలిసికొనియున్నాము గావున దాని ననుసరించి మూలధనాభివృద్ధికై ప్రయత్నించుట మనకు గర్తవ్యము.

3 ఉపన్యాసము

ధనోత్పత్తిసాధనములలో మూడవదియగు పురుషకారమును గుఱించి మనమిప్పుడు విమర్శింపవలసియున్నది. పురుషప్రయత్నము లేక ధనవర్గములోని పదార్థమేదియు నుత్పత్తి కాజాలదు; ఇట్టి పదార్థములుత్పత్తియగుటకు బురుషకారమావశ్యకమగుట చేతనే యవి ధనవర్గములో జేరుట సంభవించుచున్నది. సారవంతమగు భూమి దేశమందత్యధికముగనుండినను దానిని దగువిధముగ సాగుజేయగలవారు దేశములో లేనిపక్షమున దానినుండి ధనోత్పత్తి కాదను మాట సర్వవిదితమైయున్నది. ప్రస్తుతకాలమందు అమెరికా ఆస్ట్రేలియా న్యూజీలండు దక్షిణాఫ్రికా మున్నగు పరదేశములలో, కొన్ని భాగములయందు సారవత్తరమగు భూమెంతయో యధికముగనున్నది; కాని వానియందు ప్రజలు కాపురముండక పోవుటచేతను నాభాగములకు వెళ్లి పనిచేయుట కష్టతరమగుట చేతను నా దేశములలో ఫలింపదగినంత పదార్థసముదాయమింకను నుత్పత్తియగుట లేదు. మనుష్యుని సహాయము లేకయుడవులందు వృక్షములు పెరుగుచు ఫలించుచునుండును; సముద్రములం

దును నదులందును మత్స్యాదులుత్పన్నమగుచుండును. కాని మనుష్యుడాప్రదేశములకు వెళ్ళి యాఫలితముల సంగ్రహింపనుద్యుక్తుడైనగాని వానివలనిలాభము నాతడుపొందజాలడు. ప్రకృతియనుకూలింపకపోయినను బురుషకారమువలన నొక్కొకప్పుడు ధనోత్పత్తి చేయవచ్చునుగాని, మానవపరిశ్రమ లేనిదియు ప్రకృతిసంపదయపరిమితముగనుండినను ధనార్జన దుస్తరమగును.

మూలధనసహాయమున ప్రకృతిసంపదనుండి పురుషకారముత్పత్తిజేయగల ధనసముదాయము రెండంశములపైనాధారపడియున్నది. ఇందులో మొదటిది దేశములోనిజనసంఖ్య; రెండవది జనులకు ధనోత్పాదనయందుగల సామర్థ్యము. జనసంఖ్యయధికముగనుండినయెడల నుత్పత్తియగుధనసముదాయముగూడనధికముగనుండును; అట్లుగానియెడల నుత్పత్తియగుధనసముదాయముస్వల్పముగనుండును. జనసంఖ్య తక్కువైనను జనుల సామర్థ్యమధికముగ నుండిన యెడల నధిక ధనోత్పత్తియు స్వల్పముగ నుండినయెడల నల్పధనోత్పత్తియు నగును. అమెరికాసంయుక్తరాష్ట్రములలో నిజనసంఖ్యమనసంఖ్యకంటెహీనమైయున్నను వారెక్కువబుద్ధిసూక్ష్మతతో బనిచేయువారగుటచేత నాదేశమందెక్కువ ధనముత్పత్తియగుచున్నది. కావునజనసంఖ్యయొక్క వృద్ధిక్షయములును, ప్రజలసామర్థ్యమును దేనిచే నిర్ణీతములగుచుండునో మనమిప్పు డాలోచింప వలసియున్నది.

జనసంఖ్యయొక్క వృద్ధిక్షయముల నిర్ణయించు నంశములగుఱించి యర్థశాస్త్రమందు విపులమగు చర్చచేయుటయావశ్యకముగాదు. జీవశాస్త్రమందును, సాంఘికశాస్త్రములలో మఱికొన్నిటియందును వీనివిషయమగుపరిశోధన విస్తారముగ నుం

డును; కావున ముఖ్యములగు విషయములుమాత్రమిచ్చట సంక్షిప్తముగ జెప్పదగియున్నవి.

ఏదేశమందుగాని, జనసంఖ్యను మూడంశములునిర్ణయించుచుండును. వీనిలో మొదటిది దేశమందేటేటగలుగుజననములసంఖ్య; రెండవదిమరణములసంఖ్య; మూడవదియాదేశమునకుసంబంధించిన ‘వలస’ స్వభావము (అనగా, ఆదేశములోనివారధికముగ విదేశములకువెళ్ళిపోవుచున్నారా, విదేశములవారాదేశములకువచ్చి కాపురములజేయుచున్నారా, లేక యిట్టిసంబంధమాదేశమున కితరదేశములతో లేకయేయున్నదా? అను విషయము). జననములసంఖ్యకంటెమరణములసంఖ్యతక్కువైనచో జనసంఖ్యవృద్ధియగును; రెండునుసమానముగనుండినయెడల జనసంఖ్యలోమార్పులెట్టివియుగలుగకుండును; మరణములసంఖ్య హెచ్చగునెడల జనసంఖ్యక్షీణింపదొడగును. ఇట్లే ‘వలస’ స్వరూపములోగలుగు మార్పులుగూడ సందర్భానుసారముగ జనసంఖ్యలోగలుగు వృద్ధిక్షయములకు హేతువులుగనున్నవి.

దేశమందేటేటబుట్టు పిల్లలసంఖ్య దానిలోనివివాహసంబంధమగు నాచారవ్యవహారముల ననుసరించియుండును. ఈసందర్భమున మూడువిషయముల మనముగమనింపవలెను. (1) దేశములోని స్త్రీపురుషులలో నెందఱువివాహ మాడుచున్నారు? (2) సాధారణముగ వివాహములేవయస్సున జరుగుచున్నవి? (3) వివాహితులగువారిలో సంతానేచ్ఛయధికముగనున్నదా? అల్పముగనున్నదా? ఈవిషయములందుగల భేదములబట్టి యొకదేశమునకును మఱియొకదేశమునకును జననములసంఖ్యలోగల భేదము లుత్పత్తియగుచుండును.

(1) ఒకవిధముగ మనదేశమందు వివాహమెల్లరికిని నిర్బంధమై యున్నదని భావింపవచ్చును. ప్రతిపురుషుడును, ప్రతిస్త్రీయును తప్పక వివాహమాడవలయునని యిప్పటిశాసనములలో లేకపోయినను నట్లు చేయుట సాంప్రదాయసిద్ధమగునాచారమై యున్నది. పురుషులలోనైన యుక్తవయస్సువచ్చినను వివాహమాడనివారుకొంద ఱుందురేమోగాని, సామాన్యముగ స్త్రీలలో శాశ్వతబ్రహ్మచారిణులుగ నుండువారిసంఖ్య బహుస్వల్పము. పాశ్చాత్యదేశములందిట్టి యాచారములేదు. వివాహమాడకయే యావజ్జీవమునుగడపు స్త్రీపురుషులా దేశములం దెందఱో యున్నారు. మఱియొకవిషయమునగూడ మనదేశమునకునువానికిని భేదమగపడుచున్నది. స్త్రీలు పునర్వివాహమును జేసికొను నాచారముమనలో ననేకవర్ణములందులేదు; పాశ్చాత్యదేశములందలి స్త్రీలకిట్టినిర్బంధముకనబడదు.

వివాహమాడు స్త్రీపురుషులసంఖ్యబట్టి దేశమం దేటేటగలుగుజననములసంఖ్య నిర్ణీతమగును. 1911 సం॥ జనాభాలెక్కల బట్టిమనదేశమందు పురుషులలో నూటికి నలుబదియాఱువంతునను, స్త్రీలలో నూటికి నలుబదియెనిమిదివంతుననువివాహమాడుచున్నట్లుదెలియవచ్చుచున్నది. పాశ్చాత్యదేశములో దేనియందును నూటికిందఱుచొప్పున వివాహమాడుటలేదు. ఈకారణముచేత నేటేటమనదేశమందుబుట్టు పిల్లలసంఖ్యయధికముగ నున్నది. వేయిమందిజనమునకు 27 చొప్పున నింగ్లండులోనిజననములసంఖ్య యుండ, మనదేశమున నది 39 వంతుననున్నది.

(2) ఈసందర్భమున వివాహమాడువారివయస్సుగూడ జాలముఖ్యమగువిషయము. దేశములోని నైసర్గికవిశేషములబట్టి

శీతదేశములందు గొంచెమాలస్యముగను, నుష్ణదేశములందు గొంచెముశీఘ్రముగను స్త్రీపురుషులకు సంతానయోగ్యత కలుగుచున్నది. ఈయోగ్యతకలిగినతర్వాత నెంతయాలస్యముగ వివాహములుజరుగునో దానినిబట్టి జననములసంఖ్య యేర్పడుచుండును. ఆలస్యమేమియుజేయక, తత్క్షణమేవివాహములు జరుగుటయాచారమగునెడల జననములసంఖ్య హెచ్చుగనుండును; లేనియెడ దక్కువగనుండును. మనదేశమందు 12,13 సంవత్సరములకే స్త్రీలకుసంతానయోగ్యతకలుగుచున్నది. ఆవయస్సుననే స్త్రీలలోజాలామంది వివాహితలైయుందురు; తక్కినవారటుతర్వాత విస్తారకాలము వివాహముకొఱకై వేచియుండరు. 15 సంవత్సరముల వయస్సుగల స్త్రీలెవ్వరు నింగ్లండున బెండ్లియాడుటలేదు; మనదేశమం దావయస్సులోని స్త్రీలలోనూటికిరువదిమంది వివాహమాడియున్నారు. 20 సంవత్సరములు వయస్సుగలస్త్రీలలో నింగ్లండున వేయింటికిబండ్రెండుగురుచొప్పునమాత్రము వివాహమాడియుండ, మనదేశమందునూటికెనుబదిమందివివాహమైనవారున్నారు. సాధారణముగ నిరువదియైదుసంవత్సరములుదాటినగాని యింగ్లండులోనిస్త్రీలువివాహమాడరు; మనదేశములోనిస్త్రీలప్పటికై నార్గురుపిల్లలకు తల్లులైయుందురు. వయస్సువిషయమున బురుషుల వయస్సుకంటె స్త్రీలవయస్సెక్కువప్రధానమైనదని శాస్త్రజ్ఞులయభిప్రాయము.

బాల్యవివాహములు జరుగు మనదేశమువంటి దేశములలో జననములసంఖ్యహెచ్చుగనుండును. మనదేశమున వేయిమంది జనమునకు 39 చొప్పున నేటేటబుట్టుచున్నారనియిదివఱకేచెప్పి

యుంటిని. పాశ్చాత్యదేశములలోని జననముల సంఖ్య తగ్గియుండుటకు వానిలోని ప్రజలాలస్యముగ వివాహమాడుట యొక కారణమైయున్నది.

అతిబాల్యవివాహములు మనదేశమందాచారమై యుండుటకును, నింగ్లండు మొదలగు పాశ్చాత్యదేశములలోనట్లుగాక యుండుటకును బెక్కు కారణములుండవచ్చును. కాని వానిలో నార్థికమగు ముఖ్యహేతువొక్కటియున్నదని విదేశస్థితిగతులబట్టి మనము చెప్పవచ్చును. పాశ్చాత్యదేశములందలి స్త్రీపురుషులు కొంచెమాలస్యముగ వివాహమాడుచున్నారని పైనజెప్పియుంటిని. ఈవిషయమున వారిలోగూడ గొన్ని తరతమభేదము లగపడుచున్నవి. తక్కువయంతస్తునందుండి మామూలుకూలిపనివలన జీవించునట్టివారు, కొంచెమెక్కువయంతస్తునందుండి యుద్యోగము వ్యాపారము మున్నగు వృత్తులవలన జీవించువారికంటె శీఘ్రముగ వివాహము జేసికొనెదరు. ఉన్నతమగునంతస్తులోనున్నవారు ముప్పదియైదు నలుబది సంవత్సరముల వయస్సువచ్చినగాని పెండ్లియాడుటలేదు. ఇంగ్లీషువారిలోను నితరపాశ్చాత్యులలోను అంతస్తుహెచ్చగుకొద్దియు వివాహయోగ్యముగ నెంచబడు వయస్సుగూడ హెచ్చగుచుండును. ఈవిషయముల బరిశీలించిన పాశ్చాత్యదేశములందలి యర్థశాస్త్రజ్ఞులు వివాహవయస్సునకును అంతస్తునకును సంబంధమున్నదని సిద్ధాంతపఱచియున్నారు. ఈసంబంధమునకుగల హేతువునుగూడ వారు తెలిపియున్నారు. ఒకమనుష్యుని యంతస్తువలననే కుటుంబపోషణమునకై నతడొనరింపవలసినఖర్చులు నిర్ణీతములగుచున్నవి. తక్కువయంతస్తు

నందున్నవాడు స్వల్పాదాయముతో వానికుటుంబరక్షణమును జేసివానిమర్యాదను గాపాడుకొనగలిగియుండును. అనగా నట్టివాడు భుజించునాహారము, ధరించువస్త్రములు, కాపురముండు గృహము, ఉపయోగించునితరపదార్థములును సామాన్యములై యెక్కువఖరీదుగలవిగనుండవు. వానికి సంతానము కలిగినను వారికి విస్తారముగ విద్యనుగరపవలసినట్టిగాని వారివిద్యాభ్యాసము పూర్తియగునంతవఱకు వారిని బోషింపవలసినట్టిగాని యగత్యము వానికి విశేషముగనుండదు. ఇంతేగాక పిల్లలధికముగనుండినయెడల బదిపండ్రెండు సంవత్సరముల వయస్సు వారికి వచ్చినతోడనే వారినిగూడ నేదియో యొక కూలిపనిలో బ్రవేశపెట్టి వారు తెచ్చువేతనమువలన మఱింత సులభముగ కుటుంబమును బోషించుకొనవచ్చుననెడియాశ వానికుండును. కావున నట్టివాడు స్వల్పాదాయమార్జించినను దానితో వానిమర్యాదకుదగినట్లు కుటుంబపోషణము జేసికొనగలిగియుండును. అంతటి యాదాయము దొరకువఱకు మాత్రమతడు వేచియుండి యది దొరకగనే వివాహమాడును. అతడు కోరునట్టి యాదాయమల్పమగుట చేత, నా మొత్తము నతడు వానివృత్తిలో బ్రవేశించిన స్వల్పకాలముననే యార్జింపగలిగియుండును. అట్టివాడొకవేళ గొంతకాలము వేచియున్నను నెక్కువ జీతము లభించుట కవకాశముండదు. కావున నాయంతస్తులోనివా రిరువదినాలుగు ఇరువదియైదు సంవత్సరముల వయస్సుననే వివాహమాడెదరు. ఎక్కువయంతస్తులో నుండువాడింత శీఘ్రముగ గుటుంబ భారమును వహింప సమర్థుడు కాజాలడు. ఆహారము వస్త్రములు మున్నగువానికై యతడు చేయవలసిన ఖర్చధికముగ నుండును; తక్కువ

యంతస్తులోనివా రుపయోగింపని పదార్థముల నెన్నిటినో యితరుపయోగించుచుందురు. సంతానముకలిగినంతనే యితని కట్టి సౌఖ్యము నుండదు. వారి శరీరపోషణమునకై యెక్కువ ఖర్చుపెట్టవలసి వచ్చుటయేగాక, వారికి దగిన విద్య గరపుట కెంతయో ధనవ్యయము జేయవలెను. వారు స్వతంత్రముగ నేదియో యొకవృత్తిలో బ్రవేశించి కొంచెమార్జింపగలుగు నంతవఱకు వారిని రక్షింపవలెను. పిల్లల విషయమైయెక్కువ యంతస్తులో నున్నవారు వహింపవలసినంత బాధ్యత తక్కువ యంతస్తులో నున్నవారి కుండుట లేదు. కావున, వారిలో నెక్కువ యాదాయము గడింపదగిన స్థితియందుండువారు మాత్రము వివాహమాడెదరు. వారుగూడ, తమయంతస్తునకు దగినట్లు కుటుంబపోషణమును జేసికొనగలవారమను ధైర్యము న్నప్పుడే వివాహ ప్రయత్నము గావింతురు. సామాన్యముగ, నుద్యోగములో బ్రవేశించిన యయిదారు సంవత్సరములకుగాని యింతటి యాదాయము వారికి లభింపదు. కావున నధికమగు నంతస్తులో నున్నవారు ముప్పదిమూడు ముప్పది నాలుగు సంవత్సరముల వయస్సువచ్చినతర్వాత వివాహమాడెదరు. మనలోననేకులు విద్యార్థిదశయందున్నప్పుడే వివాహమాడుటయు, నుద్యోగములో బ్రవేశించునప్పటి కిద్దరు ముగ్గురు పిల్లలకు దండ్రులై యుండుటయు సంభవించుచున్నది. కానిపాశ్చాత్యదేశములం దంతస్తునుబట్టి, వివాహమాడువారి సంఖ్యయు వారివయస్సును నిర్ణీతము లగుచున్నవి. అల్పమగు నంతస్తులోనివారు శీఘ్రముగ వివాహము జేసికొనుటచేత, నాయంతస్తునబుట్టు పిల్లలసంఖ్య యధికముగ నుండును;

యెక్కువ యంతస్తులోని వారాలస్యముగ బెండ్లాడుటచే వారికి బుట్టుపిల్లలసంఖ్య తక్కువగ నుండును.

మనదేశములోని బాల్యవివాహములకు సహిత మంతస్తును సంబంధించిన యిట్టి కారణమొకటియున్నదని యనుమానము కలుగుచున్నది. మనలో జాలమంది తక్కువయంతస్తులోని వారు. వారనుభవించు నాహారవస్త్రాదులంత ప్రశస్తములు కావు. వారికి మిక్కుటములగు నాశలేవియు లేవు. స్వల్పమగు నాదాయముతో వారు కుటుంబపోషణ మొనర్చుకొనగలిగి యున్నారు. "పుట్టించిన దైవము పోషింపడా" యనిపుట్టినపిల్లల బోషించుభారమును దేవునిపైవైచు స్వభావము మనదేశమందు వ్యాపించియున్నది. పిల్లలకు విద్య నేర్పవలయుననియు, వారినిలాభకరములగు వృత్తులలో బ్రవేశింపదగునట్లు దయారు చేయవలయుననియు సామాన్యులు తలచుటలేదు. ఈకారణములబట్టి, బాల్యవివాహములు అధికసంతానముకలిగియుండుట మున్నగునవి సత్సాంప్రదాయములుగ గణింపబడుచున్నవి. కాని, ఈవిషయములగురించినపరిశోధన మనదేశమందింకను జరుగవలసియున్నది. అది బాగుగను బూర్ణముగను జరిగినగాని సత్యమిదియని నొక్కిచెప్పుటకు వీలులేదు. విద్యార్థులెల్ల రిట్టి పరిశోధనకు గడగుట మిక్కిలి యావశ్యకమై యున్నది.

(8) వివాహమాడినంతమాత్రమున నధికసంతానప్రాప్తియగుననియు, నందుచే జననముల సంఖ్య హెచ్చుగుననియు సిద్ధాంతపఱచుట కవకాశము లేదు. వివాహమాడినవారిలో సంతానేచ్ఛ యధికముగనున్నదా? అల్పముగనున్నదా? యను

విషయమును విమర్శింపవలసియుండును. ఈ యిచ్ఛనుబట్టి పాశ్చాత్య దేశములం దొకయంతస్తులో బుట్టు పిల్లలసంఖ్యకును మఱియొకదానిలో బుట్టు పిల్లలసంఖ్యకును విస్తారమగు భేదము గనబడుచున్నది. ఎక్కువ యంతస్తునందుండువారు, సంతానాధిక్యమగుటవలన నంతస్తునకుదగినట్లు జీవించుట దుష్కరమగునని యిద్దరు ముగ్గురుపిల్లలు పుట్టినతర్వాత సంతానము కలుగకుండునట్లు ప్రయత్నింతురు. పుట్టినపిల్లలిద్దరుముగ్గురైనను వారిని దగురీతిని బోషించి పెద్దవారినిగ జేయుట ప్రధానమనియు, నధికసంతానమున్న యెడల నిట్టిపోషణ జరుగుట దుస్తరమనియు వారూహించుచుందురు. ఇట్టియూహాలకనుగుణముగ వారునియమముగలిగి ప్రవర్తించుటచేత నా దేశములం దగ్రజాతులలో బుట్టు పిల్లలసంఖ్య తక్కువగనున్నది. ఇట్లేగాక, వివాహమాడువారి సంఖ్యసమానముగ నుండు దేశములలో గూడ జననములసంఖ్య సమానముగ నుండకుండుటకు సంతానేచ్ఛలో గలభేదములే కారణము. సంతానవిషయమై యిట్టినియమములుగల వారిసంఖ్య మన దేశమందు జాలతక్కువ. సంతానమెంత యధికముగనుండిన నంతగౌరవమని మనవారూహించుచుందురు. ఈ కారణముచేతగూడ మన దేశములోని జననముల సంఖ్య హెచ్చుగనున్నది.

అనేకుల కీయంశము లనుమానాస్పదములుగ గనబడవచ్చును; కాని పాశ్చాత్య దేశములలోనియనుభవమున కివి యన్నియు ననుగుణముగనున్నవి. మన దేశమందీవిషయములలో విస్తారములగు భేదములున్నవని యనుకొనుటకు బూర్వము పరిశోధన విశేషముగ జరుగవలసియున్నది.

జననములసంఖ్య విస్తారముగనుండునంత మాత్రమున జనసంఖ్య యధికముగ వృద్ధియగుచుండవలసినది లేదు. ఈసందర్భమున మరణముల సంఖ్యగూడ గమనింపవలసిన యంశమే. మరణములకంటె జననములెంత యధికముగ నుండునో దానిని బట్టియే జనాభివృద్ధియగుచుండును. మరణసంఖ్యను నిర్ణయించు సందర్భములేవియో మనమిప్పుడు విమర్శింపవలెను.

పుట్టినవారిలో శాశ్వతముగ జీవించువారొక్కరుగూడ నుండరుగదా! వార్ధకమును బొందినవారు తప్పక మృతి జెందవలసి యుందురు. ఇట్టివారిలో నేటేటగొందఱు మృతి జెందుచుందురు. కాని సాధారణముగ జననములసంఖ్య హెచ్చుగనుండు దేశములలో మరణముల సంఖ్యగూడ నధికముగనే యుండును. వృద్ధులుకానివారిలోగూడ ననేకులు గతించుచుందురని దీనివలనస్పష్టమగుచున్నది. మన దేశమందు వేయింటికి 39 మందిపుట్టుచున్నట్లిదివఱకు చెప్పియుంటిని; సంవత్సరమునకు వేయిమందిలో 34 గురు గతించుచున్నారు. కావున వేయింటికి 5గురు చొప్పున జనసంఖ్య వృద్ధియగుచున్నది. ఇంగ్లండులో వేయింటికి 27గురువంతున బుట్టువారును 15గురువంతున మృతిజెందువారును యున్నారు. కావున వేయింటికి 12గురుచొప్పున జనసంఖ్య వృద్ధియగుచున్నది. మన దేశమున మృతినొందు వారిలో (1) శిశువులు (2) 15 మొదలు 30 సంవత్సరముల వయస్సుగల స్త్రీలును నధికముగనున్నారు. దీనికి బాల్యవివాహములు ముఖ్యమగు కారణము. దృఢగాత్రులుగానట్టి బాల్యావస్థయందుండు స్త్రీపురుషులకు జనించువారు మొదటినుండి కృశులుగ నుండుటచేత వారిలో

ననేకులు పుట్టిన నొకటి రెండు సంవత్సరములలోపల మృతి జెందుచున్నారు. ఇట్లే, 13, 14 సంవత్సరములకే సంతానవతులగు స్త్రీలు కొలదికాలముననే బలహీనులై రోగముచే పీడింపబడి కడుశీఘ్రముగ పరలోకగతులగుచున్నారు. ముప్పది సంవత్సరముల వయస్సులోపల మృతిజెందు స్త్రీలలో బ్రసవకారణమున మృతిజెందువారి సంఖ్య యధికముగనున్నది. ఏటేటబుట్టువారిసంఖ్య హెచ్చుగనుండుటకు బాల్యవివాహము కారణమైనట్లే, మరణముల సంఖ్యగూడ నధికముగనుండుట కదియే హేతువుగ నున్నది.

జనసామాన్యము తక్కువయంతస్తు నందుండు వారగుటచేతను వారియాదాయము చాలా తక్కువగ నుండుటచేతను, తగువిధముగ కుటుంబపోషణము జేయగలశక్తి వారికి లేకయున్నది. విశేషముగ ధనవ్యయముజేసి, పిల్లలకు బుష్కలమగు నాహారముబెట్టి వారి నారోగ్యస్థితియందుంచుట యనేకులకు దుస్సాధ్యము; కావున శైశవమందలి గండముల దప్పించుకొని, పెద్దగ పెరుగువారుగూడ బలహీనులై యకాలమృత్యువును బొందుచున్నారు. వార్ధకమన్న నీకాలమందు నలుబది సంవత్సరములకే కలుగుచున్నది. అరువది సంవత్సరములకంటె నెక్కువ కాలము బ్రతుకు వారిసంఖ్య తగ్గుచున్నది. వ్యాధి, దుర్భిక్షము మొదలగు వానినుండి తప్పించుకొనుట కష్టముగుచున్నది. శరీరపోషణకు వలయు నాహారాదులు సమృద్ధిగ లేక పోవుటయే యిట్టిదుస్థితికి కారణము. వార్ధకదశ వచ్చువఱకు బ్రతికియుండి తదనంతరము మృతిజెందుట సహజము; అట్టి మరణములు మాత్రము దేశమందు సంభవించుచున్న

యెడల విచారింపవలసిన దేదియునుండదు. కాని, మనదేశమందలిస్థితి విపరీతముగ నున్నది. మంచివయస్సునందుండి, వ్యవసాయాది లాభకరములగు కార్యముల జక్కగ జేయగలవారత్యధికముగ మృతిబొందుచున్నారు. మరణముల సంఖ్యదీనివలననే హెచ్చుగ గనబడుచున్నది.

ఇట్టిసందర్భమున దేశక్షేమము గోరువారెల్లరు చేయదగిన కార్యములుకొన్నియున్నవి. మరణములసంఖ్యయధికముగనుండుటకు జననములసంఖ్య యధికముగనుండుటయే కారణము కావున, జననములసంఖ్యను దగ్గించుటకు బ్రయత్నింపవలెను. కుటుంబములదగురీతిని బోషింపశక్తిగలవారు మాత్రము వివాహమాడవలయును. బాల్యవివాహములమాని స్త్రీపురుషులెల్లరు మంచి వయస్సు వచ్చిన తర్వాత పెండ్లిజేసికొనవలెను. వివాహమాడినవారుసహిత మింద్రియలోలురుగాక, మితమగు సంతానముతో దృప్తిబొంది పుట్టినపిల్లలు కొద్దిమందయినను వారినిజాగరూకతతో బెంచుచుండవలయును. అనేకులు పుట్టుటయు, బుట్టినవారిలో నకాలమున ననేకులు మృతిజెందుచుండుటయు, దేశమునకు సౌఖ్యకరముకాదుగదా? వివాహసంబంధములగు నాచారముల మనమించుక మార్చుకొనినయెడల శరీరపటుత్వమును బుద్ధిబలమును దీర్ఘాయువును గలవారు దేశమందధికమై దేశైశ్వర్య మభివృద్ధిగాంచుట కవకాశముండును.

(2)

జననములసంఖ్య వృద్ధియైనతుదకు జనసంఖ్యయమితముగ వృద్ధినొందుటచేత మొత్తముమీద దేశమందుత్పత్తియగు

ధనసమూహాయ మధికమైనను, సరాసరి నొక్కొక మనుష్యునికి లభించు ధనముతగ్గి, ప్రజలజీవితమందుగలుగు కష్టములధికమై వ్యాధి, దుర్భిక్ష యుద్ధాదులు హెచ్చి తుదకు జనక్షయ మగునని పాశ్చాత్యదేశములోని యర్థశాస్త్రపరిశోధకులుకొంతకాలము క్రిందటసిద్ధాంతపఱిచియుండిరి. ఇదియెల్లకాలమునందును నెల్లదేశములందును వర్తింపకపోయినను, నిట్టికష్టములఁ దొలగించుటకు మనుష్యునికి సామర్థ్యమున్నను, నొక్కొకప్పుడు జననములసంఖ్య వృద్ధియగుటలో దేశోపద్రవము కలుగునని మనమనుకొనక తప్పదు. దీనికి హేతువు లేవియో మనమిప్పుడు తెలిసికొనవలయును.

(1) ఏ దేశమందుగాని వ్యవసాయయోగ్యమగు భూమియంతయు నొక్కటేవిధముగ నుండదు. కొంత భాగము మిక్కిలిసారవంతముగను, గొంతభాగ మంతకంటెతక్కువసారముగలదిగను, మఱికొంతభాగము సారహీనముగను, రకరకములుగనుండును. దేశమందలి జనసంఖ్య స్వల్పముగనుండునపుడు జనులకు నాహారపదార్థములు విస్తారముగ కావలసినది లేదు; అందుచేమొదటిరకపుభూమిలో గొంతభాగమును మాత్రము వ్యవసాయముజేసి వారికిగావలసినంత యాహారపదార్థములవారుత్పత్తిజేసికొనుచుందురు. ఇట్టి సందర్భమున జనసంఖ్యహెచ్చినను, సారవంతమగుభూమి మఱింత యుండుటవలన దానిని సాగుజేసి, వలయు నాహారమును సంపాదించుకొనెదరు. ఇట్లుండగా వారిసంఖ్య మఱింత యధికమైనయెడల మొదటిరకపు భూమిలో నుత్పత్తియగు ధాన్యాదులు వారికి సరిపోకపోవచ్చును. అట్టిసమయమున వారు రెండవరకపు

భూమిలో కృషిజేయవలసియుందురు. కాని, యీభూమి మిక్కిలి సారవంతముకాని దగుటచేత, మొదటిరకపు దానిలోపండినంత దీనిలోపండజాలదు. కొంతమూలధనముతో నొకమనుష్యుడు మొదటిరకపు భూమిలో నొక యెకరమును వ్యవసాయము జేసినయెడల నొకపుట్టెడుధాన్యము పండుచుండెనేని, ఈ రెండవ రకపుభూమిలో నొక యెకరమునుండి ముప్పాతిక పుట్టెడు ధాన్యము మాత్రము ఫలింపవచ్చును. కావున జనులసంఖ్య హెచ్చి, కొందఱు రెండవరకపు భూమిని వ్యవసాయముజేయ వలసి వచ్చినపుడు వారిశ్రమకుదగినంతటిఫలములభింపకయుండును; ఇట్టివ్యవసాయమును జేయువారితరులకంటె దక్కువ ధాన్యము నార్జించుచుందురు. ఆర్జన తగ్గుటచే కుటుంబపోషణము దుస్తరమగును; కడుపునిండునట్లాహారము దొరకకపోవును; శరీరము కృశించుటయు వ్యాధి పీడితమగుటయు సంభవించును. ఇట్టి స్థితిలో జనసంఖ్య మరింత యధికమైనయెడల మూడవరకపు భూమిసాగుజేయబడవలసిన యవసరముకలిగి, శరీరపోషణ విషయమై మఱింత కష్టము లుత్పన్నము లగును. దేశమందు ప్రశస్తమగు భూమియధికముగనుండువఱకు జనసంఖ్య హెచ్చుటవలన నేలాటియిబ్బందులును గలుగజాలవు. అట్టిభూమి మితముగనుండుటబట్టియు నధికజనము నిమిత్తమై సారహీనములగు భూములుగూడ వ్యవసాయము జేయవలసియుండుటబట్టియు, సామాన్యముగ జనసంఖ్య యమితముగ వృద్ధియగుటవలన బ్రజలకెక్కువ సౌఖ్యము కలుగుటకు బదు లెక్కువ కష్టములుకలుగును.

(2) జనసంఖ్య హెచ్చినపుడు రెండవరకపుభూమిని

సాగుజేయుటకు బదులు మొదటిరకపుభూమిని మఱింతశ్రమ పడి వ్యవసాయము జేసినయెడల నధికసంఖ్యకు గావలసిన యాహారము దొరకదా? యను సందేహము కొందఱికి గలుగ వచ్చును. అనఁగా, సారవంతమగు భూమిలో నొక యెకరము నొకమనుష్యుడు సాగుజేయుటవలన నొకపుట్టెడు ధాన్యము పండినయెడల జనసంఖ్య హెచ్చినపుడొక్కొక యెకరము నిద్దరుచొప్పున సాగుజేసినయెడల రెండుపుట్లధాన్యము పండ జాలదా? అట్లుపండిన యెడల సారవిహీనములగు భూముల సాగుజేయవలసిన యావశ్యకతయే యుండదుకదా? అప్పుడు కావలసినంతయాహారము దొరకకపోవుటవలన గలుగు నష్టములన్నియు నదృశ్యములవునుగదా? గాని, ఈ విషయమున గూడ నొక సిద్ధాంతమున్నది; అది యందఱియనుభవమందు నున్నట్టిదియే. ఒక మనుష్యుడు శ్రమ పడుటవలన నొకపుట్టెడు పండినయెడల, నిద్దఱాభూమియందే శ్రమపడుటవలన రెండు పుట్లును ముగ్గురు శ్రమ పడుటవలన మూడు పుట్లును బండ జాలవు. ఇద్దఱుశ్రమపడినపుడొకడు శ్రమపడినపుడుత్పత్తియైన దానికంటె మరికొంచెమధికము కావచ్చును. ఏలన, భూమిని దున్నుటయందును జదరము జేయుటయందును గలుపు తీయుటయందును కృషి సంబంధమగునితర కార్యములందును, నొకనికంటె నిద్దఱెక్కువపనిని జేయగలిగియుందురు. అందుచే నిద్దఱుకలిసి పనిచేసినపుడొక యెకరమునుండి యొకటిన్నర పుట్టియో, యొకటిముప్పాతికపుట్టియో పండవచ్చును. ధనోత్పత్తికి బురుషకారమొక్కటిమాత్రమే సాధనముకాదు; ప్రకృతి సంపదయును రెండవసాధనముగూడ నుండవలయును.

పురుషకారముమాత్రము రెండురెట్లయి, ప్రకృతిసంపదయొప్పటియట్లే యుండినయెడల ఫలము రెండురెట్లగునా? ప్రకృతిసంపదగూడ రెండురెట్లయినయెడల ఫలితము రెండింతలు కావచ్చును. ఒకయెకరమందలి భూసార మొక్కటేవిధముగ నుండ, దానివ్యవసాయము జేయువారిమాత్రము రెండురెట్లయినయెడల ఫలితముకొంచెమధికమగునుగాని రెండింతలధికము కాదు. కావునజనసంఖ్యహెచ్చినపుడు సారవిహీనమగు నెకరా భూమిని వ్యవసాయము జేసి యొకడు ముప్పాతికపుట్టిధాన్య ముత్పత్తిజేయుటకును, నతడు సారవంతమగు నెకరా భూమిని సాగుజేయుచున్నవానితోగలిసి దానిని మఱింత చక్కగ సాగుజేసి మొత్తముమీద దానినుండి యొకటిముప్పాతికపుట్టి ధాన్యము నుత్పత్తిజేయుటకును, భేదమేమియులేదు. ఈ రెండు మార్గములలో దేనిననుసరించినను, నధికమగు మనుష్యుని పరిశ్రమవలన కలుగుఫలితము ముప్పాతికపుట్టియే. కావున జనసంఖ్య యధికమైనపుడు శరీరపోషణము కష్టతరమగునని దీనిబట్టి స్పష్టమగుచున్నది. సారవంతములగు భూములను మఱికొందఱుకలసి జాగరూకతతో కృషిజేసినపుడు కలుగు ఫలితమందిట్టి వ్యత్యాసము లేకపోవునెడల బ్రపంచమందలి సారహీనములగు భూముల సాగుజేయవలసిన యవసరమే యుండదు.

జనసంఖ్యావృద్ధియగుటవలన భూములుచాలక ప్రజలు కష్టపడుచున్నారనుటలో నుండు సత్యమిదియే. ఈ కష్టము లనేకరూపములుగ బరిణమించుచుండును. సామాన్యముగ దీనివలన వ్యాధులుప్రబలి, జనక్షయము కలుగును; లేదా [illegible]

ములుత్పన్నమై జననష్టకారకములు గావచ్చును; లేక యొక దేశమందలి జనసంఖ్య హెచ్చుటచే నాజన మితరదేశములపై దాడివెడలి, వానిలోని జనమును వారిభూమిని నశపరచుకొని, యాకారణముచే గలిగిన నధికలాభము ననుభవించుచుండ వచ్చును. ఇట్టి యుద్ధములవలనగూడ బ్రజాక్షయము సంభవించుచుండును. జనసంఖ్య హెచ్చుటయు, హెచ్చిన జనమును బోషించుటకు గావలసినంతటి సారవంతములగు భూములు దొరకకపోవుటయు, బ్రపంచములో నిదివఱకుజరిగిన గొప్ప యుద్ధములన్నిటికిని మూల కారణములు. ప్రస్తుతకాలమందైరోపాఖండమందుండి ప్రతిసంవత్సరము లక్షలకొలది జనము అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజీలండు, దక్షిణాఫ్రికా మున్నగు దేశములకు వెళ్ళి, యచ్చట స్థిరనివాసముల నేర్పఱచుకొనియుండుటకుగూడ నైరోపాలోని జనాధిక్యము కారణము. ఒక దేశమందు హెచ్చినజనసంఖ్యకు గావలసిన యాహారాదులు లభించుట దుస్తరమైనపుడు వ్యాధులు దుర్భిక్షములు యుద్ధములు లోనగువాని మూలమున గ్రమక్రమముగ నా యధిక జనము క్షీణించును. దేశమందుత్పన్నమగు నాహారపదార్థాదులెంతయధికముగనుండునో దానికంటె నధికముగ జనసంఖ్య వృద్ధియగునెడల వ్యాధిమొదలగు విపత్తువలన జనక్షయము కాకమానదు. కావున నాలోచనపరులుగాక, బాల్యవివాహములయందాసక్తులై జననముల సంఖ్యను వృద్ధిజేయుటవలన క్షామాదిపీడలమూలమున బాధపడుటయే ఫలితము. ఇట్టిబాధల దగ్గించి యనవసరమగు ప్రజాక్షయము సంభవింపకుండ జేయవలయుననిన, వివాహధర్మములందు గొన్ని మార్పుల

గావించుకొనుట యత్యావశ్యకము. మానవజీవిత మమూల్యమైనట్టిది; పుట్టినవారిలో నొక్కరుగూడ, వారణీయములగు కారణములవలన మృతి జెందకుండునట్లు జేయుట మనకు విధియైయున్నది. నాగరికతాభివృద్ధిగాంచినట్టి యింగ్లండు, ఫ్రాన్సు మున్నగు దేశములలో నిదివఱకే యిట్టి వివాహసంబంధములగు మార్పులను గావించుకొనియు, నారోగ్యశాస్త్ర వైద్యశాస్త్రముల ననుసరించి యాచారవ్యవహారముల నిర్ణయించుకొనియు మృతిజెందువారి సంఖ్యను దగ్గించుకొనియున్నారు. ఈ విషయముల సంబంధించిన జ్ఞానము నధికముగ సంపాదించి మనముగూడ నవసరములగుమార్పుల జేసికొనవలసిన కాలము వచ్చియున్నది.

పైజెప్పిన రెండంశములవలన జనసంఖ్య హెచ్చగుటచే మనుష్యునికిగలుగు కష్టములన్నిటికిని ప్రకృతిప్రాతికూల్యమే ప్రధానహేతువని స్పష్టమగుచున్నది. కాని, యేయేటబ్రతిదేశమందును జనసంఖ్య హెచ్చగుచుండుట మనము చూచుచున్నాము; దీనివలన మానవజీవితమందలి కష్టములుగూడ నధికములగుచున్నవా? ధనోత్పత్తివిషయమున మనపూర్వులకంటె మన మిప్పుడెక్కువ నేర్పును గలిగియున్నాము గదా? మనుష్యుడన్ని విషయములందును దినదినాభివృద్ధి గాంచుచున్నాడనియు, శరీరపోషణము పూర్వముకంటె కష్టతరమగుటకు బదులు సులభతరమగుచున్నదనియు, నిగ్లండు ఫ్రాన్సు జర్మని మొదలగు నవనాగరికత దేశములబట్టి మనకు తెలియుచున్నదిగదా? ఇట్టి సందర్భమున జనసంఖ్య హెచ్చగుటచేత ప్రాణాధారణము కష్టమగునని విచారింపవలసిన యన

సరము లేదుగదా? అని కొందరు వాదింపవచ్చును. ఈ వాదములోగల సత్యమును మనము విమర్శింపవలయును.

ప్రకృతికిని మనుష్యునికిని నిరంతరమగు పోరాటము జరుగుచున్నది. అందులో జయము సంపాదించుటకు మనుష్యులు ప్రయత్నించుచుందురు. ఈ ప్రయత్నము కొనసాగుటలో మనుష్యుని బుద్ధిబలము వానికి బ్రధానమగు సహకారిగ నున్నది. బుద్ధిబలముచేతనే మనుష్యుడు సృష్టిలోని యితర ప్రాణులను ప్రకృతిని వశపఱచుకొనుచున్నాడు. ప్రకృతివలన గలుగు ప్రతికూల్యముల నన్నిటిని దొలగించుకొనుటకును దానిని అనుకూల పఱచుకొనుటకును నిదియే నతనికి సాధనమై యున్నది. అనాదినుండి యాహారపదార్థముల సంపాదించుటలో మనుష్యుడు చూపుచున్న నేర్పునుగుఱించి యాలోచించితిమేని, తక్కువ విస్తీర్ణత నుండి యెక్కువ ఫలితము నుత్పత్తిజేయుటయే దీని ముఖ్యలక్షణముగ గన్పడును. ఆదియుగమందలి మనుష్యులు వేటవలన నాహారమును సంపాదించుచుండిరి. దీనిచే సమృద్ధిగ నాహారము దొఱకుటకు నెంతయో వైశాల్యముగల యడవులావశ్యకములయియుండెను. జనసంఖ్య హెచ్చుకాగా, నీయడవులు చాలకపోవుటచే, నుపాయాంతరమున మితమగు భూమినుండి యధికమగు ఫలితము నుత్పత్తి జేయగోరి వేటను మాని పశుపాల్యము నవలంబించిరి. అడవులనన్నిటిని గోభూములుగ మార్చి, పశువుల నందుమేపి పాలు పెరుగు మాంసము మొదలగువాని నాహారముగ జేసికొనిరి. వేటమృగములు స్వేచ్ఛగ దిరుగుటకు వలసినంత భూవైశాల్యము

లేకపోయినను, ననేకపశువులు భూమి నాధారముగ జేసికొని జీవించుట కవకాశముండెడిది. వేటయే జీవనోపాయముగ నున్నప్పుడు చాలకుండిన భూమి పశుపాల్యము జీవనాధారమైనప్పుడు సమృద్ధిగ మనుష్యునికి గావలసిన యాహారమును నిచ్చునట్టిదాయెను. కొంతకాలమునకు జనసంఖ్య మఱింత హెచ్చుకాగా, పశువుల సంఖ్యను హెచ్చుజేసి వానికి గావలసిన గోభూములగూడ నధికముజేయవలసిన యవసరము కలిగెను; కాని భూమి ప్రకృతిజమగు పదార్థమనియు దాని నధికముజేయుట దుస్తరమనియు నిదివఱకే చెప్పియుంటిమి. కావున, నిట్టి సందర్భమున, మితమగు గోభూములనుండి, యెప్పటికంటె నధికమగు నాహారమును సంపాదించుట కొఱకు మనుష్యుడు వాని బుద్ధిని నుపయోగింపవలసి వచ్చెను. అప్పుడు వ్యవసాయము జీవనాధారముగ జేసికొని మితముగనుండు గోభూములనుండి కావలసినంతటి యాహారము నుత్పత్తిగావింపవచ్చునని మనుష్యుడూహించెను. స్వల్పవిస్తీర్ణతగల భూమి, వ్యవసాయయోగ్యమయినపుడు, గోభూమిగ నది యున్నప్పుడు దానినుండి మనుష్యుడు పొందుచున్న యుపకారముకంటె నెక్కువ యుపకారము బొందుట కవకాశముండును గదా? ఈకారణముచేతనే ప్రస్తుతకాలమందు సహితము పశువులమేపునకుగా నుంచబడియుండు బీడుపొలముల ననేక గ్రామములందు వ్యవసాయయోగ్యములగునట్లు మనవారు చేయుచున్నారు. వ్యవసాయముజేయు పద్ధతిని మనుష్యుడెఱిగినదాదిగ, జీవధారణమతనికి సులభతరమాయెను. కాని జనసంఖ్య హెచ్చుటచేతను, పైనిజెప్పినట్లు సారమునుబట్టి భూము

లపో. ననేకములగు రకములుండుటవలనను, సారవంతములగు భూములు మితముగనుండుటవలనను నెంతసారవంతమగు భూమినుండిగాని యధికపరిశ్రమకనుగుణమగు ఫలితము నుత్పత్తిజేయుట దుస్సాధ్యమగుటవలనను మనుష్యునిజీవితము కష్టమగుచువచ్చెను. అయినప్పటికిని, మనుష్యుని బుద్ధిబలమునకు మితిలేదుగదా? ప్రకృతిలోని రహస్యముల గనుగొని భూసారమును వృద్ధిపఱచుటకును నల్పమగు భూమినుండి యమితమగు ఫలమును బొందుటకును వలయుమార్గములగనుగొన మనుష్యుడు ప్రయత్నముల గావింపదొడగెను. క్రొత్తక్రొత్తలగు నుపకరణములదయారుచేసియు, ఎరువులజాగ్రత్తబెట్టియు, జలాధారముల వృద్ధిపఱచియు, పంటలలో మార్పులగావించియు, నూతనములగు నాహార పదార్థముల గనుగొనియు, సారవిహీనములగు భూములసహితముసారవంతములుగజేసి సారవంతములగు వానినుండి నొకకాలమునకంటె మఱియొకకాలమున రెండుమూడునాలుగు రెట్లధికమగు ఫలితమును బొందగలవాడాయెను. వ్యవసాయచరిత్రయన నీయంశములలోగలిగినమార్పుల చరిత్రయే. ఇట్టి మార్పులనవలంబించి, యింగ్లండు యునైటెడ్‌స్టేట్సు జర్మనీమున్నగు దేశములలో నూరుసంవత్సరములకు బూర్వము నొకయకరమునుండి ఫలింపజేసినదానికంటె నాలుగైదురెట్లధికముగ నిప్పుడు ఫలింపజేయుచున్నారు. జనసంఖ్య హెచ్చినను మనజన్మము దుఃఖభూయిష్టమగునని విచారింపవలసినదిలేదు. మనుష్యుడు, వాని బుద్ధిబలమువలన దనకుగలుగు నాటంకములనన్నిటిని యిప్పటికిప్పుడు గాకపోయినను క్రమక్రమముగనయిన బోగొట్టు

కొనుటకు సమర్థుడై యున్నాడు.

ఇదిగాక, ప్రపంచమందు మనుష్యునిచే నుపయోగింపబడని ఖాళీప్రదేశము లింకను ఉన్నవి. కనడా, ఆస్ట్రేలియా యునైటెడ్‌స్టేట్సు, దక్షిణాఫ్రికామున్నగు దేశములలో నల్పజనమును నధికభూమియు గనబడుచున్నవి. జనాధిక్యముగల దేశములలోని వారీదేశములకు వెళ్ళి, కాపురములు నేర్పఱచుకొని, వీనిలోనిభూముల వ్యవసాయముజేసి, సుఖముగజీవింపవచ్చును. ఐరోపాఖండవాసులిదివఱకేయిట్లు చేయుచున్నారు. అయిదువందలసంవత్సరములకు బూర్వమీదేశము లున్నవను మాట యెవరికిని దెలియకుండెను. క్రమక్రమముగ వీనినిగనుగొనుటకును, తర్వాత లక్షలకొలది యైరోపియన్లు వీనిలో వెళ్ళి కాపురముండుటకును ఐరోపాలోని జనాధిక్యమే కారణము. ఈ ఖాళీప్రదేశములన్నియు జనపూరితమగు వఱకును జనసంఖ్య హెచ్చుచున్నదని విచారింపనక్కఱలేదు.

మఱియొకవిశేషముగూడనున్నది. జనాధిక్యముగల దేశములోనివారు వారిదేశమునుండి కావలసినంత యాహారము నుత్పత్తిజేసికొనజాలనపుడు, విదేశములనుండి వ్యాపారమూలమున వారికిగావలసినంత పదార్థములగొనవచ్చును. ఈకాలమున నిట్టి యుపాయమునగదా యింగ్లండు మొదలుగాగల దేశములవారు యిండియా రషియా అమెరికా మొదలగు విదేశములనుండి యాహారాదులుదెప్పించుకొనుచుండుట! కావున, ఏవిధముగ నాలోచించినను, జనసంఖ్య హెచ్చుగుటచేత కష్టము లధికములగునని యెంచుటకు హేతువులుకానరావు.

ఈవాదములోని సత్యాసత్యములజదువరులాలోచింతు

రుగాక. మనదేశమందిపుడు సుమారు ముప్పదిరెండుకోట్లప్రజలున్నారు. జననములసంఖ్య యధికముగనున్నదనియు, పుట్టినవారిని బోషించుటకు మనకు శక్తి లేకపోవుటచే వారిలో నధిక సంఖ్యాకులు మృతి జెందుచున్నారనియు నిదివఱకే చెప్పియుంటిని. మనబుద్ధిబలమువలన నూతనమార్గముల నవలంబించి వ్యవసాయము నిప్పటికంటె లాభకరముగ జేసికొనగలిగినయెడలను; మనదేశమునుండి యనేకులు విదేశములకు వెళ్ళి యచ్చటనే స్థిరనివాసముల నేర్పఱచుకొనగలిగినయెడలను; లేక, క్రొత్తవృత్తులనవలంబించి, క్రొత్తపదార్థముల నుత్పత్తిజేసి, వానిని విదేశములవారికమ్మి దానిమూలమున మనకుగావలసిన యాహారపదార్థముల నధికముచేసికొనినయెడలను; జనసంఖ్యనుగుఱించిన విచారము మనము మానవచ్చును. కాని, యీపైసాధనముల నుపయోగించుటకు మనమిప్పుడు తగినస్థితియందున్నామా? ఇట్టిస్థితివచ్చుటకు గొంతకాలముపట్టినయెడల నాకాలము వచ్చువఱకు జనసంఖ్యను హెచ్చింపకుండుట మనకు విధిగదా? అని మనమాలోచింపవలయును.

ఈసందర్భమున నొకటిరెండుమాటలుమాత్రము చెప్పవలసియున్నవి. వ్యవసాయమును నిప్పటికంటె నాదాయకరముగ జేయుటకు మనదేశమందెంతయో యవకాశమున్నది. దొరతనమువారు సహితము వ్యవసాయపరిశోధన శాలలు, వ్యవసాయకళాశాలలు, ప్రదర్శనములు మున్నగువానివలన నూతనోపాయముల గనుగొనుటకును వానియొక్క ప్రచారము దేశమందు గావించుటకును బ్రయత్నము జేయుచున్నారు.

నదీజలములు వ్యర్థముగ సముద్రముపాలుగాకుండునట్లు కాలువలను, వర్షజలము వ్యర్థముగాకుండ చెరువులను నిర్మించి నూతులుద్రవ్వించి మఱికొన్ని జలాధారముల గల్పించియు భూమినుండి యెక్కువ ఫలితమును సంపాదింప నందఱు ప్రయత్నము గావించుచున్నారు. కాని, మనదేశమున కీనవీనోపాయములలో నేవితగినవో దెలిసికొనుటకు గొంతకాలము పట్టును; ఉపాయములు దెలిసినను వానిని రైతులు పూర్ణముగ నాచరణయందుంచుటకు వలయు మూలధనము కొంతకాలమునకుగాని సమకూరజాలదు; జలాధారనిర్మాణమునకు వలయు వసతులు గూడ నెక్కడనన్న నక్కడ మనకు గావలసినంతవఱకు దొరకుట దుస్తరము. కావున జనసంఖ్య హెచ్చుటలో నష్టమేమియు లేదని మనము భావింపక, యిప్పటికంటె స్థితిగతులు చక్కబడువఱకును జననములసంఖ్య తగ్గించుటకు గావలయు ప్రయత్నము జేయవలెను.

"వలస"వలనగూడ జనాధిక్యమును దగ్గించుకొనుటకు మనకు విస్తారమగు నవకాశములేదు. ఆస్ట్రేలియా, కనడా మొదలగు దేశముల కైరోపాఖండవాసులగు తెల్లవారు స్వేచ్ఛగ వెళ్ళగలరుగాని, మనము వెళ్ళుట కెన్నియోయాటంకముల గల్పించియున్నారు. కొన్నిదేశములకు "కూలీలు"గ మనవారు వెళ్ళుచుండెదరుగాని, వారికాదేశములందు గలుగునిరాదరణమువలన నట్టివారిసంఖ్య చాలతక్కువగనున్నది. ప్రపంచమందు "తెల్ల"వారికిని, "నల్ల"వారికిని నిప్పుడుగల వైషమ్యము తగ్గినగాని, "వలస"వలన మనకెట్టి యాదాయమును గలుగజాలదు. ఏవిధముగ నాలోచించిచూచినను, మనదేశ

ములోని జననములసంఖ్య తగ్గుట మంచిదని తోచుచున్నది.

(౩)

మనదేశమందు ముప్పదిరెండుకోట్ల జనమున్నను వారిలోనందఱు ధనోత్పత్తికొఱకయి పాటుపడువారు కారు. బాలురు వృద్ధులు స్త్రీలలోననేకులు అంగవికలులు సోమరులు నిరుద్యోగులు చోరులు మోసగాండ్రు ఇంద్రియలోలురు మున్నగువారు గలరు. వారివలన ధనోత్పత్తియగుటలేదు. ఇట్టివారిసంఖ్య యధికముగానుండు దేశమున ధనాదాయ మల్పముగనుండుటయేగాక, ధనార్జనజేయువారికి వారిధనము వలన గలుగుసౌఖ్యము స్వల్పమై యందుకొఱకై వారుచేయు కృషిసహితమప్పటప్పటికిక్షీణింపదొడగును. స్వతంత్రముగ ధనార్జన జేయగలిగినను లేకపోయినను ప్రతి మనుష్యుడు నేదియో యొకవిధముగ జీవింపవలసియుండును. తానార్జింపలేనపుడితరులార్జించిన దానిని భిక్షాటనముచేగాని చౌర్యమువలనగాని మోసము జేసిగాని బంధుత్వము గలిపిగాని తాననుభవించుటకు బ్రతిమనుష్యుడును బ్రయత్నము గావించుచుండును. కాని, ఒకడార్జించుటయు, దానిని మఱియొకడనుభవించుటయు దేశమున కెన్నడు క్షేమకరము కానేరదు. ఇట్టిస్థితిగతు లధికముగనుండు దేశమున ధనార్జనయందువలసినంత యుత్సాహమును బ్రజలు చూపజాలరు.

దీనిని బట్టి బాలురు సహితము ధనార్జనకుగడగవలయునని తీర్మానింపగూడదు. ఏలన, బాల్యావస్థయందుండు వారు ధనార్జనోపాయములనేర్చుకొనుటయందు వారికాలమును గడపుట శ్రేయస్కరము. సాధారణముగ నధికకాలము నిట్లు

గడపువారుత్తరకాలమున నధికధనము నార్జింపగలిగియుందురు; ఇట్లుతాత్కాలిక నష్టమును గొంతవఱకు సహింప నిష్టపడినవారుత్తరకాలమున విస్తారలాభమును దప్పక పొందుదురు. దీర్ఘకాలమును జీవనోపాయముల కనుకూలించు విద్యను నేర్చుకొనుటలో బాలురు గడపుచుండుట నాగరకతా సూచకములలో నొక్కటియైయున్నది. ఒకకుటుంబమునయిదాఱు సంవత్సరముల వయస్సుగల బాలురిద్దఱుండినయెడల నింటియజమానుడార్జించి వారిని బోషించుటకు బదులు, వారే వానికి దగిన కూలిపని నేదియో యొకదానిని జేసి యొకటి రెండు రూపాయలదెచ్చిన యెడల నప్పటి కుటుంబ పోషణము సులభతరముగ నుండును; కాని దీనివలన రెండుగొప్పనష్టములు కలుగుచున్నవి. అంత చిన్న వయస్సు నుండి కాయకష్టముజేయుటవలన సహజమగు శరీరదార్ఢ్య మభివృద్ధిగాక మొత్తముమీద శరీరపటుత్వము తగ్గిపోవును. అట్టివారు వయస్సు వచ్చినతర్వాతగూడ కృశాంగులై బాగుగ బనిచేయుటకసమర్థులై యుందురు. అందుచేత వారార్జింపగలుగు ద్రవ్యము గూడ మొత్తముమీద నల్పముగనే యుండును. అట్లుగాక వీరు ధనార్జనమునకు బదులు ధనార్జనోపాయముల నేర్చుకొనుటను బ్రయత్నించినయెడల మఱికొన్ని సంవత్సరములవఱకు వారితలిదండ్రులకెక్కువభారమును గలిగించువారయినను, పిదప వారికనుగుణమగు వృత్తిలో బ్రవేశించి యెక్కువధనము నార్జింపగలవారగుదురు. ఏమియు నేర్చుకొనక, మామూలు కూలిపనివలన సంవత్సరమునకు సరాసరి నూఱురూపాయలు గడింపగలవారు, కొన్నిసంవత్స

రముల విద్య నేర్చుకొనుటలో గడపినయెడల సంవత్సరమునకు రెండుమూడువందల రూపాయలను సులభముగ సంపాదింపగలవాడగును. బాల్యమును విద్యనభ్యసించుటలో నుపయోగించువానికంటె ధనార్జనలో నుపయోగించువాడు తాత్కాలికలాభమునుగొంతపొందవచ్చునుగాని యుత్తరకాలమున నతడు విస్తారసుఖము ననుభవించుట కవకాశముండదు. ఏవయస్సునం దెట్టి పనులజేయవలెనో యట్టిపనుల జేసినయెడల బ్రతిమనుష్యుడును బ్రతిదేశమును భావికాలమం దధికైశ్వర్యమును బొందుచుండును. ధనోత్పత్తిగావించువారిలో బాలురు చేరకపోయినను, బాల్యమును జక్కగ నుపయోగపఱచు దేశములందు దీనివలననష్టము సంభవింపదు. బాల్యమును వ్యర్థపుచ్చునట్టి వారుండు దేశములందు మాత్రము దీనివలన విస్తారమునష్టముకలుగుచుండును. తలితండ్రులు విద్యనుజెప్పింప సమర్థులుకానప్పుడు రాజ్యాధికారు లీపనికి బూనవలయుననియు, నట్టిపూనికగల దేశములందు బాలురచే ధనార్జనము జేయింప గూడదనియు బ్రస్తుత కాలమందు ప్రముఖు లెల్లర భిప్రాయపడుచున్నారు. ఇది యెంతయో ప్రశస్తమయినదని వేఱుగ జెప్పనక్కఱలేదు.

స్త్రీలలో ననేకులు ధనోత్పత్తి జేయుట లేదని చెప్పినంతమాత్రమున స్త్రీలందఱు సోమరులై నిరుపయోగముగనున్నారని మనము భావింపగూడదు. ధనము నార్జించుట యెంతముఖ్యమో దానిని జక్కగ వినియోగపఱచుట యంతముఖ్యము. ఇంటిపనులను జక్కబెట్టి, పిల్లల పోషించి, పదార్థముల దగువిధమున వినియోగపఱచుట వారికార్య

మయియున్నది. ఈపనుల నెవ్వరో యొకరు చేయవలయును గదా? స్త్రీలు వీనికి బూననియెడల పురుషులు వీనిని జేయవలసియుందురు. ఇట్లుగాక యనాదినుండి యీకార్యములం దనుభవమును నేర్పును సంపాదించినవారు స్త్రీలగుటచేత, వారు వీనిని నిర్వహించుటమూలమున పురుషులుధనార్జనను దిగులు విచారములు లేక చేయగలిగియున్నారు. కొందఱు స్త్రీలు గృహనిర్వాహణమునకుగూడబూనక సోమరులయివారి జీవితకాలమునంతను నాహారము భుజించుటయందును భూషణముల ధరించుటయందునుగడపుచుందురు. వారివిషయమయి సోమరులగుఱించి చెప్పుసందర్భమున గొంత చెప్పబడును.

కొందఱుద్యోగము జేయుటకిష్టపడియున్నను గావలసిన యుద్యోగములు దొరకకపోవుటచేత వారికాలమునంతను వ్యర్థపుచ్చవలసియుందురు. వారివలనగూడ నెట్టి ధనాదాయము గలుగజాలదు. ప్రస్తుతకాలమం దాంగ్లేయవిద్య నభ్యసించిన వారిలోగూడ నుద్యోగములేకయుండు వా రెందఱినో మనము చూచుచున్నాము. ఇదిగాక దేశములోని ప్రజలస్థితిగతులును, వారి వాంఛలును మారుచుండుటవలన నొకప్పు డాదాయము బొందుచున్నవారు సహితము మఱియొకప్పుడు చేయుటకెట్టి పనులును లేక వారికాలమునంతను వ్యర్థముగ గడపుచుందురు. దీనికి వారి దురదృష్టమే కారణము. మనదేశమందలి సాలెవాండ్రలో ననేకు లిప్పుడిట్టి స్థితియందున్నారు. కాలాంతరములచే విదేశములనుండి వచ్చువస్త్రముల మనముకొనుటవలన, సాలెవాండ్రలో ననేకులు వారికులవృత్తులమానవలసివచ్చినది. మఱియొకవృత్తినవలంబించి జీవనము జేయుటకు

దగిన యవకాశ మట్టి వారందరకు నింకను గలుగలేదు. అట్టి
ది కలుగువఱకును వారిబుద్ధిబలమును దేహబలమును నిరుప
యోగములైయుండును. వ్యవసాయము దీసికొనినను నీవిష
యము స్పష్టము కాకతప్పదు. సాధారణముగ మన దేశములో
ననేక ప్రదేశములందు వ్యవసాయము వర్షముపై నాధారపడి
యున్నది. వర్షములు కురిసినగాని రైతులు సేద్యమునకు ప్రా
రంభింపరు. ప్రారంభించినదిమొద లయిదాఱునెలలలోగా వ్య
వసాయమంతయు బూర్తియైపంటలు పండును. కొన్నిభూము
లందు రెండుమూడుపంటలుపండునుగాని యిది సర్వసాధారణ
ముకాదు. కుప్పలనూర్చిధాన్యము నింటజేర్చినతర్వాత తిరిగి
వర్షములు కురియువఱకును రైతులకు విస్తారముపనియుండదు.
కొందఱు వారిభూమిని బాగుచేసికొనుటయందు గాలము గడ
పెదరు; కాని మొత్తముమీద నాయాఱునెలలందును గర్షకు
లు నిరుద్యోగులైయుందురు. ఏదియో యొకపనిని గల్పించు
కొని సంవత్సరమంతయు వ్యవసాయమున శ్రమపడుట సాధ్య
ముకాదు. కావున గ్రామములోని ప్రజలశక్తిసామర్థ్యము
లైదాఱు నెలలవఱకు నిరర్థకములగుచున్నవి. నేతయందు బని
చేయుటయనిన నిట్టిదికాదు. వర్షముకురిసినను లేక పోయినను
సంవత్సరములోని మూడువందలయఱువదియైదురోజులలోగూ
డ బనిచేయుటకవకాశమున్నది. కావున, దేశములోని జనసం
ఖ్యవలననుత్పత్తిజేయబడుధనమును నిర్ణయించుటకు బూర్వము
వారిలో నందఱు పనిజేయుచున్నారా, కొందఱు మాత్ర
మట్లు చేయుచున్నారా? యను విషయము మనముగమనింప
వలెను. మన దేశములోని వ్యవసాయదార్లు బీదలుగనుండుటకు

వారు సుమారైదాఱు నెలలు వ్యర్థముగనుండుటయొక్క కారణ
ముగ ననేకులు చెప్పుచున్నారు.

దేశములోనిమఱికొందఱు, చేయుటకుబనిపాటులుండి
నను వానినిజేయుటకిష్టపడక యుందురు. వీరువీరికాలమునంత
ను సోమరులైగడపుచుందురు. సాధారణముగ ధనికులలోననే
కులిట్టివారుందురు. ఎవడుగడించినధనమును యావజ్జీవమువాడ
నుభవించుటయేగాక వానియనంతరము వానికుమారులకిచ్చివే
యుహక్కు ప్రతిమనుష్యునికినున్నది. తండ్రితాతలుసంపాదిం
చిన యాస్తినిస్వాధీనముజేసికొని దానినిష్టానుసారముగ నుప
యోగించుటకుగూడనందఱకుహక్కున్నది. ఇట్టిసందర్భమున
విస్తారమగు నాస్తికివారసగు వాడు స్వయముగ గష్టపడకయే
సోమరిగనుండికూడ సుఖజీవనము జేయగలిగియున్నాడు. అట్టి
వారు దేశమందెంత యధికముగనుందురో యంతయధికముగ
దేశమునకు నష్టముకలుగును. స్వయముగ ధనోత్పత్తికరమగు
పనుల నెద్దానినికాని చేయకపోయినను నిట్టివారు సుఖముగజీవ
యాత్ర జేయుటకు గారణమితరులుగడించినదానిననుభవించుట
యేగదా? వీరుకూడగష్టపడియేదియో యొకవృత్తిలో బ్రవే
శించినయెడల దేశములోనుత్పత్తియగు ధనసముదాయమధిక
మగును. ఇట్టిసోమరులెంతధనికులైనను, వారుమృతిజెందుట
చేత దేశమునకెట్టినష్టమునుగలుగజాలదు. ఇంతేగాకవారిమర
ణమువలన లాభముగూడజేకూరును. జీవితకాలమందు వారను
భవించుచుండిన పదార్థసముదాయమిప్పుడితరు లనుభవించు
ట కుపయోగించును. ఇట్టిసోమరులుపురుషులైనను స్త్రీలయిన
ను దేశమునకు వారివలనగలుగు నపకారముసమముగనేయుం

డును. ఈలాటి సోమరితనమును బోగొట్టి ప్రతిమనుష్యునివలన దేశమునకేదో యొకయుపకారము కలుగునట్లు చేయుట యావశ్యకము.

చోరులు మోసగాండ్రు మున్నగు వారినిగుఱించి యధికముగఁ జెప్పవలసినది లేదు. వీరుచాల జాగరూకతతో బనిచేయుచు, నితరులు శ్రమపడి యార్జించిన ధనమున ననుభవింపబ్రయత్నించుచుందురు. వీరిచర్యలవలన ధనోత్పత్తివిషయమున ననేక విధములగు నష్టములు కలుగుచున్నవి. కష్టపడి ధనార్జనజేయు వారు సహజమిట్టివారి యుపద్రవమునుండి తప్పించుకొనుటకు గడుజాగ్రత్తగలవారై క్రొత్తగ ధనముత్పత్తిఁ జేయుటకు బదులుగా నదివఱకు తాముత్పత్తిగావించిన దానిని రక్షించుటకు పాటుపడవలసి యున్నారు. అనగా సన్మార్గులు వారిసామర్థ్యముల జాలవఱకు నధికధనాదాయమును సంపాదించుటలో వినియోగము జేయలేక పోవుచున్నారు; అందువలన దేశమందుత్పత్తి కావలసినంత ధనముత్పత్తియగుట కవకాశములేకయున్నది. ఇంతేగాక, యిట్టివారి బాధయెక్కువగనుండు దేశములలో బ్రజలు కష్టపడి పనిజేయుటకుగూడ నుత్సహింపజాలరు. తాముశ్రమపడి యుత్పత్తి జేసినదాని నొరులు దీసికొని పోవుచుండు నెడల తగినంత యుత్సాహము వారియందెట్లుండును? ఇట్టివారివలన గలుగుబాధలనుండి ప్రజలదప్పించుటకు దేశమునందలి ప్రభుత్వమువార నేకుల రక్షకభటులుగను (పోలీసు) న్యాయాధిపతులుగను నెక్కువజీతములిచ్చి నియమింపవలసియున్నారు. ఈబాధలులేని యెడల నీయుద్యోగస్థులు ధనార్జనోపయోగములగు వ్యవసాయాదుల చే

నీ దేశములోని ధనసముదాయము నధికము జేయగలిగి యుందురుకదా?

పై యంశములబట్టి దేశములోనుండు ప్రజలలో ననేకుల బుద్ధిసామర్థ్యము నేర్పు మొదలగుగుణములు వ్యర్థములై పోవుచున్నవనియు దుర్వినియోగములగుచున్నవనియు స్పష్టమగుచున్నది. చోరులు మోసగాండ్రు మొదలగువారి సంఖ్యను ప్రభుత్వమువారు తగినయేర్పాటులు గావించి తగ్గింపవచ్చును. సోమరితనము మొదలగువానిని బోగొట్టుటకు మనమతమును నీతియు జీవసహితములై యిప్పటికంటె నెక్కువచైతన్యముతో బని చేయవలసియున్నవి. జనసంఖ్య హెచ్చుగ నున్నమాత్రముచేత ధనాదాయము హెచ్చుకాజాలదు. నిజముగ బనిజేయగలవారి యొక్కయు, బనిజేయనిష్టపడువారి యొక్కయు, సంఖ్యావృద్ధి కావలెను. పనిజేయనిష్టపడుచుండినను బనిదొరకక వ్యర్థముగ గాలయాపనము చేయుచుండు వారికి దగిన యుద్యోగములను వృత్తులను గల్పించుటగూడ నావశ్యకమైయున్నది.

జనసంఖ్యకు సంబంధించిన విషయములలో మఱియొక దానినిగుఱించిమాత్రమిచ్చట జెప్పవలసియున్నది. సోమరులుగాక, కష్టపడిపనిజేయుటకిష్టపడువారందఱు తామేప్రదేశములందు బనిజేసిన లాభమధికముగనుండునో, వృత్తులలో నెద్దాని నవలంబించినయెడల జీవనము సుఖముగ జరుగునో, తెలిసికొని తదనుగుణముగా వారి ప్రవర్తనలందు మార్పుల గావించుకొనవలెను. అప్పుడుగాని దేశములోనియాదాయము తగినంతయధికముగనుండజాలదు. మన దేశమునుగుఱించి యీసందర్భ

మునగొంచెమాలోచించినయెడల నీవిషయముయొక్క ప్రాముఖ్యముస్పష్టపడగలదు. చెన్నరాజధాని, బంగాళారాజధాని, సంయుక్తరాష్ట్రములు మున్నగువానిలో జనసమ్మర్దమత్యధికముగనున్నది. ఈకారణముచేతనీప్రదేశములలోనివారిలోననేకులకువ్యవసాయయోగ్యములగు భూములుదొరకక జీవనము చాలకష్టముగనున్నది; కాని అస్సాం, బర్మా, సింధురాష్ట్రము, మధ్యయిండియా, మధ్యపరగణాలు, మనరాజధానిలోని మన్నెప్రదేశములు లోనగువానిలో జనసంఖ్యచాలస్వల్పముగనున్నది. జనబాహుళ్యముగల ప్రదేశములలోనున్నవారిట్టి ప్రదేశములకు సులభముగ వెళ్లుచుండినయెడల నీప్రదేశములలోని ప్రకృతిసంపద బాగుగ కృషిచేయబడి మనయాదాయము నెంతయోవృద్ధిజేయును. దూరదేశములకు సాహసించి వెళ్లువారెందఱుగలరు? ఇట్లే, నవీనపద్ధతులననుసరించి ప్రత్తి, జనుము మొదలగువానిని జక్కజేసి వస్త్రములనేయుట కనువగు యంత్రశాలలను చెన్నపట్టణము, బొంబాయి, అహమదాబాదు, కాన్పూరు, కలకత్తా మొదలగుపట్టణములలో ధనికులనేకులు స్థాపించియున్నారు. వానిలోబనిచేయుటకు వేలకొలది కూలివాండ్రయత్యావశ్యకము. ఆపట్టణములకుగొంతదూరమందుండు పల్లెలలో ననేకులుకూలిపనిలేకయున్నారు; అట్టివారుసాహసించి యీపట్టణములకు వెళ్లినయెడల సుఖముగ జీవనముజేయ నవకాశముకలుగును. ఏప్రదేశమునకువెళ్లినయెడల లాభమధికముగదొరకునో యాప్రదేశములకుబోవుటకు ప్రజలుసాహసింపవలెను. సర్వసాధారణముగ దేశమంతట్టివారుండినయెడల నేటియుత్పత్తియగు ధనాదాయమెక్కువగనుండును.

కాని ధనలాభమున్నదని యింతమాత్రమున స్వగ్రామమును వదలి దూరరాష్ట్రములకు వెళ్లనిష్టముగలవారనేకులుండరు. బంధువులను మిత్రులను విడనాడి, భాషావేషములందును, నాచారవ్యవహారములందును భిన్నముగనుండు ప్రదేశములకు వెళ్లుటకు బ్రతిమనుష్యుడును వెనుదీయుచుండును. ఇదిగాక శీఘ్రముగ బ్రయాణముజేయుట కనుకూలించు సాధనములింకను దేశమందంతట వ్యాపింపలేదు. ఇవి పదార్థములిప్పటికంటె నధికముగ దేశమందు వ్యాప్తమైనయెడల నవసరమున్నప్పుడు స్వగ్రామమునకు సులభముగా రావచ్చునను ధైర్యముతో ననేకులు దూరప్రదేశములకు వెళ్ళనిశ్చయింపవచ్చును. ఇదిగాక, మనదేశములో నేభాగమునందెట్టి కూలివాండ్రు కావలసియున్నారో, వారికెట్టి వేతనములు లభించునో, తెలియపఱచు సాధనము లేవియులేవు. గ్రామములో స్వతంత్రముగ బనిచేసికొనుచుండువారు గొప్పపట్టణములలోని యంత్రశాలలలో నియమితకాలమునకువచ్చి పదిపండ్రెండుగంటలకాలము విశ్రాంతియనునదిలేక, యంత్రమువలె నేకదీక్షతో బనిచేయుటకు సాధారణముగ నంగీకరించుటలేదు. వర్ణధర్మములుగూడ నిట్టియాటంకముల గొంతవఱకు గలిగించుచున్నవి. పంచములు వివక్షలేక యేప్రదేశమునకనిన నాప్రదేశమునకు వెళ్ళెదరుగాని, యగ్రవర్ణములవారు వారివర్ణాశ్రమధర్మములకు భంగముకలుగునను భయముచేత స్వగ్రామమునుండి చాలదూరమునకువెళ్ళ నిష్టపడుటలేదు. ఈయంశములబట్టి యొకప్రదేశమునుండి దూరములోనున్న మఱియొకప్రదేశమునకు వెళ్ళుపద్ధతి మనవారి

లో లేవని భ్రమపడగూడదు. మన దేశచరిత్రమును జక్కగా బరిశీలించినవారికి నిట్టి భ్రమయుండుటకు గారణము లేదు. ఆర్యులు దేశమందంతట వ్యాపించుట, యాంధ్రులలో ననేకులు ద్రవిడదేశమునకు వెళ్ళి యిప్పటివఱకచ్చటనే స్థిరనివాసము లేర్పఱచుకొని యుండుట, ద్రవిడులలో ననేకులాంధ్రదేశమున గాపురముండుట, యాంధ్రద్రవిడులు వేనవేలుగ బర్మాలో నివసించియుండుట, బంగాళీలు పంజాబుపర్యంతమును పార్సీలు దేశమందంతటను వ్యాపించి యుండుట — మున్నగు దృష్టాంతములవలన మన దేశస్థులు ధైర్యసాహసములందు వక్కినవారికి దీసిపోవువారుకారని స్పష్టమగుచున్నది. ప్రదేశాంతరములకు వెళ్ళవలసిన యగత్యమును, నెట్టి ప్రదేశములకు వెళ్ళినయెడల ప్రస్తుత సందర్భములబట్టి లాభకరముగనుండునో, యందుకు దగినయేర్పాటుల నెట్టివానిని జేయవలెనో, లోనగువిషయముల గుఱించి విపులమగు పరిశోధన జేయవలసియున్నది.

ఈవిధముగనే లాభనష్టములను గుర్తెఱిగి యాయావృత్తులందుదగురీతిని దేశములోని ప్రజలు సర్దుకొనుచుండవలెను. ఒకప్పుడొక వృత్తిలాభకరముగనుండవచ్చును; కొంతకాలము గడచినతర్వాత దానిలోగలుగులాభములు తగ్గవచ్చును. అప్పుడందులో జేరినవారును జేరదలచినవారును మఱియొక వృత్తి నవలంబింప సిద్ధపడవలెను. ఈకాలమున నింగ్లీషువిద్యనభ్యసించిన వారిలో ననేకులు సర్కారునౌకరియందును న్యాయవాది వృత్తియందును బ్రవేశించుచున్నారు. మొత్తముమీఁద వీనివలన విస్తారలాభము కలుగుట లేదని యందఱికి నిశ్చ

యమైయున్నది. ఇట్టి సందర్భమున నిట్టియుద్యోగముల జేయ నెంచి యింగ్లీషువిద్యను నధిక ధనవ్యయముగావించి యెల్లవారును నేర్చుకొనుటకు బ్రయత్నించుట నిరర్థకముగదా? మఱియొక విధమగువిద్యను నేర్చుకొని మఱియొకవృత్తిలో బ్రవేశించుటకై ప్రజలు పాటుబడవలయుంగదా? అన్యవిదేశస్థుల పోటీవలన మన దేశములోని నేత, కంచరపని, గాజుపని, చర్మపుపని, మున్నగునవి పూర్వమువలె విస్తారలాభకరములు గాక యున్నవి. ఇట్టిస్థితిగతులలో నీపనులజేయుచున్నవారు వీనిని వదలుకొని లాభకరములగు వృత్తుల మఱివేనియందైన బ్రవేశింపవలెను. వంశపారంపర్యముగ నివికులవృత్తులుగ నున్నవనియు నిట్టివానిని మాని కులమర్యాదకు ననుగుణముగాని వృత్తుల నవలంబించుట వర్ణాశ్రమధర్మవిరుద్ధమనియు నెంచినయెడల జీవనధారణము నానాటికి గష్టతరమగును. వర్ణాశ్రమము వలన లాభములెన్నియైన నుండవచ్చును; కాని, యొకవృత్తినుండి మఱియొకవృత్తిలో బ్రవేశించుటయం దాటంకములగలిగించు స్వభావము దానియందుండుటచేత, నీసందర్భమున నవి కొంత నష్టకారకములని యొప్పుకొనక తప్పదు.

—:0:—

౭ ఉపన్యాసము.

ప్రతిసంవత్సరమును దేశమందుత్పత్తియగు నాదాయము దేశములోని ప్రజలయొక్క సంఖ్యనుబట్టియే గాక వారికి సంబంధించిన మఱికొన్ని విషయములబట్టి గూడ నిర్ణీతమగుచున్నది. ఈవిషయములలో (1) ప్రజల దేహబలమును వారి బుద్ధిబలమును (2) వారినీతి ప్రవర్తనయు (3) సంఘముగ జేరి పనిచేయుటకై వారికిగల యవకాశములును (4) వారివ్యవహారముల పరిమాణమును (5) వారిరాజకీయ సాంఘికస్వాతంత్ర్యములును ప్రధానములై యున్నవి. వీనియొక్క స్వభావమును, ధనోత్పత్తిలో వీనివలనగలుగు లాభములను వీనికాధారములగు హేతువులను మనమిప్పుడు విమర్శింప వలసియున్నది. పురుషకారమువలన దేశమందుత్పన్నమగు ధనసముదాయ మీయంశముల ననుసరించియుండును.

దున్నుట, వరిగోయుట, బట్టలనేయుట, కుట్టుట, ఇండ్లనుగట్టుట, బరువులమోయుట లోనగుపనులలో దేనినిగుఱించి యాలోచించినను నధికమగు శరీరబలమును గలవాడు బలహీనునికంటె నెక్కువగ వీనినిజేయగలిగి యుండునని స్పష్టపడకమానదు. బలవంతుడగువాడలసిపోక దినములో నెక్కువ గంటలకాల మెక్కువ యోపికతో బనిచేసి యధికఫలితము నొందుచుండును. ఈవిషయమున మనకును పాశ్చాత్యులలో గొందఱికిని మాత్రమేగాక మనలో నొక వర్ణమువారికిని మఱియొక వర్ణమువారికిని నొకప్రదేశమందునివసించువారికిని మఱియొకప్రదేశమందుండు వారికినిగూడ విస్తారభేదమున్నది. ఇంగ్లీషు కూలివాడొకడు మనకూలివానికంటె మూడునాలుగు రెట్లధికమగు పనిని జేయగలడనియు, మనదేశములోని పంజాబీలు మహారాష్ట్రులు కాపులు రెడ్లులోనగు వారుబంగాళీలు బ్రాహ్మణులు వైశ్యులకంటె నధికబలము గలిగియుండువారనియు సర్వజనాభిప్రాయమై యున్నది. ఇట్టిభేదములుండుటకనేక కారణములుకలవు. చలిదేశములందుండువారుష్ణదేశములలోని వారికంటె నెక్కువశరీరదార్ఢ్యము గలవారై యుందురు. కొందఱిబలాధిక్యమునకు వారిజాతియే కారణమై యుండును. వంశపారంపర్యముగ గొన్నిజాతులవారు దృఢగాత్రులుగనుండుట సంభవించుచున్నది. ఈసందర్భమున మనము భుజించునాహార స్వభావమును దాని పరిమాణమును గూడ ముఖ్యములగు నంశములు. మాంసము గోధుమలు జొన్నలు రాగులు మున్నగు వానిని దినువారు కాయగూరలు బియ్యములోనగు వాని నుపయోగించువారికంటె నధికబలముగలిగి యుందురు. కొందఱికి కడుపునిండ నాహారము దొరకుచుండును; మఱికొందఱికి నొకటిరెండుపూటలకు వలయునాహారము మాత్రము లభించుచుండును. మనదేశములో సంపూర్ణమగు నాహారములేక కృశించియుండు వారిసంఖ్య యత్యధికము. ఇట్టివారనేకులుండుటబట్టియే మనదేశమందుత్పత్తియగు ధనసముదాయము స్వల్పముగనున్నది. వీరికి గడుపునిండ నాహారము లభించుచున్నయెడల నిప్పటికంటె నెక్కువగ వారు పనిజేసి హెచ్చగు ఫలమును బొందగలవారగుదురు. సమృద్ధిగ నన్నములేక కృశించుచుండు వారిసంఖ్య పాశ్చాత్యదేశములందత్యల్పముగనున్నది. ఇట్లైశీతోష్ణబాధలనుండి మనశరీ

రమును రక్షించునట్టి బట్టలు ఇండ్లులోనగునవికూడ మనబలమును ఆరోగ్యమును నిర్ణయించుచుండును. ఇవిపూర్ణముగ లేకపోవుటవలన మనదేశములో ననేకులు కృశాంగులుగను రోగబాధితులుగ నున్నారు. ఆవశ్యకపదార్థవర్గములో జేరినయాహారము వస్త్రములు గృహములు మున్నగునవి వలసినంత యధికముగ లభింపనందున క్షామము జ్వరము అంటువ్యాధులు మొదలగువాని మూలమున మృతిజెందువారి సంఖ్య మనదేశమందపరిమితముగనున్నది. పుష్టికరమగు నాహారము సమృద్ధిగ దొరకినగాని మనబలహీనత తగ్గజాలదు. ఈవిధముగనే మనమవలంబించు వృత్తులుకూడ మనయారోగ్యమునకు హేతుభూతములయియున్నవి. వ్యవసాయమే ప్రధానవృత్తిగాగలిగి, విశాలమగు బయలుప్రదేశములలో బనిజేయుచు, శుభ్రమగుగాలిని బీల్చుచునుండు వారు గనులలోను జనసమ్మర్దముగల కర్మాగారములలోను బనిచేయుచుండు వారికంటె బలారోగ్యములం దధికులై యుందురు. ఇట్లే దుర్గంధభూయిష్ఠములును, స్వేచ్ఛగతిరుగుటకవకాశమియ్యనట్టివియు, జనబాహుళ్యముగలిగినట్టివియునగు పట్టణములలో నివసించువారికంటె నిట్టిబాధలులేని గ్రామములలోనుండు వారారోగ్యవంతులయి యుందురు. ఇటువంటి హేతువిశేషములవలన గొందఱు బలవంతులుగను దక్కినవారు బలహీనులుగనుండుట తటస్థించుచున్నది. ఈబలాబలములపయి మనముత్పత్తిజేయు పదార్థసముదాయము నాధారపడియున్నది.

ఈసంబంధమున మనుష్యునిశరీరబలము ముఖ్యమైనను వానిబుద్ధిబలము ముఖ్యతరమైనదని చెప్పదగియున్నది. నానాటికిని వృద్ధిపొందుచుండు ధనసముదాయము నుత్పత్తిజేయుటకు మనుష్యునిబుద్ధిబలమే మూలకారణము. దీనిచేతనే మనుష్యుడు భూసారమును వృద్ధిపఱచి, జంతువులను మచ్చికజేసికొని ఋతుధర్మముల గనుగొని, దేశానుగుణమగు పంటల బండించి, నూతనసాధనముల నిర్మించి ప్రకృతిలోని పంచమహాభూతములన్నిటిని వశపఱచుకొని యొకకాలమునకంటె మఱియొకకాలమున నధికమగు నాదాయమును సంపాదింపగలిగియున్నాడు. అల్పమగు కృషివలన నధికమగు ఫలితార్థమును బొందుటయే బుద్ధిబలముయొక్క మహిమ. బుద్ధిబలమున్నదా? లేదా? యనుటకిదియే ప్రధానమగు తార్కాణము. జ్ఞానశూన్యులగు ననాగరకులు చెట్లయాకులను పట్టలను గట్టుకొని మానమునుగాపాడుకొనుచుండిరి. కొంతకాలమునకు దనబుద్ధిబలమువలన రాట్నము మగ్గములోనగు సాధనముల గనిపెట్టి వస్త్రముల నేయుటను మనుష్యుడు దెలిసికొనెను. వీనితో నెంతయో శ్రమపడినగాని తనకుగావలసినంతబట్ట నతడు నేయలేకయుండెను. తర్వాత వారిబుద్ధిబలముచే, పాశ్చాత్యులు కొందఱు వేగముగ బనిచేయుటకు వీలగు రాట్నములను మగ్గములను నిర్మింప దెలిసికొనిరి. మామూలుసాధనములచే నొకదినమంతయు శ్రమపడినయెడల రెండుగజముల వస్త్రము తయారగుచుండెను; ఈనూతనసాధనములవలన నైదారుగజములు తయారగుట కవకాశము కలిగెను. మఱి కొంతకాలమున కావిరియంత్రములను గొందఱుకనిపెట్టిరి. దాని

సహాయముచేత నొక్కొకమనుష్యుడు రోజునకు వందలకొలది గజములబట్టను తయారుచేయగలవాడాయెను. ఇట్లేమరియొక నిదర్శనముదీసికొని యీవిషయమును స్పష్టపఱుపవచ్చును. ఒకప్రదేశమునుండి మఱియొకప్రదేశమునకు బదార్థములదీసికొనిపోవలయుననిన బూర్వకాలమందు మనుష్యునిభుజబలము తప్ప వేరుసాధనము లేకయుండెను. గంటకు మూడునాల్గుమైళ్ళకన్న నెక్కుడుదూరము బరువునుమోయుట దుస్తరము. ఎంతబలవంతుడైనను మితమగుబరువునే మోయగలిగియుండును గాని యెంతబరువన్ననంతబరువును మోయజాలియుండడు. కావున నొకరోజంతయు శ్రమపడినను ముప్పదిమైళ్లకంటె నెక్కువదూరము వెళ్లలేకయుండెను. క్రమక్రమముగా వానిబుద్ధిబలముచే జంతువులనుమచ్చికజేసికొనుటకు నేర్చుకొని వానిసహాయమున నెక్కువదూరమధికమగుభారముతో వెళ్లగలవాడాయెను. పిమ్మట బండ్లనుజేయుటకును రస్తాలువేయుటకును దెలిసికొని మఱింతవేగముగ నెక్కువభారమును మోయసమర్థుడాయెను. ఇటీవలికాలమందు ఆవిరియంత్రసహాయమున నినుపదారులమీద రోజునకు వేయిమైళ్లదూర మెంతబరువునైన దీసికొనిపోవుటకు సామర్థ్యమును సంపాదింపగలిగెను. మనము ధనోత్పత్తికై చేయు వ్యాపార వ్యవహారములలో దేనినిదీసికొనినను, నీవిషయము స్పష్టమగును. ఉపాయము, నేర్పు (చాతుర్యము) అనినవన్నియు బుద్ధిబలముయొక్క రూపాంతరములు. కొంతబంగారము నిద్దరు కంసాలులకిచ్చినయెడల నేర్పుగలవాడు దానిని సుందరమగు భూషణముగమార్చును; నేర్పులేనివానిచే జేయబడిన భూషణమంత సుందరముగనుండదు. నదులలోని జలమంతయు నుపాయరహి-

తులగువారు నివసించుచుండు దేశమున వ్యర్థముగ సముద్రములజేరుచుండును. ఉపాయసహితులుగల దేశమందు నీజలములు వ్యర్థములుగాక, ఆనకట్టలు, కాలువలు, చెరువులు మొదలగువానిమూలమున వ్యవసాయమున కుపయోగించును. గనులను ద్రవ్వుటకు దెలియనంతవఱకు వానిలోనుండు లోహములు మనకు నిరర్థకములైయుండును; ఆజ్ఞానమును సంపాదించిన క్షణమునుండి యవి మనకు సుఖదాయకములగును. మనుష్యునిబుద్ధికంతమనునది లేదు. దానిని వ్యర్థపుచ్చక, తగువిధమున నుపయోగించుచున్నయెడల బ్రకృతిలోనిరహస్యముల నన్నిటిని మనము దెలిసికొని యిప్పటికంటె నెన్నియోరెట్లధికమగు భాగ్యమనుభవింపగలవారమగుదుము. నాగరకత గాంచిన వారికిని స్వల్పనాగరకత గలవారికిని అనేక విషయములందు భేదములుండవచ్చును. కాని వారికిగల తారతమ్యమునకు బుద్ధిబలమే ప్రధానకారణమై యుండును. ఇప్పటికాలమువారు ప్రాచీనులకంటె నాగరికులని చెప్పుటతో బ్రాచీనులకంటె మనమతమును మననీతిప్రవర్తనయు నెక్కువ ప్రశస్తములుగ నున్నవని యభిప్రాయముకాదు. ఆలోచించిచూచినయెడల నీవిషయములలో వారికంటెమనము హీనులముగగూడ నుండవచ్చును. కానిబుద్ధిబలమున నీకాలపువారు వారికంటె నిస్సంశయముగ నధికులైయున్నారు. మహాసముద్రముల దాటుటలో సాధనములగు నావిరియోడలు ఇనుపదారులు తంతిసమాచారము విద్యుద్యంత్రములు ఆకాశయానములు ఆవిరియంత్రములుమున్నగునవి బుద్ధిబలాధిక్యమునుసూచించుసాధనములు. మనకంటె బాశ్చాత్యులెక్కువ నాగరకులై యున్నారని చెప్పునప్పుడు

గూడ మనము గ్రహింపవలసిన ప్రధానవిషయమిదియే.

విద్యవలన స్వభావసిద్ధముగ మనకుండునట్టి బలమును దగువిధమున నుపయోగించుటకును దానిని వృద్ధిపఱచుకొనుటకును మనము నేర్చుకొనుచున్నాము. ఈనేర్చుకొనుటయందు మనకేయేసాధనములు సహాయము జేయుచుండునో యవి యన్నియువిద్యలో జేరునట్టివియే. విద్యయనచదువుట వ్రాయుట గ్రంథములకర్థముజెప్పగలుగుటమాత్రమే కాదు. వీనిని దెలియనివాడు సహితము నిజముగ విద్యావంతుఁడై యుండవచ్చును. చదువువచ్చినవారు గూడ నొకానొకప్పుడు విద్యావిహీనులై యుండవచ్చును. మన దేశమున బ్రస్తుతకాలమందు విద్యావిషయములో భిన్నాభిప్రాయములనేకములున్నవి. విద్యయన నేమియో పరిపూర్ణముగ నాలోచింపక పోవుటయు, జదువుకొనినవాఁడే విద్యావంతుఁడని భ్రమపడుటయు నీభేదాభిప్రాయములకు హేతువులైయున్నవి. దీనినిగుఱించి రెండుమూఁడంశములు మాత్రమిచ్చట జెప్పవలసియున్నది.

కొందఱు విశేషపరిశ్రమయు విద్యయు లేకయే వారిబలమును దగుమార్గముల నుపయోగించి జీవింపగలిగి యున్నారు. వారుచేయుపనుల నేర్చుకొనుటకు విస్తారమగు విద్య యక్కఱలేదు. బరువులు మోయుట మామూలు కూలిపనులు చేయుట దుకాణములలో వస్తువులనందిచ్చుట బండ్లను దోలుట యిండ్లలో నౌకరిజేయుట మొదలగువానిని శ్రమలేకయే నేర్చుకొనవచ్చును. ఇట్టిపనులుచేయుటకు చదువుఅనావశ్యకము. వడ్రంగము కంసాలిపని కుట్టుపని నేత కుమ్మరిపని వ్యవసాయము లోనగువానిని గొంతశ్రమపడికాని నేర్చుకొనుట దుస్తరము.

ప్రతిమనుష్యుఁడును వీనిని జేయగలిగి యుండఁడు. కృషివలన మాత్రమవి సిద్ధించును. కాని వీనిలో సమర్థతను బొందుటకు గూడ జదువువ్రాత మొదలగునవి యావశ్యకములుకావు. చదువుయొక్క సహాయములేకయే మన దేశమందీశిల్పముల నందఱు నేర్చుకొనుచున్నారు. గుమాస్తాలుగను న్యాయవాదులుగను ఉపాధ్యాయులుగను వర్తకులుగను జీవింపనెంచువారికి మాత్రము చదువవసరమైయున్నది. ఈపనులలో బ్రవేశింపనెంచువానికి వ్రాయుట చదువుటలోనగు వానియందు గొంతసామర్థ్యముండవలెను.

విద్యాపద్ధతులగుఱించి ఆలోచించునపుడు ముఖ్యముగ నాలుగయిదు విషయముల మనము విమర్శింపవలయును (1) మనదేశమందు 'కర్మకరులు' వారిశిల్పముల నేర్చుకొనుపద్ధతికిని పాశ్చాత్యదేశములవారిపద్ధతికిని బ్రధానమగుభేదమొక్కటియున్నది. సాధారణముగ మనదేశమందు నొక్కొకవృత్తియు నొక్కొకవర్ణమువారికి సాంప్రదాయముగవచ్చుచుండుధర్మముగనున్నది. కంసాలులుకుమ్మరులు చాకలివాండ్రు సాలెవాండ్రు లోనగువారు వారికులవృత్తులుమాని వృత్త్యంతరముల నవలంబించుటకు సామాన్యముగనిష్టపడుట లేదు. తండ్రితాతలేవృత్తివలన జీవనముచేయుచుండిరో దానివలననేవారివంశస్థులందఱు జీవనముజేయ నుద్దేశించుచుందురు. వర్ణధర్మమన నిదియే. ఇదిగాక, యొకప్రదేశమందుబలువురొక్కటేవృత్తి నవలంబించియున్నను వారందఱు కలసి యొకచోటనుగాని యొకయజమానుని యధీనముగగాని పనిజేయుట లేదు. ప్రతికార్మికుఁడును వానివాని పనినివానివానియింటియందే చేసికొనుచుండును. ఒకగ్రామమున

బదికుటుంబములసాలెవాండ్రుగూడిన యెడల వారందఱు నొక నేత శాలలో నొకయధికారివద్ద నౌకరీజేయువారై యుండరు. ప్రతిగృహమందు నొకటిరెండు మగ్గములుండును; స్వగృహమునుండియే వారు వారి పనుల జేసికొనుచుండుట సాంప్రదాయమై యున్నది. ఇప్పుడిప్పుడు ధనికులు కొందఱు కొన్ని వేలరూపాయిలు ఖర్చుపెట్టి మగ్గములుకొన్నిటినిగొని విశాలమగు నొకగృహమందుంచి చుట్టుప్రక్కలనుండు సాలెవాండ్రకు రోజుకూలి నిచ్చి వారిచేబనిచేయించుపద్ధతి నవలంబించుచున్నారుకాని, యిది సర్వసాధారణముకాలేదు.

ఈ పైయంశములవలన మనవిద్యాపద్ధతులతో నొకగొప్పవిశేషముత్పన్నమగుచున్నది. కార్మికులేదియోయొక పాఠశాలకువెళ్ళి వారికులవృత్తుల నక్కడ నేర్చుకొనవలసిన యావశ్యకత లేదు. ఎవరిగృహమువారికి పాఠశాలగను, నెవరితండ్రులువారికిగురువులుగను నేర్పడుటసంభవించుచున్నది. చిన్నవయస్సునుండి తండ్రిచేయుచుండుపనుల జూచుటమూలమునను నాతనికిసహాయము జేయుచుండుటచేతను, వృత్తిలోని రహస్యముల విశేషశ్రమలేకయే బాలుడు నేర్చుకొనగలిగి యున్నాడు. గ్రంథములమూలమున గొన్నియంశముల నేర్చుకొనుటయు దర్వాత వానినభ్యసించుటయు మొదలగుపద్ధతులు మనయందు లేవు. ప్రారంభమునుండియు నభ్యాసవశముననే మనకర్మకరులువారివిద్యల నేర్చుకొనుచున్నారు. ప్రతిదినమును వారిపెద్దలా పనులు జేయుచుండుటను జూచువారగుటచేత, కులవృత్తికి సంబంధించిన విషయములన్నియు వారికి సులభగ్రాహ్యములుగనుండును. వారివారికళలయందు వారుసులభముగ నుత్తీర్ణ

లగుచున్నారు. ఇట్టివిద్యాపద్ధతివలనశిష్యులకుగలుగులాభమిట్టిదియు. మఱితలిదండ్రులకన్ననో విస్తారవ్యయము లేక వారిపిల్లలుకులవృత్తులందుత్తీర్ణులగుట సంభవించుచున్నది. ఒకొక్కపనివానియొద్ద వానికుమారులును దగ్గఱబంధువుల పిల్లలును దప్పదక్కినవారెవ్వరుండకపోవుటచేత శిష్యులలో బ్రతిశిష్యునియొక్కలోపముల జక్కగ గ్రహించుటకును దత్క్షణమే వానిని దిద్దుటకును నెక్కువ యవకాశమున్నది. ఇట్లుగాక శిష్యులనేకులైనపుడు గురుశిష్యులకిట్టిపరస్పర సంబంధము లేకపోవుటచేత, సంపూర్ణమగువిద్యలభించుట దుస్సాధ్యమైయుండును. కావున మనముముఖ్యముగ గమనింపవలసిన సారాంశ మొక్కటియున్నది. అనేకులు కలిసి, యొకపాఠశాలకువెళ్ళి యక్కడ నేర్చుకొనునట్టిదిమాత్రమే విద్యయనిచెప్పుటకు వీలులేదు. ప్రతిగృహమునునొక్కపాఠశాల. మనచాకలివాండ్రు కుమ్మరులు, వడ్రంగులులోనగువారు వారిపిల్లలకువిద్యనేర్పు గురువర్యులై యున్నారు. దీనిమూలమున మనదేశములోని కళలన్నియునశింపక, ఇంకనుజీవించియున్నవి. వీనిని నేర్చుకొనువారుగూడ విద్యార్థులే. వీరునేర్చుకొనునది సహితము విద్యయే.

(2) కాని, యీపద్ధతిలో నొక గొప్పలోపమున్నది. తండ్రులు వారికుమారులకు నేర్పునది వంశానుగతమగు వారికులవిద్యమాత్రమే. ఆకులవృత్తిలో నితరదేశములందు గలుగుచుండుమార్పులు, దానికి సంబంధించిన క్రొత్తయుపకరణములు, మున్నగునవి వీరికి గోచరములుకావు. అట్టివి సాంప్రదాయ విరుద్ధములగుటచేత వాని నవలంబించుటకు గూడ వారు జంకుచుందురు. ఇదిగాక, యింతవఱకు మనదేశమందు బ్రచా

రములో లేని వృత్తులనేకములు మనవారికాలమున నవలంబింపవలసియున్నది. అవియింకను ప్రాచీనవృత్తుల పద్ధతిని గులవృత్తులగుట లేదు. అట్టివానిని బూర్వపురీతిని దండ్రుల యొద్దనుండి నేర్చుకొనుట దుస్సాధ్యము. కావున బ్రాచీన వృత్తులకు సంబంధించిన నవీనపద్ధతులను, నవీనవృత్తుల గొన్నింటిని నేర్చుకొనుటకు బ్రాచీనవిద్యా పద్ధతి సరిపడుట లేదు. వీనిని బోధించుటకొఱకై పాఠశాల లవసరములైయున్నవి. వీనిని నేర్చుకొనినగాని మనకర్మకరు లితర దేశములలోనికర్మకరులవలె ముందుకువచ్చి యధికలాభమును బొందగలవారు కాజాలరు. మనవ్యవసాయము, నేత, లోనగువృత్తులు వెనుకబడి యుండుటకు, వీనిలో నీకాలమునగలిగినమార్పులబోధించుట కనుగుణమగు పాఠశాలలు దేశమందు లేకపోవుటయే కారణము. ప్రాచీనమార్గము విచ్ఛిన్నము గాక యుండుటకు వర్ణధర్మములవసరములైనను, నవీనమార్గముల నేర్చుకొనుటకు పాఠశాలలత్యంతావశ్యకములైయున్నవి. ఇట్టివి దేశమందు లేనియెడల శిల్పములకు సంబంధించినవిద్య దేశమందు వ్యాపించుటకు గాని తన్మూలమున మన యాదాయ మభివృద్ధి నొందుటకు గాని యవకాశముండదు. అట్టిపాఠశాలలీ దేశమునందు నెలకొల్ప బ్రయత్నములఁ జేయవలెను.

(౩) ఆంగ్లేయప్రభుత్వము మనదేశమందు వ్యాపించిన తర్వాత వారిచే నెలకొల్పబడిన యాంగ్లేయ పాఠశాలలలోని ప్రధానమగులోపము పైయంశములకు సంబంధించి యున్నది. ఈపాఠశాలలో జదువువారికి భాషాజ్ఞానము తప్ప మరియొకటి యలవడుట లేదు. అందువలన వానియందుత్తీర్ణులై విశ్వ

విద్యాలయ పట్టములబొందినవారు గుమాస్తాలుగను ఉద్యోగస్థులగను న్యాయవాదులుగను నుండుటకుమాత్రము సమర్థులైయున్నారుగాని వ్యవసాయాది వృత్తుల నవీనపద్ధతుల ననుసరించి యభివృద్ధిజేసి యెక్కువ ధనము సంపాదింప శక్తిలేకయున్నారు. ఈకారణముచేతనే కర్షకులు కూలివాండ్రు కర్మకరులులోనగువారు వారిపిల్లలను విస్తారముగ నీపాఠశాలలకంపుట లేదు. వీనియందు జదివినవారు కృషి, వర్తకము మొదలగు కులవృత్తులయెడ నిరసనభావము కలవారై వానిని వృద్ధిపఱచుటకు స్వయముగ నిష్టములేక యుద్యోగములవలననే జీవనముజేయుట కుద్దేశించుచుందురు కావున జనసామాన్య మీవిద్యను వారిపిల్లలకు జెప్పింప నిష్టపడుట లేదు. ఇట్లుగాక, యీపాఠశాలలందు వృత్తులనుగుఱించియు శిల్పములగుఱించియు గూడ గొంతశిక్షను విద్యార్థులకు నేర్పినయెడల కర్మకరులు సహితము వారిబాలురనీ పాఠశాలలకంపుటకు బ్రయత్నింతురు. అప్పుడు దేశమందంతట నిప్పటికంటె నధికముగ విద్యవ్యాపింపగలిగియుండును. పదిపండ్రెండు సంవత్సరములు కష్టపడి నేర్చుకొనిన విద్యవలన దుదకు దగువిధమున జీవనము జేయ నవకాశము లేనియెడల నట్టివిద్య నిరర్థకమైనదనియే చెప్పదగియున్నది. పైనుదాహరించిన కారణములవలన నిప్పుడింగ్లీషుపాఠశాలలలో జెప్పువిద్య కొంతవఱకిట్టిదియనియే పండితులయభిప్రాయమైయున్నది.

(4) భాషాజ్ఞానము మామూలు కర్మకరులకంత యావశ్యకముకాదని పైన చెప్పియుంటిని; అట్టిజ్ఞానమును సంపాదించుటవలన వారికిలాభముకలుగజాలదనిగాని, కర్మకరుల కీకాల

మున నట్టివిద్య యక్కఱలేదనిగాని మనమనుకొనగూడదు. పూర్వకాలపుపద్ధతిని గులవృత్తులను శిల్పములను నేర్చుకొనగోరువారు చదువు రాకపోయినను వారివృత్తులం దుత్తీర్ణులు కాగలిగియున్నారనియే నాయభిప్రాయము. నిజముగ నాలోచించినయెడల నీకాలమందు కర్మవిద్యల నభ్యసించువారికి గొంతభాషాజ్ఞానమును శాస్త్రజ్ఞానమును లభించుట మిక్కిలి లాభకరముగనుండును; అట్టి జ్ఞానము లేనియెడల వారివిద్యలు పరిపూర్ణత నొందజాలవు. కర్మలసంబంధించిన పద్ధతులన్నియు దినదినము మార్పుల బొందుచున్నవి. ఈమార్పులు వలన బూర్వముకంటె నధికమగు నాదాయము సంపాదించుట కవకాశము కలుగుచున్నది. నూతనములగు పరికరముల నేకముల శాస్త్రపరిశోధకులు కనుగొనుచున్నారు. అట్టివి యున్నవనియు, వానినీవిధముగ నుపయోగింపవలయుననియు, మనకర్మకరులు తెలిసికొనవలసియున్నది. దీనికంతకు భాషాజ్ఞానమే మూలము. నవీనముగ దేనినైన నొకరు కనుగొనినయెడల దానినిగురించి పత్రికలయందును గ్రంథములయందును బ్రచురించుట యీకాలము నమామూలుగనున్నది. గ్రంథముల జదివి యర్థము జేసికొనగలవారుతప్ప దక్కినవారు వీనివలన శీఘ్రకాలమున నుపకారమును బొందజాలరు. క్రొత్తయెరువులు, నాగళ్లు, నూతులనుండి నీళ్లనుదోడుయంత్రములు, మగ్గములు లోనగునవి దేశమందు వ్యాపించుటకు బూర్వము వానినుపయోగించు పద్ధతుల దెలుపు పత్రికలను జదువుసామర్థ్యము ప్రజలయందుండవలెను. మన దేశమందిటీవల దొరతనపువారి వ్యవసాయపరిశోధనశాలలో వ్యవసాయమునకు సంబంధించిన నూతనవిష

యములనెన్నిటినో శాస్త్రజ్ఞులు కనుగొని పత్రికలలో బ్రచురించియున్నారు. చదువుగలవారిసంఖ్య చాలతక్కువగ నుండుటచేతను, జదువువచ్చి యీపత్రముల నర్థము జేసికొనగలవారు కర్షకులు కాకపోవుటచేతను, కర్షకవృత్తి నవలంబించినవారికి వీనిని జదువసమర్థత లేకపోవుటచేతను, నూతన పరిశోధనముల వలన మనవారింకను విశేషముగ నుపయోగమును బొందలేదు. భాషాజ్ఞానముగల కర్మకరునికి వానికర్మకు సంబంధించి, ప్రపంచములోని దేశములలో నెద్దానియందుగని పెట్టబడిన నవీనపద్ధతులన్నియు వశమగుచుండును. కావున శిల్పములభివృద్ధియగుటకు శిల్పులకు భాషాజ్ఞానముండుట యావశ్యకము.

ఇదిగాక, వృత్తులలో దేనినవలంబించినను, ప్రతిమనుష్యునికిని దేశచరిత్ర, భూగోళము, గణితము, ప్రకృతిశాస్త్రము మున్నగువానికి సంబంధించిన సామాన్యజ్ఞానముండుట మిక్కిలి శ్రేయస్కరము. బుద్ధిబలమువలన మనము ప్రకృతిని వశపఱచుకొని దినదినాభివృద్ధి గాంచగలిగి యున్నామని యిదివఱకే చెప్పియుంటిని. బుద్ధిబలము నధికముజేసి బుద్ధికి వికాసమును పటుత్వమును గలిగించుటలో బైవిషయములకు సంబంధించిన జ్ఞానమతిలాభకారిగనుండును. తనవృత్తికి సంబంధించని విషయాంతరములగురించిన జ్ఞానమును సంపాదించినవాడు తెలివితేటలతో దనపనుల జేయగలుగువాడగుటచేత నెక్కువయాదాయమును బొందగలిగియుండును. వ్యవసాయమువలన జీవించువానికి భూసారము, పంటలస్వభావము, ఎరువులు, విత్తనములు, జలాధారములు, ఋతువులు మొదలగు వానిని

గుఱించి తప్పక దెలిసియుండవలెను. కాని వీనితోఁ దృప్తి బొందక సామాన్యమగు ప్రాపంచికజ్ఞానమునుగూడ నితఁడు సంపాదించినయెడల బుద్ధిమాంద్యమును బోగొట్టుకొని, సూక్ష్మబుద్ధితో వ్యవసాయము జేయగలవాఁడగును. అట్టివారే వారివృత్తులలో క్రొత్తక్రొత్త పద్ధతులగనుగొనఁ గలిగియుందురు.

(౫) జ్ఞానాభివృద్ధిని గాంచుటలో బ్రాచీన పద్ధతులకును నవీనపద్ధతులకును విశేషభేదమున్నది. క్రొత్త విషయములను, గ్రొత్తరహస్యములను, గ్రొత్తయుపకరణములను గనిపెట్టు నుద్దేశముతోఁ దీక్షవహించి పనిచేయువారు పూర్వకాలమందనేకులుండినదిలేదు. సామాన్యమగుపనులజేయుచుండునప్పు డదృష్టవశమున నేదియైననొక యుపాయము మనస్సునకు దట్టినయెడల నట్టివానిమూలమున మనజ్ఞాన మభివృద్ధి యగుచుండును. పరిశోధనకొఱకు బ్రత్యేకముగ జీవితమంతను గడపి ప్రకృతిలోని విశేషముల దెలిసికొనినవారి సంఖ్య బహుస్వల్పముగ నుండెను. ఇప్పుడన్ననో ముఖ్యముగ బాశ్చాత్యదేశములందు శాస్త్రపరిశోధన జేయుటకై కాలమునంతగడపువారిసంఖ్య యత్యధికముగనున్నది. శాస్త్రజ్ఞులు కావించిన పరిశోధనల నాచరణమునందుంచి, వానివలన ధనాదాయము నధికముజేయువారి సంఖ్యగూడ హెచ్చుగనున్నది. జనసంఖ్య హెచ్చగుటచేత నింగ్లండులో నొకప్పుడు ప్రజలకు గావలసినంతమాంసాహారము దొరకదయ్యెను. అట్టిసమయమున బశువులు తినునాహారములో నట్టిమార్పులగావించినయెడల నవి బలిసియధికమాంసమును గలవియగునని పరిశోధనగావించి, వానికి బెట్టునట్టి యాహారములలో దగినమార్పులజేసికొనిరి. దేశములోనిగొఱ్ఱెలవలన మాంసమును,

'ఉన్ని' దొరకుచుండెను కాని 'ఉన్నిబట్ట' లధికముగ గావలసియుండుటచేత నెట్టిపదార్థములను గొఱ్ఱెలకాహారముగ బెట్టినయెడల వానిశరీరములపై నధికమగు 'ఉన్ని' యుత్పత్తియగును? అని శాస్త్రజ్ఞులుపరిశోధించి, కావలసినఫలమును బొందగలిగిరి. వరిపండుటవలన గడ్డియు ధాన్యమునుగూడ మనకు లభించుచున్నవి. గడ్డికంటె ధాన్యమెక్కువ పండింపవలయుననిన భూమిలో నెట్టియెరువుల వేయవలసినదియు, ధాన్యముకంటె గడ్డియే యధికముగ గావలసినపు డెరువులలో నెట్టిమార్పుల జేయవలసినదియు, శాస్త్రజ్ఞులుపరిశోధించి కనుగొనగలిగిరి. నీలిపైరును వ్యవసాయముజేసి నీలిమందునుత్పత్తిజేయుటకంటె సులభతరముగను చౌకగను నీలిమందును జేయునుద్దేశము గలవారై రసాయనశాస్త్రజ్ఞులు వ్యవసాయ సహాయ మక్కఱలేకయే నీలిమందు నిప్పు డుత్పత్తిజేయగలిగియున్నారు. ఇట్టినిదర్శనము లెన్నియోయున్నవి. ఈకాలమందు మనముద్దేశపూర్వముగ బ్రయోగములజేసి, వానిమూలమున నూతనపద్ధతుల గనుగొనుటకు బ్రయత్నించుచున్నాము. ఇట్టిప్రయత్నములవలన నప్పటికప్పుడే ఫలములు లభింపకపోవచ్చును; కాని, శాస్త్రజ్ఞులనేకులుతగిన పరికరములతోడను దదేకదీక్షతోడను వారివారి శాస్త్రములందు బరిశోధన జేయదొడగినయెడల మనజ్ఞానమభివృద్ధియై ధనోత్పత్తియందు మనకెంతయో తోడ్పడగలదు. గొప్పవిశ్వవిద్యాలయములలోనిపండితులు చేయు పరిశోధనలవలన లాభమున్నదని సామాన్యజనము గ్రహించుటలేదు. కాని, జర్మని, అమెరికాయున్నగుదేశముల యైశ్వర్యమునకంతకు బరిశోధనలే మూలాధారములు. అట్టి శాస్త్రజ్ఞులును, శాస్త్రపరిశోధకులును,

పరిశోధకాలయములును మనదేశమందువృద్ధిగాంచవలయును.
వీనికై ప్రప్రథమమున నెంతయోద్రవ్యము ఖర్చుపెట్టవలెను.
ఖర్చుపెట్టిననేమి? మూలధనమగునిదియంతయు గొంతకాలము
నకు వేయిరెట్లలాభమును దేశమునకుగలిగించును.

జంతువులకును మనుష్యునికినిబుద్ధియందే భేదమున్నది
ఇట్టిబుద్ధిని వికసింపజేసి దానివలన నత్యధికమగు ఫలితమును
బొందుటకు మనుష్యుడు ప్రయత్నింపవలెను. బుద్ధివికాసముచే
తనే మనుష్యుడిప్పటికి నాగరకుడాయెను. బుద్ధిని జక్కగ నుప
యోగించిచేసినపనివ్యర్థముకాజాలదు. కాలముమారినపుడును,
మామూలు పద్ధతులు తగినంతలాభ మియ్యనపుడును, సంద
ర్భానుసారముగ మనవృత్తులలో మార్పుల జేసికొనవలసిన
యవసరముకలుగును. దేశములోని ప్రజలు బుద్ధిమంతులై శా
స్త్రపరిశోధనమందుత్సాహముగలవారై యుండిన యెడల నిట్టి
మార్పులగష్టములేక చేసికొనగలిగి యుందురు. లేనియెడల ని
ర్బంధములబడవలసిన వారగుదురు. ప్రాచీనకాలమందుండి సాం
ప్రదాయసిద్ధముగవచ్చుచుండుజ్ఞానమును నశింపనీయక క్రొ
త్తజ్ఞానమును సంపాదించుటలో బ్రజలకుదోడ్పడు సాధనము
విద్య. దానినెల్లరకుగలిపి యందఱునుదానివలనలాభము బొం
దువారుగజేయుట మనకువిధియై యున్నది. అట్టికార్యమునకు
గడగుటకంటె నావశ్యకమగుపని యెన్నటికినినుండజాలదు.

దేశములోని మనుష్యుల నీతిప్రవర్తనవలన గూడదేశ
మందుత్పత్తియగు ధనసముదాయము నిర్ణీతమగుచుండునని చె
ప్పియుంటిని. నీతికినిధనోత్పత్తికిని సంబంధమున్నట్లు సాధారణ
ముగ మనకుగనుపించుటలేదు. సారవంతమగుభూమిని సత్యము

లాడువాడు వ్యవసాయముజేసినపుడుఫలించుపంట యబద్ధము
లబలుకువాడు వ్యవసాయముజేసినపుడు ఫలించుదానికంటె న
ధికముగనుండుటలేదు. కొందఱుమోసముజేసియు చౌర్యము
గావించియు సన్మార్గప్రవర్తకు లార్జించు ధనముకంటె నధిక
ముగ నార్జింపగలిగియున్నారు. ఇట్టిసందర్భముల బట్టిచూడ
నీతిప్రవర్తనకును మనమార్జించుధనమునకు సంబంధము లేన
ట్లుండునుగాని మనముముఖ్యముగ గమనింప వలసిన విషయ
మేమియన మనుష్యుడొంటరిగ నేప్రదేశమందును నుండుటలే
దు. ఎక్కడజూచిన నొకమనుష్యుడు మఱికొందఱితో గలిసిసం
ఘములుగను జాతులుగను నేర్పడియున్నాడు. ఇతరులతో గ
లిసియే మనమనేకకార్యముల జేయుచున్నాము. మనుష్యులకి
ట్టిపరస్పర సంబంధ ముండుటచేత నీతి మిక్కిలి ప్రధానమగు
నంశమైయున్నది. ప్రతిమనుష్యుడును దానుత్పత్తిజేయు పదా
ర్థములలో గొంతభాగమునైన నితరులకమ్మి తనకు వలయువా
నిని మఱికొందఱి దగ్గరనుండి కొనుచున్నాడు. ఇట్టివ్యాపార
మునకంతటికి సత్యము మూలాధారమైయున్నది. ధాన్యమం
దుపొట్టునుమన్నునుగలిపియు పంచదారలో బియ్యపు పిండిని
గలిపియు బట్టలుదళసరిగ నుండునట్లగపడుటకై గంజిబెట్టియు
నేతిలోనరటిపండ్లను క్రొవ్వునుగలపియు అమ్మువారు కొనువా
రిని మోసపెట్టుచుందురు. ప్రతిమనుష్యుడిట్టి మోసమునకు
బూనినయెడల వ్యాపారము తగ్గిపోయి దానివలన దేశమున
కు వచ్చునాదాయము క్షీణించును. అనేకవిదేశములతో మన
ము వ్యాపారము చేయుచున్నాము. వేరుసెనగ గోధుమ ప్రత్తి
నువ్వులు మొదలగువానిని మనవద్దనుండి విదేశములవారువిశే

షముగగొనుచున్నారు. కాని మనవారిలో గొందఱు వీనితో మన్ను మొదలగు వానిని మిళితముచేసి విదేశముల కప్పుడప్పు డంపుచుండుట వలన వారికి మనయందలి నమ్మకము తగ్గి మనము పంపు సరుకులకు వారు తక్కువ ధరల నియ్య బూనుకొనియున్నారు. ఇందువలన మన దేశమున కెంతయో నష్టముకలుగుచున్నది. ఇట్లే, ప్రస్తుతకాలమందు మన దేశమున నెక్కడ జూచినను జపాన్ వస్తువులే గనబడుచున్నవి. జపాన్ అగ్గిపెట్టెలు, జపాన్ చిమ్నీలు, జపాన్ బొమ్మలు, జపాన్ మల్లుతానులు. సమస్తము జపానునుండియే వచ్చుచున్నవి. కాని వీనినుపయోగించువారి కందఱికిని నివియెంత మోసపు బదార్థములో తెలియకమానదు. ఇట్టివస్తువుల మన దేశములకంపి కొంత కాలము మనల మోసపెట్టగలరు కాని, ఎల్లప్పుడును వారు మనల మోసముచేయగలరా? దీనివలన జపాన్ వారు మన దేశముతో జేయుచుండు వ్యాపారము తుదకు క్షీణించునుగదా? ఇట్లే ప్రతి దేశమందు ననేకులితరులవద్ద జీతములబుచ్చుకొని నౌకరి జేయుచుందురు. నౌకరీజేయువారు వారిపనుల నమ్మకముతో జేయకపోయిన యెడల వారియజమానులకు బ్రారంభమున నష్టము కలిగినను తుదకు వారికి నౌకరి దొరకకపోవుటచేతను వారి వేతనములు తగ్గిపోవుటచేతను వారికిగూడ నష్టము కలుగును. కూలివాండ్రు వారిపనుల నమ్మకముగ జేయకపోవుట వలననే యజమానులు వారికాలమును కూలివాండ్రు పనులజక్కగ జేయుచున్నారా లేదాయని గమనించుటయందుపయోగింపవలసియున్నారు. అట్లుగాక ప్రతిమనుష్యుడును వాని కార్యముల విధ్యుక్తముగ నెరవేర్చువాడైన యెడల నీయజమానులు వారి

సామర్థ్యము వ్యర్థపుచ్చక యింతకంటె లాభకరములగు పనులజేసి, యెక్కువ యాదాయము నార్జింపగలవారై యుందురు. ఈవిధముగ మనమాలోచించినయెడల సన్మార్గులుకాని వారు దేశమందుండినయెడల బ్రజల దేహబలమును బుద్ధిబలమునుజాలవఱకు వ్యర్థములగుచుండునని స్పష్టపడగలదు. ఈసందర్భమున దేశములోని చోరులు మోసగాండ్రుసోమరులు లోనగువారివలన గలుగు నష్టమునుగుఱించి యిదివఱకే చెప్పియుంటిని. కావున, పురుషకారము వలనగలుగు ఫలితము పురుషులకు జన్మముతో గూడ లభించిన శరీరబల బుద్ధిబలములనే గాక తర్వాతవిద్యమూలమున వారుపొందిన శిక్షనుసహితము ననుసరించియుండునని పై విషయములవలన గ్రహింపవలసియున్నది.

కాని, మనుష్యునికష్టమువలన నుత్పత్తియగు నాదాయము దేశములోని ప్రజలుగావించుకొనిన మఱికొన్నియేర్పాటులపైకూడ నాధారపడియున్నది. వానిలోనెల్ల కార్యవిభజనము మిక్కిలి ప్రధానముగనున్నది. ఈవిభజనమువలన గలుగుఫలితములేవియో మనమిప్పుడు విమర్శింపవలెను.

మనలోనొక్కొక్కరము బలురకములగువస్తువులననుభవించుచున్నాము. వివిధములగు నాహారపదార్థములు వస్త్రములు గృహోపకరణములు పటములు పుస్తకములు కుర్చీలు బల్లలు గొడుగులు నగలు లోనగువానిలో నన్నిటినో ప్రతిమనుష్యుడును గోరుచుండుటయు వానిలో ననేకముల సంపాదించుచుండుటయు మనము చూచుచున్నాము. కాని స్వయముగ గృషిజేసి తనకువలయు వస్తువుల నన్నిటి నొకడు గూడ నుత్పత్తి జేయుటలేదు. ప్రతిమనుష్యుడును నేదియో

యొకపదార్థమును మాత్ర ముత్పత్తిజేసి దాని మూలమున వానికిగావలసిన తక్కినపదార్థముల సంగ్రహించుచున్నాడు. కొందఱు వ్యవసాయముజేసి ధాన్యముల బండించి వాని నితరులకిచ్చి వారివద్దనుండి బట్టలు గృహోపకరణములు మున్నగువానినిగొనుచున్నారు. మఱికొందఱు బట్టలనేసి వానికి బదులుగ నితరపదార్థముల నితరకర్మకరులనుండి గొనుచున్నారు. ప్రతిదేశమందును వారివారి వృత్తులబట్టి ప్రజలు పెక్కుతరగతులుగ విభజింపబడి యున్నారు. మనకుగావలసిన వస్తువులు అనేకములైనను మనలో నొక్కొక్కరము ఏదియో యొక వృత్తి నవలంబించియు నొక్కవస్తువునుమాత్ర ముత్పత్తి జేసియు దన్మూలమున మన మనుభవింపగోరు పదార్థములనన్నిటిని సంపాదించుపద్ధతికి కార్యవిభజనమని పేరు. 'కంసాలులు కుమ్మరులు సాలెవాండ్రు న్యాయవాదులు గాయకులు వైద్యులు' అని మనము దేశములోనిజనుల విభజించినపుడు దానికంతకు "కార్యవిభజనము" ఆధారమైయున్నది. "కార్యవిభజనము" లేనియెడల 'పురుషకారము' వలన గలుగుఫల మతిస్వల్పమై యుండును.

కార్యవిభజనమువలన వృత్తులయందు మనకుగల కౌశలమధికమై యధికఫలము కలుగుచున్నది. కార్యకౌశలమునకంతకు నభ్యాసము మూలకారణము. ప్రారంభమున నొకపని యెంతకష్టముగనుండినను దానినే పలుమాఱు మనము చేసిన యెడల నది కొంతకాలమున కతిసులభమగును. కొంతమట్టిని మనచేతిలో బెట్టి దానితోనొకకుండను జేయుడనిన మనకెవ్వరికిని సాధ్యము గాకయుండును; కాని, యుదయము లేచి

నదిమొదలదియే పనిగాగల కుమ్మరివాడయిదు నిమిషములలో బ్రశస్తమగు కుండనుజేసిమనకియ్యగలిగియుండును. దీనికి నభ్యాసమేగదా కారణము. అనేక విధములగు పనుల జేయువానికి నొకదానియందుగూడ నభ్యాస మలవడజాలదు; అందుచేత నొకదానియందుగూడ నతడుత్తీర్ణుడుకాజాలడు. కార్యవిభజనముండుటచేత ప్రతిమనుష్యుడును నేదియో యొకపనిని మాత్రము చేయసంసిద్ధుడై దానిమూలమున నాపనియందు విస్తారమగు సౌలభ్యమునుబొంది, విశేషమగు ఫలమును సంపాదించుచున్నాడు. ఇట్లుగాక, ప్రతిమనుష్యుడును వానికిగావలసిన బట్టల నతడేనేసికొనవలసినట్టియు గావలసినగృహోపకరణముల వడ్రంగుల సహాయము లేక యతడేనిర్మించుకొనవలసినట్టియు గావలసిన ధాన్యమును నతడేపండించుకొనవలసినట్టియు దుస్థితి సంభవించిన యెడల వీనిలో నొక్కదానియందుగూడ నధికమగు నేర్పును సంపాదింపలేక కష్టము విస్తారముగ బడినను ఫలితమునుమాత్రమత్యల్పముగ బొందువాడగును. నేతనొక్కటినే యభ్యసించినవాడుదానియందుమిక్కిలి నేర్పును సంపాదించిరోజున కైదాఱు గజములబట్టను నేయగలవాడైయుండును; వడ్రంగమునుమాత్ర మభ్యసించినవాడొక కుర్చీని నాలుగురోజులలో తయారుచేయగలవాడగును. అట్లుగాక, యవసరమువచ్చినపు డన్నిపనులను జేయవలసినవాడొకదానియందు గూడ నెక్కువ యనుభవము లేక నెలరోజులు శ్రమపడినగాని వానికిగావలసిన వస్త్రమును, రెండునెలలు శ్రమపడినగాని యొకకుర్చీని తయారుచేయలేక, తయారుచేసినప్పుడుగూడ నాణ్యములు కానివానిని దయారు చేయువాడై

యుండును. నియమితకాలములో మనముత్పత్తి జేయగల ధన సముదాయము మనకుగల నేర్పుపై నాధారపడి యుండును. అట్టినేర్పును సంపాదించుటలో మనకు కార్యవిభజన నత్యధికముగ సహాయపడుచున్నది. కార్యవిభజన సౌకర్యమెంత యధికముగనుండిన నంతయధికముగ మనముధనము నార్జింప గలవారమగుదుము.

కార్యవిభజనమువలన మనకు మఱియొకలాభముకూడ కలుగుచున్నది. ఎవరెవరి కేయేపనులయందు సహజమగు సామర్థ్యముండునో యట్టిపనులయందు మాత్రము వారు ప్రవేశించి వానిని బాగుగ జేసినయెడల నధికలాభము కలుగును గాని, ప్రతిమనుష్యుడు ప్రతికార్యమును జేయవలసివచ్చినయెడల నెల్లరకు నమితమగు నష్టము సంభవించును. కార్యవిభజనమనిన నేకార్యమున కెవరు తగియుందురో దానిని వారు చేయుటయు, దగనివారు దానిని మానుకొనుటయు ననియర్థము. వ్యాపారమం దెక్కువ చొరవగలవానికి వ్యాపారము జేయుటకు సంపూర్ణమగు నవకాశమీయక, వానికిష్టము లేని వ్యవసాయాదులందు నియోగించినయెడల నష్టము కలుగును గదా? సంగీతమును నేర్చుకొని దానియం దుత్తీర్ణుడు కావలయునని కోరు వానిని కూలిపనిలో నియోగించుటవలన లాభమేమి యున్నది? కార్యవిభజనమున కవకాశము లేనియెడల నెల్లకార్యముల నొక్కడే చేయవలసివచ్చుటచేత, వానికిగల సహజమగు బుద్ధిసూక్ష్మతవలన దేశమునకు గలుగవలసినంత లాభము కలుగకపోవును. అందుచేత మనుష్యుల సామర్థ్యము వ్యర్థపుగుట కవకాశము కలుగుచున్నది.

ఎల్లప్పుడు నొకటేపనిని జేయుచుండువానికి దానిలోని కష్టసుఖములు సంపూర్ణముగ బోధపడుటచేత నట్టివాడా కష్టముల దొలగించుటకు వలయు నుపాయముల గనుగొనసమర్థుడగును. ఈకాలమందన్ని వృత్తులందును నూతనపద్ధతులెన్నియో ప్రచారమునకు వచ్చియున్నవి. దీనికంతకు నీకార్యవిభజన మొక ప్రధానకారణము. ఏదియో యొకవృత్తివలన జీవింపనవకాశముండినపుడు దానిని నేర్చుకొనుటలో విశేషకాలము గడుపవలసిన యావశ్యకతయుండదు. అట్లుగాక, పెక్కుపనులు నేర్చుకొన దలచువాడు విద్యను నేర్చుకొనుటయందధిక కాలము వినియోగింప వలసి వచ్చును.

మనముపయోగించు నుపకరణములవలన నధికమగు లాభమును సంపాదింపగోరితిమేని కార్యవిభజనము తప్పక యుండవలెను. వ్యవసాయము, వడ్రము, నేత, కుమ్మరిపని లోనగువాని నన్నిటిని నొకడు చేయబూనినయెడల వానివద్ద నీవృత్తులన్నిటికిని సంభవించిన పనిముట్లుండవలయును గదా? కాని, అతడు వ్యవసాయము చేయుచుండునపుడు వడ్రము మొదలగు పనులలో నుపయోగింపదగు నుపకరణములన్నియు వ్యర్థముగ మూలబడియుండును; అట్లే వడ్రపుపనిజేయునపుడు తక్కినపనిముట్లన్నియు నిరర్థకములై యుండును. పనిముట్లు నెల్లప్పుడు నుపయోగింప నవకాశమున్నప్పుడే వానివలన సంపూర్ణమగు లాభము దొరకుచుండును. కార్యవిభజనముండి, వడ్రమును మాత్ర మొక్కడు చేయుచుండినయెడల వానికాలమంతయు నీపనియందే వినియోగమగుచుండుటవలన వాని పనిముట్లెప్పుడును నిరర్థకములుగనుండవు. ఈవిషయమును స్పష్టపఱచుటకొక నిద

ర్షనాంతరమును దీసికొనవచ్చును. ఒకడైదువందల రూపాయలప్పుదీసికొని, యీపనిముట్లన్నియు గొనెననుకొందము. ఈ రూపాయలకు సంవత్సరమునకేబదిచొప్పునవడ్డీని చెల్లింపవలసినయెడలనతడు సంవత్సరకాలములోపల నీమూలధనమునపాయమున దక్కనఖర్చులన్నియుబోగా ఏబదిరూపాయలనికరలాభమును నార్జింపవలసియుండును. కాని, యతడుకొనిన 'పనిముట్లు' చాలాకాలమునిరర్థకములుగనుండినయెడలవానికింతటి లాభముదొరకుటదుస్తరమగును. కార్యవిభజనముండి, యీ యైదువందల రూపాయిలలో వ్యసాయమున కుపయోగించు పనిముట్లకుగావలసిన రెండువందలరూపాయలను వ్యవసాయదారుడును, వడ్రమునకు సంబంధించిన నుపకరణములకువలయు వందరూపాయలవడ్రంగియు, నేతకుగావలసిన దానికై సాలెవాడు నూరురూపాయలను వేరువేరుగా నప్పుపుచ్చుకొనిన యెడలవారెల్లప్పుడువారి ప్రత్యేకపుగార్యమును చేయుచుండువారగుటవలన వారిపనిముట్లకు "విశ్రాంతి" యనునది లేక సర్వకాలములందు నుపయోగములోనుండి యెక్కువలాభమును గలిగించుచుండును. మనయొద్దనుండు మూలధనమువలన నధికమగులాభమును బొందగోరితిమేని దానినొక్క నిమిషముగూడ ననవసరముగ నూరకయుంచగూడదు. కార్యవిభజనముండిన గాని దానివలన నధికమగులాభముదొరక జాలదు.

ఈకాలమునసర్వదేశములందు నీకార్యవిభజనము ప్రచారములోనున్నది. కాని, కొన్నిటియందుసామాన్యముగను మఱికొన్నిటియందు సంశ్లిష్టముగనుగనబడుచున్నది. ఏపదార్థమునైన మనకుపయోగించునట్లు తయారుచేయుటకుబూర్వ

ము దానివిషయమై యనేకవిధములగుపనుల జేయవలసియుండును. వస్త్రముతయారగుటకు (1) ప్రత్తినుండినూలునువడకుట (2) బట్టలునేయుట (3) నేయబడినబట్టను తెల్లజేయుట (4) దానికిరంగువేయుట మొదలగువివిధములగు పనులావశ్యకములు. వ్యవసాయము చేయువాడు నీపనులచేయకుండుటయు, వీనిని ప్రత్యేకముగ మఱియొకడు చేయుటయు నొకవిధమగుకార్యవిభజనము. కాని యీనాలుగుపనులలో నొక్కొకదానిని ప్రత్యేకముగ నొక్కొకడు జేయుచు దానివలన వానిజీవనమును సంపాదించుట మఱియొకవిధమగుకార్యవిభజనము. దీనికే సంశ్లిష్ట కార్యవిభజనమని పేరు. ఒకపదార్థమును తయారుచేయువాడు మఱియొకదానిని జేయువానికంటె భిన్నుడగుటయేగాక, యొక్కొక్కపదార్థముత్పత్తిలోజేయవలసిన యనేకములగుపనుల నొక్కొకదానినొక్కడు చేయుచుండుటదీనిలక్షణము. నూలువడుకువాడొకడు, నేయువాడుమఱియొకడు, దానినిచలవజేయువాడు మఱియొకడు, దానికిరంగు వేయువాడు మఱియొకడుగనుండినయెడల వ్యవసాయమునుండి యంతవఱకేవిభజింపబడిన "నేత" యనుకార్యము మఱికొన్ని శాఖలుగవిభక్తమగును. ఒకడేనాలుగువిధములగు పనుల జేయుటకుబదు లొక్కొక పనినిమాత్రము చేయుచుండినయెడల దానిలోనధికమగు కౌశలమునుబొందగలవాడగును. ఇదే విధముగనూలును బట్టగ నేయుటయనుపని రెండుమూడుపనులుగ విభజింపబడి, యొక్కొకటిప్రత్యేకముగ నొక్కనిచే జేయబడుచుండవచ్చును. పడుగును తయారుచేయువాడొక్కడుగను, పేకనువేసినేయువాడు మఱియొకడుగను నుండినయెడల నొకపనియందు మొదటి

వానికున్నవనేర్పును, మఱియొకఁడు రెండవపని యందెక్కువగు నేర్పును సంపాదించుట కవకాశముండును. ఇట్లు ప్రతికార్యమును వలయునంతవఱకు ననేకవిధములుగ విభజించి, యొక్కొక భాగమునొక్కొకనిచే జేయించుచున్నయెడల, కర్మకరులకు బనులయందుగల లాఘవమధికమైనదానిమూలమున వారుత్పత్తి జేయగల పదార్థసముదాయము హెచ్చగుచుండును. పనివాండ్రకు వారిపనులలోఁగల నేర్పునధికపఱచుటకు "కార్యవిభజనము" మిక్కిలిగ ననుకూలించుచున్నది. పనులయందు మనకుగల నేర్పుపై మన ముత్పత్తి జేయగల వస్తుజాలమాధారపడి యుండునని యిదివఱకే తెలిసికొనియుంటిమి. కావున కార్యవిభజనమూలమున, మనమధికధనము నుత్పత్తి జేయగలిగియుందుమని వేరుగ జెప్పనక్కఱలేదు. కంసాలులలో వడ్రము, కంచరపని, బంగారుపని, ఇనుముపని, ఱాతిపనిలోనగువానిని జేయువారు వేరువేరుగనుండుటకును, సాలెవాండ్రలో పట్టుపని, నూలుపని, ఉన్నిపని, మొదలగువానిని వేరువేరుశాఖలవారు చేయుటకును, నిట్లేయితరములగు పనులజేయువారనేకశాఖోపశాఖలుగ విభాజితమైయుండుటకును, కార్యవిభజన సౌకర్యమునధికముగ ననుభవింపగోరుటయే కారణము. మన దేశమందలి బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రవర్ణము లుత్పత్తియగుటకు గూడనిదియే హేతువని యనేకులయభిప్రాయమైయున్నది.

కాని, కార్యవిభజనమధికముగ బ్రచారమునకు వచ్చుటకు వ్యాపార సౌకర్యములు దేశమునందు విశేషముగ నుండవలెను. మనగ్రామములలో నీ"కార్యవిభజనము" కొంతవఱకుండుటను మనము చూచుచున్నాము. కృషిచేయువారు

వేరుగను, చాకలిపని, మంగలిపని, వడ్రము, చర్మపుబని, కుమ్మరిపని, మొదలగువానిని జేయువారు వేరుగనున్నారు. కాని, వడ్రంగులు మొదలగువారు వారి కులవృత్తివలన మాత్రమే జీవింపక, కొంతవ్యవసాయము జేయుచు నప్పుడప్పుడు కూలిపనికి వెళ్ళుచు వారియాదాయము నధికము జేసికొనుచుందురు. దీనికి గారణము వారికులవృత్తులవలన వారికి గావలసినంత యాదాయము రాకపోవుటయే. అనగా వడ్రంగియొకఁడు వడ్రముతప్ప మఱియేపనినైనను జేయనిపక్షమున, వానికులవృత్తిలో నతనికి గొప్పనేర్పున్నను, దానివలన నతడుత్పత్తి జేయు నాగళ్ళు, పెట్టెలు, మంచములు మొదలగు వానిని దీసికొని వానికిబదులుగ నతనికి గావలసిన ధాన్యాదుల నిచ్చువారిసంఖ్య విశేషముగ గ్రామమందు లేరని యభిప్రాయము. ఒకఁడు వడ్రముతప్ప మఱియొకపనినిజేయక సంవత్సరమునకు రెండువందలనాగళ్లను, నొకవంద తక్కిన యుపకరణములును, నూరు మంచములును, యేబదియిండ్లకుగావలసినతలుపులు దూలములు మొదలగువానిని తయారు చేయ సమర్థుడనుకొందము. గ్రామము చిన్నదగుటచేతనిన్నినాగళ్లను, నిన్నిపనిముట్లను గావలసినవారు లేనియెడల నతఁడిన్నిటి నుత్పత్తి జేయుటవలన లాభమేమికలదు? వానిగ్రామమందుగాకపోయినను, ఇరుగుపొరుగుగ్రామములలోని వారైన నీపనిముట్లను కొనునప్పుడే యతఁడు వానికాలమునంతను కులవృత్తిలో గడుప సంసిద్ధుడగును; అట్లుగాక, తానుత్పత్తి గావించినవానినన్నిటిని కొనువారు లేనియెడల కులవృత్తివలన మాత్రము జీవనము జరుగక వ్యవసాయాదుల గూడ గొంతవఱకు జేయవలసిన

వాడగును. కొన్ని గ్రామములందు చిల్లరదుకాణమును బెట్టుకొని, ఉప్పు మిరపకాయలు మొదలగువానినమ్ముచు దానివలన జీవించువర్తకులుండుటయే లేదు. ఏలన ప్రత్యేకముగ నిట్టిపనిని జేసినదానివలన విశేషలాభమును గడించుటకు గ్రామమందు దుకాణములోని వస్తువులగొనువారిసంఖ్య యధికముగ నుండవలెను. అట్టిదుకాణములందేమియుగొనక, కొనవలసి వచ్చిన సమయములందు సమీపమందున్న పట్టణములకు వెళ్లి, యక్కడ తమకుగావలసినవానిని గొనునభ్యాసము ప్రజలయందుండునెడల ప్రత్యేకముగ దుకాణమునొకదానిని గ్రామమందుంచుకొనువాడుండడు. సాధారణముగ మనగ్రామములందు తాపీపనియే ప్రత్యేకమగు వృత్తిగ గలవారుండుట లేదు. ఏలన, నట్టివారికి సంవత్సరమంతయు బనిదొరకుట కష్టము. ఇటికలతోను ఱాతితోను యిండ్లను గట్టుకొనువారు గ్రామమందనేకులుండిన యెడల బ్రతిదినము నెవ్వరోయొకరు తాపీవాని చేబనిజేయించుకొని వానికికూలి నిచ్చుచుందురు; అట్లు లేనపుడు తాపీపని తప్పమఱిదేనిని జేయలేనివాడు గ్రామమందు స్వపోషణకు వలయునంతటి ద్రవ్యము నార్జింప లేకపోవును. కావున తాపీపని నేర్చుకొనినవా రితరములగు పనుల జేసి వేతనముల సంపాదింపవలసిన యవసరమున్నది. ప్రత్యేకముగా నొక్కపనిని మాత్రము చేయుటవలన దానియందధికమగు నేర్పు దొరకుట సత్యమే! కాని, యట్టిపనివలన జీవనము జరుగుననియు, దానివలన నుత్పత్తియగు పదార్థములనన్నిటిని నితరులు దీసికొని యాపని జేయువానికి గావలసిన పదార్థముల నిచ్చెదరనియు నమ్మకమున్నప్పుడే, ప్రత్యేకముగ నొక్క పనివలన మాత్రము

జీవించువారిసంఖ్య యధికముగనుండును.

ఈవిషయమును మఱియొక నిదర్శనమువలన స్పష్టముగావింపవచ్చును. పూర్వకాలమున నన్నిగ్రామములందును, నిప్పటికాలమునగూడ గొన్ని గ్రామములందును గ్రామస్థులకు గావలసినపదార్థములనన్నిటిని వారేవారిగ్రామమున నుత్పత్తి జేసికొను నాచారముండెడిది. భూసారమెట్టిదైనను, గొంచెము భూమిలో ధాన్యము మిగిలినదానిలో కందులు పెసలు మినుములు మిరపకాయలు ప్రత్తి గోగు మొదలగు నానావిధములగు పదార్థములను బండించుచుండెడివారు. గ్రామములో బండినప్రత్తిని దానిలోని సాలెవాడు బట్టగ తయారు చేయుటయు, గ్రామములోని పొలమందలి చెట్లనుగొట్టి యూరివడ్రంగి కావలసిన పనిముట్లుచేయుటయు సంభవించుచుండెను. గ్రామములోని పొలము ధాన్యపుబంటకుమాత్ర మనుగుణమై యుండినను కందులు మొదలగువానిని వారుపండించుట నష్టకరము గదా? ఇవిపండు భూమిలో ధాన్యమునే పండించిన యెడల నెక్కువధాన్యముత్పత్తి యగునుగదా? అయినప్పటికిని నానావిధములగు పంటలు వారుపండించుటకు గారణమేమి? భూమియందంతటను వారుధాన్యమును బండించిన యెడల వారికిగావలసినకందులు పెసలుమున్నగువాని నితర గ్రామముల నుండి వారుకొనవలసియుందురు. ధాన్య మాయితరగ్రామస్థులు తీసికొని దానికిబదులు పెసలుమొదలగువానిని వారిచ్చుట కవకాశముండినయెడల వీరు ధాన్యమొక్కటియే పండించుట లాభకరము కాని, యొకగ్రామమునుండి మఱియొక గ్రామమునకు వెళ్లుటకు సరియగు బాటలు లేకపోయినను, మధ్యమార్గములను న

జోరులభయమధికముగనుండినను, నిట్టిక్రయవిక్రయములుజరుగుటకు వీలుండదు. ఇట్టిసందర్భమున మొదటి గ్రామములోని భూమి ధాన్యపుబంటకు మిక్కిలియనుకూలించినదైనను పెసలు ప్రత్తి మొదలగువాని కనుకూలింపకపోయినను పెసలు మొదలగునవికూడ గ్రామస్థులకావశ్యక పదార్థములగుటచేత నితరప్రదేశములందుండి వానిని ధాన్యమునిచ్చి తెచ్చుకొనుటకు వీలులేనపుడు వానినీగ్రామమందే యుత్పత్తిగావింపవలసినయావసరముండెడిది. ఇప్పుడీవిషయములం దెన్నియో మార్పులు కలిగినవి. గ్రామమందుండు పొల మేపంటకనుకూలించునో దానినిమాత్రము పండించుపద్ధతి దేశమందు వ్యాపించుచున్నది. ఒకగ్రామములోనిభూమి వేరుసెనగకు జాల ననుగుణమైనయెడలదానినిమాత్రమే రైతులుపండింతురు. మఱియొకగ్రామమున ప్రత్తి ఇంకొకగ్రామమునజనుము మఱియొకగ్రామమునపొగాకు ఈవిధముగకృషిజరుగుచున్నది. ఏలన గ్రామమందంతటను పొగాకునుమాత్రమేపండించినను, పొగాకునితరగ్రామములకును బట్టణములకును నెగుమతిజేసి తమకు గావలసిన ధాన్యము పెసలు బట్టలుమొదలగువానిని గ్రామాంతరములందుండి తెచ్చుకొనుటకనేక సౌకర్యములున్నవి. దానివలన పొగాకును జనుమును మాత్రమొకగ్రామమువా రుత్పత్తిగావించినను వారికి గావలసినయితరవస్తువులు దొరకవను భయము వారికుండుటలేదు. ఇట్లొక్కొకగ్రామమువారు వారిభూమి దేనికనుకూలించునో యాపంటలనుమాత్రము పండించుచు నావంటల నితరగ్రామములవారికిచ్చి యాగ్రామములలోని భూమి దేనికనుకూలించునో దానినిగొనుపద్ధతిగూడ గార్యవిభజనయొ

క్క రూపాంతరమే. ఎవరికి దేనియందు నేర్పుండునో యాపనిని వారుచేయుట కార్యవిభజనముయొక్క ప్రధానలక్షణము. కావున ప్రత్తిని బండించుటలో నెక్కువసదుపాయములుండువారు దానినిమాత్రము పండింపవలెనుగాని పొగాకు గోధుమలు లోనగువానినుత్పత్తి జేయుట నష్టకరము. క్రయవిక్రయములకు గావలసినసౌకర్యములధికముగ నేర్పడినపుడిట్టికార్యవిభజనము ప్రచారములోనికి వచ్చునని మనము గ్రహింపవలెను. ఇనుపదారులు, రోడ్లు, కాలువలు మొదలగునవి యిట్టిసౌకర్యములు. వీనిమూలమున నొకప్రదేశమందుత్పత్తియగు పదార్థములు మఱియొకప్రదేశమునకు దీసికొనిపోవుట మిక్కిలి సులభముగనుండును. ఇందుచేత బ్రతిగ్రామమందును బ్రతిప్రదేశమందును నచ్చటనుండుప్రజలకుగావలసిన పదార్థములన్నిటిని నుత్పత్తి జేయవలసిన యావశ్యకత తగ్గిపోవును. ఏగ్రామమును ఏప్రదేశమును, ఏరకపు పదార్థముల యుత్పత్తి కనుకూలించునో యట్టివిమాత్రము వానియందుత్పత్తి జేయబడుట సంభవించును. ఇందుచేత మొత్తముమీద దేశమందుత్పత్తియగు ధనసముదాయ మధికమగును.

కార్యవిభజనమువలన గలుగగలఫలమును బొందగోరియే మనము విదేశములతో వ్యాపారము జేయుచున్నాము. కొన్నిపదార్థముల నుత్పత్తి జేయుటకు విదేశములవారి కున్నట్టి సదుపాయములు మనకు లేవు. ఈకారణముచేత నీపదార్థముల మనముత్పత్తి జేయక, దేశాంతరములందుండి కొనుచున్నాము. దూది, బట్టలు, ఇనుము, ఉక్కు, యంత్రములు, గాజుసామానులు, కాకితములు, మోటారుబండ్లు, అగ్గిపెట్టెలు, మొదలగు

నవి యన్నియు నిట్టివి. వారికిగల సదుపాయముల కనేక కారణములుండవచ్చును. కొన్ని పదార్థముల విషయమున వారిదేశమునందలి "ప్రకృతిసంపద" మిక్కిలి యనుకూలముగ నుండవచ్చును. ఇనుము, వెండిమున్నగువానినివారు మనకంటె నధికముగ నుత్పత్తి జేయగలుగుట కిదియే కారణము: మఱి కొన్ని పదార్థముల విషయమున విదేశములవారి యనుభవమును నేర్పును మిక్కిలి హెచ్చుగ నుండుటచే వానిని వారు చాల సులభముగను జౌకగను నుత్పత్తి జేయుచుండవచ్చును. బట్టలు, ఉక్కు, యంత్రములు మొదలగునవి యిట్టిపదార్థములు. వీని నుత్పత్తి గావించుటయందు విదేశస్థుల కుండునట్టిసదుపాయములు మనకు ప్రస్తుతము లేకపోవుటచేత, వారివలె జౌకగ వీనినుత్పత్తి జేయుటకు మనకవకాశము లేదు. ఇట్లుగాక మఱికొన్ని పదార్థముల విషయమున మనకుండునట్టి సౌకర్యములు వారికి లేవు. ప్రత్తి, జనుము, కాఫి, తేయాకు, వేరుసెనగ, కొబ్బెర, నల్లమందు, చర్మములు, మొదలగుపదార్థము లిట్టివి. వీనినన్నిటిని వారుమనవద్దనుండి కొనుచుందురు. వీనిని వారు మనవలె జౌకగ నుత్పత్తి జేయలేని వారగుటచేత మనవద్దనుండి కొనుట వారికి మిక్కిలి ఆదాయకరము. విదేశముల నుండి మన మిప్పుడు కొనుచుండు పదార్థముల గొనుటమాని, వానిని మనదేశమందే యుత్పత్తి జేయబూనితిమేని, విదేశస్థులవలెజౌకగ నుత్పత్తి జేయలేకపోవుటచేత గొంతనష్టము సంభవించును. కావున విదేశములతోడి వ్యాపారమువలన నిట్టి నష్టములు నశించి, మనకు విస్తారమగు లాభముగూడ గలుగుచున్నది. ఏప్రదేశమునం

దుండువారి కెట్టి పదార్థముల నుత్పత్తి జేయుటయందు సౌకర్యముండునో వాని నుత్పత్తి జేయుటయే సదా కార్యవిభజనము యొక్క లక్షణము. కావున దేశములలో నొక్కొకటియు నిట్టి కార్యవిభజనపద్ధతి ప్రకారము ధనోత్పత్తి గావించు చుండిన యెడల నెల్లదేశములకును లాభకరముగనుండును.

౫ ఉపన్యాసము

ప్రకృతి, పురుషకారము, మూలధనము అనుమూడు సాధనముల సహాయముచేత ధనముత్పత్తి యగుచున్నదనియు, నుత్పత్తియగు ధన సముదాయము వీనియొక్క బాహుళ్య సారతలచే నిర్ణీతమగుచుండుననియు, ప్రకృతి బాహుళ్యమును మనము హెచ్చుచేయలేకపోయినను తక్కిన రెంటియొక్క బాహుళ్యమును ఎల్లసాధనములయొక్క సారతను వృద్ధిపఱచుటకు మనుష్యునికి సామర్థ్యమున్నదనియు గావున మనయిష్టానుసారముగ ధనము నభివృద్ధిజేయుట మనకు సాధ్యమనియు మనదారిద్ర్యమునకు మనయందలిలోపములే ప్రధాన హేతువులనియు వెనుకటి నాలుగుపన్యాసముల యొక్క సారాంశమై యున్నది. సాధనసంగ్రహణము గావించినతర్వాత ధనార్జనయందు వానిని వినియోగించు పద్ధతులలో నొక దేశమునకును మఱియొక దేశమునకును విశేషములగు భేదము లగపడుచున్నవి. వానినిబట్టిగూడ దేశమం దుత్పత్తియగు ధనసముదాయము నిర్ణీతమగుచుండును గనుక వానినిగుఱించి మనమిప్పుడు విమర్శింపవలసి యున్నది.

ఈవిమర్శనకు గడగుటకు బూర్వమీ సందర్భమున నుపయోగింపబడు నొకసాంకేతికమునుగుఱించి కొంచెముచెప్పుట యావశ్యకము. "వ్యవహారము" (Business) అనుమాటను నీయుపన్యాసమునదఱచుగ వాడవలసియున్నది. "వ్యవహారము"

అననేమియో ప్రారంభమున దెలిసికొనినగాని తక్కిన విషయములు బాగుగ బోధపడజాలవు. "స్వతంత్రముగ ధనము నుత్పత్తిజేయువాని స్వాధీనమందుండు ప్రకృతిపురుషకారమూలధనముల సంయోగము" నకువ్యవహారమని పేరు. ధనోత్పత్తికై ప్రయత్నము జేయుటలో నొకప్పుడులాభము కలుగవచ్చును, మఱియొకప్పుడు నష్టముసంభవింపవచ్చును. ఈలాభనష్టములననుభవించువాడు స్వతంత్రముగ ధనోత్పత్తికై పాటుపడుచుండువాడేగాని, యొకరియధీనమందుండి వారియాజ్ఞానుసారముగ బనిజేయువాని కిట్టిలాభనష్టములతో సంబంధముండదు. కూలివాండ్రకును యజమానునికిని గలభేదము దీనినిబట్టియే కలుగుచున్నది. యజమానుడగువాడు కృషివలననో వాణిజ్యమువలననో కొంతయాదాయ మొందగోరి నలుగురు కూలివాండ్రను వానిపనిలో నుంచుకొనినయెడల వానికి నష్టము వచ్చినను లాభమువచ్చినను వారికిచ్చుటకై నిర్ణయించుకొనబడిన కూలినిచ్చుకొనవలెను; నష్టమువచ్చినపుడు వారి వేతనము లో తగ్గించుటగాని, లాభమువచ్చినపుడు హెచ్చించుటగాని, జరుగదు. కావున కూలివాండ్రు ధనము నుత్పత్తిజేయువారైనను వారిప్రయత్నము స్వతంత్రమైనది కాదు. యజమానుడా ప్రయత్నమున లభించు లాభనష్టములకు "పూచీ"పడియుండువాడు కావున, స్వతంత్రుడని చెప్పదగియున్నాడు. సాధనసామగ్రినంతను గూర్చుకొని, స్వతంత్రముగ ధనోత్పత్తి గావించుటకై ప్రయత్నించువారందఱు వ్యావహారికులనియు, వారిప్రయత్నము వ్యవహారమనియు మనము గ్రహింపవలెను. దీనిననుసరించి స్వతంత్రముగ వ్యవసాయముజేయు రైతులును, స్వతంత్రముగ

బదార్థముల బక్వపఱచు కర్మకరులును, స్వతంత్రముగ వాణిజ్యమువలన జీవించుచుండు వర్తకులును వ్యావహారికులనియే చెప్పదగియున్నారు.

'వ్యవహారము' యొక్క పరిమాణమును (Size of the business) బట్టిమనముత్పత్తిగావించు ధనాదాయమునిర్ణీతమగుచున్నది. ఈవాక్యములోనియర్థము దెలిసికొనుటకుం బూర్వము వ్యవహార పరిమాణమననేమియో స్పష్టపఱుపవలెను; ఇందుకై కొన్నియుదాహరణముల దీసికొనెదము. ఒకగ్రామమున వ్యవసాయయోగ్యమగుభూమి ఐదువందల యెకరములును, వ్యవసాయదార్లు నూరుమందియు నున్నపుడీనూర్గురును స్వతంత్రముగ వ్యవసాయము జేయుచున్న యెడల వారిలో నొక్కొక్కరైదెకరములపొలమును సరాసరినికృషిజేయుచుందురు; అప్పుడువ్యవహారపరిమాణ మైదెకరములని చెప్పబడును. ఇట్లుగాక వీరిలో నేబదిమంది స్వతంత్రముగ గృషిజేయువారుగను తక్కినవారువారివద్దకూలిపనిజేయువారుగను నుండినయెడల నొక్కొక్కవ్యవహారముయొక్క పరిమాణము పదియెకరములగును; పూర్వముకంటె నిప్పుడు వ్యవహారపరిమాణ మధికమయ్యెనని చెప్పబడును. స్వతంత్రముగగృషిజేయువారు పదిమందియు తక్కినవారువారి స్వాధీనమందుండి వారిభూములలో నౌకరిచేయువారైనయెడల వ్యవహారపరిమాణముమఱింతయధికమయ్యెనని చెప్పవలసియుండును. గ్రామములోనిభూమియొక్క విస్తీర్ణతగాని, కర్షకులసంఖ్యగాని వృద్ధికాకపోయినను వ్యవహారపరిమాణము వృద్ధికావచ్చును. కృషిసంబంధమగు వ్యవహారము లధిక పరిమాణమునుగలవియని చెప్పినపుడొక్కొక స్వతంత్రుడగు రైతు అధిక

విస్తీర్ణతగలభూమిని గృషిచేయుచున్నాడని యర్థముకాని దేశమందు మొత్తముమీద భూవిస్తీర్ణత యధికముగనున్నదనియర్థముకాదు. ఇట్లే నేతనుగుఱించిగూడ జెప్పవచ్చును. నూరుమందిసాలెవాండ్రు ప్రత్యేకముగ నెవరింటిలో వారుస్వతంత్రముగ బట్టలునేయుటకుబదులు వారందఱునొక ధనికునిస్వాధీనమందుండి, వాడిచ్చిన వేతనమునకు వానియాజ్ఞానుసారముగ బనిచేయుచుండినయెడల వ్యవహారపరిమాణమధికమయ్యెనని చెప్పవలసియుండును. సాలెవాండ్ర సంఖ్యయందుగాని, మగ్గముల సంఖ్యయందుగాని వృద్ధి లేకపోవచ్చును; కాని ఒక్కొక్క డొక్కొకమగ్గమున కధికారియై పనిచేయుటకు బదులిప్పుడొక్కడే నూరుమగ్గములకధికారియై నూర్గురికియజమానుడగుట తటస్థించుచున్నది. మనదేశములో నాలుగుకోట్లరూపాయలవిలువగల నేతకుసంబంధించిన మూలధనమును, స్వతంత్రముగ బనిజేయుసాలెవాండ్రు నాలుగులక్షలును నుండినయెడల నొక్కొక సాలెవాడును నూరురూపాయల పరిమాణముగల మూలధనముతో వ్యవహారము జేయుచుండును. అట్లుగాక ఈమూలధనమంతయు నాలుగు వందల మంది స్వాధీనమందుండి తక్కిన సాలెవాండ్రందఱు వారికి లోబడి పనిజేయుచున్న యెడల నొక్కొక వ్యవహారము సరాసరిని లక్షరూపాయల మూలధనము గలదియై పూర్వముకంటె నధిక పరిమాణము గలిగినట్టిదియని చెప్పబడును. ఇందులో గూడ వ్యవహార పరిమాణము మాత్రమధికమయ్యెను గాని, మొత్తముమీద నేతలో నుపయోగింపబడుచుండు మూలధనముగాని నేతవాండ్ర సంఖ్యగాని యధికము కాలేదు. ఇట్లే యొక పట్టణ

ములోని ప్రజలందఱికిని పదిలక్షలరూపాయల విలువగల చిల్లరసామాను లొక సంవత్సరమునకు గావలసి యుండినప్పుడు పట్టణములో వేయిమంది చిల్లర దుకాణదార్లుండినయెడల నొక్కొక దుకాణమున సరాసరిని వేయి రూపాయల వ్యవహారము జరుగుచుండును. దీనికిబదులు చిల్లర దుకాణములసంఖ్య నూరైనయెడల నొక్కొకటియు పదివేలరూపాయల వ్యవహారమును జేయగలది యగును. కావున చిల్లరదుకాణపు వ్యవహారములు పూర్వముకంటె నిప్పుడధిక పరిమాణముగలవయ్యెనని చెప్పవలసి యుండును. దీనివలన బట్టణములోనివారధికముగ చిల్లరసామానుల గొనుచున్నారని చెప్పుటకు వీలులేదు. కావున స్వతంత్రముగ ధనముత్పత్తిజేయువారు సరాసరిగ నెక్కువగుపురుషకారప్రకృతి మూలధనసముదాయము నుపయోగించి, సరాసరిగ నెక్కువఫలితము నుత్పత్తి జేయుచుండినయెడల వ్యవహారపరిమాణ మధికముగనున్నదనియు, నట్లుగానియెడల స్వల్పముగ నున్నదనియు మనము తెలిసికొనవలెను.

ధనోత్పాదకములగు కర్మలనేకములలో వ్యవహారపరిమాణ మధికముకానుకాను ఉత్పత్తియగుధనమధికతరమగును. లక్షరూపాయల మూలధనముతో వ్యవహారము జేయునప్పుడు సంవత్సరమునకు సరాసరిని పదివేలబేలుల బట్టలు తయారైనయెడల రెండులక్షల మూలధనముతో వ్యవహారముజేయునప్పుడిరువదివేల బేలులబట్టలు తయారగుట సహజమైనను నిరువదియొక వేయిగాని, యిరువదివేల యైదువందల బేళ్ళుగాని తయారగుట కవకాశముండును. వ్యవహారపరిమాణ మధికముకానుకాను ఉత్పత్తియగు ధన మధికతరమగునని చెప్పుటలో గల

యభిప్రాయమిదియే. కావున నిద్దఱుసాహుకార్లు ప్రత్యేకముగ లక్షరూపాయలతో వేఱువేఱుగ నేతవ్యవహారమునుజేయునప్పుడిరువదివేలబేలుల బట్టలుతయారగును; అట్లుగాక యిద్దఱుకలిసి రెండులక్షలరూపాయలతో నొక్కటేవ్యవహారమును జేసినయెడల నధికమగు ఖర్చుజేయ నవసరము లేకయే పూర్వముకంటె వేయిబేలులో యైదువందల బేలులో యధికముగనుత్పత్తి యగును. ఇట్లు జరుగునప్పుడొక్కొక బేలుయొక్క ఖరీదుతగ్గి బట్టలు కొనువారికవి చౌకధరలకు దొరకుచుండును. వ్యయము నధికముగజేయక లాభమునభివృద్ధిగావించుట సర్వశ్రేయస్కరముగదా? ఇట్లే కొంతవఱకు వ్యవసాయమునగూడ జరుగుట కవకాశమున్నది. ఒక్కొకరు స్వతంత్రముగ పదేసియెకరములచొప్పున వ్యవసాయము జేయుటకుబదులు పదిమంది స్వాధీనమందుండు నూఱుయెకరముల పొలము నొక్కడుదీసికొని, వ్యవహారమును బెంచి కూలివాండ్ర సహాయమున దానిని సేద్యము జేసినయెడల నూరెకరములనుండి యిదివఱకు బండుచున్నదానికంటె నిప్పుడధికమగు పంటపండును.

మనదేశమందలి వ్యవహారములన్నియు మిక్కిలి స్వల్పపరిమాణమును గలవిగ నున్నవి. ఒక్కొక రైతు సరాసరిని మూడునాలుగు ఎకరములకంటె నధికముగ సాగుజేయుటలేదు. నేత, కట్టుపని, వడ్రము మొదలగువానివలన జీవించు కర్మకరుల వ్యవహారముల పరిమాణముగూడ మిక్కిలి స్వల్పముగనున్నది. ఎన్నియో లక్షలరూపాయల మూలధనముతో బెక్కువేల కూలివాండ్రనుజేర్చి బొంబాయి అహమదాబాదు కాన్పూరు మున్నగు పట్టణములలో నేతశాలల నిప్పుడిప్పుడు కట్టి

పనిచేయుచున్నారు; కానిసామాన్యులగు మనసాలెవాండ్రొక రొకరియొద్ద నేబది యిరువదిరూపాయలకంటె నెక్కువ మూల ధనముండుటలేదు. ఇటీవలవఱకు మనదేశమందెవరిధాన్యము ను వారువారిండ్లలో దంపించుకొనుట యాచారముగనుండెను; ఇప్పుడుగూడ గ్రామములలో నీయాచారమింకను గనబడుచు న్నది. ఇందుకై మనముపయోగించురోకలి, రోలు, చేట మొ దలగు నుపకరణముల మూల్యము చాలతక్కువ. అల్పమగు మూలధనముతో మనము ధాన్యముదంచుటకును, గోధుమ లు మొదలగువానిని బిండిజేయుటకును, నువ్వులు మొదలగువా నినుండి నూనెదీయుటకును బ్రయత్నించుచున్నాము. ఈవ్య వహారముల పరిమాణము మిక్కిలి యల్పమగుట చేత వీనినుండి తగినంతఫల ముత్పత్తియగుట లేదు. ఎవరింటవారు ధాన్యము ను దంపించుకొనుటకుబదులు బియ్యపుమర (యంత్రము)నొక దానిని దెప్పించి దానిసహాయమున బియ్యము తయారుచేయు ట లాభకరముగనుండునని మనవారిప్పుడిప్పుడు తెలిసికొనుచు న్నారు; అనగా ధాన్యమునుదంపించు వ్యవహార మల్పపరిమా ణముగ నుండుటకుబదు లధికపరిమాణముగ జేయుట లాభకారి యనియనుభవమువలన దెలియుచున్నది. ఇట్లే తెలుకులవారు వారింటియందు గానుగనొకదానిని బెట్టుకొని కొంచెకొంచెము నువ్వులనుండి నూనెదీయుట మిక్కిలియల్పపరిమాణముగు వ్యవ హారము. యంత్రసహాయమున నొక్కమారెన్నియో బ స్తాలనువ్వులనుండి నూనెదీయుటయధికపరిమాణవ్యవహారము. దీనివలన నెక్కువలాభకరముగ నూనెనుదీయుట కవకాశము న్నది. అనగా అయిదు వందల రూపాయల మూలధనముగల

తెలుకులవాడు రోజునకు పదిశేర్లనూనె నాడగలిగిన యెడల అయిదువేలరూపాయల మూలధనముతో నీపనికి బూనువాడు వానికంటె బదిరెట్లధికమగు నూనెనేగాక పదునొకండు పం డ్రెండు రెట్లధికమగు నూనెనాడగలిగియుండును. కావుననూ నె చౌకధరలకు దొరకుటకవకాశము కలుగును.

వ్యవహారపరిమాణ మధికముకానుకాను ఉత్పత్తియగు ధన మధికతరమగుటకును, బదార్థములు మునుపటికంటె జౌక గా దొరకుటకును గారణములెన్నియో గలవు. (1) అధికపరి మాణ వ్యవహారములలో కార్యవిభజన కెక్కువ సౌకర్యముం డును: అందుచే కర్మకరు లెక్కువనేర్పుతోను లాఘవముతో ను బనిచేయగలవారగుదురు. ఒక్కొక గ్రామమం దొక్కొ క వడ్రంగి స్వల్పపరిమాణ వ్యవహారమును జేయుచు, వ్యవ సాయమున కుపయోగించు పనిముట్లు, గృహోపకరణములు, గృహనిర్మాణమునకు గావలసిన తలుపులు దూలములు కిటి కీలు మున్నగువాని నన్నిటి నీతడు చేయవలసియుండును. ఇన్ని రకముల పనులను జేయుచుండుటవలన నొక్కదానియందుగూ డ పరిపూర్ణకౌశలమును సంపాదించుట కవకాశముండదు. ఒకవేళ కుర్చీలు బల్లలు మొదలగువానిని జేయుటయందు వా నికెక్కువ నేర్పున్నను గ్రామమందు కుర్చీల గొనువారధికము గ నుండక పోవుటచేత వాని నేర్పంతయు వ్యర్థమగుచున్నది అనగా నేదియో యొక కార్యమును మాత్ర మతడు చేయు టయు దానియందు తీర్ణుడగుటయు సంభవించుట లేదు. మ న గ్రామములోని వడ్రంగు లందఱు నిట్టిస్థితిలో నున్నారు. ఇట్లుగాక యొకధనికుడు పదివేలరూపాయల మూలధనమును

జేర్చి, దానితో వడ్రంగులకు గావలసిన పనిముట్లనన్నిటినిగొని యేబది గ్రామములందలి వడ్రంగుల వానివద్దకు దెప్పించుకొని వారిచే బని జేయింపసాగినయెడల, వారిలో నెవడేపనియందు సమర్థుడో వానిచే నాపనిని జేయించుచు, మొత్తముమీదనధికమగు పదార్థసముదాయము నుత్పత్తి జేయవచ్చును. అనేకులొక్కచోటగూడి, కలిసి పనిచేయుచున్నప్పుడు కార్యవిభజనకవకాశముండునుగాని యొక్కడేయుండునపుడట్టిది జరుగుటకు వీలులేదు. ఈయేబది వడ్రంగులకంటె భిన్నుడగువాడీపనికి బూనవలసిన యవసరము లేదు. ఏబదిగ్రామములలోని వడ్రంగులందఱు స్వగ్రామములవిడిచి వారివారిపనిముట్లతో మఱియొకప్రదేశమున నందఱుచేరి కలిసిపనిచేయుటకు తీర్మానించికొనినపుడుగూడ వ్యవహారపరిమాణమధికమై కార్యవిభజనసదుపాయము కలుగవచ్చును. ఒకవ్యవహారమందు జనబాహుళ్యమధికముగనుండినయెడలనీసదుపాయముతప్పక చేకూరును. ఒక చిన్న చిల్లరదుకాణమందు దుకాణదారుడే యన్నిపనుల జేసికొనుచుండవలెను. వస్తువులనందుకొనుటయు గొలుచుటయుదూచుటయు లెక్కపద్దులవ్రాసికొనుటయు మొత్తముగ వానిదుకాణమునకుగావలసిన పదార్థసముదాయమును గొనుటయునతడే చేసికొనవలసియుండును. ఇందుచేవానిదుకాణములో వస్తువుల గొనుటకు వచ్చువారనేకులు వ్యర్థముగనక్కడ వేచియుండవలెను: ఇన్నిపనులజేయుట యవసరము గనుక వానికాలము గూడ జాలవఱకు నిరర్థకమగుచుండును. అట్లుగాక పది పదునైదువేల రూపాయల మూలధనముతో జిల్లర దుకాణమును బెట్టినవాడు నలుగురైదుగురుకూలివాండ్రను వస్తువులనందిచ్చు

టకును తూచుటకును బ్రత్యేకముగ నియమించి, పద్దుల వ్రాయుటకు బ్రత్యేకముగనొకగుమాస్తాను బెట్టుకొని, తాను వస్తువుల నాణెముచేసి వానిని దెప్పించుటయందు తనకాలమును వినియోగింపవచ్చును. ఇట్టికార్యవిభజన యుండినయెడల వానివ్యాపారము వృద్ధియగును; వానిదుకాణమునగొనువారికి గాలహరణము లేకపోవుటయేగాక వస్తువులుకూడ చౌకధరలకు దొరకుట కవకాశముండును.

మనదేశమందిప్పటికాలమున బదార్థముల నుత్పత్తిజేయు కౌశలముకంటె వానిని దగువిధమున క్రయవిక్రయములజేయగల నేర్పధికముగ గావలసియున్నది. కొనువారల కెట్టిపదార్థములు కావలయునో, వానినుత్పత్తి గావించుటలో నుపయోగింపదగుమూలపదార్థము లెచ్చటజౌకగ దొరకునో, యుత్పత్తిగావించిన పదార్థములను దగుప్రదేశముల నెట్లువిక్రయింపవలెనో తెలిసికొని, దానికనుగుణముగ వ్యవహారముల జేయుట మిక్కిలి యావశ్యకమైయున్నది. మనకర్మకరులిట్టిజ్ఞానము సంపాదించుట మిక్కిలిదుస్తరము. నెలకు బదిపదునైదురూపాయలకంటె నెక్కువ లాభమును సంపాదింపలేనికర్మకరులిట్టిజ్ఞానముగలవారిని నియోగించి, వారికిదగుజీతములనిచ్చి, వారిని గ్రామముల వెంటనంపి, వారిమూలమున గావలసినవిషయముల దెలిసికొనుటకు బ్రయత్నింపజాలరు. కావున బ్రశస్తములగు పదార్థముల దయారు చేయగలిగియుండినను వారివ్యవహారము లల్పపరిమాణములగుటచేత నిట్టికార్యముల జేయుటకు వారికవకాశము లేకున్నది. సాహుకార్ల యొక్కయు వర్తకులయొక్కయు వాసములకులోబడి, తయారు చేసిన వస్తు

వులతక్కువధరలను వీరికమ్మవలసియున్నారు. ఇట్లుగాక, వేలకొలది రూపాయలతో వ్యాపారముజేయువాడు నేర్పుగలవారికి వేతనములిచ్చి తనవద్దనుంచుకొని, వారిమూలమునదనకు గావలసిన సంగతుల నన్నిటిని దెలిసికొనగలవాడగును. క్రయవిక్రయములకు సంబంధించిన యిట్టికార్యముల ప్రత్యేకము చేయగలవారు, బాహుళ్యముగ వ్యవహారముజేయుచుండువారికి మాత్రమే దొరకగలరు.

(2) అధికపరిమాణ వ్యవహారముజేయువానికి యంత్రములనుపయోగించుటకవకాశముండును. అల్పవ్యవహారునికిట్టి యవకాశముండదు. పాశ్చాత్య దేశములలో నీకాలమున ననేక కార్యములను యంత్రసహాయమున జేయుచున్నారు. నేలను దున్నుటకును, జదరముచేయుటకును, వరిగోయుటకును, కుప్పల నురుపుటకును, పాలలోనుండి వెన్ననుదీయుటకును, నేత మొదలగు కార్యముల జేయుటకును, యంత్రములనుపయోగించుచున్నారు. అందుచేవారుపనులను శీఘ్రతరముగను నాణెముగనుచేయగలిగి, యనేకపదార్థముల మనకంటెజౌకగ నుత్పత్తి చేయువారైయున్నారు. మన దేశమందలి నేత మొదలగువృత్తులు నశించుటకును; నింగ్లండు, జపాన్ మున్నగు దేశములనుండి యపరిమితముగ వస్త్రములుమన దేశమునకు వచ్చుచుండుటకు నా దేశములవారు యంత్రసహాయమున బట్టలుతయారు చేయగలుగుటయేకారణము. వారితో సమానముగ మనమువస్త్రములులోనగు పదార్థములు తయారుచేయవలయుననిన మనముగూడయంత్రముల నుపయోగింప సంసిద్ధులము కావలెను. కాని, యల్పపరిమాణముగల వ్యవహారముచేయువానికి విలువ

గల యీయంత్రములసంపాదించుట దుస్తరము. పది వేలరూపాయలబెట్టి యొకనీరుతోడుయంత్రమునుగొని పని జేసిన యెడల రోజునకు నూరెకరముల పొలమునకు గావలసిననీటిని నూతిలోనుండితోడవచ్చును. మనమామూలు ఏతాముమూలమునగాని "కపిలె" మూలమునగాని, యింతటిపనిచేయుట కవకాశములేదు. కాని మూడునాలుగెకరములమాత్రముసాగుచేయువానికింతఖర్చు చేయుటకు సామర్థ్యమెట్లుండును? అట్టియంత్రమునొకదానిని వానికిచ్చినప్పటికిగూడ దానివలన నుపయోగమునుబొందుటకు వానికవకాశముండదు; రెండుమూడెకరములపొలమునకు నీళ్లుపెట్టుటకొరకయంత్రమావశ్యకముకాదు. మనవ్యవసాయవ్యవహారముల పరిమాణమధికమై యొక్కొకరు నలువదియేబది యెకరముల పొలమునుసాగుచేయువారైనప్పుడె యిట్టియంత్రముల నుపయోగింప నవకాశముకలుగును. ఇట్లే, మామూలుమగ్గమునుగూడ గొనలేనివాడుయంత్రముల గొనుటకు సమర్థుడు కాజాలడుగదా? కనుక, యంత్రములవలన లాభముల మనము పొందగోరితిమేని వ్యవహారపరిమాణము నధికము జేసికొనవలెను. యంత్రములగొనగలిగినంత మాత్రముచేత లాభమేమియురాజాలదు. వానినుపయోగించుట కవకాశముగూడనుండవలెను. ఒకధనికుడు పదివేలరూపాయల బెట్టి యొక బియ్యపుయంత్రమునుగొనగలిగియుండును; కాని వానిఖర్చుకు నెలకు పదిబస్తాలధాన్యముకంటె నెక్కువ దంప ననసరము లేనియెడల వాడు కొనినయంత్రము నిరర్థకమగును గదా? ప్రతిదినమును వందలకొలదిబస్తాలధాన్యమును బియ్యముగమార్పవలసినప్పుడేయట్టియంత్ర మావశ్యకమగును. మఱి

యొకయుదాహరణమునుగూడ మనముదీసికొనవచ్చును. అనేకపట్టణములలో స్వల్పపరిమాణవ్యవహారములగు ముద్రణాశాలలున్నవి; కాని యంత్రసహాయమున బనిచేయుశాలలు తక్కువ; ఏలన, చిన్నపట్టణములలో ముద్రణాలయములకు విస్తారముపనిలేదు; అధికవ్యయముచేసి యొకయంత్రమునుగొనినప్పటికి, నదిచేయగలిగినంత పనినిదానిచేజేయించుట కవకాశముండదు: అందుచేతనది విశేషకాలము వ్యర్థముగనుండవలసియుండును. ప్రతిపట్టణమందు ననేకములగు చిన్నముద్రణాలయములుండుటకు బదులుగొప్పపట్టణములందే ముద్రణాలయములుండుటయు, జిన్నపట్టణములందనేకములుండుటకు బదులొక్కటేయుండుటయు సంభవించినయెడల, నొక్కొకముద్రణాలయముచేయవలసిన పనియధికమై 'అలయాధికారులు' యంత్రములగొని, వాని చేబనిజేయింపసమర్థులగుదురు. యంత్రోపయోగమనుభవించుటకు వ్యవహారపరిమాణ మధికముకావలయును.

(3) అధికపరిమాణముగల వ్యవహారముల జేయువారికి క్రయవిక్రయములం దల్పవ్యవహారముజేయువారికంటె నధికలాభము కలుగును. సాధారణముగ మనము పదార్థముల వేనినైనను విశేషముగ గొనునపుడవి మనకు జౌకధరల కుదొరకుచుండును. చిల్లరగ నొకటిరెండుగజములగొనుటకు బదులొక తానునుగాని, యొకబేలుబట్టలనుగాని కొనునపుడు వర్తకులుమనకు జౌకగనిచ్చుచుందురు. అధికముగ వ్యవహారముజేయువానికీకారణమున నాతడుకొను పదార్థములన్నియు జౌకగ దొరకుటచేత నల్పవ్యవహారముజేయువానికంటె నతడధిక

లాభమును బొందగలవాడగును. ఇనుపదారి మూలమునగాని, బండ్లపైనిగాని, పడవలపైనగాని యెక్కువసరకుల దెచ్చునపుడు దానిఖర్చుల రేటు తక్కువగనుండును. ఇందుమూలమునగూడ నధికవ్యవహారముచేయువానికెక్కువలాభముకలుగును. ఇట్లే యతడు సరకుల నమ్ముటలో నెక్కురకముల వస్తువులనుత్పత్తిజేయగలవాడగుటచేతను, ప్రత్యేకముగ దానుత్పత్తిగావించినవానినిబత్రికలమూలమునను నౌకరులమూలమునను బ్రచురపఱుప సామర్థ్యముగలవాడగుటచేతను, నల్పవ్యవహారము జేయువానికంటె నధికతరలాభమును బొందువాడగును. కావున లక్షలకొలదిగజములబట్టనుత్పత్తిజేయువాడొక్కొకగజమునకర్ధరూపాయచొప్పున నమ్మగలిగి మొత్తముమీద నెక్కువయాదాయమును సంపాదించును. మామూలునేతగాడు పందరెండుపందలగజములమాత్రము నేయువాడై యిట్టిసదుపాయలోపముచేత గజమును తొమ్మిదిపదియణాలకు గాని యమ్మలేకుండును. బట్టలగొనదలచువారందఱు మొదటివాని దగ్గరకు వెళ్లుదురు. వానివ్యాపారమీహేతువుచే మఱింతయధికమగును.

కావున కార్యవిభజనమందును యంత్రముల నుపయోగించుటయందును క్రయవిక్రయముల జేయుటయందును నధికపరిమాణ వ్యవహారమందుండు సదుపాయము లల్పపరిమాణవ్యవహారమందుండజాలవు. అల్పవ్యవహారముజేయు నూర్గురు కర్మకరులకంటె నధికవ్యవహారము జేయువారు పదిమంది తక్కిన తొంబదిమందిని సేవకులుగజేసికొని ధనోత్పత్తిగావించుచుండుటలాభకరమగును. ఇట్టిపద్ధతులవలనఖర్చునధికముజేయక

పదార్థసముదాయమును మాత్రము హెచ్చింపవచ్చును. అందుచేత వ్యవహారము నడుపువారికి గాక, పదార్థములగొని యనుభవించువారికి సహితము లాభమధికమగును. పాశ్చాత్యదేశములనుండి మనము తెప్పించు సరకులలో ననేకములు చౌకగనుండుట కా దేశములలోని వ్యవహారము అధికపరిమాణముగలదిగ నుండుట యొకముఖ్యకారణము. మన దేశముయొక్కస్థితిగతులను బాగుచేయుటకై పాటుపడదలచువా రీవిషయమును జక్కగ గమనింపవలెను. ఏలన, ఇట్టి వ్యవహారబాహుళ్యమును బదార్థోత్పత్తియందు యంత్రముల నుపయోగించుటయును గొంద ఱాక్షేపించుచుందురు. వీనివలన స్వతంత్రముగ బనిచేయువారి సంఖ్య తగ్గుననియు, స్వల్పసంఖ్యాకులగు కొందఱు ధనికులు తక్కినవారినందఱిని స్వాధీనము జేసికొని వారిస్వేచ్ఛకు భంగముగలిగింతురనియు, స్వేచ్ఛాజీవనము జేయువారి సంఖ్య క్షీణించుట శ్రేయస్కరము కాదనియు వీరు వాదించుచుందురు. అల్పపరిమాణ వ్యవహారములుండు దేశమున స్వతంత్రజీవనము జేయుచుండువారి సంఖ్య యధికముగ నుండవచ్చును; కాని, యట్టివారి స్వాతంత్ర్యమెంతవఱకు సుఖదాయకమైనదో, విచారింపవలసియుండును. ఏపూటకుగావలసిన యాహారము నాపూటసంపాదించుకొనుచు, ఏమాత్రము మూలధనము కావలసియున్నను సాహుకారులవద్ద నూటికి బదునెనిమిది యిరువదినాలుగు చొప్పున వడ్డికి దీసికొనుచు నుత్పత్తిగావించిన పదార్థమును సాహుకారునిర్ణయించినధరలప్రకారము వానికే యమ్ముచు వానినెల్లప్పుడును ననుసరించి వెళ్లుచుండు అల్పవ్యవహారము జేయు

కర్షకులు కర్మకరులు లోనగువారి నెందఱినో మనదేశమందు జూచుచున్నాము. స్వల్పముగ వ్యవహారము జేయుచుండువారి స్థితి సామాన్యముగ నిట్లేయుండును. దారిద్ర్యబాధకులోబడినవారై పేరునకు మాత్రము స్వతంత్రముగలిగి నిజముగ సాహుకారులకు దాసులై యిట్టివారు వర్తించుచుందురు. వ్యవహారమధికపరిమాణము గలదియై యంత్రముల నధికముగ నుపయోగింపబడు దేశములలోని కర్మకరులు స్వేచ్ఛాహీనులై కొన్ని కష్టములపాలు గావలసియుండవచ్చును; కాని మొత్తముమీద నల్పవ్యవహారముల స్వతంత్రముగ జేయుచుండువారిలో ననేకులకంటె వారిస్థితి యుత్తమముగనుండును. ఈవిషయ మందఱివలన సంపూర్ణముగ నాలోచింపదగియున్నది.

ఒంటరిగ వ్యవహారము జేయువా డధికపరిమాణముగు వ్యవహారమును బ్రారంభింపసమర్థుడుకాడు. ఎంతయోధనముండినగాని యిట్టిపనుల నితరులసహాయమపేక్షింపక మొదలిడుట దుస్తరము. ఒకవేళభాగ్యవంతుడొకడు బాహుళ్యముగ వ్యవహారము జేయదొడగినను, ఏపనులవలన లాభమునిశ్చయముగను ననాలస్యముగను జేకూరగలదో యట్టి వానినే చేయబూనునుగాని యాలస్యముగ లాభముకలిగించువాని నారంభింప జాలడు. ఈకారణములచేత గొందఱితరులలో భాగస్థులుగ గలసి వ్యవహారము జేయుచుందురు. ఒంటరిగవ్యవహారము జేయుటకంటెనొకటిరెండు విషయముల నిదియెక్కువ లాభకరముగ నుండును. ముఖ్యముగ నెక్కువమూలధనముతో బనిని ప్రారంభించుటకును, వ్యవహారము నధికపరిమాణముగలదిగ జేయుటకును దీనియందవకాశముండును. కాని ఆలస్యముగ

లాభముగలిగించు వ్యాపారముల మొదలిడుట కిట్టిభాగస్థులు కూడ జంకుచుందురు. క్రొత్తగ నేదైన నొకవ్యవహారమును స్థాపించుటలో ధైర్యసాహసము లధికముగనుండవలెను. అగ్గిపెట్టెలను మనమితర దేశములనుండి తెప్పించుకొనుచున్నాము. వానినిమన దేశమందిదివఱ కుత్పత్తిజేయుటకై తగువిధమున బ్రయత్నించినవా రెవ్వరు లేరు. అట్టిదానిని గ్రొత్తగ జేయబూను వానికి తత్క్షణమే లాభము దొరకకపోవచ్చును. పదునైదు ఇరువది సంవత్సరములు నిరీక్షించియుండినగాని లాభముగాదను భయముకూడనుండవచ్చును. ఇటువంటిపనులను జేయుట కందఱు వెనుదీయుచుందురు. ఇద్దఱుకలసిభాగస్థులుగ బనిజేయుచున్నప్పుడుగూడ నిట్టి వ్యాపారములవలన నష్టమువచ్చి వారియాస్తియంతయు క్షయమగునన్న భయము వారికిగలుగవచ్చును. కావునసుత్తరకాలమున నెంత లాభకరములుగనుండినను, నప్పటికప్పుడు లాభమునియ్యకపోవుటచేత నిట్టిపనుల బూనుటకొంటరిగ వ్యాపారముజేయుచుండువారుగాని భాగములమీదవ్యాపారము జేయుచుండువారుగాని సాహసింపరు. ఇదిగాక, యిట్టివారికి మఱియొకకష్టముగూడనున్నది. ఇద్దఱు కలసి రెండులక్షలరూపాయ లప్పుపుచ్చుకొని వారిసొంతయాస్తితోగూడ నొకవ్యాపారము జేయుచున్నారనుకొందము. అందులోనొకనికి లక్షరూపాయలాస్తియు మఱియొకనికి బదివేలరూపాయలాస్తియు నున్నదనుకొందము. దురదృష్టవశమున వారికి వ్యాపారమందు నష్టముకలిగినయెడల మొదటివాని లక్షరూపాయల యాస్తియంతయు నప్పులవారుతీసికొని పోవచ్చును. ఆస్తిలో గొంతభాగము మాత్రమప్పులక్రిందబోవుననియు

తక్కినదియుండుననియు జెప్పుటకు వీలులేదు. భాగస్థులలో నొక్కొకని యావదాస్తియు వ్యాపారమందు గావించిన యప్పులకంతకు పూచీయైయుండును. ఏమాత్రము నష్టము వచ్చినప్పటికిని, తనయాస్తియంతయు బోవునేమోయనుభయముచేత భాగముల పద్ధతిని వ్యాపారముజేయుచుండువారు సాధారణముగ నుత్తరకాలమందెప్పుడో యాదాయమునుగలుగజేయువ్యవహారముల జేయసాహసింపరు. కాని, దీనివలన దేశమునకు విస్తారనష్టముకలుగవచ్చును. తాత్కాలికఫలమునే యపేక్షించుచు, నుత్తరకాలలాభముపై దృష్టినుంచకపోయిన యెడల గ్రొత్తవ్యవహారములును గ్రొత్తపద్ధతులును దేశమందు వ్యాపింపజాలవు. క్రొత్తదియనగనే ప్రతిమనుష్యునికిని గొంచెముభయమును, ననుమానమును గలుగుచుండును; అందువలననట్టివానిని బ్రారంభించుటకందఱు వెనుదీయు చుందురు. కాని, సాహసించి క్రొత్తవ్యాపారములలో నడుగిడకుండుట దేశమునకు శ్రేయస్కరముకాదు.

ఇట్టిసందర్భమున మనమాలోచింపవలసిన విషయములు కొన్నియున్నవి. క్రొత్తవ్యవహారముల నధికపరిమాణముగలవిగ స్థాపించుటకు గావలసిన మూలధనమును సంపాదించుటయెట్లు? మూలధనములో గొంతభాగమిచ్చి వ్యవహారములో భాగమును దీసికొనినవారికి వారియాస్తియంతయు పోవునేమోయన్న భయమును వారించు మార్గమేది? అట్టి భయము లేనప్పుడే వారు క్రొత్తవ్యవహారములందు జేరుటకు బూనెదరు; ప్రాత వ్యవహారములను సహిత మధిక పరిమాణము కలవిగ జేయబూనితిమేని యధికమగు మూలధన మావశ్యకమై

యుండును. ఇద్దఱుముగ్గుఱుమాత్రముకలిసినయెడలనీకాలమున
వ్యవహారములకు గావలసినంత మూలధనము కూడ జాలదు.
అనేకులు కలిసి పనిచేయుట యావశ్యకము. అనేకులు కలిసి
నపు డెవరు పొరబడినను వ్యవహారమునకు నష్టమురావచ్చును
ఇట్టినష్టములవలన వంతుదార్లయొక్క యావదాస్తియు పోవున
నుభయ ముండినయెడల ననేకులుకలియుటదుస్తరము. కావున
నట్టిభయమున కవకాశ మీయక యనేకులను వంతుదార్లుగ
జేర్చి విశేషమగు మూలధనమును సంగ్రహించి యధిక పరి
మాణముగల వ్యవహారముల స్థాపించుట యవసరము వీని
యన్నిటికిని జాయింటు స్టాకు కంపెనీలపద్ధతి సాధనమైయున్న
ది. ఈపద్ధతిననుసరించి మనము ధనోత్పత్తికి గడగినగాని మన
దేశపుస్థితిగతులు బాగుపడజాలవు.

ఈపద్ధతియొక్క ప్రధానలక్షణము వంతుదార్లకు వ్య
వహారములోని యమితమగుపూచి (Limited liability) యుం
డుటయే. అనగా వ్యవహారమునందు నష్టమువచ్చి దానిని మూ
సుకొనవలసి వచ్చినపుడు ప్రారంభమున నిర్ణయించుకొనిన
మొత్తమునకే వంతుదార్లు బాధ్యులైయుందురు గాని వానియా
స్తియంతయు వ్యవహారమునందలి యప్పులకొఱకై తీసికొనబడు
ననుభయముండదు. ఒకవ్యవహారమునుస్థాపించుటకు బదిలక్ష
లరూపాయలు కావలసియున్నదనుకొందము. భాగములపద్ధతిని
ఇద్దఱుముగ్గుఱుమాత్రముకలసి యంతటిసొమ్మును జాగ్రత్తపెట్టు
టదుస్తరము. వ్యవహారమునందలి యప్పులకంతకు ప్రతిభాగ
స్థుడు వాని యావదాస్తిపర్యంతము బాధ్యుడై యుండవలెను.
ఈకారణముచేతగూడ వారు సాహసించి యాపనిని బ్రారంభిం

పక పోవచ్చును. ఇట్టిసందర్భమున చందాలమూలమున నీవ్య
వహారమును స్థాపింపనెంచి యయిదారుగు రనుభవశాలురు
కలసి కావలసిన యేర్పాటుల గావింపవచ్చును. ఎవరైనను న
యిదు రూపాయలకు తక్కువగాని చందా నియ్యవచ్చుననియు
నయిదురూపాయల కొకవంతనియు నట్టివంతుల నొక్కొక
డెన్నియైన దీసికొనవచ్చుననియు వ్యవహారమువలనగలిగినలా
భమును చందాదార్లకు వారి చందా మొత్తము ననుసరించి
యియ్యబడుననియు బ్రచురపరుపవచ్చును. అయిదేసి రూపా
యల కొకవంతు దొరకునుగనుక రెండు మూడు జిల్లాలలోని
వారు కొందఱొకవంతు చొప్పునను మఱికొందఱు రెండు,మూ
డు,పది,నూరుచొప్పునను వంతులుదీసికొనినయెడల సులభము
గ నీపదిలక్షలరూపాయలు జతపడును. వంతుదార్లపూచీనియ
మితముగనుండునని చెప్పియుంటిని. అనగా నిట్టికంపెనీలో నొ
క డొకవంతు దీసికొని అయిదురూపాయల జెల్లించిన యెడల
కంపెనీకినష్టముగలిగి యదిదివాలా తీసినప్పుడుగూడ నావంతు
దారుని యయిదు రూపాయలు మాత్రము పోయిన బోవును
గాని వానితక్కినయాస్తి కెట్టినష్టము గలుగజాలదు. ధనికుడ
గువాడు నూరువంతుల దీసికొని యయిదువందల రూపాయల
జెల్లించినయెడల కంపెనీకి నష్టమువచ్చినపు డామొత్తముమా
త్రము పోవునుగాని వానితక్కిన ధనమునకెట్టి భంగమురాజా
లదు. వంతుదార్లెన్నివంతులదీసికొనెదరో వానిఖరీదుమొత్త
మువఱకే వారిపూచీ నియమితమైయుండునుగాని, నియమములే
క వారియాస్తినంతను తుడుచుకొనిపోవునట్టిదిగ నుండదు.
కావున తక్షణమే లాభమురానిపనులు జేయుటకునునష్టమువచ్చి

నను రావచ్చుననను అనుమానముండు వ్యవహారముల స్థాపించుటకును నిట్టి నిర్ణీతమగు పూచీపద్ధతి చాల నుపయోగకరముగ నున్నది. ఈకారణముచేత నిట్టివ్యవహారములు ప్రస్తుతకాలమందన్ని దేశములలో నెలకొల్పబడుచున్నవి. ప్రతిదినమును మనవార్తాపత్రికలయందిట్టి కంపెనీలస్థాపించుచున్నామనియు వానిలో వంతుల దీసికొనవలసినదనియు ననేక ప్రచురణములగపడుచుండును. ఎంతటిస్వల్పధనముండువాడును గూడ వీనిలోజేరి, వీనిని వృద్ధిపఱుప బ్రయత్నింప వచ్చును. లాభము వచ్చినసరే; నష్టము సంభవించినయెడల దానివలన వానిస్థితి సంపూర్ణముగ జెడిపోవునుభయము లేదు. కావున నిట్టికంపెనీలకు గావలసిన లక్షలకొలది మూలధనము సులభముగ జేరుటకవకాశమున్నది. వంతుదారు నకొకనికి నావ్యవహారములో నుండుటకిష్టము లేనియెడల వానివంతును మఱియొకరికమ్మివేయ వచ్చును. ఇతరపదార్థముల క్రయవిక్రయముల జేయువారికి సలహానిచ్చు వర్తకులవలె వంతులను అమ్మిపెట్టులకును నెందఱోదళార్లుందురు. ఈసౌకర్యమును బట్టికూడ ననేకులిట్టివ్యవహారములలో వంతులు దీసికొనసాహసింతురు. మామూలు భాగస్వవహారములలోని భాగస్థుడొక డితరభాగస్థుల యనుజ్ఞ లేనిదియు వ్యవహారమునుండి తొలగి పోవుటకు వీలుండదు. ఒకభాగమును దీసికొనినయెడల వ్యవహారమందిష్టము లేకపోయినను దానియందతడుండితీరవలెను. 'జాయంటుస్టాకుకంపెనీల యందిట్టినియమము లేదు. మనదేశమందిటీవలస్థాపింపబడినబ్యాంకీలు ఇనుపదారివ్యవహారములు, కాపీతేయాకు తోటలు, ఇనుము బొగ్గు బంగారు గనుల వ్యవహారములు, దూది

జెట్టులుచేయు వ్యవహారములు లోనగునవన్నియు నీకంపెనీపద్ధతి ననుసరించినవై యున్నవి. 1914 సంవత్సరమున నిట్టి కంపెనీలు 2681 సుమారు అయిదుకోట్ల రూపాయల మూలధనముతో వ్యవహారముజేయుచుండినవి. ఈనాలుగైదుసంవత్సరములలో వీనిసంఖ్య చాలయధికమాయెను.

అధికపరిమాణవ్యవహారముల స్థాపించుట కీకంపెనీల పద్ధతి మిక్కిలి యనుగుణమైయుండును. వంతుదార్లొకప్రదేశమువారుగాక, యనేకస్థలములనుండు వారగుటచేత వ్యవహారమునుజరుపుటకు వీరందఱునొకపంచాయితీని ఎన్నుకొందురు. వ్యవహారముఖ్యవిషయములోని ప్రధానాంశముల పంచాయతీదార్లు తీర్మానించుచు, సేపనియం దెవరు నేర్పుగలిగియుందురో యట్టివారిని గార్యదర్శులుగను నిర్వాహకులుగను నియమించి వారిసలహాననుసరించి కార్యములజరుపుచుందురు. కార్యవిభజనమునకిది యెంతయో యనుకూలించుటవలన సాధారణముగ నీపద్ధతి లాభకరముగనే యుండును. ఇట్టికంపెనీలవలన నుపయోగాంతరము లెన్నియో యున్నవిగాన, నాపద్ధతిని బ్రజాసామాన్యమునకు బోధించి, యట్టివానిని దేశమందు స్థాపించుటకు బ్రయత్నముల జేయవలెను.

ధనోత్పాదకములగు వివిధ కర్మల గుఱించి యీసందర్భమున గొంచెము చెప్పవలసి యున్నది. ఈ కర్మలన్నియు నైదు రకములుగ నున్నవి. (1) మొదటిరకములోనివి వ్యవసాయము, గనులుత్రవ్వుట, వేట, అడవులను పెంచుట, చేపలబట్టుట, పచ్చికబయళ్ళమూలమున పశువుల పాలించుటలోనగు మూలకర్మలు. ప్రకృతిలో నణగియున్న వస్తుజాలమును బైకి

దీయుటయే వీనిప్రధానలక్షణము. వీనివలనగలిగినఫలితముల బట్టియే తక్కిన కర్మలగావించుట కవకాశము గలుగుచున్నది ఈకారణముచేత నివి మిగిలిన కర్మలకన్నిటికి మూలాధారములై యున్నవి. (2) రెండవరకములోని కర్మలకు "పక్వకర్మలు" లేక "శిల్పములు" అని పేరిడవచ్చును. మూలకర్మలవలన నుత్పత్తిగావింపబడిన పదార్థములు తత్క్షణమే అనుభవించుటకు యోగ్యములై యుండవు. వ్యవసాయమువలన నుత్పత్తియగు ధాన్యమును దంచి వండినగాని యుపయోగకరముకాదు; ప్రత్తిని వడికి నేసినగాని యనుభవయోగ్యముకాదు; అడవులలోని చెట్లనుగొట్టి యుపకరణములుగ దయారుగావించిన గాని ప్రయోజనము కలుగదు. శిల్పకర్మలు చేయు కార్యమేమియన పదార్థముల స్వరూపమునుమార్చి, మనుష్యునిచే ననుభవింపదగినట్లుగ వానినిగావించుటయే. కుమ్మరిమంటియొక్క రూపమును మార్చి కుండను దయారు చేయుచున్నాడు: వడ్రంగి కఱ్ఱయొక్క రూపమును మార్చి తలుపులు పెట్టెలు కుర్చీలు లోనగు వానిని జేయుచున్నాడు: పంచదార జేయుట యన 'చెఱకు' యొక్క రూపమును మార్చుటయేగదా? కర్మకరులు చేయుపనులన్నియు నిట్టివిగ నుండును. ఇట్లురూపమును మార్చినగాని మూలకర్మలఫలములలో ననేకము లనుభవయోగ్యములు కాజాలవు. (3) మూడవరకపుకర్మలకు "యానకర్మ" లని పేరిడవచ్చును. వానిమూలమున పదార్థసముదాయమును నొక ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమునకు దీసికొనిపోవచ్చును. బరువులమోయు మనుష్యులు, జంతువులు, బండ్లు, పడవలు, ఓడలు, ఇనుపదారులు, ఆకాశయానములు మున్నగు

నవియిట్టివి. కర్మకరులు పదార్థముల నుత్పత్తి గావించినను వాని ననుభవింపదలచువా రెక్కడనుందురో యక్కడికి వానిని దీసికొనిపోయినగాని యవి యనుభవయోగ్యములు కాజాలవు. ఇంగ్లండునందు దూదిబట్టల నెంతయోయధికముగనుత్పత్తి జేయుదురు కాని యింగ్లీషువారు వాని నుపయోగించుట లేదు. ఇండియా, చైనా, పరిషియా మొదలగు దేశముల వారి యుపయోగార్థమై వారు వీనిని దయారుచేయుచున్నారు. వాని నీదేశములకు దెచ్చుటకు గావలసిన సముపాయములు లేనియెడల నవి యింగ్లండులో నిరర్థకములై యుండవలసినవేగదా? వానిని తయారుగావించినంత మాత్రమున లాభమేమియున్నది కావున వానిని ఇండియా మొదలగు దేశములకు దెచ్చు ఓడలు ఇనుపదారులు లోనగువానిని నడపువారు చేయుకర్మలు సహితము ధనోత్పాదక కర్మలనియే చెప్పవలసియున్నది. (4) వాణిజ్యకర్మలన్నియు నాలుగవరకములో జేరినవి. ఎవరికేపదార్థములు కావలయునో తెలిసికొని, కర్మకరుల నుండి వానిని దెప్పించి దగ్గర నుంచుకొని, వాని ననుభవించువారికవి యెప్పుడెంతవఱకు కావశ్యకమో యప్పుడంతవఱకు వానిని విక్రయించుచుండుట వర్తకుల ప్రధానకార్యమైయున్నది. (5) రూపరహితములగు ప్రయోజనముల నుత్పత్తి జేయుట ఐదవరకములో జేరినకర్మలు. ఉపాధ్యాయులు వైద్యులు గాయకులు వర్తకులులోనగువారు చేయుపనులిట్టివి.

యాన వాణిజ్య కర్మలును రూపరహితముల నుత్పత్తి జేయువారి కర్మలును ధనోత్పాదకములు కావని కొందఱి కనుమానము కలుగవచ్చును. కాని అట్లు సందేహింపవలసిన

యావశ్యకత లేదు. ధనము నుత్పత్తిగావించుట యనిన గ్రొత్తపదార్థములను ద్రవ్యములను సృష్టించుటయని అర్థము కాదు. ఒక యణువునుగూడ సృష్టిచేయుటకుగాని నాశము జేయుటకుగాని మనకు శక్తి లేదు. ధనోత్పత్తిలో మనము చేయునది యేమియన నుపయోగరహితమగు స్థితియందుండు ద్రవ్యముల నుపయోగసహితమగు స్థితిలోనికి మార్చుటయే. చేపలు నీళ్ళలోనుండునంత వఱకవి మనుష్యుని కుపయోగములుకావు. చేపలవాడు వానిని సృష్టించుటలేదు. వానిని నీటినుండి వెలుపలకుదీసి మన కుపయోగకరములుగ జేయుచున్నాడు. కర్షకుడు వరినినుత్పత్తి జేయుటలేదు. భూసారమందును భూమి నావరించియుండు వాయువునందునుగలపదార్థముల గొన్నిటిని వరిరూపముగ బరిణమింప జేయుచున్నాడు. ఈ రూపము నవిదాల్చినపుడే వానివలనమనకు బ్రయోజనముకలుగుచున్నది. ఇట్లే శిల్పి యగువాడు క్రొత్తగ ద్రవ్యమును సృష్టించుటలేదు. దానియొక్క రూపమును మాత్రము మార్చి మనకెక్కువ యుపయోగమును గల్పించుచున్నాడు. ధనోత్పాదకులందఱు జేయుపని ఉపయోగముల నుత్పత్తి జేయుటయే గాని ద్రవ్యముల సృష్టిచేయుట కాదు. ఈ యుపయోగము రూపము మారుట వలన గలుగ వచ్చును; స్థానము మారుట వలనను గాలము మారుటవలన గూడ గలుగవచ్చును. యానకర్మల జేయువారు పదార్థములయొక్క స్థానమును మార్చి మన కుపచరించుచున్నారు. వర్తకులు కాలానుగుణములగు ప్రయోజనముల గల్పించుచున్నారు. మనకువలయుపదార్థములన్నిటిని సంగ్రహించి దగ్గఱనుంచుకొని మనకెప్పుడు కావ

లసియుండిన నప్పుడు వాని నిచ్చుటకు వర్తకుడు సంసిద్ధుడై యుండును. సంవత్సరమున కొకకుటుంబమునకు పదిబస్తాలబియ్య మావశ్యకమైయుండ దానినంతను నొక్కమారే కొనుట కాకుటుంబమువారు సమర్థులు కాకపోవచ్చును. నెలకొకబస్తాచొప్పున వారికి వీలైనప్పుడు కొనదలచుకొనినయెడల నెలనెలకు వారికిచ్చుచుండు వాడొకడుండ వలయునుగదా? వర్తకుడాపనిచేయుటవలన సంఘమునకంతకు నుపకారము చేయువాడుగా నున్నాడు. రూపరహితములగువాని నుత్పత్తి జేయువారు ధనోత్పాదకులా? కాదా యనువిషయమును గుఱించి మొదటియుపన్యాసమున జెప్పియుంటిని.

మనదేశమం దీయైదువిధములగు కర్మలగుఱించిన విషయము లెన్నియో యాలోచింపదగియున్నవి. వాని నన్నిటిని సవిస్తారముగ నిక్కడజెప్పుటకువీలులేదు. ప్రధానాంశముల మాత్రము కొన్నిటినిసూచించెదను.

(1) మూలకర్మలలోనెల్ల వ్యవసాయము ప్రధానమైనది. మనదేశములోని ప్రజలలో నూటికి డెబ్బదిరెండుచొప్పున వ్యవసాయముమూలమున జీవించుచున్నారు; కావున నీవృత్తిని బాగుపఱచినయెడల జనసామాన్యమంతయు బాగుపడగలదు. ఇప్పటికంటె సాదాయకరముగ నీవృత్తిని జేయుటెట్లు అని యాలోచించుటలో నిదివఱకు ధనోత్పత్తి విషయమై నేనుజెప్పినసంగతు లన్నియు మిక్కిలి సహకారులుగ నుండును. ఈసందర్భమున గొన్నిసంస్కరణములు మిక్కిలియావశ్యకములని యెల్లఱు నంగీకరించుచుందురు. ఎరువులుమొదలగువానిమూలమున భూసారమును వృద్ధిగావింప వలెననియు,

‘ఉపకరణాదుల’ క్రింద రైతు లెక్కువధనమును వ్యయము జేయవలెననియు, రైతులిప్పటికంటె విద్యావంతులై నవీన పద్ధతుల నుపయోగింప సంసిద్ధులు కావలయుననియు, నందఱు చెప్పుచుందురు. కాని, ఇంతకంటె ముఖ్యములగు విషయములు రెండుమూ డున్నవి. వానిలో జేయవలసినమార్పుల జేసినగాని తక్కినసంస్కరణములు సాధ్యములు కాకపోవుట యేగాక, సాధ్యములైనను విస్తారలాభకారులు కాజాలవు. (1) మన దేశములోని వ్యవసాయమిప్పటికంటె నధికపరిమాణము లగు వ్యవహారములగలిగి యుండవలెను. ఒక రైతుసాగుచేయు గః భూమియొక్క విస్తీర్ణత యతడు పండించు పంటలయొక్కయు భూసారముయొక్కయు నతడుపయోగించుపనిముట్లు మొదలగువానియొక్కయు, స్వభావము ననుసరించియుండును. కాని, సామాన్యముగ సాగుచేయు పొలమునుండి యతని కుటుంబపోషణమునకు వలయు ధనసముదాయము మాత్రమైన నుత్పత్తికాకపోయిన యెడల నతని వ్యవహారము మిక్కిలి యల్పపరిమాణముగలదియని చెప్పదగియుండును. వ్యవసాయమువలన జీవింపదలచినవాని కతడు సాగుచేయుపొలము కొంచె మధిక విస్తీర్ణతగలదైనప్పుడుగాని యిట్టి కుటుంబపోషణమున కనుగుణముగనుండదు. ఇంతకంటె నల్పవిస్తీర్ణతగల భూమిని సాగుచేయుచుండువాడు వ్యవసాయమువలన మాత్రమే జీవింపలేక తక్కినపనుల నేదినైన జేయుచుండ వలెను; ఇందుచేత కార్యవిభజన సౌకర్యములుగూడ తగ్గిపోవును. అధికవ్యయముజేసి క్రొత్తపద్ధతు లవలంబించుటకును, యంత్రసహాయమున బని జేయుటకునుగూడ నిప్పటికంటె వ్యవహారము లధికపరిమాణ

ములు కలవి కావలెను. ఎక్కువ విస్తీర్ణతగల భూమి స్వాధీనమందుండిన యెడల నప్పులు తక్కువ వడ్డీకి దొరకుచుండును. ఈకాలమున మన రైతు లధికములగు వడ్డీల కప్పులు పుచ్చుకొనవలసియుండుటకు వారి యల్పవ్యవహారములే కారణములు. కావున నొకయకరమును రెండుమూడెకరములను సాగుచేయుచుండు రైతులు స్వతంత్ర వ్యవసాయమును మాని వారిభూముల నితరులకమ్మి కూలివృత్తివలన గాని మఱియొకవృత్తివలనగాని జీవింపదొడగుట మిక్కిలి శ్రేయస్కరము; అమ్ముట కిష్టములేనియెడల ‘మక్తా’ పద్ధతినైన నితరులకిచ్చుటకు సంసిద్ధులైయుండవలెను. ఇట్లిట్టివారు చేసిన యెడల స్వతంత్రముగ వ్యవసాయముజేయుచుండు రైతుల వ్యవహారము లధికములై దానివలన నెక్కువలాభము కలుగుట కవకాశ ముండును. బొత్తుగ భూమిలేనివానికన్న ‘అరయెకరము’ భూమి యుండుట మిక్కిలి గౌరవకరమనియు, భూమి యుండువాడు దానిని వదలిపెట్టుకొనుట ప్రశస్తముకాదనియు, భూమివంటి యాస్తి మఱియొకటి లేదనియు మన వారభిప్రాయపడుచుందురు. కాని, అల్పవిస్తీర్ణతగలభూముల లాభకరముగ వ్యవసాయముజేయుట దుస్తరమగుటచేతను, అట్టి భూములుగలవారు సాధారణముగ నప్పులపాలై వానిని సాహుకార్లకు ‘తాకట్టు’ పెట్టియుండువారగుటచేతను, నట్టివారు వారి భూముల వదలుకొనుట యే క్షేమకరము. కొన్ని దేశములలో స్వతంత్రముగ వ్యవసాయము జేయు రైతెంతయో కొంత విస్తీర్ణతకు తక్కువ కాని పొలమును కృషిచేయవలయునని దొరతనమువారు శాసనములమూలమున నిర్బంధపఱచుటయుగూడ సంభవించు

చున్నది. మనదేశమునగూడ నిట్టిశాసన మొకదాని నమలులో నుంచిన యెడల బాగుగనుండును. శాసనమువలన గాకపోయినను మఱియొక పద్ధతిమూలముననైన రైతులవ్యవహారపరిమాణము నధికపరుపవలెను. (2) మనవ్యవసాయపద్ధతులలో మఱియొకలోపముగూడ నున్నది. సాధారణముగ నొక్కరైతుసాగుచేయుపొలమంతయు గ్రామములో నొక్కప్రదేశమందుండక దానిలో నొకచేనొకచోటను, మఱియొకచేను మఱియొకచోటను, నింకొకటి వేఱొకచోటను గ్రామమందంతయు చెదరియుండును. అయిదెకరములొకనికుండినయెడల సామాన్యముగ నవి ఐదారుప్రదేశములలో వెదజల్లినట్లుండును. ఇందువలనగూడ ననేకనష్టములు కలుగుచున్నవి. సాగుచేయుపొలమంతయు నొక్కప్రదేశమందేయుండినయెడల దానికొఱకై యొకనూతినిగాని మఱియొక జలాధారమునుగాని త్రవ్వుకొనవచ్చును: అది యైదారుభిన్నప్రదేశములందున్న యెడల నైదారునూతులు త్రవ్వినగాని వానిపొలమంతకును నీరుదొరకజాలదు; కాని యొకనూతినిద్రవ్వుటకే శక్తిలేని మనరైతులిన్నిటిని ద్రవ్వుట యెట్లుసంభవించును? త్రవ్వినను నవి చాల నఱకు నిరర్థకములై యుండునుగదా? ఇట్లే, తనపొలములోనికి నితరుల పశువులు రాకుండుటకును, నితరుల పశువులతో దనపశువులు కలియకుండుటకును, మఱికొన్ని సదుపాయముల బొందుటకును, పొలము చుట్టు కంచెలగట్టుకొనుట యావశ్యకము. ఇదియును పొలమంత ఒకప్రదేశమందున్నప్పుడే సాధ్యముగను లాభకారిగను నుండును. రైతు, వానిపొలమందే యింటినిగట్టుకొని కాపు

రము జేయుటవలన జాల నాదాయకరముగనుండును; కాని వాని పొలమైదారు ప్రదేశములందున్నప్పుడిట్లు కాపురముజేయుట దుస్తరమగును. వాని పొలములోని మడిమడికిని నాలుగు వైపుల నిరుగుపొరుగువారి మళ్లుండుటవలన, వారివైమత్యము తేనిదియు వానిపొలమును బాగుచేసికొనుట దుస్తరమగును. గనిమెల క్రిందను, కాలిత్రోవల క్రిందను, విస్తారమగుభూమి మన గ్రామములందు వ్యర్థపరుపబడుచున్నది. కాపురముండు గ్రామములోనుండి సాగుచేయు చేలకు వెళ్లుటయందెంతయో కాలము వ్యర్థమగుచున్నది. గనిమెలగుఱించిన కలహములు తఱచుగ రైతులలో గలుగుచుండుటకుగూడ నీపద్ధతియే కారణము. ఇన్నిలోపములతో గూడియుండు నీపద్ధతిని మాన్పి పలుప్రదేశములందొక్కనిచేలున్నప్పుడు వాని నన్నిటి నొక ప్రదేశమునకు మార్చుకొనుట కుద్దేశించు వానికి సదుపాయముల గలిగించి యీ సంస్కరణమును గావించినగాని వ్యవసాయ మిప్పటికంటె నాదాయకరము గాజాలదు: (3) వ్యవసాయమూలమున నుత్పత్తియగు ధాన్యాదుల విక్రయించుపద్ధతులయందు రైతులు కొన్నిమార్పుల జేసికొనవలెను. ప్రత్తి, జనుము, చెఱకు, నువ్వులు, మొదలగువాని నుత్పత్తిగావించువారును, ఆహారపదార్థముల నుత్పత్తిజేయువారిలో ననేకులును, వారి సరకులను దగినధరల కమ్మగలిగినగాని వారికృషి యాదాయకరముగ నుండదు. శ్రమపడి వీని నుత్పత్తిగావించినంతమాత్రమున వారు కృతార్థులుకాజాలరు. ఈ పదార్థముల నెచ్చట నమ్మవలెనో, యేధరలకమ్మవలెనో, ఎప్పుడెవ్వరికమ్మవలెనో తెలిసికొని తదనుసారముగ వ్యా

పారము జేసినగాని వారికి తగు ఫలము రాజాలదు. కొందఱు రైతులు పంటలు పండకముందే వానిని సాహుకారున కమ్ముట కంగీకరింతురు; మఱికొందఱు సమీపమునందలి పట్టణములలోని ఖరీదులు తెలియక సాహుకారు చెప్పిన నాఖరీదుల కమ్ముచుందురు. సాహుకారువద్ద నప్పుపుచ్చుకొనినవారు కుప్పలనూర్చిన వెంటనే వారిపంటల వాని స్వాధీనము జేయుచుందురు. ఇట్టిపద్ధతులవలన రైతులు వారి పదార్థములజాలతక్కువధరలకు విక్రయింపవలసినవారైయున్నారు. విస్తారలాభము వర్తకులు సంపాదింపగలిగియున్నారు. వీనిని మాన్పి, వీనిస్థానమున రైతులకు లాభకరములగు నుండుపద్ధతుల నెలకొల్పవలెను (4) క్రయవిక్రయములలో నవసరములగు మార్పుల గావించుకొనుటకును, చౌకగమూలధనమును సంపాదించుకొనుటకును, “పరపతిసంఘములు” మిక్కిలి యనుకూలింపగలవు. వీనిని మనగ్రామము లన్నిటియందును స్థాపించి, యిప్పటికంటె నెక్కువవిధముల నుపచరించునట్లు చేయవలెను. ప్రధానములగు నీసంస్కరణముల గావించిన యెడల, వ్యవసాయ మిప్పటికంటె నాదాయకరమగుట తప్పదు.

(2) మూలకర్మలవలన నుత్పత్తియగుపదార్థముల రూపమును మార్చి, వానిని యనుభవయోగ్యములుగ జేయుట శిల్పకర్మల లక్షణమైయున్నది. వీనిని వృద్ధిపరచుట కెట్టిసంస్కరణముల మనము గావించుకొనవలెను? ప్రస్తుతకాలమున మన మీవిషయమున మిక్కిలి వెనుకబడియున్నామని విదేశములనుండి మనముదిగుమతిచేయుసరకులు తెలుపుచున్నవి. మన మెగుమతిచేయునవి యన్నియు మూలకర్మలఫలములు; మనము

దిగుమతి చేయునవి యన్నియు పక్వపఱుపబడిన వస్త్రములు, యంత్రములు, పంచదార, ఇనుపదారులకు వలయుసామానులు, గాజుసామానులు, మోటారుబండ్లు, రంగులు, ఔషధములు లోనగునవిగ నున్నవి. ఒకప్పుడు మనము శిల్పకర్మలయందు గూడ మిక్కిలి నేర్పుగలిగి వస్త్రాదుల నితరదేశములకెగుమతి జేయుచుంటిమి. ఇట్టికర్మలిప్పుడు నశించుట కనేకకారణములు కలవు. వీనిలో గొన్నిటిని బునరుద్ధారణజేయుట కవకాశమున్నది; కాని, ప్రధానములగు సంస్కరణముల గొన్నిటిని మనము గావించుకొనవలెను. (1) నేత మొదలగుకర్మల నన్నిటి నధికపరిమాణవ్యవహారముల గలవానిగ, మనము మార్పవలెను. (2) పూర్వపు బద్ధతులను బనిముట్లను మాని యంత్రములు మొదలగు నవీనోపకరణముల మన ముపయోగించుటకు సంసిద్ధులము కావలెను. ఇట్టిపద్ధతిని మనవారిదివఱకే బొంబాయిమున్నగునగరములలో నవలంబించి, విస్తారలాభమును బొందగలిగియున్నారు. (3) జాయెంట్ స్టాకుపద్ధతిని వ్యవహారముల స్థాపింపగోరువారికి దగినప్రోత్సాహమును జూపి, వారి యుద్యమములకు దోడ్పడవలెను.

దేశమందలి ప్రజలలో వ్యవసాయాదిమూలకర్మలవలన జీవించువారి సంఖ్య యధికముగనుండవలెనా, లేక శిల్పములవలన జీవించువారధికముగనుండవలెనా, అను విషయము చర్చనీయమైయున్నది. ఏదేశమందెట్టి కర్మల కెక్కువసదుపాయము లున్నవో, యెట్టిపనుల జేయుటయందా దేశములోని వారెక్కువ నేర్పుగలిగియున్నారో యట్టి కర్మలమాత్రము వారు గావించి, వానివలన నుత్పత్తియగు పదార్థముల విదేశ

ములవారికి విక్రయించి వారివద్దనుండి తక్కినపదార్థముల గొనుట శ్రేయస్కరమని కార్యవిభజనమునుగురించి విమర్శించినపుడు చెప్పియుంటిని. ఈకారణముచే, మనవారిలో మూఁడు వంతులు మూలకర్మలలో బనిజేయుచుండిన యెడల వానియందు మనకెక్కువసదుపాయము లున్నవనియు, నిట్టిసదుపాయములు లేకపోవుటచేత వస్త్రాదుల నితరదేశములనుండి మనము తెప్పించుకొనుచున్నామనియు, జెప్పవలసియుండును. శిల్పకర్మల నభివృద్ధిజేయుటవలన మూలకర్మలలో బనిచేయుచుండు వారనేకులు వానినివిడిచి శిల్పకర్మలలో జేరవలసియుందురు. అనగా మనకెక్కువనేర్పు దేనియందున్నదో యాపనిని విడిచిపెట్టి తక్కువనేర్పుగలదానిలో బ్రవేశింపవలసివచ్చును. ఒకగజముబట్టను ఇంగ్లీషువారు రెండణాలఖరీదున నుత్పత్తిజేయగలరు. మనమన్నచో నర్ధరూపాయ ఖర్చుపెట్టవలయును. ఇట్టి సందర్భమున నింగ్లీషువారిచే బట్టలనేయించి, మన ముత్పత్తిజేయగల ప్రత్తి, గోధుములు, కాఫీ మొదలగువానిని వారికిచ్చి వారివద్దనుండి బట్టలకొనుట లాభకరముగాని, మనమే నష్టమువచ్చినను బట్టలు తయారుచేయ సంసిద్ధుల మగుట క్షేమకరమని తోఁపదు. ఎవరేపనియందు సమర్థులో దానిని వారుచేయవలయునని యొప్పుకొనినయెడల దేశమందు కర్షకు లధికముగనుండవలెనా, లేక శిల్పు లధికముగ నుండవలెనా, యను విషయ మంతముఖ్యముకాదని స్పష్టమగును.

కాని, యీవాదమునకు రెండుమూడాక్షేపణ లున్నవి. (1) దేశమందు వివిధములగువృత్తు లుండుటమంచిది. ఏదైన నొకసమయమున నొకదానికి నష్టముకలిగినను, దానివలనబ్రజలందఱు బాధపడక, యావృత్తిలోని వారుమాత్రమే బాధపడుదురు. అట్లుగాక, యధికజన మొక్కటే వృత్తియందున్నప్పుడు దానికెట్టియాటంకము కలిగినను నధికజనము బాధపడుట సంభవించును. మన దేశమున వ్యవసాయముమూఁడు వంతుల జనమునకు బ్రధానజీవనోపాయమైయున్నది. వర్షములు కురియక యొకసంవత్సరమున క్షామము సంభవించినపుడు ప్రజలందఱు నిరుద్యోగులై కష్టపడవలసియుందురు. ఇట్లుగాక కొందఱుమాత్రము దీనివలన జీవించుచు దక్కినవారు శిల్పములవలన జీవించుచుండినయెడల క్షామమువచ్చినపుడు కర్షకులకుమాత్రము బాధకలుగునుగాని శిల్పులు సుఖముగనే యుండవచ్చును. కావున శిల్పకర్మలం దిప్పుడు మనకు సదుపాయములు లేకపోయినను వానిని దేశమందు నెలకొల్పవలసిన యవసరమున్నది. (2) మన మవలంబించు వృత్తినిబట్టి మనగుణములు నిర్ణీతములగుచుండును. గ్రామములో వ్యవసాయము జేసిజీవించుచుండువారికిని బట్టణములలో వ్యాపారాదులవలన జీవించుచుండువారికిని గలభేదము వారి వృత్తులనుబట్టియే వచ్చుచున్నది. కర్షకులకు 'ప్రకృతి' సంబంధములగు భూమి, శీతోష్ణములు, వర్షము, వాయువు, మంచు, మొదలగువానితో నెక్కువసంబంధ ముండును. పురవాసులును శిల్పులునగువారికింతకంటె నితర మనుష్యులతోడి సంబంధ మధికముగ నుండును. వ్యవసాయముచేయువారీకారణముచేత సాధారణముగ నమాయకులుగను నిష్కపటులుగను నెక్కువదైవభక్తిగలవారుగనుందురు. శిల్పములవలన జీవించుచు జనసమ్మర్దముగల పట్టణములలోనివసించువారికి లోకజ్ఞానమును, సూక్ష్మబుద్ధియు

చుఱుకుదనమును నధికముగ నుండును. దేశ మభివృద్ధి గాంచుట కన్నివిధములగు సుగుణములును బ్రజలయందుండ వలెను. ఒకవిధమగు వృత్తులవలననే జీవించువారైన యెడల నొకవిధమగు గుణములే ప్రబలియుండును; తక్కిన గుణముల సంపాదించుట కవకాశముండదు. శాంతులు, పౌరుషవంతులు వినయముగలవారు, స్వేచ్ఛాభిలాషులు లోనగు నన్నిరకముల వారును దేశమందుండ వలయుననిన నిట్టిగుణముల నభివృద్ధి జేయు వివిధములగు జీవనోపాయములు దేశమందు స్థాపింపబడ వలెను. కావున వ్యవసాయమే ప్రధానవృత్తిగ నుండుటకు బదులు శిల్పములనుగూడ నేదియోయొకవిధమున వృద్ధిజేయు ట యావశ్యకము.

ఈ యాక్షేపణలు సమంజసము లవునో కావో చదువరు లాలోచింపవలెను. సమంజసములే యని తీర్మానించు వారు సహితము శిల్పముల నభివృద్ధిజేయుట కెట్టియుపాయముల ననుసరింపవలెనో విమర్శింపవలెను. విదేశములనుండి మన మిప్పుడు తెప్పించుచుండు సరకులపై సుంకము లధికము చేయుట యొకయుపాయము. ఇట్టి శిల్పకర్మల స్థాపించువారికిగలుగు నష్టముల బూరించుటకు దొరతనమువారు ద్రవ్యసహాయము చేయుట మఱియొకపద్ధతి. లేక సామాన్యముగ విద్యాభివృద్ధి గావించి శిల్పులనిప్పటికంటె నేర్పరులజేసి వారిచే వ్యవహారముల నడిపించుట మఱియొకయుపాయము. వీనిలో నేది ప్రశస్తమగు సాధనమో నిర్ణయింప నందఱు ప్రయత్నముగావింపవలెను

(౩) యానకర్మలు ధనోత్పాదకములని చెప్పుటకు గల కారణముల నిదివఱకే తెలిపియుంటిని. గడచిన నూఱుసంవత్స

రములలో నీకర్మలందు మన దేశమున గలిగినన్ని మార్పులు మఱిదేనియందును గలుగలేదు. అతికంకరతో నిర్మింపబడిన బాటలు, వంతెనలు, పడవలునడుచుటకనుగుణమగు కాలువలు ఇనుపదారులు లోనగు సదుపాయము లన్నియు గల్పింపబడినవి. వీనివలన కార్యవిభజనసదుపాయము లధికములై యే పంటల కెక్కువధర లున్నవో వానిని మాత్రము మన రైతులు పండించుటయు బంటల కెక్కువధర లే ప్రదేశమున దొరకుచున్నవో యక్కడికి వానినంపి యధికలాభమును బొందుటయు గావలసిన పదార్థము లెక్కడచౌకగ దొరకునో యక్కడనుండి వానిని దెప్పించుకొనుటయు హెచ్చుగ వేతనము లెక్కడ లభించునో యక్కడికి మనవారు వెళ్లుచుండుటయు సంభవించుచున్నది. ముఖ్యముగ వీనిలాభములన్నియు క్షామకాలమందగపడుచున్నవి. ఇనుపదారులు లోనగు ప్రయాణసౌకర్యములు లేనికాలమున నొకప్రదేశమున బ్రజలన్నము లేక చచ్చుచుండుటయు మఱియొకచోట నపరిమితముగ ధాన్యముండుటయు మామూలుగ నుండెను. ధాన్య మధికముగ నుండిన పరదేశములనుండి క్షామబాధితములగు ప్రదేశములకు దానిని దెచ్చుట కవకాశము లేకుండెను. ఇప్పుడన్ననో యీలాటి బాధ లన్నియు జాలవఱ కదృశ్యములైనవి. మారుమూలలందుండుటచే నింతవఱకు నుపయోగరహితములుగ నున్న గనులనుండి లోహముల బైకి దీయుటకును జొరసాధ్యముకాని యడవులమధ్యనుండు నుపయోగకరములగు పదార్థముల సంగ్రహించి మనుష్యులు కాపురము చేయుచుండు ప్రదేశములకు దెచ్చుటకును ఇనుపదారులవలె దోడ్పడగలసాధన

ములు వేఱులేవు. కావున వీనిసహాయముచేత మనఐశ్వర్య మధికమయ్యెనని చెప్పక తప్పదు. కాని వీనివలన గొంచెము నష్టము గూడ గలిగినదని పలువు రభిప్రాయపడు చుందురు. సముద్రముమీద పాశ్చాత్య దేశములనుండి తేబడుపదార్థము లనేకములు దేశమందంతట వ్యాపించుట కివియే హేతువులు. ఈపదార్థములు మనవా రుత్పత్తిగావించు చుండిన వానికంటె చౌకగ నుండుటవలన మనవారందఱు వానినె కొనుటకు మొదలిడిరి. ఈకారణముచేత మననేతమొదలగు శిల్పము లనేకములు శీఘ్రకాలమున నశించుట సంభవించెను. అనేకులకు వారి శిల్పకర్మల నదలుకొని కర్షకులుగ మారవలసివచ్చెను. ఈకాలమున మనదేశమందు వ్యవసాయమొక్కటియే ప్రధానవృత్తిగనుండుటకినుపదారులు కారణములైయున్నవి.

ఇనుపదారులకును దొరతనమువారికిని నెట్టిసంబంధముండవలయు ననువిషయ మీకాలమున మనదేశమందును నితర దేశములందును జర్చింపబడుచున్నది. కొందఱు వీనిని దొరతనమువారే నిర్మింపవలెననియు, నిర్మించినవానిని దొరతనమువారే నడుపవలయుననియు మామూలు జాయింటుస్టాకుకంపెనీలపద్ధతిని వ్యవహారములనడిపించుట క్షేమకరము కాదనియు వాదించుచున్నారు. ఇతరములగు దారులకన్నిటికి దొరతనమువారే యజమానులైయున్నారు. పట్టణములలోని వీధులు, దేశమందలి బాటలు, పడవలునడుచు కాలువలు మున్నగుదారుల కన్నిటికిని దొరతనపువా రధికారులైయుండ నినుపదారుల నిర్మించుటకుమాత్రము కంపెనీల కధికారమిచ్చుటయనుచితమని వీరివాదము. దీనిని మఱికొన్ని హేతువులను నను

సరించి మనదేశమందు దొరతనపువారే యినుపదారులలో ననేకములనిర్మించి స్వాధీనము చేసికొనియున్నారు. కాని వానిని నడిపించుటనుమాత్రము సొంతముగ జేయక, యనేకములగు నినుపదారులను 'కంపెనీలకు' మక్తాపద్ధతిని బనిచేయుట కిచ్చియున్నారు. దొరతనమువారే నడిపించినయెడల బ్రయాణసౌకర్యమును, చార్జీలసౌకర్యమును నధికముగ గలుగుననియు, నీకంపెనీలింగ్లండునందుండి పనిచేయుచుండుటవలన మన కనుకూలమగు నేర్పాటుల జేయకున్నవనియు, దొరతనమువా రీమక్తాపద్ధతిని మాని స్వయముగ బనిచేయుట బ్రశస్తముగ నుండుననియు మనవారనేకు లభిప్రాయపడియున్నారు. మన శాసననిర్మాణసభలు తేల్చవలసిన విషయములలో నిదియొక్కటిగనుండును; కావున దీనినిగుఱించి సరియగు నభిప్రాయము లందఱును గలిగి యుండవలెను.

౬ ఉపన్యాసము

కార్యవిభజనమునకు వినిమయ మనుబంధమైయున్నది. ఒకపదార్థమునిచ్చి దానికిమారుగ మఱియొకదానిని దీసికొనుటకు వినిమయమని పేరు. ఈకాలమున మనకుగావలసిన పదార్థములన్నిటిని వినిమయమూలముననే సంపాదించుచున్నాము. ఎవరియనుభవమునకు గావలసినవస్తువులను వారేయుత్పత్తిగావించుకొనుచుండు నెడల నితరులతో వినిమయము జేసికొనవలసిన యగత్యమేయుండదు. కాని, ప్రస్తుతకాలమునన్ని దేశములందును 'కార్యవిభజన' పద్ధతిప్రబలి, దినదినమునకు సంశ్లిష్టతరమగుచున్నది. ప్రతిమనుష్యుడును వానికి దేనియందు నేర్పధికముగనున్నదో దానినిమాత్రముత్పత్తి జేయుచున్నాడు. అట్టివానిని దయారుచేయువాడు, వానినితరులకిచ్చి, వారివద్దనుండి వానికి గావలసినవస్తువుల సంపాదించుట యత్యావశ్యకముగనున్నది. వ్యవసాయమువలన జనుము నుత్పత్తిచేయువాడు దాని నితరులకిచ్చి వానికి గావలసిన బియ్యము, బట్టలు, నెయ్యి, నూనె లోనగువానిని, బట్టల దయారుచేసిన సాలెవాడు బట్టల నితరులకిచ్చి వారివద్దనుండి యాహారపదార్థములను మార్చి దీసికొనినగాని వానిజీవనము జరుగజాలదు. కూలిపని జేసికొనువాడు సహితము వాని దేహబలమును వినిమయము గావించుచున్నాడు. గాయకుడు వానిగానశక్తిని, వైద్యుడు వానివైద్యకౌశలమును, న్యాయవాది వానిబుద్ధిచాతుర్యమును వినిమయపఱచి వారివారికి గావలయు పదార్థములసంపాదించుచున్నారు. సాధారణముగ నొక్కడుగూడ స్వానుభవమునకొఱకు బదార్థముల నుత్పత్తిజేయుటలేదు. కావున సర్వోత్పత్తి కంతకు నీకాలమున వినిమయము మూలాధారమైయున్నదని చెప్పవచ్చును.

ఈకారణముచే బదార్థముల మూల్యనిర్ణయము మన కందఱకును మిక్కిలి ముఖ్యమగు విషయముగ నున్నది. ఒకవస్తువును వినిమయము జేసినపుడు దానికి బదులుగ నియ్యబడునట్టి యితరవస్తువులసముదాయమే దానిమూల్యము. ఒకబస్తాబియ్యమునకు బదులుగ రెండుమణుగుల నెయ్యి దొరకిన యెడల బస్తాబియ్యపు మూల్యము రెండుమణుగుల నెయ్యి యనియు, నొకపుట్టెడు మిరపకాయలకు నాలుగుపుట్ల ఉప్పుదొరకుచుండు నెడల దానిమూల్యము నాలుగుపుట్ల ఉప్పనియు జెప్పదగియుండును. ఒక వస్తువధిక మూల్యము గలది యనిన దానికి బదులుగ నితరవస్తువు లధికముగ దొరకుచున్నవనియు, నల్పమూల్యము గలవియనియు, నవితక్కువగ దొరకుచున్నవనియు నర్థము. ఇట్టి సందర్భమున నొకమనుష్యునికి వానివృత్తివలన గలుగునాదాయము వాడుత్పత్తిగావించుపదార్థసముదాయము వానిపరిశ్రమలబట్టి మాత్రమేగాక యాపదార్థముల మూల్యమునుబట్టికూడ నిర్ణీతమగుచుండును. ఒకరోజంతయు గష్టపడియొక డొకమంచమును, మఱియొకడొక పెట్టెను దయారుచేసిన యెడల వీరిద్దఱిలో నెవరికెక్కువయాదాయము దొరకునదియు మంచముల యొక్కయు పెట్టెలయొక్కయు మూల్యమునుబట్టి దెలిసికొనవలెను. ఒక మంచమునకుబదులు నాలుగు సేర్లబియ్యమును నొకపెట్టెకుబదు లైదుసేర్లబియ్యమును లభిం

చుచుండునెడల మొదటి వానికంటె రెండవవాడు ధనికుడుగ నుండును. ఇట్లే, మనయిండ్లలో నౌకరిజేయువారికి రోజునకొక సేరు బియ్యము చొప్పునను, గనులలో బనిచేయువారికి రెండుసేర్లచొప్పునను కూలి నిచ్చుచుండిన యెడల రెండవ వాని పరిశ్రమ మొదటివాని దానికంటె నధికమూల్యముగలదనియు నందుచేత నతడెక్కువ నార్జించుచున్నాడనియు జెప్పదగియుండును. మనుష్యుల యార్థికస్థితి వారిపరిశ్రమలమూల్యమున ననుసరించియుండునని దీనిచే స్పష్టమగుచున్నది. కావున మూల్యనిర్ణయము మనకెల్లరికిని మిక్కిలిప్రధానమగువిషయము.

పదార్థములలో నన్నిటియొక్క మూల్యము నేకకాలమున నధికమగుటయు నేకకాలమున హీనమగుటయుసంభవింపదు. ఒకవీసె పంచదారకుబదులుగ నొకసేరునూనెకునూరొకటిన్నరసేరు నూనెదొరకినయెడల పంచదారయొక్కమూల్యమధికమైనదని చెప్పవలసి యుండును; కాని నూనె యొక్క మూల్యమప్పుడే హీనమయ్యెనని స్పష్టమగును. అట్లుగాకవీసె పంచదారకు ముప్పావుసేరు నూనె దొరకినయెడల పంచదార మూల్యముతగ్గుటయు నూనెమూల్యముహెచ్చుటయు జరుగును. ఈ రెండు వస్తువులకుగల పరస్పరసంబంధము వానిమూల్యమువలన నేర్పడుచున్నది. పైనుదాహరించిన యంశముల బట్టి యిట్టిసంబంధముగల మూల్యము లేకకాలమున నధికములు కాని హీనములుకాని కాజాలవని స్పష్టమగుచున్నది. ఈవిధముగనే మనమువాడుకొనుచుండు పదార్థములలోగొన్నిటిమూల్యమధికమైనపుడు తక్కినవాని మూల్యము హీనమైనదనిభావింపవలెను.

పదార్థములతో ఎట్టివానికి మూల్యముండును, ఎట్టివానికుండదు? కొన్నిపదార్థము లధికమూల్యము లగుటకును మఱికొన్ని యల్పమూల్యము లగుటకును హేతువులేవి? ఒకయుపదార్థ మొకప్పుడల్ప మూల్యముగలదిగను మఱియొకప్పుడధికమూల్యముగలదిగనుండుటకునుగారణమేమి? స్థానమునుబట్టి కూడ నొక్కయుపదార్థముయొక్క మూల్యము భిన్నముగ నుండునుగదా, ఇది యెందువలన సంభవించుచున్నది? అనువిషయములను మనము విమర్శింపవలెను.

ఈసందర్భమున. మఱియొక సూక్ష్మాంశమును మనము ముందుగగ్రహింపవలెను. ఒకపదార్థముయొక్క మూల్యమును నిర్ణయించుటయనిన మొత్తముమీద నాపదార్థమంతయు నెంతమూల్యము గలదియో తెలిసికొనుటకాదు; మొత్తపు మూల్యముతోడ మనకెట్టిసంబంధములేదు. దానిస్వభావమునుబట్టి దానిలోనొక శేరుయొక్కయో వీసెయొక్కయో మూల్యమెంతయని నిర్ధారణజేయుటయే మనకు ప్రధానమగు విషయము. మనము పదార్థముల గొనునపుడుగాని విక్రయించునపుడుగాని వానికనుగుణమగు నేదియో యొకమానమునుబట్టి వాని క్రయవిక్రయముల జేయుచుందుము. బియ్యముగొనుటకు మనము దుకాణమునకువెళ్ళినపుడు బస్తాలచొప్పుననో శేర్లచొప్పుననో కొన్నిబియ్యమునుగొనుచుందుము. బట్టలగొనుటయనిన కొన్నిగజములనో తాన్లనో బేలులనో గొనుటయేగదా? కాకితముల మూల్యమనిన నొకదస్తాలేక యొకరీముమూల్యముగాని ప్రపంచమందుండు కాకితములన్నిటియొక్క మూల్యమని యభిప్రాయము కాదు. ఒకనికి నెయ్యికావలసియున్నదనిన

నేతిజాతినంతయు నతఁడు కొనదలచియున్నాడని కాదు: కొన్ని వీసెలో, కొన్నిడబ్బాలో వానికిగావలసియున్నదని యేయర్థము. మూల్యనిర్ణయమనిన పదార్థాంశము (వీసె, శేరు, వంద) యొక్క మూల్యనిర్ణయముగాని పదార్థసముదాయముయొక్క మూల్యనిర్ణయము కాదు. వినిమయ సందర్భమున 'పదార్థ' మను మాట నుపయోగించినపు డంతయు పదార్థము యొక్క యంశమనియే యర్థముగాని పదార్థసముదాయమని యర్థము కాదు. ఈసంగతిని మరచిపోక మనము వినిమయ సంబంధమగు సిద్ధాంతముల విమర్శింపవలెను.

ఒకపదార్థ మెవరికైన గావలసియున్నప్పుడే దానికి మూల్యముండునుగాని లేనియెడల నది మూల్యరహితమగును. వాయువు, నీళ్లు మొదలగు పదార్థములకు మూల్యము లేదు. ఒకవీసె వాయువునుగాని, ఒకబిందెడు నీళ్ళనుగాని పుచ్చుకొని దానికిబదులుగ మూల్యముగల యితరపదార్థముల నిచ్చువారెవ్వరును లేరు. దీనికి గారణమేమి? వాయువునుజలమును నక్కఱలేనివారొక్కరుగూడనున్నారా? అవిలేనియెడల దేహధారణమే దుస్తరముగదా? నిజమేకాని కావలయును, అక్కఱలేదు అని చెప్పినపుడు యదార్థమగు నభిప్రాయమేదియో పై నుదాహరించియున్నాను. ఒకశేరు వాయువు నిచ్చి దానికి బదులుగ నితరపదార్థముల గోరునపుడు వాయువువలన మనకు లాభమున్నదా లేదా యనువిషయముతో మనకావశ్యకత లేదు. ఈ శేరు వాయువు మనకు గావలయునా, అక్కఱలేదా యనియే మనము విమర్శింపవలెను. ఒకబిందెడు నీళ్ళకో లేక యొకపీపానీళ్ళకో కొన్నిమూల్యముగలయితరపదార్థము

నొకడు కోరునపుడు మొత్తముమీద నీళ్ళవలనమనకుపయోగమున్నదా లేదా యను విషయమును మనము పరిశీలింప నక్కఱలేదు: ఈ బిందెడు నీళ్ళవలనను, ఈపీపానీళ్ళ వలనను మనకుబ్రయోజన మున్నదా యనియే మనమాలోచింపవలసియుండును. మనమే వస్తువును వినిమయము చేసినను ఇట్టివిషయమునే యాలోచింపవలసియుందుము. ఒక వీసె వాయువును, ఒక బిందెడు నీళ్ళు నెవరికైన గావలసియున్నప్పుడే వానికి మూల్యముండును గాని, లేనప్పుడు వానికి బదులుగ నితర కొన్నిపదార్థముల నిచ్చువారెవ్వరు నుండరు. ప్రస్తుతమున సాధారణముగ వీనిని గావలసియుండు వారెవ్వరులేరు. ఈ కారణముచేత వీనికిమూల్యము లేదు. కాని, కొన్నిపట్టణములందొకబిందెడునీళ్లకు గొంతసొమ్మునిచ్చిపుచ్చుకొనుచుందురు. ఏలన నాపట్టణములలో నాబిందెడునీళ్ళుకావలసియుండువారున్నారు.

ఈయర్థము ననుసరించి, కొన్నిపదార్థములక్కఱలేకపోవుటకు రెండు కారణములు కలవు. ఒక పదార్థము యొక్కయంశము వలననేగాక యాపదార్థ సముదాయము వలనను గూడ మనకెట్టి ప్రయోజనమును గలుగక పోవచ్చును. ఒక గంపెడు ముండ్లకు మూల్యములేక పోవుట కిదియే కారణము. ఈగంపెడు ముండ్లవసరము లేకపోవుటయేగాక ముండ్లవలనమనకెట్టి ప్రయోజనమును లేదు. ముండ్లే మన కావశ్యకము గానపుడు గంపెడు ముండ్లకు మూల్యముండుట యెట్లు సంభవించును? ఇది మొదటి కారణము. ఇదిగాక మఱియొక హేతువుగూడ నుండవచ్చును. ఒక బిందెడునీళ్లకు మూల్యము లేకపోవుట కట్టిబిందెలనీళ్ళ పరిమితముగ నుండుటయునందు చేత

నీబిందెడు నీళ్లవలన బ్రత్యేకముగ మనకెట్టి ప్రయోజనమును లేకపోవుటయే కారణము. నీళ్ళవలన మనకు బ్రయోజనము లేకపోలేదు. కాని, నీళ్ళవలన నట్టిప్రయోజనముల బొందగోరెదమో దాని నంతను నీబిందెడు నీళ్ళుండినను లేకపోయినను మనము పొందగలిగి యుందుము. ఈబిందెడు నీళ్ళకస్మాత్తుగ గ్రిందబడిపోయినయెడల నెట్టిశ్రమలేకమఱియొక బిందెడునీళ్ళను సంపాదింపవచ్చును. కావుననిదియున్నను లేకపోయినను నొక్కటే. ఇది యంతలెక్కలో జేరినదికాదు. దీని వంటిబిందెల నీళ్లెన్నియో దొరకుచున్నవి. ఏవస్తువునుగుఱించి మన మిట్లుపేక్షించియుందుమో దానికి మూల్యముండదు. ఈవస్తువువంటి వస్తువు లపరిమితముగనుండుటయే యీయుపేక్షకుగారణము. ఒక బస్తాబియ్య మిట్టిదికాదు. దీని వంటి బియ్యపు బస్తా లపరిమితముగగాక మితముగనున్నవి. బియ్యమువలన మనముపొందగోరు ప్రయోజన మీబస్తాయుండినగాని పూర్తిగబొందలేము. ఇదిలేనియెడల నాప్రయోజనము తగ్గిపోవును. ఒకవీసెడు వాయు వదృశ్యమైనపుడు దానిస్థానమున మఱియొకవీసెడు చేర్పగలిగిన ట్లొకబస్తాబియ్యము పోయినయెడల దానిస్థానమున నంత సులభముగ మఱియొక దానిని జేర్పలేము. కావుననే యొకబియ్యపుబస్తాకు మూల్యముండుటయు నొకవీసెడువాయువునకు మూల్యము లేక పోవుటయు సంభవించుచున్నది. అనగా మితముగనుండు వానికే మూల్యలక్షణముకలదు; అమితముగ నుండువానికట్టి మూల్యలక్షణము లేదు. మన వాంఛల దీర్చుకొనుటగదా మనము పదార్థముల గోరుచుండుట. ఆకలిదీర్చుకొనుటకై బియ్యపు

బస్తాలు మన కావశ్యకములుగ నున్నవి. ఒకబస్తా లేకపోయినను ఆకలివలన బాధపడువారి సంఖ్యయు ఆకలిబాధయు నధికమగును. ఆబస్తాయుండినయెడలనివితగ్గును. ఊపిరివిడచుటకు వాయువు మన కావశ్యకముగనున్నది. కాని, యెన్నియో వీసెలవాయువు మనలనావరించి యుండుటచేత నొకవీసెవీనిలో దగ్గినను మనయూపిరి నిరోధింపబడదు. మితము అమితము అనుమాటలకు దీనిననుసరించి మనమర్థము గ్రహింపవలెను.

పైవిషయములబట్టి మఱియొక సిద్ధాంతముకూడ దేలుచున్నది. మనకు గావలసియుండు పదార్థములకే మూల్యముండుటవలన నధికముగగావలసియుండువాని కధికమూల్యమును స్వల్పముగగావలసి యుండుదానికి స్వల్పమూల్యమును లక్షణములై యుండును. ఒకపదార్థాంశము (వీసె, శేరు, వంటలో నగునట్టి) వలనమనము పూర్తిజేసికొన నుద్దేశించు వాంఛయొక్క తీక్ష్ణతనుబట్టి యదిమనకధికముగ గావలసియుండునదియు నల్పముగ గావలసియుండునదియు నిర్ణీతమగును. వాంఛ తీక్ష్ణముకానుకాను పదార్థాంశ మధికతరముగ గావలసియుండుటచేత దానిమూల్యముగూడ నధికముగనుండును. ఆతీక్ష్ణత హీనముకానుకాను దానిమూల్య మల్పమగుచుండును. కావున బదార్థాంశముల యావశ్యకతయొక్కయు వానిమూల్యముయొక్కయు నధికాల్పములు వాంఛలతీక్ష్ణత ననుసరించి యుండునని తెలిసికొనదగియున్నది.

ప్రతివాంఛకును మితియొకటి యున్నది; వాంఛయెల్లప్పుడొక్కటే విధముగనుండదు. మామిడిపండుపై నొకనికి గలవాంఛ యొకపండుదినగనెవెంటనే కొంచెముతగ్గును; రెండు

వదానిని దినగనే మఱికొంచెము తగ్గును; మూడవదానిని తినినతర్వాత నింకనుదగ్గును; నాలుగవదానిని దినినపిమ్మట వాంఛపూర్తిగ నశింపవచ్చుననియే చెప్పవచ్చును. ఐదవదానిపై వాంఛ లేకపోవుట మాత్రమేగాక దానినిదినుటవలన బాధకలుగునను భయముగూడ బుట్టవచ్చును. ఈవిధముగనే బొత్తిగబట్టలు లేనివానికి బట్టపైనతితీక్ష్ణముగు వాంఛయుండును. ఒకటిదొరకిన తర్వాత రెండవదానిపైగల వాంఛకొంచెముతక్కువతీక్ష్ణతగలదియగును; ఇట్లు క్రమక్రమముగ తీక్ష్ణత తగ్గుచు బదిపండ్రెండు బట్టలదొరకిన పిమ్మట మఱియొక దానిపై వాంఛయే లేకపోవును. మఱియొకబట్టపై మనకుగల వాంఛయొక్క తీక్ష్ణతయిదివరకు మనయొద్ద నెన్ని బట్టలున్నవో దానిపై నాధారపడి యుండును. బట్టలే లేనపుడొకబట్టపై మనకుండునంతటి వాంఛ యొక బట్టదొరకిన తర్వాత మఱియొక దానిపైనుండదు; ఒకటేబట్ట మనయొద్దనుండినపుడు మఱియొక (రెండవ) దానిపైనుండునంతటి వాంఛ రెండుబట్టలుదొరకిన తర్వాతనుండదు. ఇట్లేమనయొద్దనుండు బట్టలసంఖ్యయధికము కానుకాను మఱియొకబట్టపై మనకుగలవాంఛ మఱిమఱి హీనమగుచుండును.

దీనినిబట్టి మఱియొకవిషయమునుగూడ గ్రహింపవలసియున్నది. ఒకపదార్థాంశమువలన మనకు గలుగు ప్రయోజనము, అదియెంత తీక్ష్ణతగలవాంఛను బూర్తిచేయగలదో దానిపై నాధారపడియుండును. అధిక తీక్ష్ణముగు వాంఛ నదిపూర్తిగావించునెడల దానిప్రయోజన మధికముగను; నల్పతీక్ష్ణముగు వాంఛను బూర్తిగావించునెడల దానిప్రయోజన మ

ల్పముగనుండును. బట్టలే లేనపుడు మనకొక బట్ట దొరకినయెడల దానిప్రయోజనమింతయని చెప్పుటకుగూడ వీలుండదు. ఒకబట్టయున్నతర్వాత మఱియొకటి లభించినయెడల దాని ప్రయోజన మింత యధికముగ నుండదు. ఒకటే బట్టయుండి, తర్వాతనది దొంగలపాలైనయెడల మనకు దానివలన నెంతయో బాధకలుగును; కావున నట్టి యధికబాధను దొలగింపగలయీవస్త్ర మధికప్రయోజనముగలదియని చెప్పనొప్పును. రెండు బట్టలలో నొకటి దొంగలపాలైనయెడల మనకు గలుగు బాధ యంత యధికముగనుండదు; కావున రెండున్నప్పుడొక బట్టవలన గలుగు ప్రయోజనము తక్కువగనుండును; మూడు బట్టలున్నప్పుడొక బట్ట పోయినయెడల మనకు గలుగు బాధ మఱింత తక్కువగనుండును. గనుక నట్టిబాధను దొలగించు నీబట్టయొక్క ప్రయోజనము మఱింత తక్కువగనుండును. కావున నొకపదార్థముయొక్కయంశము లధికముకానుకాను వానిలో నొకయంశము లేకపోవుటవలన మనకు గలుగు బాధయు అది యుండుటవలన మనకు గలుగు ప్రయోజనమును తగ్గుచునుండును. ముప్పదిరూపాయలు జీతము దెచ్చుకొనువాని కొకరూపాయపోవుటవలన గలుగునంతటి బాధ నూరురూపాయల జీతగాని కొకరూపాయపోవుటవలన గలుగుదానికంటె నధికముగ నుండును; తక్కువజీతగాని కొకరూపాయవలన గలుగునంతటి ప్రయోజనమెక్కువ జీతగానికి గలుగదు. ఒకరూపాయనధికముగ జీతమిచ్చునెడల రోజునకు మఱియొక గంట దక్కువజీతగాడు పనిచేయసిద్ధపడును; ఆరూపాయవలన నతని కెంతయో యధికమగు ప్రయోజనము

గల్గుటయే దీనికి గారణము. నూరురూపాయలజీతము తెచ్చుకొనువానికి మఱియొక రూపాయమీఁద నింతటిలక్ష్యముండదు; కావున రూపాయ కింకొకగంట బని జేయనతడిష్టపడడు. మనమనుభవించునట్టి యేపదార్థమును గుఱించి యాలోచించినను దానియంశము లధికముకానుకాను నొక్కొక యంశమువలన మనకు గలుగు ప్రయోజనము తగ్గుననియు, మఱియొక యంశముపై మనకుగల వాంఛతగ్గుననియు స్పష్టమగును. దీనికంతకు మనమానసిక శారీరతత్వములే కారణములు. ఒక్కొకయాశకు నిట్టి యవధియు: నిట్టి క్షయము నుండుటవలననే జీవితములో మనకు సౌఖ్యమనునది లభించుట కవకాశము కలుగుచున్నది. ఎన్ని కబళములు తినినను, మొదటి కబళముతినుటకు బూర్వ మాకలి బాధయెంత తీక్ష్ణముగ నుండెనో యంతతీక్ష్ణముగ నుండసాగినయెడల భోజనమువలన సుఖమనునది లభించు టెట్లు? ఎన్ని చెంబులనీళ్లు తాగినను దప్పి యథాప్రకార ముండినయెడల పానీయములు మనకెట్లు సౌఖ్యదాయకములగును?

ఒక పదార్థము యొక్క యంశము లధికములగుటయు, అందుచేత నాపదార్థముయొక్క మఱియొక యంశముపై మనకుగల వాంఛయొక్క తీక్ష్ణతతగ్గుటయు, దానివలన నాయంశ మల్పప్రయోజనము గలది యగుటయు మూల్యనిర్ణయ సందర్భమున మనకెంతయు సహకారులుగనున్నవి. మన మొక వీసెనూనెకు నియ్యదలచు మూల్యమా వీసెనూనెవలన గలుగు ప్రయోజనము ననుసరించియుండును. మనయింట, నూనెయే లేనియెడల దీనివలన నధిక ప్రయోజనము కలుగును

గావున దీనికెక్కువ ఖరీదునిచ్చుటకు సిద్ధపడుదుము. మార్గాంతరములేనియెడల వీసెకు మూడురూపాయల నిచ్చియైన గొనదలతుము. ఈధరనుబెట్టి రెండు వీసెలగొనుటకు మాత్రము వెనుదీయుదుము. ముఖ్యముగ గావలసిన కార్యము లొకవీసెతో జరుగునుగావున రెండవవీసె మొదటిదానియంత ప్రయోజనకారి కాజాలదు. రెండున్నర రూపాయచొప్పున నిచ్చినగాని రెండవవీసెను గొనజాలము. మూడవవీసె రెండవదానికంటె నల్పతర ప్రయోజనముకలది కావున రెండురూపాయలకంటె నెక్కువగదానికిమనమియ్యబూనుకొనము. ఈవిధముగనే భోగ్యవస్తువుల నన్నిటిని గుఱించి చెప్పుట కవకాశమున్నది. పంటలధికముగ బండినపుడు వానిధరలు తగ్గుచుండునుగదా? అధికములగు పంటలవలన సంపూర్తి కాదగినవాంఛల తీక్ష్ణత తక్కువగనుండుటయు, వానివలన గలుగు ప్రయోజన మల్పతరమగుటయు దీనికి గారణములు. దేశమందుబండిన పంట ప్రతి మనుష్యునికి నొకపూటకు వలయు నాహారమునకు మాత్రము సరిపడినదైనయెడల, నొకపూటకు గూడ నాహారము దొరకనిపక్షమున మృతిజెందవలసియుండునని యొకరూపాయి నిచ్చియైన దానిని గొనుటకందఱు సంసిద్ధులగుదురు. కాని, పంటలధికమై రెండుపూటలకు గావలసినంతటిది దొరకునట్లుండినయెడల నింతటి ఖరీదునిచ్చి బియ్యము నెవ్వరుకొనజాలరు. ఒకపూటకు దొరకినతర్వాత, దొరకకయే యుండినపు డాహారముపై మనకుండినంతటివాంఛయిప్పుడుండదు. రెండవపూట యాహారములేనియెడల మృత్యువు సంభవింపదు; శరీరబలము కొంతతగ్గినతగ్గవచ్చును. మృత్యువునుండి తప్పించుమొద

టిపూట యాహారమధికప్రయోజనముగలది యగుటచేత నొకరూపాయ నిచ్చితిమిగాని, శరీరమును గృశింపకుండుటకును మాత్రముచేయగల రెండవపూటయాహార మంతప్రయోజనకారి కాకపోవుటచేత నర్ధరూపాయకన్న నెక్కువ నిచ్చుటకు మన మిష్టపడజాలము. పంటలు మఱింత యధికమైన మూడుపూటలకు వలయు నాహారము దొరకునట్టి స్థితిలో రెండుపూటలయాహారము లభించినతర్వాత మూడవపూట భోజనమంత ప్రయోజనకారికాదు. గనుక నొకపూట భోజనమునకొక పావలామాత్రమే మనమియ్యబూనుకొనెదము. అనగా, పూటకు వలయు బియ్యము పావలాకు దొరకునప్పుడే మూడుపూటలు తినెదము కాని, దాని ఖరీదర్ధరూపాయైన యెడల రెండుపూటల భోజనము తోడనే తృప్తిబొంది యుందుము. మూడుపూటలకు వలయునంతటి యాహార ముత్పత్తిగావించి, పూటకర్ధరూపాయ చొప్పుననిచ్చినగాని బియ్యము విక్రయింపమని కర్షకులు చెప్పినయెడల మనకు రెండుపూటలకు గావలసిన పరిమాణమునే కొనెదము; అందుచేత వారుత్పత్తిగావించిన దానిలో గొంతభాగము చెల్లుబడి కాకపోవును. పావలాకొకపూట చొప్పున నిచ్చుటకు వారు సంసిద్ధులైనప్పుడే వారుత్పత్తిగావించినదంతయు గొనబడుట తటస్థించును దేశమందు పండుధాన్య మింతకుగూడ నధికముగ నుండినయెడల మనుష్యులు తినినతర్వాత మిగిలిపోయినదానిని బశువులకాహారముగ బెట్టవలసియుండును. అట్లు గావించినగాని ధాన్యము నకంతకు వినియోగముండదు. పశువులకాహారముగ బెట్టబడు శేరుబియ్యము మనుష్యుల కాహారమగు శేరుబియ్యమంతటి

ప్రయోజనము కలదియని చెప్పుటకు వీలులేదు. తమయాకలి తీర్చుకొనుటకనిన శేరునాలుగణాలచొప్పున మనుష్యులు కొనుచుండిరిగాని, పశువుల యాకలి దీర్చుటకనిన నింతఖరీదు బెట్టి శేరు బియ్యమును కొనజాలరు. మూడణాలకో రెండణాలకో దొరకినగాని పశువులకు బియ్యము నాహారముగ వినియోగించుట జరగదు. కావున, నధికముగ బంటలు పండినపుడు ధరలు తగ్గిపోవుటకు ధాన్యాంశము (శేరు) పై మనకుగలవాంఛ తక్కువతీక్ష్ణతగలది యగుటయు, దానిప్రయోజనముతగ్గుటయు గారణములని స్థిరమగుచున్నది.

పై యుదాహరణమున మూడువీసెల నూనెను గొనునప్పుడు మొదటివీసెకు మూడురూపాయలును రెండవదానికి రెండున్నరయు, మూడవ దానికి రెండు రూపాయలును మొత్తముమీద ఎనిమిదిన్నర రూపాయ లిచ్చుచున్నామా? అన్ని వీసెల నొక్కటే ధరకు గొనుచున్నాము కదా? అని మీరనుమాన పడవచ్చును. ఒక వీసెకు మఱియొక దానికంటె నధికమగు మూల్యము నిచ్చుచున్నామని యీ సిద్ధాంతము చెప్పుట లేదు. వీసె రెండున్నర రూపాయలకు దొరకినగాని రెండు వీసెలును, రెండు రూపాయలు చొప్పున దొరకినగాని మూడువీసెలను గొనజాలమనిమాత్రమది చెప్పుచున్నది వీసె రెండురూపాయ లయినప్పుడు మూడువీసెల మాత్రమే కొనుటయేల? నాలుగవవీసె నెందుకుగొనగూడదు? రెండు రూపాయల విలువగల ప్రయోజనము మూడవవీసెవలన లభించుటయు నాలుగవవీసెవలననింతటిప్రయోజనము లభింపకపోవుటయు దీనికిగారణము. ఖరీదు రెండురూపాయలైనప్పుడు

రెండుపీసెల మాత్రముగొనక మూడవపీసెనుగూడ నేలకొనవలెను? మూడవపీసెకొనుటవలన నధమము రెండురూపాయలవిలువగల ప్రయోజనము లభించుచున్నదను నిశ్చయముండుట యేదీనికిగారణము. పీసె యొకరూపాయకు దొరకుచుండిన నప్పటికిని గొందఱొకపీసెనుగూడ గొనుటలేదు. ఒకరూపాయవిలువగల ప్రయోజనము గూడదానినుండి వారికిలభింపక పోవుటయే దీనికి హేతువు. అనగా పీసెనూనెవలన బొందదగు సౌఖ్యముకంటె నారూపాయతో బదార్థాంతరముల గొనియనుభవించుటవలన గలుగుసౌఖ్యమధికముగ నుండుటచేత వారు నూనెనుగొనుట మానిరనియభిప్రాయము, కానియెవరుకొనినను, నెవరుకొనకపోయినను మొత్తముమీద నొకపదార్థము విస్తారముకానుకాను దానిఖరీదు తగ్గుననియు నది యల్పముకానుకాను ఖరీదుహెచ్చుననియు దెలియుచున్నది. ఖరీదునకును బదార్థసముదాయమునకునుగల యీపరస్పర సంబంధమెట్లేర్పడుచున్నదో పైవిషయములవలన గ్రహింపనగును.

పైవిషయముల జర్చించుటలో మనముకొన్ని సాంకేతికపదముల వాడుట యావశ్యకముగనుండును. (1) పదార్థము అని మనముపయోగించు నపుడంతయు సామాన్యముగ పదార్థాంశము, పదార్థములో నొకపీసె, ఒక శేరు అను అర్థములో వాడుచుందుము. ఒక పదార్థమువలని ప్రయోజనము అనిన మొత్తముమీద నాపదార్థ మంతటివలన మనకు లభించు ప్రయోజనము కాదు. దానిలో నొకయంశము వలన గలుగు ప్రయోజనమే. ఒకపదార్థ మధికము కానుగాను దానిలోనొక యంశమువలన మనకుగలుగు ప్రయోజనము తగ్గుచుండును.

దీనికి క్షీణప్రయోజన సిద్ధాంతమని పేరు. (2) దీనినిబట్టిగిరాకిసిద్ధాంత మొకటి యేర్పడుచున్నది. ఒకవస్తువున కింత గిరాకియున్నదని చెప్పినపు డేదియో నిర్ణీతమగు నొకధర చొప్పున నాపదార్థములో నింతపరిమాణము పీసెలు, శేర్లు, వందలును, క్రేతలుకొనుటకు సిద్ధపడియున్నారని యర్థము. గిరాకియనిన బదార్థపరిమాణముమాత్రము కాదు, కొనవలయుననెడియాశమాత్రముగాదు. ఒకధర ప్రకారము క్రేతలుకొను పదార్థపరిమాణమే గిరాకి. ధర తెలియనిదియు గిరాకి ఇంతయున్నదని మనము చెప్పజాలము. ఏలన ధర హెచ్చినయెడల మనము కొనసిద్ధపడు పరిమాణము తగ్గును. ధరతగ్గినయెడల నది హెచ్చును. ఈపరిమాణమెప్పుడునిలుకడగనుండదు. ధరనుబట్టియది మారుచుండును. ధరతక్కువ కానుకాను బరిమాణము హెచ్చుచుండుటయు ధర హెచ్చు కానుకాను బరిమాణముతగ్గుచుండుటయు గిరాకిధర్మముగనున్నది. దీనికి గిరాకిసిద్ధాంతమని పేరు (3) ఒకవస్తువునకు గిరాకి హెచ్చినదనిన నిర్ణీతమగు నొకధరప్రకార మిదివఱకు గొనుచున్నదానికంటె నిప్పుడధికముగ గొనుచున్నారని యభిప్రాయము. ఇదివఱకు శేరు పదియణాలధరప్రకారము రెండులక్షల శేర్లను గొనుచుండియిప్పుడు రెండులక్షలయిరువదివేల శేర్లను గొనువారైనయెడలగిరాకి హెచ్చినదనియు, రెండులక్షలకంటెదక్కువగ గొనువారైనయెడల గిరాకితగ్గినదనియు జెప్పవలసియుండును. (4) గిరాకి హెచ్చుట కాపదార్థమువలన గలుగుప్రయోజనము హెచ్చుటకారణము. అనగా దానివలన బూర్తికావలసిన వాంఛ తీక్ష్ణతరమైనదని యర్థము. ఇందుచేత దానిఖరీదు హెచ్చగును.

పై చర్చలయొక్క సారాంశముల నిప్పుడు పేర్కొని విషయాంతరముల దెలిసికొందము. (1) ఒకవస్తువు యొక్క అంశములు అధికముకాను కాను దాని (లో నొకయంశము) యందు మన కుగల వాంఛయొక్క తీక్ష్ణత తగ్గును. (2) అందుచేత దానివలన మనకుగలుగు ప్రయోజనముకూడ తగ్గిపోవును. (3) ఈకారణముచేత దానికిబదులుగ మనమియ్యదలచుకొను మూల్యముసహితము తక్కువగును. ఇట్లే ఒకవస్తువు తగ్గినయెడల దానియందు మనకుగలవాంఛయొక్క తీక్ష్ణతయు దానివలన మనకుగలుగు ప్రయోజనమును, దానికై మనమియ్యదలచు మూల్యమును హెచ్చగును. కావున పదార్థములమితత్వామితత్వములబట్టి వానిమూల్యములు నిర్ణీతములగుచుండును. ఈమితత్వమునకుగల కారణములేవియో మనమిప్పుడు విమర్శింపవలసియున్నది.

మన మనుభవించు పదార్థములలో ననేకములు మితములుగనుండుటకు ప్రధానకారణములు నాలుగుగలవు. (1) వీనిలో మొదటిది 'ప్రకృతిలోపము'. మనమెంత యధికముగ బాటుపడ తీర్మానించుకొనినను గొన్ని పదార్థముల సముదాయము నధికముచేయుట దుస్తరముగనుండును. భూమి, నదులు, పర్వతములు, వర్షము లోనగునవి యిట్టివి. ఇందుచేత వీనిసహాయ మధికముగ నుండినగాని యుత్పత్తికాజాలని వస్తువులన్నియు మితములుగనుండుట తటస్థించుచున్నది. గొప్పపట్టణములలో నొకచదరపుగజము నేలకైదారు రూపాయలియ్యవలసియుండును. భూవిస్తీర్ణతను మనమధికము జేయలేకపోవుటయే దీనికిగారణము. (2) మనవాంఛలసంఖ్య హెచ్చగుచుం

డుట రెండవకారణము. ఇందుచేత నొకప్పు డధిక బాహుళ్యముగ నున్నపదార్థములు క్రమక్రమముగ మితత్వమునువహించుచున్నవి. మనదేశమం దనేకులు జొన్నలు, రాగులు మొదలగువానిని దిని జీవించుచున్నారు; కాని ఆదాయమధికము కానుకాను నీపదార్థమునమాని వీనికిబదులుగ బియ్యమునువాడుకచేయుట మామూలుగనున్నది. ఇట్లనేకులు బియ్యము నుపయోగింప మొదలిడినయెడల బియ్యపుపంట యథాస్థితియందున్నను బియ్యము మితతరమగుటయు దానిమూల్య మధిక మగుటయు సంభవించుచున్నది. బట్టలువిస్తారముపొందని వారు వానిని విశేషముగవాడుటయు బూరిండ్లలో గాపురముజేయువారు పెంకుటిండ్ల గోరుటయు గంజితో దృప్తిబొందియుండువారు కాఫీ టీ మొదలగువానిని పానముజేయుటయు మనవాంఛలసంఖ్య యధికమగుచున్నదని సూచించుచున్నవి. ఈకారణముచేత బట్టలు, పెంకులు, కాఫీ, టీ మొదలగువానియొక్క మూల్యమధిక మగును. ఏదైన నొకక్రొత్త పదార్థమును మనము కోరినయెడల, పదార్థాంతరము నుత్పత్తిజేయువారిలో గొందఱు దానినిమాని, నూతనవస్తువును దయారుచేయ బూనుటచేత ప్రాతవస్తువు నుత్పత్తిజేయువారిసంఖ్యతగ్గి, యది మఱింతమితమగును; అందుచేత దానిమూల్యము హెచ్చ కావచ్చును. కావున, మనవాంఛలు పెంపొందుటవలన గూడ పదార్థములకు మితత్వముగలుగుచున్నదని స్పష్టమగుచున్నది.

(3) మనుష్యుడు శ్రమపడినగాని పదార్థము లుత్పత్తి కాజాలవు; కాని సాధారణముగ నెవ్వడును విశేషకాలము శ్రమపడుట కంగీకరింపడు. ఇందుచేతగూడ పదార్థములకు

మితత్వము కలుగుచున్నది. పురుషకారములేనిదియు ధనోత్పత్తికాజాలదనియిదినఱకే తెలిసికొనియుంటిమి. కాని, తానుజేయు పనియందే యుత్సాహముగలిగి, ఫలితమును గమనింపక నిష్కామకర్మ యొనర్చువా రెవ్వరు గలరు? సామాన్యముగ మనమందఱము ఫలమునపేక్షించియే, పనులకు బూనుచున్నాము. కొన్నిపనులు ప్రారంభమునుండి బాధనుకలిగించునవిగ నుండును; అట్టిపనులజేసి ధనము నుత్పత్తిగావించువారికి బ్రతిఫల మధికముగనున్న గాని వారాపనుల బ్రవేశింపజాలరు. అనేకములగు పనులు ప్రారంభమున బాధను కలిగించునవి కాకపోయినను గర్మకరులకు నలసటను గలిగించునవిగ నుండును. మనముచేయు పనులన్నిటికి నిదిసామాన్యలక్షణమై యున్నది పనికిబ్రారంభించినపుడు మిక్కిలి యుత్సాహమున్నను, గొంతకాలమైనతర్వాత మనమలసిపోవుటతప్పదు. మనశరీరమును మనస్సును విశ్రాంతిగోరునవి యగును. పనినిమాని వేయవలయుననుబుద్ధి మనకుగలుగును. మఱికొన్ని సమయములలోనొకపనిని గొంతకాలముచేసినతర్వాత దానియందు విసుగుకలిగి మఱియొకదానిని జేయవలయుననెడి యుత్సాహము పుట్టును. ఈరెండవ పనిని జేయుట కాటంకముగలిగి మొదటిదానే మనను చేయవలసిన ట్లేర్పడినయెడల నదియుగూడ శ్రమముగనే గనపడును. కావున, ధనోత్పాదకములగు నేపనులజేయ బూనినను నవికొంతకాలమునకు శ్రమరూపమును దాల్చునని స్పష్టమగుచున్నది. శ్రమయనునది లేనియెడల, విశ్రాంతి యవసరముకాకపోయిన పక్షమున, నిరువదినాలుగుగంటలకాలముగూడమనము పనులజేయుచు నిప్పటికంటె నెన్నియో రెట్లధి

కముగ మనకుగావలసిన పదార్థముల నుత్పత్తి జేయ సమర్థులమైయుందుము. అప్పుడిప్పటివలె పదార్థములకు మితత్వము లేక, మూల్యమదృశ్యమైపోవును.

కాని, మనప్రపంచమును మనశరీరతత్త్వమును నిట్టివి కావు. అయినప్పటికిని శ్రమపడి మనము మితముగనైన బదార్థముల నుత్పత్తిజేయుచుండుటకు గారణమేమి? శ్రమకనుగుణమగు ప్రతిఫలము మనకుదొరకగలదను నమ్మకమే. ఇంతటి ప్రతిఫలము దొరకుచుండునెడల శ్రమపడి పదార్థముల నుత్పత్తిగావించుట కందఱును బూనుకొందురు. ఈసందర్భమున మనము రెండువిషయముల గమనింపవలెను (1) ఈకాలమున మనము పదార్థముల నన్నిటిని స్వానుభవమునకుగాక వినిమయముకొఱ కుత్పత్తిగావించుచున్నాము. శ్రమకు దగినట్టిప్రతిఫలము లభించినదా లేదా యనుదానికి మన ముత్పత్తిగావించువానిమూల్యమే తార్కాణము. ప్రత్తినిబండించువానికిదానియొక్క మూల్య మధికముగ నుండినయెడల దగినప్రతిఫలము దొరకినదని మనమనుకొనవలెను; మూల్యముతక్కువగ నుండినపుడు తగినప్రతిఫలము దొరకలేదని చెప్పవలసియుండును (2) పదార్థమధికముగ నుండినపుడు దానిమూల్యము తగ్గుననియు, నదియల్పముగ నున్నప్పుడు మూల్యము హెచ్చుననియు నిదివఱకు దెలిసికొనియున్నాము. ఇట్టి స్థితిలో నుత్పాదకు లెంత పదార్థము నుత్పత్తి గావింతురు? విస్తారమనేకముగ తయారు చేసిన యెడల దానిమూల్యము తగ్గుటచేతలాదాయమునకుబదులు వారికినష్టమురావచ్చును. ఎనుబదినాళ్ళను దయారుచేసి వినిమయపఱచినయెడల నొక్కొకదాని

యైదు శేర్ల బియ్యమును, నూరునాగళ్ళు వినిమయము పఱచినప్పు
డొక్కొకదానికి నాలుగు శేర్లును, నూటయిరువది నాగళ్ళునిని
మయపఱచినపుడు మూడు శేర్లును దొరుకుచుండిన యెడల వ
డ్రింగులెన్ని నాగళ్ళ దయారుచేయుదురు? వారెంత యధిక
ముగ నుత్పత్తిజేసిన నంతచౌకగ నవికొనువారికి దొరకగలవు
కాని, యొక్కొకనాగలికి నాలుగుశేర్లబియ్యమునకంటె నక్కు
వమూల్యము లభించినయెడల వారిశ్రమ వ్యర్థమగునని వార
భిప్రాయ పడినయెడల వారు నూరునాగళ్ళకంటె నధికముగ
దయారుచేయ నిష్టపడరు. శ్రమకు దగినఫలము మూడు శేర్లు
మాత్రమేయని వారనుకొనినయెడల నూటయిరువదినాగళ్లను
దయారుచేయుదురు. అంతకంటె నధికముగ నుత్పత్తిజేయజా
లరు. కావున నెన్నినాగళ్ళనుదయారుచేసినప్పుడు మూల్యము
వారిశ్రమ కనుగుణముగ నుండునో యన్నిటినే వారుత్పత్తిగా
వింతురని మనము గ్రహించవలెను. వారిన్ని తయారుచేయు
టయెందుకు? ఎనుబదినిమాత్రముదెచ్చినయెడల నొక్కొకదాని
నైదు శేర్లమూల్యమునకు విక్రయించి యధికలాభమును బొం
ద గూడదా? అను సంశయము కలుగవచ్చును. కాని,వృత్తు
లవిషయమై యెట్టి నిర్బంధములు లేనియెడల నాగళ్ళనుత్పత్తి
జేయుటవలన నొక్కొకదానిపై నొకటి, రెండు శేర్లలాభము
దొరకుచున్నదని మఱికొందఱీవృత్తి నవలంబించి నాగళ్ళసంఖ్య
నువృద్ధిజేయుదురు. అందువలననవినూరో నూటయిరువదియో
యగుటయు, వానిమూల్యము తగ్గుటయు, నిదివఱకు వచ్చు
చుండిన యొకటిరెండు శేర్లలాభ మదృశ్యమగుటయుసంభవిం
చును. క్రొత్తవారీవృత్తిని నవలంబింపనలసిన యగత్యములే

కయే యిట్టిది జరిగినను జరుగవచ్చును. లాభమధికముగ దొ
రకుచున్నప్పు డిదివఱకుత్పత్తి జేయుచుండువారీలాభము నను
భవింపగోరి మఱికొన్ని నాగళ్ళను దయారుచేసెదరు. అందు
వలనగూడ వానిసంఖ్యహెచ్చి వానిమూల్యము పడిపోవును.
నాలుగు శేర్లు శ్రమకనుగుణమగు మూల్యమని భావించునంత
వఱకు నూరునాగళ్ళు తయారుచేయబడుచుండునుగాని, వాని
కంటె నధికముగాని తక్కువగాని, యుత్పత్తి జేయబడవని
తెలిసికొనదగియున్నది. ఈవిధముగనే తక్కినపదార్థములవిష
యమునగూడ నెఱుంగునది.

ఈవిషయమునే మఱియొకవిధముగ స్పష్టతరము చేయ
వచ్చును. ఈకాలమున మనవ్యవహారములన్నియు నాణెముల
మూలమున జరుగుచున్నది. మనముపడునట్టిశ్రమకు ఖరీదును
గట్టి మనముత్పత్తిగావించు పదార్థమును విక్రయించుటవలన
నెంతసొమ్ము వచ్చునో కనుగొని శ్రమకు దగిన ప్రతిఫలము
వచ్చినదా లేదా యనువిషయమును మనమునిశ్చయ పఱచు
చుందుము. ఒక పదార్థముత్పత్తి జేయుటలో మనకైనఖర్చు
నకు సమానమగు ఖరీదు దానికి గలిగినయెడల దానిని మన
ముత్పత్తిజేయుదుము లేనిచో మానెదము: కాని పదార్థమధిక
ముకానుగాను దానిఖరీదు తగ్గుచుండునుగదా? శేరొక రూ
పాయచొప్పున లక్ష శేర్ల బియ్యమును, అర్థరూపాయచొప్పున
రెండులక్షల శేర్ల బియ్యమును, పావలాచొప్పున మూడులక్షల
శేర్లబియ్యమును, బేడచొప్పున నాలుగులక్షల శేర్లను అమ్ముట
కవీలుండునని యనుకొందము. ఇట్టి సందర్భమున కర్షకులె
న్ని లక్షల శేర్ల నుత్పత్తిగావింతురు? ఇదివారి ఖర్చులపై నా

ధారపడియుండును. కొద్దిగ ధాన్యము కావలసి యుండునప్పుడు మిక్కిలిసారవంతములగు భూములనుమాత్రము కృషిజేయుదుము; గనుక లక్షశేర్లబియ్యమును శేరొకటింటి కారణాలచొప్పుననుత్పత్తిగావింపగలిగి యుందుము: రెండులక్షల శేర్లుకావలసియున్నప్పుడు తక్కువ సారముగల భూములను గృషిచేయవలసియుండును గావున శేరొకటింటి కర్ధరూపాయ ఖర్చగును అనగా శేరునకర్ధరూపాయ ఖర్చుపెట్టినగాని రెండులక్షల శేర్లుత్పత్తిగావు. మూడులక్షలశేర్లు కావలసియున్నప్పుడింతకంటె నధమములగు భూములగూడ సాగుచేయవలసియుండును. కావున శేరునకు బదియణాలచొప్పున ఖర్చుపెట్టసిద్ధపడినగాని యంతటిధాన్య ముత్పత్తి కాజాలదు. ఇట్టి సందర్భమునకర్షకులెన్ని శేర్లనుత్పత్తిజేయుదురో జెప్పుటసులభసాధ్య మగును. మూడులక్షల నుత్పత్తిజేసి తెచ్చినయెడల శేరునకు పావలాకంటె నధికమగు క్రయము రాదుగావునను, వారికి శేరునకు బదియణాలు ఖర్చగుటచేతను, నొక్కొకశేరుపై నారణాలు నష్టముసంభవించును. అందుచేత నింతయధికముగ వారుధాన్యము నుత్పత్తిగావింపరు. ఒకలక్షశేర్లే యుత్పత్తి జేసినయెడల ఖర్చారణాలైనను ఖరీదు పండ్రెండణాలు దొరకుటచేత లాభము మిక్కిలి యధికముగ నుండును. కాని యింత తక్కువగ నుత్పత్తిగావింపబడకుండుటకు గూడకారణములున్నవి. ఒక్కొకశేరున కారణాలు లాభము దొరకుచున్నప్పుడు కొందఱు రైతులు మఱికొంతభూమిని సాగుచేసి, యధికలాభము ననుభవింప నుద్దేశించి మఱింత ధాన్యమునుత్పత్తిగావింతురు. ఇదిమనకందఱికి స్వభావజనితముగ నున్నది. లాభ మొకకార్య

మందధికముగ దొరకుచున్నదనగనే దానిలోననేకులు ప్రవేశింతురు. ఈవ్యవసాయమునగూడ నట్లేజరిగి యొకలక్షకంటె నధికముగ నుత్పత్తి గావింపబడుట తటస్థించును. కాని, రెండులక్షలశేర్లుత్పత్తిజేసినచో శేరునకగు ఖర్చు అర్ధరూపాయిగనుండును. దానికిదొరకు ఖరీదుగూడ నంతగనే యుండును. అందుచేత నంతటి ధాన్యమును మాత్రముకర్షకులుపండింతురు. అప్పుడుమాత్రము వారిశ్రమ కనుగుణమగు ఫలితము దొరకును. అంతకంటె నధికముగ నుత్పత్తి జేసినయెడల నష్టముసంభవించును: తక్కువపండించుటవలన నధికతరమగు లాభము వచ్చునుగాని కర్షకులపోటీవలనను, పైలాభము నధికముగననుభవింపవలయుననెడి యుద్దేశమువలనను, ఎక్కువగ బండించుట జరుగును.

ఈవిధముగనే మనమన్నిపదార్థముల గుఱించి చెప్పవచ్చును. ఎంతటి సముదాయము నుత్పత్తిగావించినయెడల ఖర్చును ఖరీదును సమానములుగ నుండునో అంతటే మొత్తముత్పత్తి గావింపబడుచుండును. అందునకధికముగాని యల్పముగాని యుత్పత్తి గావింపబడవు.

(4) శ్రమకనుగుణమగు ఫలితము నుత్పాదకులు పొందగోరి కొన్నిపదార్థముల, మితతరములుగ నుత్పత్తిజేయుదురు. పైయుదాహరణములో నొకలక్షశేర్లబియ్యమును మాత్రముకర్షకులుత్పత్తిజేయక రెండులక్షలవఱకు నుత్పత్తి జేయుటకుగలకారణముల జెప్పియుంటిని. లాభము వచ్చుచున్నప్పుడావనిలో ననేకులు ప్రవేశించుటయే వీనిలో ముఖ్యమగు హేతువు. ఇట్లుగాక కొన్నిపదార్థములవిషయములో లాభమువచ్చుచుం

డునపుడు పరులాపనులయందు బ్రవేశింపనీక వానినధికముగ
నుత్పత్తిజేయుహక్కు యొక్కరికే యుండవచ్చును; లేక అనేకు
లువానిని దయారుచేయుచుండినను వారందఱొకకట్టుగట్టిపరు
లాపనులలో బ్రవేశించునపుడు వారికెన్నియో యాటంకముల
గలిగించి వారిప్రయత్నముల విఫలములుగ జేయవచ్చును. ఒక
గ్రంథము నొకరు వ్రాసినయెడల దానినచ్చువేసి యమ్ముకొను
హక్కు వారొకరికేయుండును: దానినితరులచ్చువేసివిక్రయిం
చుట శాసనవిరుద్ధము. కావునగ్రంథము లెల్లప్పుడు మిక్కిలి
మితముగనుండును. గ్రంథమెవ్వరువ్రాసినను దానినచ్చువేసి
విక్రయించునధికారము ముద్రణాలయములకన్నిటికి నుండినయె
డల నొక్కొకగ్రంథముయొక్క సంఖ్యయధికమై దానిఖరీది
ప్పటికంటె నెంతయో తక్కువగ నుండును. మనదేశమునదొ
రతనమువారు తప్పమరియెవ్వరు నల్లమందుదయారుచేయగూ
డదు. అందుచేత తయారగునుందు మిక్కిలి తక్కువై ధరచా
లయెక్కువగ నున్నది. ఇట్టి పదార్థము లేకోత్పాదకములని
(monopolies) చెప్పవచ్చును. వానిధర లెల్లప్పుడు ఖర్చుల
కంటె నధికముగ నుండును.

కొన్నిపదార్థముల నధికముగ నుత్పత్తి గావించినపుడు
శ్రమకనుగుణమగునట్టియు ఖర్చులకు సమానమగునట్టియు ఖరీ
దు దొరకుచుండినను, దానితోదృప్తిబొందక, మఱింత లాభ
మును సంపాదింపగోరి దానినుత్పత్తిచేయువా రందఱొక కట్టు
గట్టి నేదియోయొక నిర్ణీతపరిమాణముకంటె నధికముగ వా
నినివిక్రయింపగూడదని ఖరారు జేసికొనినయెడల నవి మిక్కిలి
మితతరములై వానిమూల్య మన్యాయముగ హెచ్చగుటదట

స్థించును. గత సంవత్సరమున మన దేశమందు బియ్యపు ధర
లు హెచ్చగుట కిదియొకకారణము. ఈసంవత్సరము పంటలు
బాగుగ బండినను ధరలువిస్తారముగ తగ్గకుండుటకు గొంతవఱ
కిది కారణముగనుండవచ్చును. వర్తకులలో నిట్టియైకమత్య
మమెరికాదేశమం దీకాలమున నత్యధికముగ నున్నది. ఇందు
వలన బదార్థములమూల్య మనవసరముగా హెచ్చి, ప్రజలకు వి
శేషబాధను గలిగించును. కావుననే కొన్ని దేశములం దిట్టిప
దార్థముల ధరలను దొరతనమువారే నిర్ణయించుటగాని, య
ట్టివర్తకుల లాభములో జాలభాగమును బన్నుల మూలమున
దొరతనమువారు స్వాధీనపఱచుకొనుటగాని తటస్థించుచున్న
ది. పదార్థములు బహూత్పాదకములుగ నుండవలెనా? ఏకో
త్పాదకములుగ నుండవలెనా? అనువిషయ మర్థశాస్త్రమం
దీకాలమున విశేషముగ జర్చింపబడుచున్నది.

పైనజెప్పిన నాలుగుకారణముల బట్టి పదార్థములకుమి
తత్వము కలుగుచున్నది. మొదటి రెండుకారణములవలన గ
లుగుమితత్వమును బోగొట్టుట సులభసాధ్యముకాదు, కానిప
దార్థముల నుత్పత్తిజేయుటయందు మనముపడవలసిన శ్రమ
యు మనముచేయువలసిన ఖర్చును, చాలవఱకు తగ్గించి వాని
సముదాయము నధికము జేయవచ్చును. యంత్రోపకరణము
లు, శాస్త్రపరిశోధన విద్యావ్యాప్తి, అధికపరిమాణ వ్యవహా
రములు, లోనగునవి శ్రమనుతగ్గించు సాధనములుగ నున్నవి.
ఇటీవలి కాలమున ననేకపదార్థములఖరీదు తగ్గుట కివియే హే
తువులు.

మామూలుగ నొకఖరీదుచొప్పున దొరుకుచుండుపదా

ర్థముల ఖరీదుమారుటకు వానికిగల గిరాకియందుగాని, వాని బాహుళ్యమందుగాని మార్పులుకలుగవలెను. బాహుళ్యము యథాప్రకారముగనుండ గిరాకియధికమైనయెడల మూల్యమధికమగును; గిరాకితగ్గినయెడల మూల్యముతగ్గును. గిరాకియథాప్రకారముగనుండ బాహుళ్యమధికమైనయెడల మూల్యము తగ్గును; బాహుళ్యము తగ్గినయెడల మూల్యమధికమగును. గిరాకిహెచ్చినపు డెల్లవస్తువులకు మూల్యముహెచ్చునా? అను విషయమై విపులముగ చర్చించినగాని యథార్థము స్పష్టపడజాలదు. అట్టి విపులచర్చజేయుట కిక్కడ యవకాశము లేదు.

పదార్థముల మూల్యము నిర్ణయింపబడు విధముననే ధనోత్పత్తిసాధనములగు ప్రకృతిపురుషకార మూలధనముల వలనలభించు ప్రత్యేకాదాయము నిర్ణీతమగుచుండును. అనగా ఈసాధనములకుగల గిరాకి, వానియొక్క పరిమాణముల బట్టి వానికధికముగనో అల్పముగనో ఆదాయము దొరకుచుండును. ఇట్లే వినిమయమందు మనముపయోగించునాణెముల యొక్కమూల్యముగూడ నాణెముల బాహుళ్యము నాణెములకుగల గిరాకీలబట్టి నిర్ణయింపబడుచుండును. మూల్యనిర్ణయ విషయముగురించి పైనజెప్పబడిన విషయములచక్కగగ్రహించినయెడల నర్థశాస్త్రములోని తక్కినవిషయములు సులభగ్రాహ్యములు కాగలవు.

GLOSSARY

అంతస్తు = Standard of life.
ఆదాయము = Income.
కార్యవిభజనము = Division of labour.
కోరికలు, వాంఛలు = Wants.
ధనము = Wealth.
పదార్థాంశము = Unit of a Commodity.
ప్రకృతి = Nature.
ప్రకృతి సంపద = Natural resources.
పనిముట్లు = Capital goods.
ప్రయోజనము = Utility.
పురుషకారము = Labour.
పక్వకర్మలు = Manufactures.
మూల్యము = Value.
యానకర్మలు = Transport industries.
రూపరహితములగు ప్రయోజనములు = Non-Material utilities
వలస = Migration.
వ్యవహారస్థానము = Market.
వ్యవహారము = Business.
వాంఛల తీక్ష్ణత = Intensity of Wants.
వినిమయము = Exchange.
స్థానము = Situation.
స్వీయమగు హక్కు = Right of

406

406

END OF TITLE